# త్యాగరాజ కీర్తనలు

## విశేష వివరణము

(ద్వితీయ సంపుటము)


రచయిత

**కల్లూరి వీరభద్రశాస్త్రి**



ప్రచురణ

**తిరుమల తిరుపతి దేవస్థానములు**

**తిరుపతి**

**2015**

# TYAGARAJA KEERTANALU - VISESHA VIVARANAMU

*By*
**Kalluri Veerabhadra Sastri**

T.T.D. Religious Publication Series No.1183
© All Rights Reserved

*First Print:* 2015

*Copies:* 1000

*Published by:*
**Dr. D. SAMBASIVA RAO,** I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

***D.T.P:***
Office of the Editor-in-Chief,
T.T.D, Tirupati

*Printed at:*
***Tirumala Tirupati Devasthanams Press,***
Tirupati.

## ముందుమాట

సద్గురు శ్రీత్యాగరాజస్వామివారు (క్రీ.శ.1767–1847) కర్ణాటక సంగీతమూర్తిత్రయంలో మొదటివారు. ముత్తుస్వామి దీక్షితులు రెండవవారైతే, శ్యామశాస్త్రి మూడవవారు.

శ్రీత్యాగరాజువారి ఇంటిపేరు కాకర్లవారు. ఇది పూర్వం కర్నూలు జిల్లాలో ఉండేది. ప్రస్తుతం ప్రకాశంజిల్లాలో చేరింది. త్యాగరాజుగారి వాగ్గేయరచనలకు 'కీర్తనలు, కృతులు' అని పేరు. వీరు ఎన్ని కీర్తనలు వ్రాశారన్న విషయంలో సంగీత విద్వాంసులలో అభిప్రాయభేదాలున్నాయి.

దాక్షిణాత్య సంగీత సంప్రదాయంలో శ్రీ త్యాగరాజస్వామిని 'త్యాగబ్రహ్మము' అనీ, ఆయన కృతులకు 'త్యాగోపనిషత్తు' అనే ప్రసిద్ధి ఏర్పడింది. 32వేల సంకీర్తనలు పాడిన ప్రథమాంధ్ర వాగ్గేయకారుడు, పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల వలె (1408–1503) నాలుగు లక్షలపై చిలుకు కీర్తనలు పాడిన కర్ణాటక సంగీత పితామహుడు శ్రీ పురందరదాసువలె కొన్ని వేల లక్షల సంకీర్తనలు పాడకపోయినా, వాసికెక్కిన వాగ్గేయకారుడు త్యాగరాజస్వామి. కర్ణాటక సంగీత కచ్చేరీలలో 'త్యాగరాజ కృతి' మహోన్నత స్థానాన్ని ఆక్రమించి ఉంది.

భక్తపోతనవలె, తాళ్లపాక అన్నమయ్యవలె త్యాగరాజు అద్వైతి, స్మార్తుడైనా అచంచలమైన విష్ణుభక్తుడు. విశేషించి, రామభక్తుడు. కాంచీపురం వాస్తవ్యులు, ఉపనిషత్ బ్రహ్మయోగితో వీరి సమాగమం చారిత్రకమైన సంఘటన. ఆ ప్రభావంతో త్యాగరాజు తమ కీర్తనల్లో శివకేశవాద్వైతాన్ని , రామభక్తి సామ్రాజ్యాన్ని నిర్మించినా, ఆంతరంగా అద్వైత తత్త్వాన్నే నిరూపించారు. వీరు నాదబ్రహ్మోపాసకులు. రామభక్త శిఖామణులు.

శ్రీ కల్లూరి వీరభద్రశాస్త్రిగారు శ్రీ త్యాగరాజస్వామి వ్రాసిన కీర్తనల్లో 479 కీర్తనల్ని మాత్రమే ఎన్నుకొని వాటికి 'విశేష వివరణం' వ్రాసి రెండు

సంపుటాలుగా ఇదివరకే ప్రచురించివున్నారు. ప్రథమ సంపుటంలో 241 కీర్తనలకు, ద్వితీయ సంపుటంలో 242 నుండి 478 వరకు అంటే 238 కీర్తనలకు విశేష వివరణం వ్రాశారు. ప్రస్తుతం రెండవ సంపుటం ప్రచురింపబడింది.

ఈ గ్రంథంలో, త్యాగరాజు సమకాలికులైన శ్రీవాలాజాపేట వేంకటరమణ భాగవతుల సంప్రదాయంలోని 14 అముద్రిత త్యాగరాజ కీర్తనలను 'అనుబంధం'లో చేర్చారు. చిట్టచివరగా, శ్రీవేంకటరమణ భాగవతుల 'త్యాగరాజ మంగళాష్టకం' సందర్భోచితంగా యిచ్చారు.

ప్రస్తుత గ్రంథంలో 'న' నుండి 'క్ష' వరకు గల కీర్తనల పట్టికను సమకూర్చారు. ఇది సంగీత ప్రియులకు, గాయక గాయనీమణులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఈ పుస్తకాన్ని పండితులు, సాహిత్యాభిమానులు, రామభక్తులు, పరిశోధకులు ఇతోఽధికంగా వినియోగించుకొని లబ్ధిపొందగలరని ఆశిస్తున్నాము.

సదా శ్రీవారి సేవలో....

**కార్యనిర్వహణాధికారి**
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.

శ్రీ
చంద్ర
మౌళిః

**శ్రీమత్పరమహంస పరివ్రాజకాచార్యవర్య**
**శ్రీమచ్ఛంకర భగవత్పాద ప్రతిష్ఠిత**
**శ్రీకాంచీ కామకోటి పీఠాధిపతి జగద్గురు**
**శ్రీమచ్చంద్రశేఖరేన్ద్ర సరస్వతీ శ్రీపాదులచే॥**

తదంతేవాసులు శ్రీమజ్జయేన్ద్ర సరస్వతీ శ్రీ చరణులచే శ్రీ త్యాగరాజకృతి విశేష వివరణకర్త అస్మదత్యంత ప్రియశిష్యులు కల్లూరి వీరభద్రశాస్త్రికి నారాయణస్మృతి చేయబడుచున్నది.

శ్రీ త్యాగరాజస్వామివారి కీర్తనలకు సులభముగా తాత్పర్యార్థములు తెలియుటకొరకు మీరు తలపెట్టిన యుద్యమము సహృదయ హృదయములందు దృఢమైన భక్తిని గల్గించునట్టిది. మరియు భక్తిగీతములచే పోషింపఁబడిన సాహితీరసికత్వమునుగూడ జనులలో విస్తరింపఁ జేయగలదనియు విశ్వసించుచున్నాము. ఇయ్యది సామాన్యఫలము. విశేషించి సూక్ష్మదృష్టితో ఈ గేయములందలి గాంభీర్యమును పరిశీలించునట్టి తత్త్వజిజ్ఞాసువులగు ముముక్షువులకు సైతము సార్థకమైన ఈ కృతి సంపుటము అనితర సాధారణమును లలిత లలితమును సహృదయాస్వాదనీయమైన రసపుష్టిగల అనిర్వచనీయమైన శైలితో పరమార్థతత్త్వమును కరతలామలకము చేయఁజాలియున్నది. కావుననే శ్రీ త్యాగరాజునికి "త్యాగబ్రహ్మ" యను ప్రసిద్ధియు, వారి కృతి సంపుటమునకు "త్యాగోపనిషత్తు" అనెడి ప్రసిద్ధియు గలదు. చూడుడు:– "ద్వైతము సుఖమా అద్వైతము సుఖమా" అను కీర్తనమందు సర్వసాక్షియు చైతన్యరూపమునగు పరమాత్మను సంబోధించి రెండు విధములైన విభాగములతో ప్రశ్న మాత్రమునే

ప్రయోగించుటయు, తిరిగి "ఏదారి సంచరింతురా" అను కృతియందు రెండు విధములైన సమాధానమున్నూ కల్పించి ఆ రెండు సమాధానములను పరమాత్మ వచనములుగానే ఆక్షేపించుట మిక్కిలి స్వారస్యము. ఎట్లనగా:- **"అన్ని నీవను మార్గమునను చనితే నన్ను వీడెను భారమని యనేవు, నన్ను బ్రోవరా సదాయంటే ద్వైతుడనేవు"** అనగా:- రామా! నిన్ను సర్వాత్మకునిగా భావించుచూ, నే నద్వైతమార్గము ననుసరింతునేని "జీవులకును నాకును భేదములేక పోవుటవలన నీవంటి జీవుల రక్షించునట్టి భారమే నాకు తొలఁగినదిలే" యని నన్ను రక్షించు భారమును వీడెదవు. అట్లుగాక "నన్ను సదా రక్షించు" మని ప్రార్థింతునేని అప్పుడు "నీవు ద్వైతుడవైతివే" యని నన్నాక్షేపింతువు. ఇట్లు రెండు విధములుగా కూడ భగవంతుఁడు నన్నాక్షేపించు ననుమిషతో **"దేహ బుద్ధ్యాతు దాసోఽహం జీవబుద్ధ్యాత్వదంశకః। ఆత్మబుద్ధ్యాత్వమేవాఽహం ఇతి వేదాంత డిండిమః॥"** (దేహబుద్ధితో నీకు నేను దాసుడను, జీవభావముతో నీ యంశయైనవాడను, ఆత్మభావముతో నీవే నేనైతినని వేదాంతడిండిమము) అను శ్రీశంకర భగవత్పాదుల సిద్ధాంతమును బ్రహ్మవిద్యారసిక సార్వభౌముఁడగు శ్రీ త్యాగరాజస్వామి వ్యంగ్యముగా పల్కి పై వికల్ప ప్రశ్నములకు సిద్ధాంతమును నిరూపించినారు.

మరియు **"మోక్షము గలదా"** యను కృతియందు యోగీశ్వరుఁడైన యాజ్ఞవల్క్యుని స్మృతిలోగల **"వీణావాదన తత్త్వజ్ఞః శృతిజాతి విశారదః। తాళజ్ఞశ్చాప్రయాసేన, మోక్షమార్గం నిగచ్ఛతి"** యను వాక్యమును శ్రీత్యాగరాజు స్మరింపఁజేయుచున్నారు. సద్భక్తితోగూడిన సంగీతజ్ఞానము జీవన్ముక్తిని కల్గించుననెడి పద్ధతిని, సంగీతమున కాధారములైన సప్తస్వరములు ప్రణవనాదమందే ప్రతిష్ఠ గల్గియున్నవని సూచించుటచేతనే విశదముచేసి యున్నారు. **"ప్రాణానలసంయోగముచే ప్రణవనాదము సప్తస్వరములై పరగ"** అని గలదు. మరియు "వీణావాదనలోలుఁడౌ



శివమనోవిత మెరుఁగరు" అనుటచే సంగీతజ్ఞానము ముక్తికి సాధనమని అంగీకరించని పండితులను మిక్కిలి ధైర్యముతో వ్యతిరేక ముఖముగా ఆక్షేపించియున్నారు. పై కీర్తనవచనమునకు తాత్పర్యమేమనగా:- ముముక్షువులకు జీవబ్రహ్మాద్వైతజ్ఞాన ముపదేశించునట్టి శివస్వరూపుడే శ్రీదక్షిణామూర్తి; దక్షిణామూర్త్యుపనిషత్తునందును శ్రీదక్షిణామూర్తి ధ్యాన ప్రకారములందు **"జ్ఞానముద్రాక్షమాలా వీణాపుస్తైః విరాజత్కరకమలధరః యోగపట్టాభిరామః"** అనియు మరొక్కచోట "వీణాంకరైః పుస్తకమక్షమాలాం" అనియు వినవచ్చుచున్నది. కావున సంగీతము జీవన్ముక్తికి సాధనమే గానిచో జ్ఞానప్రదానము చేయుటచే ప్రధానలక్షణముగాగల శ్రీదక్షిణామూర్తి వీణాధారణమేల చేయును? కావుననే, జీవన్ముక్తులైన శ్రీసదాశివబ్రహ్మేంద్ర శ్రీ నారాయణతీర్థ ప్రభృతులు యోగరతులు భక్తిరతులునై యుండుటయేగాక గానరతులైకూడ యున్నారు.

ఇట్లు శ్రీ త్యాగరాజస్వామివారు పరమార్థ తత్త్వవిచారసౌధాంగణమందు సంచరించువారయ్యును, లౌకికమైన వ్యావహారిక పామర సాధారణములును ప్రజాక్షేమకారణభూతములునైనసాంఘిక, నైతిక, రాజకీయాది విషయములందును తమ దృష్టిని సారించకపోలేదు. ఈ యభిప్రాయమునే "కాసిచ్చేదే" యను కృతిలో "రాజ్యాంగముకొరకు నాల్గుజాతుల రక్షణ పరసుఖమో, రాజసులై సన్మార్గమెరుఁగక పరాకుసేయఘనమో" అను వాక్యములచే నిరూపించినారు. ఇంతేగాదు. మన యందరచేతను వాంఛింపఁ బడునట్టి రామరాజ్యముయొక్క స్వరూపము నగరవాసులగు నాగరికులకును దేశవాసులగు గ్రామజనులకును వనవాసులగు మహర్షులకును సమముగా సౌభాగ్యము నిచ్చునది యని మిక్కిలి నైపుణ్యముతో ఈ కీర్తనమందు వర్ణింపఁ బడినది.

**కారుబారు సేయువారు కలరే నీవలె సాకేతనగరిని॥**
**ఊరివారు దేశజనులు వరమును లుప్పొంగుచు భావుకులయ్యే॥**

**నెలకు మూడువానలఖిల విద్యలనేర్పుగల్గి దీర్ఘాయువు గల్గి॥**
**చలము గర్వరహితులుగా లేద, సాధుత్యాగరాజవినుత రామ॥**

ఇట్లు హరిహరాద్వైత స్వరూపము కూటస్థమును బ్రహ్మమునైన రాముడనెడి స్థాణువునందు దృఢముగా సమర్చcబడిన భక్తి శృంఖలలతోగూడిన స్వహృదయమనెడి ఉయ్యెలయందు నిర్భయముగా నధిష్ఠించినవారై శ్రీత్యాగరాజస్వామి జీవన్ముక్తి మొదలు సాంఘిక సమస్యలవరకును ఉపర్యధోభాగములందు (అటు నిటు) రామభక్తియనెడి కేంద్రస్థాన సంబంధమును విడువకయే స్వేచ్ఛాసంచారానందము ననుభవించుచున్నారు.

* * *

# శ్రీ త్యాగరాజస్వామి–భావ, రాగ తాళములు

## గానార్చక: శ్రీమాన్ S. పార్థసారథి

### భావము

సంగీత సాహిత్యములలోని భావసౌందర్యమును అనుభవించగలముగాని, ఆ అనుభవమును నిర్వచించలేము. భావానుభవము ఆత్మానందహేతువు.

సంస్కారము కలవారికి ఈ అనుభవము అప్రయత్నముగ, సహజముగా కలుగును. ఎటువంటి మనోబుద్ధులు కలవారీ యానందమనుభవింతురో తెలియదుగాని సంగీతసాహిత్యములలోని ఏ యే యంశములవలన ఇంతటి రసాస్వాద సిద్ధి కలుగునో కొంతవరకు విచారణ చేయుటవలన ఉపయోగముకలదు.

మనము చాలమంది విద్వాంసుల గాత్ర వాద్య సంగీతములను వినుచున్నాము. ఒకే రాగము ఒక్కొక్క విద్వాంసుని ఆలాపనలో రక్తికట్టినట్లు, వేరొకరి గానమందు రక్తి అనుభవింపcబడుటలేదు.

ఇట్లే కీర్తనా గానమందును వేర్వేరుగా రసానుభవముకలదు. రక్తి కలిగినపుడు వారెంతో భావయుక్తముగా పాడినారందువేగాని నిర్వచించలేము. చిత్రలేఖనమందు దృశ్యమును చూచువారి చిత్తములు పులకితములైనట్లే, సంగీతమందు భావసౌందర్యము భావగర్భితమై మన చిత్తములను కదలించును.

పుస్తకములద్వారా, తన సాధనద్వారా ఈ విధమైన భావ ప్రకటన చేకూరదు.

శుద్ధమనసు కలిగి సుస్వరముతో పాడిన భావుకుcడైన గురువు వలన విని యనుభవించవలెను. యీ విషయము సంగీతజ్ఞులకు విదితమే.

అందువల్ల గురుశిక్షణ, వినీతమైన అభ్యాసపాటవమువల్లనే రక్తి ఏర్పడును. కొందరు విని చక్కగా పాడగలరు. మరికొందరు రసజ్ఞులు మనసుతో పాడగలరు.

ఈ యనుభవమునే గౌరీ మనోహరిలో **"గురు లేక ఎటువంటి గుణికి తెలియగబోదు"** అని శ్రీత్యాగరాజస్వామి వివరించినారు.

సంగీత ప్రదర్శనము రెండు విధములుగా అనుభవించుచున్నాము. లలిత సంగీతము స్వరప్రక్రియలు అంత గజిబిజిగాలేక, తాత్కాలికముగా ఇంపును, రక్తిని కలిగించును. కాని అనుభవమునకు నిలుకడలేదు. దీనివలన శాంతిసౌఖ్యములు కలుగవు.

రెండవ భాగంలో శాస్త్రీయముగా శిక్షణనంది, తమ తమ మనోభావముకొలది పరిశ్రమించి విద్వత్సభలలో చక్కగా పాడుతూ రసజ్ఞులను రంజింపచేయుచున్నారు. ఈ రెండు వర్గములకు అతీతంగా రక్తి, భక్తికలిగి, శ్రోతలను మంత్రముగ్ధులుగా నొనర్చుచు, విలక్షణ శైలిలో, ఆ యా రసానుకూలమైన స్వరవిన్యాసంతో, స్వభావ మధురంగా, వీరిది అనాహత నాదమా! అని ఆశ్చర్యము కలిగించునట్లు పాడగల భావుకు లుందురు. వీరిదే భావపూరితమైన గానము, ప్రయత్న ప్రయాసలు లేకనే శ్రోతల చిత్తముల నాకర్షించును. ఇంత రక్తిగల సంగీతము రావలెనన్న, తన సంగీతమునకు లక్ష్యము భగవంతుడే యనియు, తనకు ప్రేరకుడున్నూ భగవంతుడేయనియు, ప్రకృతియంతయు ఆతని కళాక్షేత్రమే అనియు, భక్తికలిగి, పరవశుడై పాడవలెను. కావుననే **"సీతా–వర! సంగీతజ్ఞానము ధాత వ్రాయవలెరా"** యని త్యాగరాజస్వామి వరవడి తీర్చిద్దినారు. అందుకు శాస్త్రీయమైన జ్ఞానము దోహద మొనర్చును.

త్యాగరాజస్వామి సంగీత సాంప్రదాయము నెంత రక్తిగా పోషించిరో, అంతకు మిన్నగా, సంస్కృతాంధ్ర సాహిత్యభావ సౌందర్యము వేదేతిహాస



పురాణ కావ్య సంపదతోతోడై, సంగీత సాహిత్యముల కొక రూపుకట్టి, లక్ష్యశుద్ధిని, సిద్ధిని సమకూర్చినవి. వారి కీర్తనలు సంగీత సాహిత్య సమన్వయమునకు, సమైక్యతకు నిదర్శనములు.

వారి సంగీత సాహిత్యములు శాస్త్రవేత్తలకు, తత్త్వవేత్తలకు, ముముక్షువులకు, సాధకులకు ఆబాలగోపాలమునకు అమృతమువలె ఆనందకేంద్రములు. అందుకు వారి జీవితము, వారి దైనందినచర్య మనకు సర్వకాలములందును ఆదర్శవంతములు. ఇంతటి మహోన్నతికి ప్రధానకారణము వారి భావపుష్టియే.

అనాది ఆర్షము నైన భరత నాట్యమునకున్నూ అభినయ ప్రదర్శనకున్నూ భావమే జీవము.

సాత్వికాభినయ నైపుణ్యముకల నర్తకులు చక్కని భావరక్తికల భక్తితో త్యాగరాజస్వామి కృతుల నభినయించగలిగినచో లోకమానంద తన్మయము కాకమానదు.

శ్రీ త్యాగరాజస్వామి ఉపనిషత్ప్రతిపాద్యమైన పరబ్రహ్మను నాదబ్రహ్మముగా నుపాసించిరి, ఇందుకు వలయు సారూప్యముల నెన్నింటినో తమ కృతులలో వివరించినారు. మరియు నాదరూపముననే బ్రహ్మానుభవము కలుగుననియు, ఏకాగ్రతతో భక్తిబ్రహ్మనిష్ఠకు రక్తినిచ్చుననియు, తమ జీవితమునే ఇందు కాదర్శముగా చూపినారు.

ఒక భక్తుని జీవితములోని వివిధ రసానుభవమునకే త్యాగరాజుని సంగీతము రూపకల్పన మొనర్చును. భక్తులు అనుభవించు ఆనందపారవశ్యము, మనోవేదన, పశ్చాత్తాపము, ఆవేగము మొదలగు ఎన్నో భావముల వైవిధ్యము వారి కీర్తనలందు స్పష్టముగానున్నది. అందుపయోగించిన సంగీత ప్రక్రియయు అందుకు అనువుగానున్నది. కావుననే, వీరి గేయములు భావముచే చాలా గొప్పవని పెద్దలందరు. వారి

గేయములు మనకు లభించిన వాటిలో వారి సంగీత లక్ష్యము, దైవాను సంధానము, భక్తి, రక్తి విశదములగుచున్నవి.

ధన్యాసిలో **"సంగీత జ్ఞానము భక్తివినా-సన్మార్గము కలదే"**యని, "ఘనులకు మ్రొక్కెద" అనీ, నారదాదులు మొదలు తన తరంవరకు సంగీతమునకుగల సంప్రదాయ శుద్ధిని కీర్తించినారు. శుద్ధ బంగాళలో **"రామభక్తి సామ్రాజ్యం"** అను గేయము బ్రహ్మానందస్థాయి నందినది.

ఆపై **"భజనపరులకేల దండపాణి భయము"** అను గేయంలో "మృత్యుం తీర్త్వాఽ మృతమశ్నుతే" అని శృత్యర్థమును సూచించి, సంగీత సహిత సద్భక్తి పునరావృత్తి రహిత శాశ్వత బ్రహ్మానంద కారణమనియు, "ఎంతని నే వర్ణింతును" **"క్షీణమై తిరుగ జన్మించే సిద్ధిమానురా"** యను గేయములలో నాదోపాసనా సిద్ధిని హెచ్చరించిరి.

పై వివరించిన భావములకు కేంద్రములుగా వీరి ఘనరాగ పంచరత్నములను పేర్కొన వచ్చును. అందలి సంగీత సంప్రదాయగౌరవము, శాస్త్రమర్యాద, ఉన్నతమైన వేదోపనిషద్యోగ తాత్పర్యములు ఎన్నో విశేషములు కలవు.

మరియొకచోట "భక్తి బిచ్చమియ్యవే" అను శంకరాభరణ కీర్తనమందు, **"నా మనసు భక్తినే కోరియుండగ"** ఇత్యాది కీర్తనలలో వారి వైరాగ్య సంపద వ్యక్తమగుచున్నది.

తోడి రాగంలో **"దాశరథీ నీ ఋణము దీర్ప నాతరమా!"** యని తన కృతజ్ఞతను, భగవదనుగ్రహమును స్మరించినారు.

భక్తులు వివిధ రీతులలో భగవంతుని నామగానము చేయుట, ఆ పరమాత్మ నొకపుడు లక్ష్యశుద్ధితో అనుభవించలేక పరితపించుట, దిక్కుతోచక ఆర్తుడగుట, అంతలోనే భగవద్దర్శనానందముచే పొంగి నృత్యము చేయుట, మరొకపుడు ఆత్మదోష విమర్శనము, లోకవాతావరణమునకు



వాపోవుట, తిరిగి దీనరక్షకుడని భగవంతుని శరణందుట మొదలగు అనేక భావములను, రాగభావంతో, సాహిత్య భావంతో ఎంతో పొందికగా మన కందించి యున్నారు.

## రాగము

ఒకే రాగమును, వేర్వేరు భావములతో సంతరించు శక్తి అయ్యగారికి కలదు. మోహనలో **"మోహనరామా"** యను కృతిలో రాముని సౌందర్యము, అదే రాగంలో **"ననుపాలింప నడచివచ్చితివో"** అను దానిలో రామదర్శనం తనకు లభించినందుకు కలిగిన ఆశ్చర్యానంద సంభ్రమములను, **"ఎవరురా నినువినా గతి మాకు"** అని అదే రాగంలో దీనత్వము, **"రాదా నాదుపై నీ దయ"** అనుటలో శరణాగతి, **"మాటిమాటికి తెలుపవలెనా?"** అను దానిలో ఎత్తిపొడుపు, తనకుగల చనువును చూపి, యీ కృతులలో స్వర, రాగ, తాళముల పొందికతో, వేర్వేరు అనుభవములను శ్రోతలకందించుట వారికే చెల్లినది.

అట్లే శంకరాభరణంలో **"ఏమి నేరమో నన్నుబ్రోవ"** అని దీనముగా పలికి, **నీకు భారమా!** అని ప్రశ్నించుట విశేషము.

**"ఎందుకు పెద్దలవలె"** అను దానిలో ఆత్మవిమర్శ, "ఎదుట నిలచితే" అను దానిలో నిందాస్తుతి, తిర్గి **"బుద్ధిరాదు బుద్ధిరాదు"** అని పెద్దలందు విధేయత ఇట్లు ఒకే రాగభావంలో స్వరభేదం, గతిభేదములతో వివిధ రసానుకూలంగా భావవ్యక్తీకరణము అనితర సాధారణమైన సంగీత ప్రజ్ఞ.

## తాళము

భావమును వ్యక్తపరచుటకు రాగమెంత ముఖ్యమో తాళమున్నూ అంత ముఖ్యమైనది. ఇందు కుదాహరణము – **"చెడే బుద్ధి మానురా"** అనే అఠాణ కృతిలో, పల్లవి అతీత తాళములో "చెడే" యను మాటలో "డే" అనువర్ణముతో తాళమారంభమగును. నిందలో యీగతి ఎంతో దోహదమిచ్చును. శ్రీవారి

కృతులు వివిధ తాళ గతులు కలవైనను, కృతి ప్రతిపాదమందును, చతురశ్రగతి ప్రచ్ఛన్నముగ గోచరించును. వారి కృతులు వినుటలో సౌందర్యమునకిదియొక ముఖ్యకారణము.

వారి "త్రిశ్రగతి" తాళ కృతులను పరిశీలించుచో ఈ తారతమ్యము విశదమగును. త్రిశ్రగతి ఆదితాళమునుండి, **"గట్టిగాను నను"** బేగడ కృతికిగాని, బిలహరి **"ఇంతకన్నానందమేమి"** అనువాటిని ఇటీవల కొందరు రూపక తాళమునకు మార్చిన మార్పువలన, భావప్రకటనకు లోపమే కలిగినదిగాని మేలులేదు. కృతిలో తాళముయొక్క ప్రాముఖ్యమేగాక, మధ్యమాది కాలగతులను కూడ జాగ్రత్తగా కాపాడవలెను.

**"సౌమిత్రి భాగ్యమే"** అనే ఖరహర ప్రియ కీర్తనలో ఆదిశేషతల్పమున విష్ణువు మెల్లననూగు ఊపు, దృశ్యము మధ్యమకాలమున పాడిన చెదిరిపోవును.

అట్లే **"పట్టి విడువరాదు"** మంజరి రాగకృతి, భక్తుడు నిరాశ్రయుడగు నను భయమున పరమాత్ముని వేడికొనుటలో చౌకకాలంలో పాడినచో రసాభాసమగును.

త్యాగరాజస్వామి కృతులను భావ ప్రధానములుగా పాడునపుడు ప్రతిపాదమునందును పదవిన్యాసము, యతిప్రాసలు సంగతి స్వర భేదములు జాగ్రత్తగా గుర్తించవలెను. ఒక కృతిలోని సంగతి పద్ధతులను, ఇంకొక కృతిలో చేర్చిపాడుట భావమునకు హాని కలిగించును.

భావ వ్యతిరేకముగా తాళ కాలములను పాటించకపోవుట యెంత నిరర్థకమో, సంగతులను సందర్భ విరోధముగా అమర్చుకొనుటయు ప్రతిబంధమే. సాహిత్యములోని దీర్ఘ హ్రస్వ స్వరములున్నూ భావము నందించుటలో సహాయపడును.



భక్తుడు, భగవంతుని గూర్చి నాయికాభావం, భృత్య, పుత్ర, శిశు భావములతో కీర్తించును. త్యాగరాజస్వామి యీ భావములన్నింటిని తమ గేయములలో పొందుపరచిరి. శుద్ధ, షట్శృతి, స్వర రాగములలో **"నోరేమి శ్రీరామ" "నా యెడ వంచన సేయకురా" "బాగాయె నయ్యా"** అని వీరు పాడిన కృతులు భావుకులకు ఎంతో అపురూపమైనవి.

**"భావ మెఱిఁగి బ్రోతువు సద్భక్త భాగధేయ** "అఠాణ" "అట్ట బలుకుదు విట్టబలుకుదు"వని వారే అన్నట్లు భగవంతుడు భక్తుల భావమెఱిఁగి కాపాడుచున్నాడు. జీవుడు సర్వవిధముల చేతను, పరమాత్మతత్త్వమందు భక్తిరస స్వరూపుడై రమించుటయే పరమలక్ష్యమని శ్రీ త్యాగరాజస్వామి భావసమాధియని తెలియుచున్నది.

మన సంగీత సంప్రదాయము చిరస్థాయి నందుటకు శ్రీ త్యాగరాజస్వామి కీర్తనలు పట్టుకొమ్మలు. కావున రసజ్ఞులు, సహృదయులు, భక్తులు, విద్వద్గాయకులు శ్రీ త్యాగరాజస్వామివారి సంగీతసాహిత్య రత్నములను నిత్య నూతనకాంతులతో తమ కంఠనాళములం దలంకరించుకొని, భారత ఆర్ష సంస్కృతిచే సకల శ్రేయముల నందగలరనుటలో సందేహములేదు.

ప్రకృతం శ్రీ కల్లూరి వీరభద్ర శాస్త్రిగారు శ్రీశ్రీశ్రీ కాంచీ కామకోటి పీఠాధిపతుల దివ్యానుగ్రహంతో శ్రీవారి గేయములకు చక్కని విశేష వివరణమందించుటకు మేమెంతో ఆనందించుచున్నాము.

# విజ్ఞాపనము

వాగర్థములవలె సంగీత సాహిత్యములు అవిభాజ్యములు. సంగీతము భావసౌరభము. సాహిత్యము మకరందముగల పుష్పము. నాదోపాసకులైన వాగ్గేయకారుల గేయములందు సాహిత్యము లలితమై విలంబ యతి విశ్రమములతో భావపుష్టి కలిగియుండును.

విద్వద్గాయకులు ఆ సాహిత్య లాలిత్యమును, అర్థ గాంభీర్యమును గమనించి తన మనోధర్మముతో సాహిత్య సమరసములైన స్వర రాగ లయ విన్యాసములతో, సంప్రదాయ వరవడిలోనే విలక్షణములైన సంగతులను పాడి శ్రోతల చిత్తములను రసరంజితములుగా తీర్చి దిద్దుదురు. తన పాటలో నూత్నభావములను చిత్రించవచ్చునే గాని సంగీత సాహిత్యముల సహజ మర్యాదను మార్పు చెందనీయరాదు. ఈ విధమైన పద్ధతులను అనుసరించుటచేతనే నాటి వాగ్గేయకారుల మొదలు నేటి సంగీతోపాసకుల వరకును సంగీత సాహిత్య కళలు సర్వతోముఖాభివృద్ధినందుచూ నిత్య నూతన వికాసముతో విరాజిల్లుచున్నవి.

అట్టి వాగ్గేయకార త్రిమూర్తులలో శ్రీత్యాగరాజస్వామి తన ఇష్ట దేవతయైన శ్రీరాముని తారకదివ్యనామమును చిరకాల ముపాసించి, రామనామమును, రాముని దివ్యరూపమును ఒక్క తీరుగా ననుసంధానించుకొని రామనామకీర్తనమందే రాముని దివ్యచరిత్రను మేళవించుకొని, సర్వదేవతలను రాముని ఆస్థానమునకే పిలచి విందొనర్చుచూ, వేదేతిహాస, పురాణములందలి ఉదాత్తములైన భావరహస్యములకు చక్కని సమన్వయముతో, తన గేయరూపమున సంగీతమున కొక మహాభాష్యమును మన కనుగ్రహించినారు. వేదాగమములందు ఈ మహనీయుడు అనుభవించని అంశములేదు.



అనంతములైన ఉపనిషద్రహస్యములను తననాద సుధారసముతో ముంచెత్తి బ్రహ్మానంద మందినాడు.

ఆయా విద్వద్గాయకులు పాడునపుడు ఆ మహనీయుని సాహిత్యమందలి భావములు సూటిగా భావుకుల చిత్తములందు సునాయాసముగా మహార్థములను స్ఫురింపజేయును. అనాదిగా సహృదయులు ఆ యర్థ భావనముచే ఆనందించుచునే యున్నారు. **"వాల్మీకాది ఋషులు మునులు నిన్ను పాడిన నా ఆసదీరునా"** యన్నట్లు నా జన్మాంతర సుకృతమునను, నా గురుస్వాముల దివ్యానుగ్రహము వలననూ, నా తల్లి చిననాటనుండి పాడుకొను త్యాగరాజ కృతులను విని యుండుటచేతనూ, నాకీకృతి వ్యాఖ్యా వివరణమందొక చాపల మంకురించి, లోగడనే ఒక కృతిగా నాకృతినందినది. ఆ త్యాగరాజ వ్యాఖ్యాగ్రంథము సహృదయులు రసజ్ఞుల ఆదరణమున ద్వితీయ ముద్రణమునందుట ఆనందము. అందు రెండు భాగములుగా విభజించితిని: 1. ప్రహ్లాదభక్తి విజయము, 2. నౌకా చరిత్రము, 3. దివ్య నామకీర్తనములు, 4. ఉత్సవ సంప్రదాయకీర్తనలు, 5. ఘనరాగ పంచరత్నములు అను విభాగమొనర్చి, అకారాదిగా సుమారు నాల్గువందల కీర్తనలు, విశేష వివరణముతో ప్రథమ భాగముగా ప్రకటింపబడినది. ప్రస్తుతం "నీ" అను అక్షరమాదిగా కడమ కీర్తనములతో ఈ రెండవ భాగమును ముద్రించి ప్రకటించుటతో కృతకృత్యుడనైతినని మనవి చేయుచున్నాను.

వీణావాదన లోలుడైన పరమశివుడు, స్మృతికర్తలైన యాజ్ఞవల్క్యాదులు, జీవబ్రహ్మైక్య రూపమైన ముక్తికి సంగీతము, నాదోపాసనము, సాక్షాత్సాధనమని సిద్ధాంత మొనర్చినారు. కావుననే, భక్తిగీతి పరిపోషితమైన సాహిత్య రాసిక్యమేగాక, త్యాగరాజకీర్తనలు **"త్యాగోపనిషత్"** అను ప్రసిద్ధి గలవనియు, శ్రీత్యాగరాజస్వామికి త్యాగబ్రహ్మత్వ ప్రసిద్ధిగలదని మహోన్నత

పరమార్థ ధర్మమును ప్రబోధించిన అస్మత్పరమాచార్యులు, జగద్గురువులు శ్రీశ్రీశ్రీ కాంచి కామకోటి పీఠాధిపతులు శ్రీ చన్ద్రశేఖరేంద్ర సరస్వతీ శ్రీచరణులు శ్రీముఖము ననుగ్రహించిరి. తదంతేవాసులు శ్రీశ్రీశ్రీ పరమహంస పరివ్రాజకాచార్యవర్యులు జగద్గురు శ్రీమజ్జయేంద్ర సరస్వతీ శ్రీవారు. శ్రీపరమాచార్యులు ప్రసాదించిన శ్రీముఖమే, త్యాగరాజకృతులకు మహాభాష్యమని ఆదేశించి తదనువాదమును ఇందు ప్రకటించుటకు నారాయణ స్మరణముతో ఆదేశమిచ్చినందుకు అస్మద్గురు స్వాముల చరణ సన్నిధికి అనేక సహస్రవందనము లర్పించుకొనుచున్నాను.

**– కల్లూరి వీరభద్రశాస్త్రి**

# త్యాగరాజ కీర్తనలు – అక్షరానుక్రమణిక


| సంఖ్య | కీర్తన | పుట |
|---|---|---|
| 242 | నీ చిత్తము | 1 |
| 243 | నీ చిత్తము నా భాగ్యమయ్యా! | 3 |
| 244 | నీ దయ రావలె | 4 |
| 245 | నీ దయ రాదా | 6 |
| 246 | నీ దయచే రామ | 7 |
| 247 | నీ పద పంకజములను | 8 |
| 248 | నీ భజనగాన | 10 |
| 249 | నీ భక్తి | 11 |
| 250 | నీ ముద్దుమోము | 12 |
| 251 | నీవంటి దైవమును | 13 |
| 252 | నీ వాడనే గాన | 15 |
| 253 | నీవేరా కులధనము | 16 |
| 254 | నీవేగాని | 17 |
| 255 | నీ దయ గల్గుటే | 19 |
| 256 | నీవంటి దైవము | 21 |
| 257 | నీవు బ్రోవ వలె | 21 |
| 258 | నీవే నన్నెడ | 22 |
| 259 | నెనరుంచరా | 24 |
| 260 | నెనరుంచినాను | 24 |
| 261 | నేనెందు వెదకుదురా | 25 |
| 262 | నే పొగడకుంటే | 26 |
| 263 | నే మొఱబెట్టితే | 27 |
| 264 | నేరమా రామ | 28 |
| 265 | నోరేమి శ్రీరామ | 29 |

| సంఖ్య | కీర్తన | పుట |
|---|---|---|
| 266 | పదవి నీ సద్భక్తి | 30 |
| 267 | పరమాత్ముడు | 31 |
| 268 | పరాకు నీకేలరా | 32 |
| 269 | పరాశక్తి | 33 |
| 270 | పరిహాసకమా | 34 |
| 271 | పరితాపము | 35 |
| 272 | పరిపూర్ణ | 35 |
| 273 | పలుకవేమి | 36 |
| 274 | పలుకు కండ చక్కెరను | 37 |
| 275 | పట్టి విడువరాదు | 38 |
| 276 | పరిపాలయమాం | 39 |
| 277 | పరలోక | 40 |
| 278 | పరలోక సాధనమే | 41 |
| 279 | ప్రక్కల నిలబడి | 42 |
| 280 | ప్రాణనాథ | 44 |
| 281 | ప్రారబ్ధమిట్లుండగా | 45 |
| 282 | పొద్దు పొయ్యేని | 46 |
| 283 | ఫణిపతిశాయీ | 48 |
| 284 | బంటురీతి | 49 |
| 285 | బాగాయెనయ్యా | 50 |
| 286 | బాలే బాలేందు | 52 |
| 287 | బుద్ధిరాదు | 54 |
| 288 | బృందావనలోల | 55 |
| 289 | బ్రోవ భారమా | 56 |
| 290 | భక్తిబిచ్చమీయవే | 56 |
| 291 | భజన | 58 |
| 292 | భజన సేయరాదా | 60 |





| సంఖ్య | కీర్తన | పుట |
|---|---|---|
| 293 | భజన సేయవే | 61 |
| 294 | భజరే భజ | 62 |
| 295 | భవనుత | 63 |
| 296 | భక్తుని | 65 |
| 297 | భజనసేయు | 67 |
| 298 | భవసన్నుత | 68 |
| 299 | భువిని దాసుడనే | 70 |
| 300 | మదిలోన | 70 |
| 301 | మనసా | 71 |
| 302 | మనసా ఎటు | 73 |
| 303 | మనసా శ్రీరాముని | 74 |
| 304 | మనసా శ్రీరామచంద్రుని | 75 |
| 305 | మనసు నిల్ప | 77 |
| 306 | మనసులోని మర్మమును | 79 |
| 307 | మనసు విషయ | 80 |
| 308 | మనవిని వినుమా | 82 |
| 309 | మనవ్యాలకించ | 83 |
| 310 | మరకత మణివర్ణ | 85 |
| 311 | మఱచే వాడనా | 85 |
| 312 | మరి మరి నిన్నే | 86 |
| 313 | మరియాద గాదయా | 87 |
| 314 | మరియాద గాదురా | 88 |
| 315 | మరుగేలరా! | 89 |
| 316 | మహిమ | 90 |
| 317 | మనసు స్వాధీనమైన | 91 |
| 318 | మహిత ప్రవృద్ధ | 92 |
| 319 | మాకేలరా విచారము | 94 |

| సంఖ్య | కీర్తన | పుట |
|---|---|---|
| 320 | మా జానకి | 95 |
| 321 | మాటాడవేమి | 97 |
| 322 | మాటి మాటికి | 98 |
| 323 | మానము లేదా | 99 |
| 324 | మామవ సతతం | 100 |
| 325 | మారు బల్కకున్నావేమిరా | 101 |
| 326 | మా పాలవెలసి | 102 |
| 327 | ముచ్చట బ్రహ్మాదులకు | 103 |
| 328 | మురిపెము కలిగె | 106 |
| 329 | ముద్దు మోము | 108 |
| 330 | మునుపే | 109 |
| 331 | మున్ను రావణ | 110 |
| 332 | ముమ్మూర్తులు | 112 |
| 333 | ముందు వెనక | 114 |
| 334 | మేనుఁజూచి | 115 |
| 335 | మేరు సమాన ధీర | 116 |
| 336 | మేలు మేలు రామనామ | 117 |
| 337 | మోసపోకు | 120 |
| 338 | మోహన రామ! | 122 |
| 339 | మోక్షము కలదా | 123 |
| 340 | యజ్ఞాదులు | 125 |
| 341 | యుక్తముగాదు | 127 |
| 342 | యోచనా | 131 |
| 343 | రఘునందన | 132 |
| 344 | రఘునాయక | 134 |
| 345 | రఘుపతే రామ | 134 |
| 346 | రఘువర నన్ను | 135 |





| సంఖ్య | కీర్తన | పుట |
|---|---|---|
| 347 | రఘువీర | 137 |
| 348 | రమారమణ | 138 |
| 349 | రమించువారెవరు | 140 |
| 350 | రాకా శశివదన | 142 |
| 351 | రాగ సుధారస | 143 |
| 352 | రాగరత్న మాలికచే | 144 |
| 353 | రాజు వెడలె | 145 |
| 354 | రానిది రాదు | 146 |
| 355 | రామ బాణత్రాణ | 148 |
| 356 | రామభక్తి సామ్రాజ్య | 150 |
| 357 | రామాభిరామ | 151 |
| 358 | రామం భజేహం | 153 |
| 359 | రామ నీ సమాన మెవరు | 154 |
| 360 | రామా నీయెడ | 155 |
| 361 | రామ కథాసుధా | 157 |
| 362 | రామ రఘుకుల | 159 |
| 363 | రామలోభ | 161 |
| 364 | రామా! నిన్నే | 162 |
| 365 | రామ నన్ను బ్రోవరా | 163 |
| 366 | రామచంద్ర నీ దయ | 165 |
| 367 | రామ దైవమా | 166 |
| 368 | రామా నీవేగాని | 168 |
| 369 | రామ నినువినా | 169 |
| 370 | రామా! నీపై | 171 |
| 371 | రామ నీ వాదుకొందువో | 172 |
| 372 | రార సీతారమణీ | 173 |
| 373 | రామ కోదండరామ | 174 |

| సంఖ్య | కీర్తన | పుట |
|---|---|---|
| 374 | రామా! నిను నమ్మిన | 175 |
| 375 | రామ రామ | 177 |
| 376 | రామ సీతారామ | 179 |
| 377 | రామ సమయము | 180 |
| 378 | రాముని మరవకవే | 182 |
| 379 | రారా నన్నేలుకోరా | 183 |
| 380 | రూకలు పదివేలున్న | 184 |
| 381 | లలితే శ్రీ ప్రవృద్ధే | 185 |
| 382 | లక్షణములు కల | 186 |
| 383 | లావణ్య రామ | 189 |
| 384 | లీలగాను | 190 |
| 385 | లేకనా నిన్ను | 192 |
| 386 | లేమి దెల్ప | 194 |
| 387 | లోకావన చతుర | 195 |
| 388 | వద్దనేవారు | 197 |
| 389 | వరదరాజ నిను | 197 |
| 390 | వరనారద నారాయణ | 198 |
| 391 | వరశిఖి వాహన | 199 |
| 392 | వరాలందుకొమ్మని | 200 |
| 393 | వరదానవ నీతాశా | 201 |
| 394 | వరరాగ లయజ్ఞులు | 202 |
| 395 | వాచా మగోచరమే | 204 |
| 396 | వాడేరా దైవము | 205 |
| 397 | వాసుదేవ వరగుణ | 207 |
| 398 | విడజాలదురా | 207 |
| 399 | విదులకు మ్రొక్కెద | 208 |
| 400 | వినతా సుత | 209 |





| సంఖ్య | కీర్తన | పుట |
|---|---|---|
| 401 | విన నాస కొనియున్నానురా | 210 |
| 402 | వినరాద నా మనవి | 211 |
| 403 | వినవే ఓ మనసా | 212 |
| 404 | విధి శక్రాదులకు | 213 |
| 405 | వినాయకుని వలెను | 215 |
| 406 | విరాజ తురగ | 217 |
| 407 | వేణుగాన లోలుని | 218 |
| 408 | వేంకటేశ నిను | 218 |
| 409 | వేరెవ్వరే గతి | 220 |
| 410 | శంభో! మహాదేవ | 221 |
| 411 | శంభో శివశంకరా గురు | 222 |
| 412 | శర శర సమరైక శూర | 222 |
| 413 | శశివదన | 223 |
| 414 | శరణు శరణనుచు | 225 |
| 415 | శివ శివ శివ | 227 |
| 416 | శివే పాహిమాం | 228 |
| 417 | శాంతములేక | 229 |
| 418 | శ్యామ సుందరాంగ | 230 |
| 419 | శ్రీకాంత నీయెడ | 230 |
| 420 | శ్రీ జనక తనయే | 231 |
| 421 | శ్రీ జానకీ | 233 |
| 422 | శ్రీ నారదనాద | 234 |
| 423 | శ్రీ నారసింహ | 235 |
| 424 | శ్రీ పతే నీపద | 236 |
| 425 | శ్రీ మానినీ మనోహర! | 237 |
| 426 | శ్రీ రఘువర | 239 |

| సంఖ్య | కీర్తన | పుట |
|---|---|---|
| 427 | శ్రీ రఘువరా ప్రమేయ | 240 |
| 428 | శ్రీ రఘుకులమందు | 241 |
| 429 | శ్రీ రమ్య చిత్తాలంకార | 242 |
| 430 | శ్రీరామ పాదమా | 242 |
| 431 | శ్రీ నారదమునీ | 244 |
| 432 | శ్రీ పప్రియ | 245 |
| 433 | శ్రీ రఘువర | 246 |
| 434 | శోభిల్లు సప్తస్వర | 247 |
| 435 | సంగీత జ్ఞానము | 248 |
| 436 | సంగీత శాస్త్రజ్ఞానము | 249 |
| 437 | సందేహమును | 250 |
| 438 | సంసారులైతే | 252 |
| 439 | సనాతన పరమపావన | 254 |
| 440 | సమయము తెలిసి | 255 |
| 441 | సమయము ఏమరకే | 257 |
| 442 | సముఖాన | 258 |
| 443 | స్మరణే సుఖము | 259 |
| 444 | సరససామదాన | 260 |
| 445 | సరసీరుహానన | 262 |
| 446 | సరసీరుహ నయన | 263 |
| 447 | స్వరరాగ సుధా | 265 |
| 448 | సరివారిలోన | 267 |
| 449 | సరి యెవ్వరే | 269 |
| 450 | సరిజేసి వేడుక | 270 |
| 451 | సత్తలేని దినములు | 272 |
| 452 | సర్వాంతర్యామి | 274 |
| 453 | సాకేత నికేతన | 276 |





| సంఖ్య | కీర్తన | పుట |
|---|---|---|
| 454 | సామజ వరగమన | 276 |
| 455 | సామికి సరిజెప్పఁజాల | 278 |
| 456 | సార్వభౌమ | 279 |
| 457 | సాక్షి లేదనుచు | 280 |
| 458 | సారమేగాని | 281 |
| 459 | సారి వెడలిన | 284 |
| 460 | సిగ్గుమాలి నావలె | 285 |
| 461 | సీతమ్మ మాయమ్మ | 287 |
| 462 | సీతాపతీ | 288 |
| 463 | సీతాపతి కావవయ్య | 289 |
| 464 | సీతావర | 290 |
| 465 | సీతా మనోహర | 291 |
| 466 | సుఖి యెవరో | 292 |
| 467 | సుగుణములే | 293 |
| 468 | సుజన జీవన | 293 |
| 469 | సుందరి నిన్ను | 294 |
| 470 | సుందరి నన్నిందరిలో | 298 |
| 471 | సుందరతర దేహం | 299 |
| 472 | సుందరి నీ దివ్య | 301 |
| 473 | సుధా మాధుర్య | 303 |
| 474 | సుందరేశ్వరుని | 304 |
| 475 | సొగసుగా మృదంగ | 305 |
| 476 | సొగసుఁజూడ | 307 |
| 477 | హరిదాసులు వెడలే | 308 |
| 478 | క్షీణమై తిరుగ | 310 |
| 479 | క్షీరసాగర శయన | 311 |

# అనుబంధము


| సంఖ్య | కీర్తన | పుట |
|---|---|---|
| 1 | శ్రీగణనాథం | 313 |
| 2 | సదా మదిందలతు | 314 |
| 3 | ఎవరున్నారు బ్రోవ | 314 |
| 4 | సారస నేత్రా | 315 |
| 5 | గానమూర్తే | 316 |
| 6 | కలశవార్ధిజాం | 316 |
| 7 | రారా ఫణిశయన | 317 |
| 8 | హరిహరి యనుకోవే | 317 |
| 9 | రామ రమ రామ రమ | 318 |
| 10 | ఘట్టివాడె యనుచు | 319 |
| 11 | కంటకులను | 319 |
| 12 | పాహి పరమదయాళో | 320 |
| 13 | లాలి యూగవయ్య | 321 |
| 14 | శంకర | 321 |
| 15 | మంగళం | 322 |




శ్రీ త్యాగరాజస్వామి

## 242. ధన్యాసి - చాపు

**నీ చిత్తము నిర్మలము నిశ్చలమని**
**నిన్నే నమ్మినాను ॥నీ॥**

**నా చిత్తము వంచన చంచలమని**
**నన్ను విడనాడకుమీ శ్రీరామ ॥నీ॥**

**గురువు చిల్లగింజ గురువే భ్రమరము**
**గురుఁడే భాస్కరుఁడు**
**గురుఁడే భద్రుఁడగు గురువు నీ వనుకొంటి**
**ధరను దాసునిబ్రోవు త్యాగరాజనుత ॥నీ॥**

మానవ చిత్తక్షేత్రములందు, అసంగ చిద్రూపము, సచ్చిదానంద ఘనము సాక్షిమాత్రమునైన ఆత్మ అధిష్ఠానమైయున్నది. క్షేత్రజ్ఞులందరు వస్తుతః పరమాత్మ స్వరూపులు **"క్షేత్రజ్ఞం చాపి మాంవిద్ధి-సర్వక్షేత్రేషు భారత"** అని భగవద్వచనము.

చిత్తము లేక అంతఃకరణము సత్త్వ రజ స్తమోగుణ సంస్కారములచే, ఆత్మయొక్క స్వరూపజ్ఞానమును మనకు కలుఁగనీయదు. ముముక్షువులు, సత్సాధనలవలన రజ స్తమోగుణ సంస్కారములను తొలఁగించుకొన్నచో, శుద్ధ సత్త్వగుణ సంపదచే తమ చిత్తము నిర్మలమగును.

అట్టి వినిర్మలచిత్త దర్పణమందు ఆనంద చిన్మాత్రమైన భగవద్రూపము సాక్షాత్కరించును.

కావున, సాధకుని చిత్తము సత్త్వశుద్ధికలదై యుండవలయును. ఆదర్శవంతము అనంత కల్యాణగుణ నిధానము. హృదయేంద్రియ ఆనంద దాయకమునైన భగవద్రూపమును ఉపాసించుటవల్లనే ఆ సత్త్వశుద్ధి

కలుగును. ఉపాసనభక్తి, రక్తిలేక, సత్త్వవృద్ధికై ఏ విధములైన సాధనలు ఫలితము నివ్వలేవు. కావున, భక్తుడు తన ఉపాస్యదైవమును, లేక గురుమూర్తిని లక్ష్యశుద్ధితో ఉపాసింపవలెను. అంతకు ముందుగా తనయందున్న దోషమును గుర్తించుట ఉత్తముని లక్షణము.

కావుననే శ్రీత్యాగరాజస్వామి తన చిత్తదోషమును గమనించి, రామా! నా చిత్తము వంచన కలది. అనగా నన్నే మోసగించుచున్నది. వాస్తవము, ప్రయోజనవంతము, న్యాయ్యమునైన విషయమును కప్పిపుచ్చి వేరే విధముగా తోపింపఁజేయుట మోసము. ఈ దోషము రజస్తమోగుణావరణము వలన ఏర్పడును. ఆ వెంటనే ఏ లక్ష్యమందును నిలుకడలేక చంచలమై యుండుటయు కలుగును. నా చిత్తమట్టి వంచనకారి చంచలమునై యున్నది. ఈ దోషములు పోవలెనన్న నిర్మలము, నిశ్చలమునైన చిత్తాదర్శము దొరకవలెను. అందుకై నే నన్వేషింపగా, నీ చిత్తము నిర్మలము, నిశ్చలమని, నీ దివ్యచరిత్రా దర్శములతో నాకు ఋజువైనది. కావున, నిన్నే నమ్మితిని. నీవు మాత్రము చంచలము వంచనదోషములు కల నన్ను విడువవలదు. నా సాంగత్యమున దీపమునకు మాలిన్యమంటనట్లు, నా చిత్తదోషములు నీ కనర్థమును కలిగించలేవు. కావున, నన్ను విడనాడకుమని ప్రార్థించిరి.

నిర్మలము, నిశ్చలమునైన చిత్తముకల శుద్ధసత్త్వమూర్తియే గురుస్వరూపము. గురువుయొక్క అనుగ్రహము, ఆశ్రయములేక ఎంతటి వానికైనను లక్ష్యశుద్ధి, సిద్ధి ఏర్పడవు. అట్టి గురుమూర్తి వైభవమును సోదాహరణముగా చరణమందు నిరూపించినారు.

చిల్లగింజ= ఇందుపగింజ; భ్రమరము= తుమ్మెద; భాస్కరుఁడు= సూర్యుడు; చేయు మూడు విధములైన సంస్కారములు కలవు.

అందు చిల్లగింజ, బురదనీటిని, అందలి బురదను, అడుగునకు తెచ్చి నీటిని తేర్చి నిర్మలమొనర్చి తాను కూడా ఆ బురద యందే లయమగును.



అట్లే సద్గురువు తన శిష్యుని చిత్తమాలిన్యమును హరించును. ఆపై భ్రమరము తన పరిభ్రమణముచే ఒక కీటమునకు తన సారూప్యము నిచ్చినటుల గురుమూర్తి, సజాతీయ ప్రత్యయములతో ధ్యాననిష్ఠను, లక్ష్యశుద్ధిని అనుగ్రహించును. ఆ తర్వాత భాస్కరుడు అంతటనిండి తన ప్రకాశమును అంతర్బాహ్యములందు జొనిపి చీకటిని అజ్ఞానమును పోగొట్టి జ్ఞానము ననుగ్రహించును. దానిచే, నిరంతర భద్రమైన జీవన్ముక్తి లభించును.

రామా! అట్టి సద్గురుడవే నీవని భావించి నిన్నే నమ్మియున్నాను. నన్నుద్ధరించుము. అని వేడుకొన్నారు.

## 243. [1]విజయవసంత – దేశాది

**నీ చిత్తము నా భాగ్యమయ్యా!**
**నిరుపాధిక నీ వాడనయ్యా ॥నీ॥**

**యోచించి కార్యము లేదనుచు**
**ఒకపారి శరణను కొంటినయ్య ॥నీ॥**

**పరదైవములఁజూచినంతనే**
**భావమందు నీవై [2]బరగెదయ్య**
**ధరలోన నా సరివారలలో**
**దయఁజూడవయ్య త్యాగరాజనుత ॥నీ॥**

ఇందు సహజ సుందరమైన జాతీయభావముతో నీ చిత్తం నా భాగ్యమని లోకమర్యాదలో కీర్తించి నీవు నిరుపాధికుడవు= ఉపాధి లేక అంతటను నిండియుండువాడవు. అనగా సర్వాంతర్యామివి, అందరి హృదయము లందున్నావు అనే సత్యమును గుర్తించి, ఇతర యోచనలు లేక నాస్థాయిలో సర్వాశ్రయుడవైన నిన్నే శరణు జొచ్చితిని.

1. జీవంతిని. 2. బరగేనిరా.

ఎచటను, ఎవ్వరికీ నీ కన్న వేరు ఆశ్రయము లేదు. కావున వారి వారి స్థాయి ననుసరించి వేరు వేరు మార్గములలో నిన్నే ఆశ్రయించవలెను.

**"యేప్యన్య దేవతాభక్తాయజంతే శ్రద్ధయాన్వితాః,**
**తేపి మామేవ కౌంతేయ యాంతి"**

ఏయే దేవతలను ఏ యే నామరూపములతో వేర్వేర ఉపాసించిననూ, వారున్నూ నన్నే పొందుదురు. అని భగవద్వచనము ప్రమాణము గలదు. కావున, పరదైవమను మాటలేదు. దైవ మొక్కటియే. అయినను, నా జన్మాంతర సంస్కార వశమున రామా! నీ దివ్యరూపమే హృదయమంటినది. ఏ దైవమును చూచిననూ, అందు నీవే సాక్షాత్కరింతువు. ఇది నా భాగ్యము. నీ సరి దైవములలో నీవే నా లక్ష్యమైనట్లు, నా సరివారలలో, వివిధ ఉపాసకులలో నేను నీ అనుగ్రహ పాత్రుడనైతినేని, మన ఇర్వుర దివ్యానుభవంలో **"ఏకమేవాஉద్వితీయం బ్రహ్మ"** అను సిద్ధాంత వచనము అనుభవ రూపమున ఫలించును. అని తనకు రామునికిఁగల అభేదమును యుక్తితో స్వభావ రమణీయముగా కీర్తించినారు.

## 244. తోడి - ఆది

**నీ దయ రావలెగాక, నే నెంతవాడను రామ** ॥నీ॥

**వేదశాస్త్ర పురాణములన్ని నీ**
**వే గతియనుచు మొఱబెట్టఁగనుక-**
**నీ సరి సనిదాని సనిదపమగా నిదమగరి సనిదా**
**నిసరి నిసాని గరిగ గామ గదామ నీదసరీ సని**
**సాసా నిదని దనీదప దాదాపమపమ పామగా మపద** ॥నీ॥

**సార సారా! కాంతారచర మద వి**
**దార సుందరాకార సుగుణ సుకు-**



**మార మారమణ నీరజాప్తకుల**
**పారావార సుధారస పూర** ॥నీ॥

**శ్రీహరే వరవిదేహ జాధిప వి**
**వాహ దళిత రిపుదేహ శేషసమ**
**బాహ సజ్జన సమూహ వైరిమద**
**దాహ మౌని హృద్గేహ నాదుపై** ॥నీ॥

**ఆదిదేవ దేవాదిమృగ్య సన**
**కాది వినుత కామాది షడ్గుణ హ**
**రాది మధ్య రహితాది త్యాగ రా**
**జాది వందిత వివాది మదహరణ** ॥నీ॥

కాంతార....విదార= అరణ్యమందు సంచరించు రాక్షసుల మదము హరించినవాడు. మా రమణ= లక్ష్మీపతి నీరజాప్త...పూర= సూర్యకులమనెడి సముద్రమునకు చంద్రుని వంటివాడు.

వరవిదేహజాధిప= విదేహుడైన జనకుని కుమార్తెకు భర్త. వి, వాహ= (పక్షి) గరుడుడు వాహనమైనవాడు. శేషసమబాహ= ఆదిశేషునివంటి బాహువులుకలవాడు.

వైరిమదదాహ= శత్రువుల మదమును దహించువాడు. మౌనిహృద్గేహ= మహర్షుల హృదయములు నివాసమైనవాడు. దేవాదిమృగ్య= దేవతలు మొదలైనవారిచే వెదుకతగినవాడు. వివాది మద హరణ= విరుద్ధవాద మొనర్చువారి మదమును హరించువాడు.

**'సర్వే వేదాయ త్పదమా మనంతి'** యనుటచే, వేదశాస్త్ర పురాణాది సకల విద్యలకు పరమావధి పరమ తాత్పర్యమునైనవాడు సర్వేశ్వరుడే. అంతటి సర్వతోముఖమై, అంతయు భగవన్మయమను అనుభవమున్నూ

దైవకృపవల్లనే లభించును. కావున, సర్వయత్నములచే దైవకృపను సంపాదించుటయే వివేకవంతుని విధి. అందు మొదటి సాధనము **“స్వస్మిన్ దీనత్వ భావనా”** తన అహంకారమును వదలి నే నెంతవాడను దీనుడనని భగవంతుని మొరబెట్టుకొనుటయే.

ఆపై చిన్మాత్రమైన ఆ భగవత్తత్త్వము, జీవుల ననుగ్రహించుకొరకు అవతారమెత్తి సర్వోన్నతమైన గుణ, వీర్య, శౌర్య, మాధుర్య భావములచే, దుష్టశిక్షణము. శిష్టరక్షణము చేసిన భగవంతుని లీలావైభవమును కీర్తించుట ద్వారమున, భగవంతుని దయకు పాత్రుడు కావచ్చును. కావున, ఇందు కడమచరణములందు శ్రీరాముని దివ్యవైభవమును కీర్తించినారు.

## 245. వసంతభైరవి – రూపకం

**నీ దయ రాదా ॥నీ॥**

**కాదనే వారెవరు కల్యాణ రామా ॥నీ॥**

**నను [1]బ్రోచేవాడని నాడే తెలియ**
**ఇన వంశ తిలక ఇంత తామసమా ॥నీ॥**

**అన్నిటి కధికారివని నేఁబొగడి [2]తి**
**మన్నించితే నీదు మహిమకుఁదక్కువా ॥నీ॥**

**రామ రామ రామ త్యాగరాజ హృత్సదన**
**నా మది తల్లడిల్లగ న్యాయమా వేగమే ॥నీ॥**

ఆ బాల్యముగా, నా జన్మాంతర పుణ్య సంస్కారముచే నా రక్షకుడవు నీవేయని గుర్తించి నిన్నే కీర్తించుచున్నాను. అనగా, నీ నా యనుబంధము

1. బ్రోచేవారిలను.
2. తే. తిరువాదిలో నొక పరమభక్తుడగు రాజసేవకుడు అయ్యగారివల్ల యీ చిన్న కీర్తనము ఉపదేశము పొందెనని ప్రసిద్ధి.



ఆ గర్భ శ్రీమంతుడన్నట్లు ఆ జన్మ సిద్ధము. కావున, కాదనే వారెవ్వరూ లేరు. అయినను ఇంత ఆలస్యము చేయుచున్నావు. ఇంతటనైన నీ దయరాదా! యని జాలిగా ప్రార్థించుట నైజ భక్తికి లక్షణము. సర్వమునకు నీవే అధికారివని నే భావించితిని. అనగా ఏ పనుల యందునూ, నా యహంకారమునకు తావివ్వలేదు. నిన్నే పొగడుచున్నాను. నా చిత్తము తహ తహలాడుచున్నది. రామ రామ రామ యని పునః పునః కీర్తించుటలో ఒక సహజమైన ఆర్తి, నైరాశ్యము గోచరించునట్లు పాడుకొని, ఇది నీకు న్యాయమా! యని వేడుకొన్నారు.

ఇందలి రాగ, స్వరవిన్యాసము జాలిని వ్యక్తీకరించును.

## 246. యదుకుల కాంభోజి – దేశాది

**నీ దయచే రామ నిత్యానందు డైతి ॥నీ॥**

**నాద బ్రహ్మానంద రసాకృతి గల ॥నీ॥**

**వర మృదుభాష సుస్వరమయ భూష**
**వర త్యాగరాజ వాక్చేలా వృత ॥నీ॥**

“పరమాత్మకు నాదమే శరీరము. **“నాదతనుం” “నాదసుధా రసంబిలను నరాకృతాయె”** అని శ్రీరాముని నాదరూపునిగా వర్ణించుట శ్రీ త్యాగరాజస్వామి వారి యనుభవము. ఈ గేయమందును స్మరించి “నాదబ్రహ్మానంద రసాకృతి గల రామా! నీ దయచే నేను నిత్యానంద మనుభవించుచున్నాను. అనుటయేగాక, నాదాత్మకములైన అలంకారములతో అలంకరించి కీర్తించుట ఎంతో విశేషము.

మృదుభాష, సరిగమాది స్వరములు భాషణములు. త్యాగరాజుని వాక్కు అనెడి చేలము= వస్త్రములుగల రామా! నీ దయవల్ల నిత్యానందము సిద్ధించునని నాదోపాసనయే సాక్షాదాత్మానందమునకు హేతువని నిరూపించినారు.

## 247. బ్యాగడ – ఆది

నీ పద పంకజములను నే నెఱనమ్మినాను ॥నీ॥

భూపాలుర గర్వంబు లణచు కొఱ
కా పరమేశ్వరు చాపము ద్రుంచిన ॥నీ॥

కోపముతో మును తాపసి ఇచ్చిన
శాపమున అహల్య అనుదినము
చాపరాయి తను తాప మోర్వలే
నాపెను గని పరితాపముఁదీర్చిన ॥నీ॥

వనరుహ తులిత నయన సంక్రందన
తనయుని బాధ సహింపని విరో
చన సుతు మతిఁగలిగిన భయ మెగయగ
ఘనతమ దుందుభి పెనుతలఁదన్నిన ॥నీ॥

జ్యావరనుత జ్యాజావర బిడౌ
జావరజాశ్రిత త్యాగరాజ
జ్యావరాజ రుద్రావ నీ సుర
భావనీయ మునిజీవన అనిశము ॥నీ॥

ఇందు శ్రీరాముని పాదారవిందముల మహిమానుభవమును వర్ణించుచూ, క్రమముగా అహల్యా శాపమోక్షణము, వాలివధ, సుగ్రీవమైత్రి మొదలైన రామాయణమందలి ప్రధాన ఘట్టములను పేర్కొని, బ్రహ్మేంద్రాదులకు సైతము భావించఁదగినవాడు, మునిజీవనుఁడు= మహర్షులకు జీవమైనవాడు, మునులే జీవముగాగలవాడునని, శ్రీరాముని దివ్యత్వమును, ధర్మస్వరూపమును కీర్తించి నీ దివ్యపాదములనే నేను నమ్మియున్నానని ప్రార్థించినారు.



సీతా స్వయంవరమందు అనేకులైన భూపాలురు గర్వముచే శివధనుర్భంగ మొనర్తుమని వచ్చి పరాజితులైరి. శివధనువన్న అదొక పరికరము గాదు. పరమేశ్వరుని దివ్యవిభూతి అందు అంతర్హితమైయున్నది. దానిని భంగించుటయన్న ఆ శైవమహస్సు తనయందు ప్రవేశింపఁ జేసికొనుటయని భావము. ఈ దేవ రహస్యమును రాజమాత్రులెరుంగరు.

ఇట్లే మహాపతివ్రతయగు అహల్యను గౌతమఋషి కోపముతో చాపరాతిగా శపించెను. ఇంద్రుని ఏకాంతచర్య ఇందుకు కారణముగా స్థూలముగా భావింతుము. ఆ తల్లి రాతిగానుండి తనుతాపము ఓర్వలేకున్నపుడు, నిర్నిమిత్తముగా శ్రీరాముని పాద పరాగస్పర్శచే శాపవిముక్తురాలై రాముని పరంధామునిగా స్తుతించెను.

ఇందు కూడ దివ్యరహస్యమిమిడియున్నది. ఇట్లే, సంక్రందన తనయుని= వాలియొక్క బాధ సహింపలేని, విరోచనసుతుని= సూర్యపుత్రుఁడైన సుగ్రీవుని భయమెరిఁగి దుందుభి కాయమును పాదవిన్యాస మాత్రమున తొలఁగించి, సుగ్రీవునికి విశ్వాసమును కల్పించి, వాని మైత్రితో రావణవధ పర్యంతము విజయమును సాధించిన రాముని చరిత్రాంశమందొక విలక్షణమైన తీరు గోచరించును.

మరియు, వాలిని ఇంద్రతనయుడని, సుగ్రీవుని సూర్యతనయుడని పేర్కొనుట వలన దివ్యసంపదతో, రాముని పరత్వమును చెప్పినట్లు స్పష్టము. జ్యావరనుత= ధనుర్ధారులచే నుతింపఁబడువాడు, జ్యా, జావర= భూపుత్రికి వరుడు, బిడౌజావరజ= ఇంద్రునికి తమ్ముడు (ఉపేంద్రుడని భావము) జ్యావర= రాజులకు, అజ= బ్రహ్మకు రుద్ర= శివునికి అవనీసుర= బ్రాహ్మణులకు భావనీయ= భావింపఁబడువాడు ముని జీవనుడు ఇత్యాది విశేషణములచే రాముని పరాత్పరత్వమును కీర్తించి ఆ దివ్యపాదములకు ప్రణమిల్లెను.

## 248. నాయకి - ఆది

**నీ భజనగాన రసికులనే-నెందు గానరా రామ ॥నీ॥**

**శ్రీభవ సరోజాసనాది శచీ మనోరమణ వంద్య ॥నీ॥**

**సుగుణ నిర్గుణపు నిజ దబ్బరలను**
**షణ్మతముల మర్మమష్ట సిద్ధుల**
**వగలు చూప సంతసిల్లి గంటిని**
**వరానన త్యాగరాజ వినుత ॥నీ॥**

**"భజ సేవాయాం"** అనుటచే త్రికరణములతో, సర్వ విధములచేతను భగవంతుని సేవించుటయే భజనమనఁబడును. అయ్యది నాదోపాసనాత్మకమై గానరూపమయ్యేనేని తీగెలు సాగినట్లు లక్ష్యసిద్ధి ఏర్పడి, అనన్యమైన రాగరంజితమై భక్తియగును. అట్టి యేకాంత భక్తుల దర్శనము అపురూపము. కావుననే, ఇట్టి రసికుల నే నెందుగానరా! యని విశేషించినారు.

భవ, సరోజాసనాదులు= శివుడు, బ్రహ్మ, శచీ మనోరమణుడు ఇంద్రుడాదిగాగల సకల దేవతా నాయకులు రామా! నీ దివ్యమోహన నామ, రూప, గుణ వైభవములచే ఆకర్షితులై నీకే మ్రొక్కుచున్నారు. ఇట్టి నీ దివ్యసంపదను శాస్త్రార్థ చర్చలతో, సిద్ధాంత రాద్ధాంతములతో, సగుణ, నిర్గుణ స్వరూప భేదములతో, గాణాపత్యము మొదలగు ఆరు మతములు, ఆయా దేవతామూర్తి భేదములతో, అష్టైశ్వర్య యోగసద్ధులనంది ఎంతటి యోగులైననూ, నాదయోగముచే, శ్రీరాముని భజనానందముతో మహాభక్తితో రామునియందు రమించు గానరసికులు సాక్షాన్ముక్తిపదమందుకొందురు. **"భక్త్యామామభిజానాతి యావాన్యశ్చాస్మితత్త్వతః"** భక్తియే తత్త్వజ్ఞానమునకు సాక్షాత్సాధనమని గీతావచనము.



## 249. జయమనోహరి - రూపకం

**నీ భక్తి భాగ్యసుధానిధి-నీ దేదే జన్మము ॥నీ॥**

**భూ భారముగాని సుర-భూసురులై జన్మించిన ॥నీ॥**

**వేదోక్తంబౌ కర్మము-వెతగల్గు గతాగతమౌ**
**నాదాత్మక త్యాగరాజ-నాథా ప్రమేయ సదా ॥నీ॥**

శ్రీ రాముని భక్తిభాగ్యమొక అమృత సాగరము. అందు ఈదులాడు వానిదే సార్థకమైన జన్మము.

వేదోక్త కర్మానుష్ఠానాదులవలన ఆ యా స్వర్గాది లోకములనుండి రాకపోకలు కల్గును.

**"ఆ బ్రహ్మ భువనాల్లోకాః పునరావృత్తినోఽర్జున,**
**మా ముపేత్యతు కౌంతేయ పునర్జన్మ నవిద్యతే" ॥గీత॥**

బ్రహ్మలోకము మొదలు సర్వలోకములు పునరావృత్తిగలవే. నన్ను పొందిన వానికి పునర్జన్మ లేదు, ఆత్మజ్ఞానముచే జీవబ్రహ్మైక్య మొందిన జ్ఞానికి **"న స పునరావర్తతే"** అను శ్రుతి ప్రమాణముచే పునరావృత్తి రహితమైనది పరమపురుషార్థమైన మోక్షపదమే. ఇది సిద్ధాంతము.

యీ కీర్తనమందు "భక్తిభాగ్య సుధానిధి నీదేదే" యనుటవలన, జగన్మంగళమూర్తి సచ్చిదానంద స్వరూపమునైన శ్రీరామకృష్ణా ద్యవతార వైభవమందు మునిఁగితేలు అనన్య భక్తులు మోక్షమును సైతముకోరక, ఈ భక్తియందే ఓలలాడెదరనుటకు భాగవతము శ్రుతిగీతలం దొక్క గీతము కలదు.

**"దురవ గమాత్మతత్త్వ నిగమాయ**
**తవాత్తతనోః చరిత మహామృతాబ్ధి పరివర్త పరిశ్రమిణః**

**నపరిలషంతి కేచి దప వర్గమపి ఈశ్వరతే చరణ**
**సరోజ హంస కుల సంగ విసృష్ట గృహాః”**

దురవగాహమైన ఆత్మ తత్త్వమును బోధించుకొరకు రామకృష్ణాది రూపమున అవతరించి, అమృతములు, అమాయికములునగు దివ్యలీలలనెడి అమృతసాగరములందు ఓలలాడుచు, భక్తులు అపవర్గమును= మోక్షమునేని పొందుట కిచ్చగించరు.

ఓ ఈశ్వరా! నీ పాదములను పద్మముల నాశ్రయించు హంసల (రాజయోగులు) సాంగత్యముచే తమ యనుబంధములైన గృహారామ, దార సుతాదులను సైతము విడుతురు. ఇట్లే రామదాసు **“ముక్తి నేనొల్ల నీ పదభక్తి మాత్రమె చాలు”** ననెను.

కావున, వేదోక్తములైన యజ్ఞాది సమస్త కర్మలకు సార్థక్యమును కలిగించునది శ్రీహరి చరణారవిందభక్తి. అదిలేనిచో వేదములు, వేదోక్త కర్మలు, గుణత్రయాను బంధముకలవై గతాఽగతాదులచే పునర్జన్మకు కారణములగును.

## 250. కమలామనోహరి – ఆది

**నీ ముద్దు మోముఁజూపవే ॥నీ॥**

**నా మీద నెనరుంచి, నళినదళ నయన ॥నీ॥**

**ఉరమున నిన్నుంచుకొనే గాని**
**ఉరగశయన నాదుల్లము రంజిల్ల ॥నీ॥**

**పులకరించ నినుఁబూజసేతుగాని**
**కలనైన మరువ చుక్కల రాయనిఁబోలు ॥నీ॥**

**మరులు కొన్నాను మదనజనక**
**ధరసుతారమణ త్యాగరాజునికి ॥నీ॥**



ఇందు జగన్మోహనమైన శ్రీరాముని శృంగార రసానుభవముతో సేవించుకొను భావముతో ఉరమున నిన్నుంచుకొందునని, శరీరము పులకరించ నిన్ను పూజింతునని, చుక్కలరాయని= చంద్రునిఁబోలు నీ దివ్యరూపమును కలనైన మరువలేనని, మదన జనకుడవైన నిన్నేమరులు కొన్నానని, వేడుకొని నీ ముద్దుమోము చూపుమని ప్రార్థించినారు.

## 251. తోడి – ఆది

**నీవంటి దైవమును షడానన! నేనెందు గానరా ॥నీ॥**

**భావించి చూడఁ దరముగాని**
**బ్రహ్మపురి నిలయ, గిరిజా తనయ ॥నీ॥**

**సరి బాలురతో కైలాస గిరిని**
**శుభాకృతితో నాడగను**
**వెరపులేక ప్రణవార్థము**
**తానను విధిని కోపగించి**
**సరగున నవ వీరులం దొక**
**కింకరునిఁగని ముమ్మారు సెలవిచ్చి**
**సురలు ముర పురారులు విని మెచ్చగ**
**వరుసగాను సృష్టిశక్తి నొసఁగిన ॥నీ॥**

**హరి హరాదులకు దిక్పాలుర కల**
**శశి సూర్యులకు**
**మరి విద్యాధరులకు బ్రహ్మాండములను**
**వెలసే వర వీరాదులకు**
**తరముగాక నిన్ను జతగూడుక**
**శరణనగా, విని సైరించక**
**పరమ ద్రోహియైన శూర పద్మాసురుని**
**కీర్తిగాను గర్వమణచిన ॥నీ॥**

**మారకోటులందు గల్గిన శృంగార మెల్ల**
**ఇందుముఖ నీ కొన**
**గోరును పోలునె**
**అటువంటి శుభాకారము సంతతము**
**సారెకు నా మదిని నిల్పిన కుమార**
**దయాపర నీరజలోచన**
**తారకాధిప కలాధరుఁడగు**
**శ్రీ త్యాగరాజ సన్నుతాశ్రిత హిత ॥నీ॥**

ఈ గేయము షడాననుని (కుమారస్వామి) యోగమహిమను కీర్తించుచున్నది. దక్షిణ భారతమున బ్రహ్మపురి (పళని) ప్రసిద్ధమైన సుబ్రహ్మణ్యక్షేత్రము. ఒకప్పుడు స్వామి ఋషిబాలురతో కైలాసమందు ఆడుకొనుచుండగా (బాల్యమని భావము) బ్రహ్మేంద్రాదులు ఆ ముచ్చట చూడవచ్చిరట. అంత బ్రహ్మదేవునిఁగూర్చి. ప్రణవమున కర్థమేమి? యని కుమారస్వామి ప్రశ్నించెనట. బ్రహ్మగారికి పరమాత్మయొక్క తాత్త్వికరూపము తెలియక, సకల చరాచర సృష్టిశక్తి తనకే గలదనియు, సృష్టి కతీతమైన సచ్చిదానందమయమగు ప్రణవార్థమెరుగక, తానే ప్రణవార్థమని సమాధానించెనట. అప్పుడు కుమారుడు ప్రణవార్థమెరుఁగని బ్రహ్మకు సృష్టిశక్తి నిచ్చుట న్యాయముగాదని కోపించి. తన సేవకులైన తొమ్మండ్రు వీరులలో ఒకనిని పిలచి, వానికి సృష్టిశక్తినిచ్చి, బ్రహ్మను తాత్కాలికముగ శిక్షించెననుకథ–శివపురాణ, శివరహస్యాదులందు ప్రసిద్ధము. మరియు శూరపద్మాసురుడు సర్వలోకములను బాధించగా వానిని, తారకుని సంహరించెనని ప్రసిద్ధము. ఆపై కుమారస్వామి సౌందర్యము కోటి మన్మథుల మించినదనియు సర్వులకు స్మరణ మాత్రముననే శుభముల నిచ్చువాడనియు, తారకాధిప కళాధరుడు= చంద్రకళాధరుడైన శివుడు త్యాగరాజేశ్వరునిచే



గూడ నన్నుతింపఁబడువాడైన షడాననునివంటి దైవము సర్వదేవతాస్తుతి పాత్రమని కీర్తించినారు.

## 252. సారంగ – జంపె

**నీ వాడనేగాన నిఖిలలోక నిదాన**
**నిమిష మోర్వగ గలనా... ॥నీ॥**

**దేవాది దేవ భూదేవ వరపక్ష రా**
**జీవాక్ష సాధుజన జీవన సనాతన ॥నీ॥**

**సత్యంబు నిత్యంబు సమరమున శౌర్యంబు**
**అత్యంతరూపంబు అమిత బలము**
**నిత్యోత్సవంబుగల నీకు నిజదాసుడని**
**తథ్యంబు బల్కు శ్రీ త్యాగరాజార్చిత ॥నీ॥**

రామా! నీవు నిఖిల లోకములకు నిదానము= అదికారణమైనవాడవు. అంతర్బాహ్యములచే నీ స్వరూప సత్తచేతనే నిండియున్నాను. కావున నీవాడనే. నన్ను వేరుగాచూచిన నిమిషమేని సహించఁజాలను. సర్వకారణుడవైన నీవే కార్యరూపమును ధరించియున్నావు. దేవతల కాదిదైవమవు. ఈ వైభవమును స్వధర్మానుష్ఠానముచే గుర్తెరింగిన భూదేవులకు (బ్రాహ్మణులు) సాధుజనులకు సన్నిహితుఁడవై వారికి నీ స్వరూపాను సంధానమున జీవనమిచ్చు సనాతనుడవు. వీరికిని, నీకును సజాతీయములైన ధర్మములు, నిత్య, సత్యములు. నిత్యమనగా త్రికాలము లందుండునది. సత్యమనగా సమదర్శనము. అత్యంత రూపంబు= సర్వాతిశయమైన రూపము; సర్వోన్నతమైన బలము. నిత్యమాంగళ్యము అను నీ గుణములు సర్వేశ్వరునికి సహజములు. ఇతరులకు కల్పితములు. కావున, నీకంటె వేరు ఆశ్రయము ఎవ్వరికిని లేదు. ఇది నిజమైనమాట; ఇక జీవులకు మిగిలినది జీవభావము. ఇట్టి జీవభావముతో భగవంతునికి

దాసుండై తన సర్వస్వము భగవదధీనమని భావించినచో నీ అనుగ్రహము కలుగును. అందుచే నీకు నిజదాసుడను. నీ వాడనని గంభీరభావముతో అభివర్ణించినారు.

## 253. బ్యాగడ – చాపు

**నీ వేరా కులధనము సంతతము నీ వేరా జీవము ॥నీ॥**

**ఈవఱకును తెలియకున్న నేరము**
**దేవర క్షమచేసి దయతో నేలుకోరా ॥నీ॥**

**మాదవ [1]సీతానుజ వర సహిత**
**మంగళకర[2] పరమార్థ భూతచరిత**
**గాధియాగ సంరక్షక సతత**
**గతిజాప్త నతజనావృత ధీవినుత ॥నీ॥**

**సుజన నిచయ పాపహిమ చండసూర్య**
**సుస్వరజిత ఘనరవ మాధుర్య**
**అజముఖారి సమర నిరుపమశౌర్య**
**ఆనంద కంద సుందర [3]సువర్య ॥నీ॥**

**రాఘవ సర్వోన్నత సుప్రకాశ**
**రమణీయకరపాటిత లంకేశ**
**త్యాగరాజవర హృదయ నివేశ**
**తరణి శశాంకలోచన జానకీశ ॥నీ॥**

ఇందు శ్రీరాముని దివ్యచరిత్రను పేర్కొను అనేక విశేషణములతో స్తుతించుచూ, ప్రత్యేకముగా “నీవేరా కులధనము” అనగా ఇలువేల్పు.

1. సీతావర అనుజసహిత.
2. పరమాద్భుత చరిత, 3. సురవర్య.



అంతకన్నా మానవజాతికే, దివ్యమానవావతారమున ఆదర్శమూర్తివై యున్నావని సంప్రదాయ గౌరవమును పేర్కొనినారు.

మాకులమునకే నీవు నిధివంటివాడవు. ఇంతవరకు ఈ విధముగా నీ బాంధవ్యమును తెలియనైతిని. ఇది గొప్పనేరము. నీవు మన్నించి ఇంతట స్వీయునిగా భావించి దయతో కాపాడుము అనుచూ, వివిధ రూపములతో శ్రీరాముని దివ్యగుణములను కీర్తించినారు. మాధవ= లక్ష్మీపతివైయుండి మానవ సహజముగా సీతానుజవరసహితుడవైతివి. భార్యా సోదరులతోగూడి చరించితివి. విశ్వామిత్ర యాగరక్షణ చరిత్ర, వాయుకుమారుడైన ఆంజనేయునికి ఆప్తుడవై వానరమైత్రినందిన విశేషము, కేవల చారిత్రక సత్యములేగాక, పరమార్థ తత్త్వసమ్మితములు. అద్భుతఘట్టములు. ఏ రాజమాత్రులు అనుకరించలేనివి. సమస్త భూతములు నీకు వినతులైరి. బ్రహ్మాదులచే స్తుతింపఁబడితివి. లోకమందలి పాపములనెడి మంచును హరించు చండ సూర్యుడవు. మృదుభాషలు సుస్వర విన్యాసముగల వాగ్విలాసము నీది, అజముఖారి సమర నిరుపమశౌర్య= బ్రహ్మాదిదేవతలకు నిరంతర అకారణ శత్రువులైన అసురుల సంహరించుటలో నీ శౌర్యము సాటిలేనిది. అజేయుడై వరదర్పితుడైన రావణుని సైతముచించి చండాడితివి. త్యాగరాజుని హృదయేశుడవై సూర్యచంద్రులు నేత్రములుగాగల ఓ! రామా! నాకులధనమై నన్నేలుకొనుము.

## 254. బిలహరి – చాపు

**నీవేగాని నన్నెవరు గాతురురా నీరజదళ నయన ॥నీ॥**
**కావలసిన కోరికలిచ్చి నన్నుఁగరుణించి బ్రోచే తల్లిదండ్రివి ॥నీ॥**

**మును మా వంశమునఁగలుగు పెద్దలు తప**
**ములనుఁజేసి యార్జించిన ధనము**

**వినవయ్యా బహు జన్మములను నిండారు**
**విరుల వేల్పులను పూజించిన ఫలము ॥నీ॥**

**శరణాగతజన పాపజ్వలనమును**
**శమన జేయు జలపూరిత ఘనము**
**సురమునిజన యోగి గణముల హృదయము**
**సుగృహమౌ సచ్చిదానంద ఘనము ॥నీ॥**

**సాగరశయన నదులలో మేటైన**
**స్వర్ణదీ స్నానానికి గల్గు ఫలము**
**త్యాగరాజు వరమని బ్రహ్మాదులకు స-**
**త్యముఁజేసి పల్కిన తారకము ॥నీ॥**

లోకమందు మానవజన్మము నను్రగహించిన ప్రత్యక్షదైవములు తల్లిదండ్రులు. "మాతృదేవోభవ, పితృదేవోభవ అని శ్రుతి. జన్మించుటకు ముందు జీవులు తమ స్వరూపమును తామెరుఁగలేరు. క్రమముగా కన్ను తెరచినదిమొదలు ఆ తల్లిదండ్రుల పరంపరాగతమైన కుల, గోత్ర, గుణ, కర్మ, సంపదలకు వారసులై గుర్తింపఁబడుదురు. వీరనుభవించు సుఖదుఃఖములకు ముందు తల్లిదండ్రుల సంస్కారబలము, తర్వాత క్రమముగా వీరొనర్చు పుణ్యపాప కర్మలతో ఫలముల ననుభవించుట పరిపాటి. ఆపై స్వతంత్రులమనెడి యహంభావము ఏర్పడి నానా కర్మ గతులను పొందెదరు.

వివేకవంతులు, బుద్ధిమంతులు తమ జీవితమునకు గల కారణ కార్య సంబంధములను విచారించి, తమకీ జన్మ కలిగించిన తలిదండ్రుల వరుసలో కారణ విచారణ చేయుచో ఈ దృశ్య ప్రపంచమందలి చేతనాచేతన భూతములకు సర్వకారణము సర్వేశ్వరుడేయను నిర్ణయమునకు రాకతీరదు. ఈ విధమైన వరవడిలో శ్రీ త్యాగరాజస్వామి రామా! మాకు అవసరమైన



కోరికలిచ్చి కాపాడు తలిదండ్రులు నీవేగాని మరెవ్వరూలేరని తీర్మానించిరి. క్రమముగా మా వంశీయులైన పెద్దలు తపస్సుచేసి ఆర్జించిన మహాధనమునీవే, అనేక జన్మ పరంపరలో వివిధ దేవతావర్గములను బంగారు పూలఁబూజించిన మహాఫలము నీవేయని ఇతర సాక్ష్యములతో నిమిత్తములేక నీ ఆశ్రయమున, నిన్నే కీర్తించుచూ నే ననుభవించు బ్రహ్మానందమే పై యంశములను ఋజువు చేయుచున్నది.

నీ దివ్యచరిత్ర, మహనీయుల అనుభవము లిట్లేకలవు.

నీ శరణాగతులైన జనుల పాపములనెడి అగ్నిని శమింపఁజేయు "జలపూరిత ఘనము= నిండైన నీటి మేఘమవునీవే! పాప ఫలము అనుభవముచేతనే పరిహరింపఁబడును. అట్లుగాక, నీ దివ్యానుగ్రహముతో శమించును. వేరుదారిలేదు.

దేవర్షులు, మహా యోగుల హృదయమే సచ్చిదానంద ఘనమైన నీకు గృహము, నిండుగా గంగానదియందు మునిఁగినవానికి కల్గుఫలితము, త్యాగరాజునకు నీవే వరప్రసాదము. బ్రహ్మాదులు సైతము సత్యమని తీర్మానించిన తారక బ్రహ్మరూపము రామా! నీవే నన్ను కాపాడవలెను.

## 255. రీతిగౌళ – ఆది

**నీ దయ గల్గుటే భాగ్యమని నిజముగ నేల దోచదో ॥నీ॥**

**నాదరూప నీరద సన్నిభ! దిననాథాన్వయ భూషణ! మృదుభాషణ॥నీ॥**

**అవివేకులైన దారతనయుల–ననుదినమును గలసి**
**భవసాగరమును ఈదలేక–భయమునఁజెయ్యలసి**
**యవనీశుల గాచి సుఖములేక–నాయాసము సొలసి**
**వివిధములగు నీమాయ లోపలఁదగిలిన తనకీ యవధులను తెలిసి॥నీ॥**

**వేగిలేచి తానతి లోభిజనుల-వెంబడిగాఁదిరిగి**
**రోగియై తాఁగోరిన కోర్కెలు-రోయక మేనుకరఁగి**
**భోగభాగ్యములకొర కన్యసురుల-భూసురుల కోరితిరిఁగి**
**యే గతియులేక యీ సుఖంబు-లిట్లని తన మదిని తానెరిఁగి ॥నీ॥**

**నాగనాయకశయనేందు దిన-నాథనయన సీతాంక**
**యోగివందిత పదారవింద-యుగశరణా కళంక**
**రాగలోభ మదాదులఁగొట్టి-రక్షించే బిరుదాంక**
**త్యాగరాజ పూజితరఘునాయక-తారకమని తెలియునిశ్శంక ॥నీ॥**

ప్రపంచమందు అందరు సుఖమునేకోరుట సహజము. అన్ని రంగములలో ఎవరిమేలును వారు గమనించుకొందురు. అయినను ఏదిసుఖము? ఏది తనకు మేలుకూర్చును! అను నిర్ణయముపట్ల ఎంతటివారైనను పొరబడుచున్నారు. కాని, రాముని దయకలుగుటే భాగ్యమని, తారకమని గుర్తించుట వివేక లక్షణము. ఎన్ని బాధలననుభవించినను భగవంతుని శరణందు వివేకమేలకలుగదో! యని ఆశ్చర్యమును చూపి అవివేకులు, లోభులను, రాజులను ఆశ్రయించి దారా పుత్రాదుల పోషణము కొరకు ఆయాసపడి అలసి, సొలసి కూడా ఈ సంసారముయొక్క అవధి ఇంతేయని తెలియక మాయలో పడుచున్నారు. భోగభాగ్యములకై అన్యసురుల= ఇతర దైవములను భూసురులనుకోరి శరీరము కరగునట్లు కామ్య కర్మల నాచరింతురు. వాటివలన తాత్కాలికఫలము ప్రాప్తించిననూ, అవి తీరినంతనే తిరిగి దుఃఖమేకల్గును. కావున, నాగనాయక శయనుని= శేషశయుని. ఇందు దిననాథ నయనుని= చంద్ర సూర్య నేత్రుని యోగివందిత పదారవిందుడైన తారకబ్రహ్మరూపుఁడైన శ్రీరాముని ఏల సేవింపరో! యని అవివేక లక్షణముల నిందు వర్ణించినారు.



## 256. భైరవి - ఆది

**నీ వంటి దైవము నేఁగాన-నీరజాక్ష శ్రీరామయ్య ॥నీ॥**

**భావించి జూచుపట్ల-పట్టాభిరామచంద్ర ॥నీ॥**

**ఆడిన నిన్నాడవలెగా-పాడిన నిన్నుఁబాడవలెగా**
**కూడిన నిన్నుఁగూడవలెగా-జాడ తెలిసిన త్యాగరాజునికి ॥నీ॥**

ఆట పాటలందు సైతము స్వభావ రమణీయముగా భగవంతుని భావించుటయే తమ జీవిత లక్ష్యమని సహజ శైలిలో ఈ గేయమును కీర్తించినారు. బాగా ఆలోచించి చూచిన రామా! నీ వంటి దైవమును కానలేను.

ఆడుట పాడుట కూడుట ప్రధాన కృత్యములు. ఇన్నింటను నీ రక్తియే చిత్తమందు భాసించుట నా యదృష్టము. అని "పానీయంబులు ద్రావుచున్ కుడుచుచున్ భాషించుచున్ హాసలీలా నిద్రాదులు సేయుచున్"....సంతత శ్రీనారాయణ పాదపద్మయుగళీ చింతామృతాస్వాద సంధానుండైన ప్రహ్లాదుని దివ్యానుభవమే ఇందు కన్పట్టును.

## 257. సావేరి - ఆది

**నీవు బ్రోవవలె నమ్మ నను-నిఖిలలోక జననీ ॥నీ॥**
**దేవి శ్రీధర్మ సంవర్ధని-దివ్య దర్శన మొసఁగి సంతతము ॥నీ॥**

**నీవలె కరుణాసాగరి యీ జగాన**
**నే వెతకి కనుఁగొనగా నెక్కడ గాన**
**పావనమగు శ్రీమత్పంచ నదీశ్వరుని రాణి-నా**
**భావములో దొరుకుకొంటివిక మరచెదనా**
**ఈ వరకును జేసిన నేరములను**

**నీ వెంచక నలుగురిలోఁదనకిక**
**కావలసిన కోరిక లొసంగి**
**కావుము పతితపావని ధర్మసంవర్ధని ॥నీ॥**

**రాజశిఖామణి సతియైన శుభాకారి అంబ**
**రాజరాజేశ్వరి త్రిజగదాధారి స**
**రోజ నయని నీ మహిమలను దెలియలేరే! త్యాగ**
**రాజాది పరమభాగవత హృదయాగారే**
**యీ జగతిని గౌరి పరాత్పరి అ-**
**వ్యాజమునను పరిపాలనఁజేయు**
**ఓ! జగదీశ్వరి నెఱనమ్మితి నిను ధర్మసంవర్ధని ॥నీ॥**

తిరువాది క్షేత్రాధి దేవత, పంచ నదీశ్వరుని దేవి ధర్మ సంవర్ధనిని, తనకు దివ్యదర్శన మిమ్మని ప్రార్థించుచున్నారు.

అమ్మా! పరమ కరుణావతివి. లోగడ నా నేరములను పాటించకుము. నా భావములో దొరకొంటివని తన భావనాగౌరవమును కీర్తించుకొన్నారు.

చంద్రుడు శిరోరత్నము గాగల పంచనదీశ్వరుని పట్టపు రాణివి. రాజరాజేశ్వరివి. ముల్లోకములకు ఆధారశక్తివి. నీ దివ్య మహిమలను సామాన్యులు తెలియలేరు. త్యాగరాజాది (శివుడు) పరమ భాగవతుల హృదయములందు వసింతువు. ధర్మ సంవర్ధినివై నిష్కపటముగా లోకమును పరిపాలించు మహారాజ్ఞీ! నిన్నే నమ్మితిని.

## 258. సౌరాష్ట్ర - చాపు

**నీవే నన్నెడఁజేసితే, నే నెవరితో దెలుపుదునయ్య ॥నీ॥**

**భావాభావ మహానుభావ శ్రీరామచంద్ర**
**భావజనక నాభావముఁదెలిసియు ॥నీ॥**



**కోరిన కోరిక లీడేరు ననుచు నిన్ను**
**ఆరాధించిన నన్ను ఆరడి బెట్టుట**
**మేరగాదు నాదు నేరమేమి న**
**న్నేలుకోర యీ లోకమున నింక ॥నీ॥**

**భక్తిలో శ్రీరామభక్తి మేలని శివ**
**శక్తి సంతతము విరక్తితో నుతిఁజేయ**
**శక్తిఁజూచి నిజభక్తులు పొగడగ**
**వ్యక్తినిఁజూచి ఆసక్తి కలిగెను. ॥నీ॥**

**పతితపావన సమ్మతమున సుజన సం**
**గతి సేయుటకు సమర హిత రామనామము**
**సతతము సేయ నీ వ్రతము గోరితిఁగాని**
**నత జనక కులాబ్జహిత త్యాగరాజునిపై ॥నీ॥**

నన్ను+ఎడచేసితే= వేరుచేసితే, భావాభావ= సదసత్‌రూపుడు, (అనగా కార్యరూపమై సత్ అయిన జగత్తు. ఇందుకు కారణరూపమైన అసత్= నామరూపములచే అవ్యక్తమైన ప్రకృతియు పరమేశ్వరుడే) భావజుడైన మన్మథునికి తండ్రి; ఆరడి బెట్టుట= పరితపింపఁజేయుట; శివశక్తి= పార్వతి; సమరహిత= సాటిలేనివాడా! నత...హిత= విధేయమైన జనకుని కులమనెడి పద్మమునకు హితుడు.

ఈ ప్రపంచము కార్యకారణ రూపమైనది. కార్య కారణములు భగవంతుని స్వరూపమే అయినప్పుడు, నన్ను వేరుగాచూచే ప్రసక్తియే లేదని రాముని అభిన్నరూపముగా కీర్తించినారు. ఈ లోకమందు మానవ సహజములైన ఉన్నతా దర్శములు కలిగి, తారక బ్రహ్మముగా ఆంతరమున పరమాత్మగా సమన్వయమగు శ్రీరామతత్త్వము కన్న వాని భక్తియే సమరసము, సాటిలేనిదని భావించి శివశక్తి పార్వతి నిరంతరము రామనామ

సంకీర్తన చేయునట. రామనామము పతితపావనము రాముని వ్యక్తిత్వమును అవగాహన మొనర్చుకొని, అనాదిగా పరమభక్తు లెల్లరు రామనామ కీర్తనమును ఒక వ్రతముగా ఉపాసింతురు. కావున, నేనునూ నిన్నే కోరితిని. నన్నెడబాటు సేయకుమని ప్రార్థించినారు.

## 259. సింహవాహిని – దేశాది

**నెనరుంచ రా నాపైని చాల–నీ దాసుడనుగానా శ్రీరామ ॥నె॥**

**సనకాది యోగిబృంద వంద్యపాదసాకేతవాససద్భక్తపోష ॥నె॥**

**తల్లిఁదండ్రి గురుదైవము నీవని**
**తలచుగాను నిను నమ్మియున్న నేఁ**
**దల్లడిల్లుచుండ దరిఁజూపవేమి**
**త్యాగరాజ పరిపాల సుగుణశీల ॥నె॥**

త్రికరణములచే రామా! నీ దాసుడనైన నాపై నెనరు= ప్రేమజూపరాదా; తల్లిఁదండ్రి గురుదైవముగా నిన్నే నమ్మియున్న నేను పరితపించుచుండగా నాకు దరిచూపుము (దరి= తీరము, ఒడ్డు) అని వేడుకొన్నారు.

## 260. మాళవి – ఆది

**నెనరుంచినాను అన్నిటికి–నిదానుడని నేను నీదుపై ॥నె॥**

**ఘనాఘ జీమూతాశుగ జలధి–గంభీర నీ పాదములపై ॥నె॥**

**కలిలో మాటలు నేర్చుకొని, కాంతలను తనయులను బ్రోచుటకు**
**శిలాత్ముడై పలుకనేరనుర–శ్రీ త్యాగరాజాప్తనీయెడ ॥నె॥**

సర్వమునకు నీవే నిదానుడని= కారణుడవని, నీపై కృతజ్ఞత కలిగియున్నాను. ఘనాఘములు= గొప్పపాపములనెడి మేఘములను చెదరగొట్టుటకు; ఆశుగ= పెనుగాలి వంటివాడవు.



లోకమందు విద్యావంతులైననూ తమ మాటల నేర్పుతో భార్యా పుత్రులను పోషించుటకొరకు సామాన్యులను సైతము పొగడుచుందురు. నేనట్లు రాతి మనసులేక రామా! నీ యెడనే ప్రేమ కృతజ్ఞతలు కలిగి నిన్నే సేవించుచున్నాను. దీనివలన సర్వ సౌభాగ్యములు లభించుట నిశ్చయము.

## 261. [1]బేహాగ్ – ఆది

**నే నెందు వెదకుదురా హరి ॥నే॥**

**ఆ నాల్గుమోములవాని మొఱ–నాలకించిరాని నిన్ను ॥నే॥**

**కలుషాత్ముడై దుష్కర్మయుతుఁడై**
**పలుమారు దుర్భాషియై**
**ఇలలో భక్తాగ్రేస–**
**రుల వేషియై త్యాగరాజ పూజిత ॥నే॥**

ఇందు పరమేశ్వరుని సాక్షాత్కారమును కోరి వానిని నేనెచట వెదకుదును! అని సహజమైన శైలిలో తత్త్వ విచారణచేసినారు. వెదకినంత మాత్రమున ఆ వస్తువు కన్పించునా? వెదకుట అనగా ఏమి? యని విమర్శించుచో, భగవంతుడు సర్వజీవులకు ఆత్మీయుడై ఆత్మయైయున్నాడు. అట్టి ఆత్మ దర్శనమునకుఁగల అడ్డు తొలగించుకొనుటయే వివేకి లక్షణము. అందుకు మనో వాక్కాయములు పరిశుద్ధములై యుండవలయును. అట్లుగాక కలుషాత్మ, దుష్కర్మలు చేయుట, వాచా దుర్భాషలు పల్కుట త్రికరణములకు మాలిన్యమని భావము. దాంభికముగా భక్తాగ్రేసరులవలె నటించుట భగవదపచారము. ఈ మాలిన్యములను తనయందే ఆరోపించుకొని శ్రీ త్యాగరాజస్వామి దైవ దర్శనమునకు ప్రతిబంధములను పేర్కొన్నారు. మరియు సృష్టి ఆరంభమున నాల్గు ముఖములతో, బ్రహ్మ తనను కన్న

1. హరి కాంభోజి

తండ్రియైన నారాయణుని సూచనతో దర్శించలేక, తాను పుట్టిన నాభీకమలనాళము ద్వారా మహాసాగరమందు వెదకి వేసారి, మరల నారాయణుని సూచనతో ఏకాగ్రచిత్తమున తపస్సుచేయగా, తనకు సర్వకారణమైన భగవంతుని తత్త్వమును తెలిసికొన్నట్లు భాగవతమందు ప్రసిద్ధము. అంతటి వానికి సైతము చిత్తము దోషరహితమై, ఆత్మోన్ముఖమైనప్పుడే భగవత్సాక్షాత్కారము లభించినది. ఇంతకన్న ఆదర్శమేమి కావలెను? అట్లే, భగవద్దర్శనాకాంక్ష, తదనుకూలమైన త్రికరణశుద్ధియు ప్రధానములని పరోక్షముగా ఇందు సూచించిరి.

శ్రీ త్యాగరాజస్వామి చరిత్రాంశములో అయ్యగారు నిత్యము ఆరాధించుకొను, శ్రీరామ పంచాయతనమును వారి అన్న జప్యేశుడు కావేరిలో వేయగా, తెల్లవారి పరివేదనతో ఈ గేయముతో పరిదేవించిరని కొందరు చెప్పుకొందురు కాని, ఎంత భక్తి లేకున్నను అయ్యగారి యన్నగారి కింతటి, సాహసకృత్యమును కల్పించుట న్యాయముగాదు. ఇందుకు ప్రమాణ మగుపడలేదు.

## 262. దేశికతోడి – జంపె

**నే పొగడకుంటే నీకేమి కొదవో**
**నీ మనసు తెలిసె గదరా ఓరామ ॥నే॥**

**ప్రాపుగల శుక సనక ప్రహ్లాద నారద**
**పరమేశ రుద్రాది భక్తులర్చింపఁగ ॥నే॥**

**భుజియింపఁబెట్ట సతి బుధులు సామాజికులు**
**భజియింప సోదరులు పవనసూనుఁ**
**దజ బిడౌజాది సురలాప్తులైనారు నీ**
**రజ నయన శ్రీ త్యాగరాజనుత బాలుడగు ॥నే॥**



భగవంతుని మహిమాతిశయమును సర్వధర్మములలో సర్వోన్న తత్త్వమును, వ్యతిరేక ముఖముగా ఇందు వర్ణించుచున్నారు. రామా! నాపై నీ అనుగ్రహము పూర్ణముగా రాకుండుటకు కారణము నీ మనోభావములు బాగా తెలిసినవిలే; ఏమన నేను నిన్ను పొగడనందువల్ల నీకేమికొదువా? ఏ లోపములేదు. నిత్యసూరులు సనక సనందన ప్రహ్లాద నారదాదులు పరమ భక్తులు నీ దివ్యభూతిని సదా స్తుతించి అర్చించుచున్నారు. ఇది నిత్య వైభవము. ఇక లోక మర్యాదలో కావలసిన సకల సంపదలు సౌభాగ్యములు నీ కమరియే యున్నవి. పరమాన్నముల నారగింపఁ జేయుటలో మహాలక్ష్మియగు సతి సీత, వసిష్ఠ వామదేవాదులు సభ్యులు, సర్వవిధముల సేవించుటకు భరతాది సోదరులు, ఎంతటి ఘనకార్యము నైనను అవలీలగా సాధించఁగల బుద్ధిమంతుడు, మనోజవుడు, దూత, ఆంజనేయుడు. బ్రహ్మేంద్రాదులు ఆప్తవర్గము. ఇన్ని యుండ అకృత ప్రజ్ఞగల బాలుడనైన నా స్తుతిలేకున్న నీకేమి లోపము? అని సనకాదుల దివ్యవైభవమును ఆత్మీయముగా భావించుట. విశేషించి, ఎవని ఆర్తి, ఎంతటి భక్తి స్తుతి, వానికి దైవానుగ్రహమును సంపాదించుననెడి ఆదర్శము ఇందు విశేషము.

## 263. రూపావతి – త్రిపుట

**నే మొఱబెట్టితే మదిలోన–నీ కాయాసము ఏలరా ॥నే॥**

**ఈ మానవాధములనుకోరి, ఎల్లవారలవలె నుండలేను ॥నే॥**

**తపమొక టొనరఁజేసినాననో**
**దానం బొక టడిగినాననో**
**కపటాత్ముడై పలికినాననో**
**కలిహర త్యాగరాజనుత ॥నే॥**

భగవంతుని అనుగ్రహము సూర్యకాంతివలె సర్వానుగ్రహ కారకము. సర్వమంగళప్రదము. అట్టి సర్వాప్తమైన భగవంతునియందు అనన్యభావముతో ఆత్మీయుడైయుండి నిత్యాప్తతను భావించుటయే భాగవతోత్తముని లక్షణము. అట్లుగాక, లోకమందు కొందరు తపసుచేయుట, భగవంతుని దర్శనమైన పిదప, ఏదేని వర మర్థించుట హిరణ్యకశిపు, రావణాదులవలె సర్వజ్ఞ, సర్వశక్తి విలసితుడైన భగవంతుని సైతము, తమ తెలివితో మభ్యపెట్టి అజేయత్వ, అమరత్వమును కోరుట ఇంకెన్నో ప్రక్రియలతో భగవంతుని భజింతురు. భగవంతుడు **"యేయథామాం ప్రపద్యంతే తాం స్తథైవ భజామ్యహం"** అను రీతిలో వారే యే విధముగా తనను భజింతురో వారి నా యా రీతుల ఆదరింతుననెను. వారి నుద్ధరించుటకు అనేక అవతార రూపభేదముల నందవలసి వచ్చును. ఈ విధముగా అవతార రూపకల్పనలు భగవంతునికి ఆ యా సహేతువులు కాకున్ననూ, సున్నితములగు భక్తచిత్తములకు భారములుగానే తోచును. అట్లుగాక, ఇందు త్యాగరాజస్వామి చాలా మృదుమధురభావ సౌందర్యముతో, రామా! నేను లోకమునం దితర విధములుగా నిన్ను సేవించు భక్తులవలెగాక, నా ఆర్తి పరిపాకముతో నిన్ను మొఱపెట్టునట్లు కీర్తించిననూ, నీవేమో ఆయాసపడుచున్నట్లు తోచెడిని. నాతో పరమాప్తతతో పల్కి దర్శనమాత్ర మనుగ్రహించిన నేనెంతో ఆనందింతును అని తన మనోరథమును వ్యంగ్యముగా నివేదించుకొన్నారు.

## 264. సౌరాష్ట్ర – దేశాది

**నేరమా రామ రామ నీకిది–నీరజాక్ష నా జీవాధార ॥నే॥**

**మారకోటి సౌందర్యమును కని**
**మదిలోన సుంతమరచి యుంటే ॥నే॥**

**కోరి కోరి నీదు కొలువు సేయువేళ**
**సారమైన పదసారసములఁబొం**



**గారఁజూచి యురమున నుంచుదామో**
**కనుల నొత్తుదామో యని**
**కూరిమిని బ్రహ్మానంద మొందుచును**
**కొంత మైమరచి యుంటిని కాని**
**తారకాధి పానన పావన సీ**
**తానాయక శ్రీ త్యాగరాజునిపై ॥నే॥**

శ్రీరాముని నా జీవాధార! యని పిలచుట శ్రీ త్యాగరాజస్వామివారి కొక విలక్షణమైన దివ్యానుభవము. సర్వేంద్రియములందు నిండుగా ప్రసరించు జీవనాడికి తన ఉపాస్యపరవస్తువు ఆధారము. ఏ పనులు చేయుచున్నను ఇంద్రియ మాలిన్యములు అడ్డురానిచో, ఆ విశుద్ధమైన హృదయాకాశమందలి భగవద్రూపమందు చిత్తము లయించును. దీనినే భక్తులు పారవశ్యమని అనుభవించి పల్కుదురు. ఆ పారవశ్యమునే అయ్యగారనుభవించుచూ, తన మధురానుభావమును ఈ గేయమందు కీర్తించినారు ముందు కోటి మన్మథులకు సాటియైన రాముని దివ్యసౌందర్యమును కన్నులార దర్శించి, మదిలో సుంత భావించినపుడు, ఇంద్రియ వ్యాపారములాగిపోయినవట. అపుడు రామా! నీ ఉపచారములు సేయుటలో నే నేమారితినేమో! ఇది నేరమా! అట్లు నీవు భావించవలదు. అని కొసరుచు ఆ దివ్యమాధుర్యము ననుభవించునట్లున్నది.

## 265. వరాళి – ఆది

**నోరేమి శ్రీరామ నిన్నాడ ॥నో॥**
**సారె సారెకును పాపకర్మములు**

**సల్పుచునుండు నావంటివానికి ॥నో॥**

**పాపులారుగురు వశ్యులు గాక**
**పండ్లిగిలించుచు తరుణులకై సీ**

**తాపతి నిజభక్తి తెలియని**
**త్యాగరాజునికి, ఒరులకైన ॥నో॥**

ప్రపంచమందు సామాన్యులు నైజముగా పాపకర్మ లాచరించుచు, ఆరుగురు పాపులు= కామక్రోధాది అర్గురు శత్రువులను యెదుర్కొనలేక, దారా పుత్రాది లంపటమునందు రాగదూషితులై సర్వమునకు ఆశ్రయుడు భగవంతుడేయని తెలిసియు, వానియందు తమ విధిని నిర్వహించక భక్తిలేనివారై, తమ కష్టనష్టములకు భగవంతునే బాధ్యునిగాచేసి పరమేశ్వరునే నిందించుటకు సాహసింతురు. కాని, రామా! నాకుఁగాని, ఇతరులకుఁ గాని నిన్నాడ నోరెట్లు వచ్చును. ఇది అన్యాయము అనుట ద్వారమున గూడ శ్రీరాముని స్తుతించినట్లే భావము. ఎవరి దోషమును వారు గుర్తించుకొనుట గూడ గుణ విశేషమే.

## 266. సాళగభైరవి – ఆది

**పదవి నీ సద్భక్తియు కల్గుటే ॥ప॥**

**చదివి వేదశాస్త్రోపనిషత్తుల**
**సత్త తెలియలేనిది పదవా ॥ప॥**

**ధనదార సుతాగార సంపదలు**
**ధరణీశుల చెలిమొక పదవా**
**రాగలోభయుత యజ్ఞాదులచే**
**భోగము లబ్బుట యది పదవా ॥ప॥**

**జపతపాది యణిమాది సిద్ధులచే**
**జగముల నేచుట యది పదవా ॥ప॥**

**త్యాగరాజనుతుడౌ శ్రీరాముని**
**తత్త్వము తెలియని దొక పదవా ॥ప॥**



'పదవి' అనగా ఉన్నతమైన స్థానము. దీనినే **"సమానానా ముత్తమ శ్లోకోఽస్తు"** (నీ సరివారలలో ఉత్తముడుగానుండుము) అని వేదాశీస్సు. ఇట్టి పదవికొక నిశ్చయమైన స్థాయి కల్పించుచూ, రామునియందు సద్భక్తి అనగా నిష్కామ సాత్త్వికభక్తి కలిగియుండుటయే యని తీర్మానించినారు. లోకమందు వేదవేదాంగములయందు పండితులైననూ, వాటియొక్క పరమ తాత్పర్యము భగవంతుడే. అదియే "సత్త" అది తెలియలేనిచో యెంత ఉన్నతికైనను విలువలేదు. **"యజ్ఞోదానం, తపశ్చైవ పావనాని మనీషిణాం"** యజ్ఞాదులు పరమ పవిత్రమైన పరమార్థసాధనములని గీతలో భగవద్వచనముకలదు. కాని, రాగ, లోభాదులతో కేవల భోగదృష్టితో కూడ ఈ ఉత్తమ సాధనల ననుష్ఠించు ప్రమాదము కలదు. ఇట్లే, జపతపాదులవలన అణిమాది యోగసిద్ధులు స్వాధీనమగును. కాని, ఇవి యొనర్చిననూ, భగవంతుని భక్తి సత్తలేనివారు, ఉన్నత పురుషార్థము నార్జించలేరు. ఇందుకు పురాణములందు అనేక ఆదర్శ పాత్రలుకలవు. కావున, శ్రీరాముని తత్త్వస్వరూపము తెలియని 'పదవి' వ్యర్థమని నిరూపించినారు.

## 267. వాగధీశ్వరి – ఆది

**పరమాత్ముఁడు వెలిగే ముచ్చట బాగ తెలుసుకోరే ॥ప॥**

**హరియట హరుఁడట సురలట నరులట**
**అఖిలాండకోటులట యందరిలో ॥ప॥**

**గగనానిల తేజోజల భూమయమగు**
**మృగ ఖగ నగ తరు కోటులలో**
**సగుణములలో విగుణములలో**
**సతతము సాధు త్యాగరాజార్చితు డిలలో ॥ప॥**

**"అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణ స్థితః"** అను శ్రుతి ప్రకారము పరమాత్మ అంతట నిండియున్నది. ఇదే భావమును ఈ

గేయమందు వివరించినారు. హరిహరాది దైవభేదములు, దేవ, మానవభేదములు, ప్రసిద్ధములైయున్నను, అన్నింటను పరమాత్మ చైతన్య ప్రకాశరూపముననను, సాక్షిమాత్రమై వెలుఁగుచున్నాడు. పంచభూతములందు మృగ పక్షులలో, తరు లతాదులయందు సైతము అంతర్లీనమై భగవంతుడే వెలుఁగుచున్నాడు.

బంగారు నగలందు అంతటను సువర్ణమే నిండియున్నట్లు. ఘట కుడ్యాదులందు మృత్తికయే వ్యాపించియున్నట్లు అంతటను భగవంతుడే నిండియున్నాడని తత్త్వమును కీర్తించినారు.

## 268. కిరణావళి - ఆది

**పరాకు నీ కేలరా రామ ॥ప॥**

**చరాచరమ్ముల వసియించే యో**
**సారసాక్ష! నా పనులంటే యీ ॥ప॥**

**పురాన శబరి యొసంగిన యటు నే**
**భుజించుకొన్న శేషమా రామ**
**ధరా తలమున గుహునివలె పత్ర**
**తల్ప మొనర్చితినా శ్రీ త్యాగరాజుపై ॥ప॥**

చరాచర ప్రపంచమందు అందరిలో సాక్షిమాత్రుడుగా ప్రమాతగానున్న పరమేశ్వరునికి అందరి భావములు తెలియును. కాని రామా! నా పనులంటే నీవేమో పరాకుగానున్నావు. కారణము తెలియుటలేదు.

నాసేవా విధులం దేమేని లోపము కల్గెనా? పూర్వము శబరి తాను భుజించిన శేషమునే నీ కర్పించినది. నీ ఆంతరంగ భక్తుఁడైన గుహుడు ఆకులలములతో నీవు శయనించుటకు తల్ప మమర్చినాడు. వారే నీకెంతో సన్నిహితులై ప్రతినిధులై నీ అనుగ్రహ పాత్రులైరి.



నేనట్లుగాక, శిష్ట సంప్రదాయముతో, వైశ్వ దేవాదులచే సంస్కృతమైన నైవేద్యమర్పించి, దివ్యమైన రత్న మంటపమందు తల్పమొనర్చి, మృదంగతాళ లలితమైన సంగీతము పాడి సేవించుకొన్ననూ, నీ ప్రసన్నత కలుగుటలేదు. నా పనులన్న ఇంత పరాకా! స్వామీ! అని ఎత్తిపొడుపుగా అన్నట్లున్ననూ, పూజ్యులైన శబరీ గుహుల ఆంతర్యమును తన హృదయములో భావించుటయే భక్తిభావముయొక్క ఉన్నతి. అదిగాక, ఇంత స్వభావ మధురమైన స్వాతంత్ర్యముతో రాముని ప్రశ్నించుట ఈ మహా భావుకుని ప్రేమానుబంధము విశుద్ధ హృదయులకు పరమాదర్శము.

## 269. సావేరి - ఆది

**పరాశక్తి మనుపరాద నాపై పరాకేలనమ్మా ॥ప॥**

**పురాణి ధర్మసంవర్ధని-శ్రీ పురాధీశ్వరీ రాజ రాజేశ్వరీ ॥ప॥**

**వరాహిధర దేవరాజ జలజభ**
**వరాక్షసారులు వరాలు కోరు**
**వరానన నగవరాత్మజ ముని**
**వరార్చిత ననుఁబ్రోవరాద ఓ ॥ప॥**

**విశాలనయనే కుశాలుగా నీ**
**దు సేవఁజేసి త్రిదశాధిపాదు**
**లు శాశ్వతులై పరవశాల నతి సే**
**య శాంతమునఁజూచు శాంభవీ! ఓ ॥ప॥**

**నిరపరాధుల నిరాకరించే**
**దురాత్ముకుల నిందు రాక సేయఁ**
**గ రాదు వర త్యాగరాజనుత శుభ**
**ద! రామసోదరి! ధరాధర సుతే ॥ప॥**

వరాహిధర= వర+అహిధర= శ్రేష్ఠమైన సర్పభూషణుడైన శివుడు, దేవరాజు= ఇంద్రుడు జలజభవ= బ్రహ్మ, రాక్షసారులు= దేవతలు. నగవరాత్మజ= హిమవంతుని కూతురు - పార్వతీదేవి.

శ్రీపురమైన తిరువాదిలో వెలసిన ధర్మసంవర్ధనినిఁగూర్చి స్తుతించినారు. బ్రహ్మేంద్రాది దేవతలు ఆ పరదేవతను వరములు కోరుదురనియు, దుష్టులు అనగా సాధువులను నిరాకరించువారికి నీ సన్నిధికి రాగల అర్హతలు లేవనీ లోకములందలి అధిపతులందరు ధర్మసంవర్ధని కటాక్షముననే శాశ్వత సౌఖ్యమునందినారనియు మహిమను వర్ణించినారు.

## 270. వనస్పతి - రూపకం

**పరిహాసకమా మాట పదుగురిలో పొగడినది** ॥ప॥

**వెఱపునను మానంబున-వెసనంబులచేఁగోరి**
**శరణాగత రక్షక నిను-సంతతమును శరణంటే** ॥ప॥

**ఒకమునికై ద్రౌపది ద్వారకనిలయా శరణనఁగ**
**ఒకమాటకు విభీషణుఁడు-ఓర్వలేక శరణనఁగ**
**సకలేశ్వర ప్రహ్లాదుఁడు-జాలిచే శరణనఁగ హి**
**తకరుండై బ్రోచితి-త్యాగరాజుని మాట** ॥ప॥

**"స హి నిత్యం ప్రసన్నాత్మా, శరణాగత వత్సలః"** (రామాయణం) అనుటవలన ఆర్తులై తనను శరణుఁజొచ్చిన వారలను ఆ ఆర్తినే అధికారముగా భావించి కాపాడుట శ్రీరాముని నియతవ్రతము. అట్లు శరణనుటకు ప్రధానమైన అవసరములు, భీతి, ఆత్మగౌరవహాని, కష్టదశ అనునవి. వీటికి గురియైనవారు ద్రౌపది వెరపున, విభీషణుడు మానమున, ప్రహ్లాదుఁడు వ్యసనమున అనన్యగతికులై, ఆర్తులై భగవంతుని శరణందిరి. భగవంతుని అనుగ్రహము పొందిరి. ఈ ఉత్తమాదర్శములతో నేనును నీ దివ్యయశమును పదుగురిలో స్తుతించుచున్నాను. రామా! నామాట



నీకెందుకింత పరిహాసకమైనదో! వెనువెంటనే నాకు ప్రసన్న దర్శన మీయకున్నావు. అని ఆదర్శ పూర్వకముగా స్తుతించినారు.

## 271. మనోహరి - రూపకం

**పరితాపముఁ గనియాడిన-పలుకుల మరచితివో**
**ఆ పలుకుల మరచితివో** ॥ప॥

**సరిలేని సీతతో సరయూ మధ్యంబుననా** ॥ప॥

**వరమగు బంగారువోడను-మెఱయుచుఁబదిపూటలపై**
**కరుణించెద ననుచు క్రీఁగనుల త్యాగరాజుని** ॥ప॥

ఈ కీర్తనమందు త్యాగరాజస్వామికి కలిగిన ఒకానొక దివ్యదర్శనము వర్ణింపఁబడినది. ఒకనాడు సాటిలేని సీతామహాసాధ్వితో శ్రీరాముఁడు సరయూనదిలోవోడను= ఒక బంగారు పడవయందు విహారము చేయుచున్నట్లున్నూ, అపుడు తనయందు క్రీగంటి ప్రసారమొనర్చి, పది పూటలలో తనతో నైక్యానుభవము నను(గ్రహింతునని శ్రీరాముడు పల్కినట్లు స్ఫురణ కలిగెనట. కావున, నా పరితాపమును చూచి రామా! నీ వన్నమాటలను మరచితివా? యని ప్రార్థించినారు.

ఇట్లే "గిరిపై నెలకొన్న రాముని" అను కీర్తనమందును పది పూటలలో కరుణింతుననెడి వాక్యమున్నది. ఇది అయ్యగారి అనుభవమే యని పరంపరగా వాడుకకలదు.

## 272. పూరి కల్యాణి - రూపకం

**పరిపూర్ణ కామభావమున మఱచినామ** ॥ప॥
**పరమ కారుణికోత్తమ! భవ, జీవ నజ భవార్చిత** ॥ప॥

**సాకేతాధిప నీముఖ సరసీరుహమును జూపి**
**సాకేమది లేదేటి సవరణరా రామ**

ఈకలి ననుసరించి హీనజాతి మర్త్యుల చీ
కాకుcబడగcదరమె శ్రీకర త్యాగరాజవినుత ॥ప॥

భవ= శివునిచే, జీవనజభవ= నీటియందు పుట్టిన పద్మమందు జన్మించిన బ్రహ్మచే, అర్చిత= పూజింపcబడువాడు. రామా! నీవు పరిపూర్ణ కాముcడవు. అనగా నిన్ను భావించి సేవించువారలందరి కోర్కెలు పూర్ణమైన సిద్ధి నందగలవు. లేదా పరిపూర్ణులై స్వతస్తృప్తి కలిగి ఏ కోరికలు లేక యుందురని భావము. అట్టి నిన్ను భావమందు మేమెన్నడైన మరచితిమా? నిరంతరము నీ దివ్య సంస్మరణము వివేకవంతులైన మానవులకు సహజమై యుండును. అయినను, ఈ మహాకలి ననుసరించి, గుణ కర్మలచే హీనులైన మానవులు కొంద రుండకపోరు. వారి సాంగత్యము చాలా చికాకు కల్గించును. కాని, ఆ చికాకు ననుభవించలేము. వారి సాంగత్యమున్నూ సమాజమందు మా కనివార్యము. కావున, రామా! నీ దివ్య ముఖార విందమును చూపి, నీవే సాకవలెను. రక్షించవలెను. ఇందు సవరణలులేవు. నీ రక్షణ–పోషణలు లేక ఈ కలిలో మేము కృతార్థులము కాలేము. కావున, పరమ కరుణతో మమ్ము సాకుము అని ప్రార్థించినారు.

## 273. పూర్ణ చంద్రిక – ఆది

పలుకవేమి నా దైవమా–పరులు నవ్వేది న్యాయమా ॥ప॥

అలుcగ కారణమేమిరా రామ నీ
వాడించినట్లు ఆడిన నాతో ॥ప॥

తల్లిcదండ్రి భక్తినొసcగి రక్షించిరి
తక్కిన వారలెంతో హింసించిరి
తెలిసి యూరకుండేది యెన్నాళ్లురా
దేవాదిదేవ త్యాగరాజునితో ॥ప॥



పరమ భాగవతులైన మహానుభావులకు తమ ఉపాస్యదైవముతో నిత్య సన్నిహితమైన యనుభవముండుననుటకు, వారి దివ్యసూక్తులే ప్రమాణము. త్యాగరాజ స్వామికి, తన సన్నిహితమైన సమాజమువలన ఏదో కొంత చికాకు సంభవించగా, ఆ వేదనను శ్రీరామునితో ఏకాంతమున విన్నవించిన భావ మీ కీర్తనయందు కన్పించుచున్నది. ఇందలి లలితవిన్యాసము కల పదముల కూర్పు ఎంతో స్వభావరమణీయమైన రక్తికి నిదర్శనము. ఈ కీర్తన పల్లవిలోనే, పలుకవేమి? అనుటలో నా దైవమా! అనుటలో రామునియందు తనకేదో పూర్వానుబంధమైన చనువు గోచరించును. పైగా రాముడలిగినట్లు భావించి, రామా! నీ వాడించినట్లు నీ చేతిబొమ్మవలె నున్న నాపై నీ కలుక న్యాయముగాదు. విశేషించి, పరులు నవ్వి అపహసింతురు. ఏమి ఇంత యనుబంధమందువా? నా తలిదండ్రులు గర్భగత సంస్కారమునుండి దైవభక్తి ననుగ్రహించుటచే నా చిత్తము నీయందు రక్తిcగన్నది. అందుకు ఇతరులు ఎంతో హింసించుచున్నారు. నీ విట్లు చూచి యూరకుండుట ఎన్నాళ్ళురా! యని ఏదో తన బాధ్యత అంతా రామునిదే అన్నట్లు జాలిగా మొరలిడుట ఆంతర్యమైన అనన్యభక్తి లక్షణము.

## 274. నవరస కన్నడ – దేశాది

పలుకు కండచక్కెరను గేరునే పణతులార చూడరే ॥ప॥

కొలువు కూటమును గొలుచువారిని
పిలిచి దాశరథి ప్రేమ మీఱబలికే ॥ప॥

సురల కామినీమణుల గాన మా
దరణ నాలకించుచును శృంగా
ర రసయుక్త వార రమణులాడcజూచి
సరస త్యాగరాజ వరునితోcబొగడే ॥ప॥

సాధారణముగా మాట, మధురము, తియ్యగా నున్నదనుట ప్రయోగసరళిలో కలదు. మాట కూడ చక్కెర, బెల్లమువలె ఆస్వాద్యమైన అనుభవైక వేద్యమనుట స్వభావమే. ఇందు రామునివల్కు తీపి, త్యాగరాజస్వామి హృదయమున కనుభవము. అందుకు అనువైన సుందర సంఘటనల నిందు సూచించి సుందరీమణులకు హెచ్చరిక నిచ్చుట శృంగార రసమేళనంతో, మరీ మాధుర్య రస మొల్కుచున్నది.

శ్రీరాముని కొలువు కూటములో ఎందరో సేవకులు పరివారమున్ననూ, అందెవరినో, ప్రేమతో పిలచి రాముఁడు మాట్లాడునట. ఇందు మాధుర్యభావము విశిష్టము.

అంతకన్న మిన్నగా దేవకాంతల గాన మాలకించుటయే గాక, దేవవారకాంతలు శృంగార భంగిమలతో నాట్యమాడుచు, తమ సంగీత సాహిత్య నృత్తములను, సాక్షాత్తుగా శ్రీరామచంద్రునికే అంకిత మొనర్చి, తమ హృదయ సర్వస్వభావములను రామునికే అర్పించి, తాము నేర్చిన కళావైభవమునకు లక్ష్యశుద్ధిని, సిద్ధిని చూరగొన్నపుడు, ఆ యానంద రసానుభవమును రాముడు స్వయముగా పొగడుచున్నపుడు వారి పలుకు కండ చక్కెరను గేరుటలో ఆశ్చర్యమేమున్నది? ఇంతటి రసావేశముతో త్యాగరాజస్వామివారు, సర్వవిద్యలకు సర్వకళలకు శ్రీరాముడే పరమ లక్ష్యమనియు, అందుకు రామతారక బ్రహ్మను ఆత్మీయముగా భావించు మహాభక్తుల హృదయానుభవమే ఆదర్శమనియు ఉదాత్తమైన లక్ష్యశుద్ధిని ఇందు నిరూపించినారు.

## 275. మంజరి - ఆది

**పట్టి విడువరాదు, నా చెయి పట్టి విడువరాదు ॥ప॥**

**పుట్టిననాడే నిజభక్తిని మెడఁగట్టి గుట్టుచెదరక చెయి ॥ప॥**

**నిత్యానిత్యములను బోధించి**
**కృత్యా కృత్యములను తెలిపించి**



**ప్రత్యేకుఁడు నీవని కనిపించి**
**భృత్యుఁడైన త్యాగరాజు చెయి ॥ప॥**

తనకీనాడు అనుభవములో నున్న శ్రీరామ భక్తివైభవము, నిత్యమేదో, అనిత్యమేదో వివేకము, ఏది కృత్యమో! అనగా చేయఁదగినదో ఏది అకృత్యమో నిర్ణయించుకొను తెలివి, సర్వ ప్రపంచమునకు వేరుగా, సాక్షిమాత్రుడుగా నున్నవాడు భగవంతుఁడనియు అట్టి దైవమే కర్తయను, ఉత్తమ భావములన్నియు జన్మ సంస్కార వశముననే కలుగును. ప్రత్యేక సాధనా యత్నమువల్లనూ కలిఁగినట్లు కన్పించిననూ, అవి పూర్వజన్మ సంస్కారబలముననే ఫలించును.

ఈ భావమునే ఈ కృతియందు వివరించినారు.

రాముడు తనకు పుట్టిననాడే కరావలంబ మిచ్చినట్లు (చెయిబట్టుట) రామభక్తిని మెడగట్టి, గుట్టు తెల్పినట్లు తన సన్నిహితమైన యనుభవమును కీర్తించుకొన్నారు.

## 276. దర్బారు - చాపు

**పరిపాలయమాం కోదండపాణే**
**పావనాశ్రిత చింతామణే ॥ప॥**
**సరసిజ భవనుత చరణ సరోజ**
**సాకేతసదన దశరథ తనూజ ॥ప॥**

**శేషాధిప వరభూషణ వాగ్వి**
**శేష కృతనామ ఘోషజనిత సం**
**తోష రవిజ సంభాషణ నతజన**
**పోషణ శుభకరవేష నిర్దోష ॥ప॥**

**సత్యసంధవర భృత్యపాలకా**
**దిత్య కులోత్తమ సత్యజనావన**

**అత్యంతసుందర నృత్యజన ప్రియ**
**స్తుత్యచారిత్ర నిత్యోత్సవరూప ॥ప॥**

**సాగరమద దమన నాగారి నుతచర**
**ణ గణపతి హృదయాగార పాలన**
**జాగరూక శరణాగత వత్సల**
**త్యాగరాజనుత నాగారి తురగ ॥ప॥**

శేషాధిప... సంతోష= సర్పభూషణుడైన శివుని వాక్కుచే వైభవమందిన నామము కలవాడు (రామనామ గానమందు శివుడు రక్తుడు) వాని నామఘోషముచే రాముడు సంతోషించువాడని పరస్పరానందము.

రవిజ సంభాషణ= సూర్యపుత్రుడైన సుగ్రీవునితో భాషించువాడు.

ఇందు చక్కని యమకప్రాసములతో శ్రీరాముని వైభవమును కీర్తించినారు.

"గణపతి హృదయాగార" అను విశేషణము రామగణపతి, లక్ష్మీగణపతి, యను మంత్రమూర్తులతో రామునికి గల అభేదమును వర్ణించినారు. కడమ విశేషములన్నియు సరళములు.

## 277. [1]మందారి – దేశాది

**పరలోక భయములేక భవ**
**పాశబద్ధులయ్యేరు ॥ప॥**

**కరివాజి శృంగారా రామ శిబి**
**కాదు లెల్ల మనకె కల్గెనని ॥ప॥**

**కొన్న కాంతలను [2]కోణ బిడ్డలను**
**వన్నె చీరలను వాన గుడిసెలను**

1. నామనారాయణి.
2. కోణబిడ్డలని జాతీయము. కూనలు అనుటకు నామాంతరము. లేక, వంకర చేష్టలు గల బిడ్డలు (కోణంగి యనుట జాతీయము).



**తిన్నగా గనే దేవలోకమని**
**తన్నుకోళ్ళలో త్యాగరాజనుత ॥ప॥**

సర్వసాధారణముగా జనులు ఎదుటి సంసారమును, కరి వాజి గజాశ్వ సంపద ఉపవనోద్యానవన శృంగారము శిబికాది= పల్లకీ మొదలగు వాహనములు మొదలగు సంపదలందు మోహముకలవారై, తాత్కాలిక మోహముచే, సంసారపాశ బద్ధులై యుందురు. ఈ సంపదయు జన్మాంతర పుణ్యవశముననే కలుగును. కాని, ఇన్ని యున్నందుకు, పరలోక భయము= అనగా పరలోక మున్నదను చింత ఆలోచన కలిగియుండవలెను. అందుకు కారణములైనవి పుణ్య పాపములు కావున, ఉత్తమ సంస్కారము కలుగుటకు పుణ్య సంపాదనము అవసరము. అట్లుగాక, కొన్న కాంతలు= అనగా ఋణానుబంధముగల భార్యలు (పరస్పర భోగానుభవమే దాంపత్య ఫలముగా భావించు దాంపత్యమేగాని, పరమార్థదృష్టి లేనివారని భావము) కోణంగి చేష్టలు కలిగి, ఇహ, పరచింతలేని సంతానము వన్నె చిన్నెలుగల వస్త్రాభరణములు, ఎంతటి మేడలు కట్టుకొన్ననూ, ఎండ వానలనుండి రక్షణయే ప్రధానమని భావించక, అందలి మోహముచే తన్నుకోళ్లలో బడి, జంజాటమందు తగుల్కొని పరలోక భయమే లేనివారగుచున్నారు. అని ఆత్మవిచారము సల్పినారు.

## 278. పూరికల్యాణి – దేశాది

**పరలోక సాధనమే మనసా ॥ప॥**

**స్మరలోభ మోహాది పాపులను**
**స్మరియించక శ్రీరామభజన ॥ప॥**

**జననాది రోగభయాదులచే**
**జగమందుఁగల్గు దురాసలచే**
**తనయాది బాంధవుల భ్రమచే**
**తగలనీదు త్యాగరాజనుతుని భజన ॥ప॥**

ఇందు శ్రీరామ భజనయొక్క ప్రభావమును సూటిగల మాటలతో సూత్ర ప్రాయముగా వివరించినారు. భజన యనగాస్తుతి, పూజ, కీర్తనము, అర్చనాది కైంకర్యములు, చింతనము, స్మరణము మొదలైన ఉత్తమ సాధనములు. ఇన్నింటను భగవంతుని జ్ఞాపకము నిరంతరముగా నుండును. ఇట్టి భజనము పరలోక సాధనము. ఉత్తమ గతినందించుటయేగాక, మనకు అనుక్షణము త్రికరణములవలన ఏర్పడు కష్టములను నివారించును. ఇందుకు అర్హత కలుఁగవలెనన్న, స్మర= కామము. లోభమోహములు మహాపాప రూపములు కావున వీటిని స్మరించకుండుట పెద్ద రక్షణయగును. **"కామఏష క్రోధఏష రజోగుణ సముద్భవః। మహాశనో మహా పాప్మావిద్ధ్యేన మిహ వైరిణం"** కామము, క్రోధము ప్రత్యేకముగా మహాపాప రూపములు. ప్రబల శత్రువులు. తిండిపోతులు అనగా వాటిని నివారించుటకెంత సామగ్రి సంపాదించినను, తృప్తి కలుగదు. ఇవి ఒక జన్మతో తీరునవిగాక, జనన మరణ ప్రవాహగతితో రోగరూపముగా జన్మ పరంపర ననుసరించి యుండును. దురాసలను పెంచి, దారా పుత్రధనాగారాది రూపమున సంతతముగా తీగెలుసాగి, శ్రీరాముని భజనానందమును చిత్తమునకు తగలనీదు. అని తన మనసును హెచ్చరించుటలో రామభజనయందుగల ఆసక్తి ఎంతో గొప్పదని నిరూపించినారు.

## 279. ఖరహరప్రియ - త్రిపుట

**ప్రక్కల నిలఁబడి కొలిచే ముచ్చట**
**బాగ తెల్పరాదా** ॥ప్ర॥
**చుక్కల రాయనిఁగేరు మోముఁగల**
**సుదతి సీతమ్మ సౌమిత్రి రాముని కిరు** ॥ప్ర॥

**తనువుచే వందన మొనరించుచున్నారా**
**చనువున రామకీర్తన సేయుచున్నారా**



**మనసునఁదలచి మైమరచి యున్నారా**
**నెనరుంచి త్యాగరాజునితో హరిహరి మీ కిరు** ॥ప్ర॥

మహాభావుకుఁడైన త్యాగరాజస్వామి తన హృదయరంగమందు సేవారూపమైన భావచిత్రమును దర్శించి కీర్తించిన గేయమిది. చుక్కలరాయడగు చంద్రబింబమువంటి ముఖముకల సీతమ్మ, నిరంతర రామ కైంకర్యమే తన జీవిత లక్ష్యముగా భావించు లక్ష్మణుఁడు శ్రీరాముని కిరుప్రక్కల సేవించుచున్నారట. ఈ సౌభాగ్యమును నాకుఁదెల్పరాదా? అనగా ఈ యానంద మనుభవించుమని నాకున్నూ అనుజ్ఞ ఇవ్వరాదా! యని అర్థించిరి. ఇంతదనుక నేను శరీరముచే శ్రీరామునికి వందనము, వాక్కుచే రామకీర్తన చేయుట, మనసులోనొక పారవశ్యమైన పరమ ప్రేమచే శరీరమును మరచియుండుట మాత్రము అనుభవించుటయే తన సేవకు పరమావధి యని భావించుచున్నాను.

కాని, సీతాలక్ష్మణులు వీటితోబాటు ఏదో విలక్షణమైన ఆంతర్యము రామునితో కలిగియుండినఁగాని, శ్రీరాముని ఇరుప్రక్కలనుండి కొలిచే ముచ్చట లభింపదు. కావున, ఆ తిరుమంత్ర రహస్యమును నాకును తెల్పరాదా! యని అడిగినారు. ఇందువల్ల త్యాగరాజస్వామి హృదయము కైంకర్య భావములో సీతాలక్ష్మణుల స్థాయినందవలెనను ఆకాంక్ష కలదై యున్నట్లు స్పష్టమగుచున్నది. వందన కీర్తనార్చనాది భక్తి సాధనలవలన శ్రీహరితో, సాయుజ్యాది పురుషార్థఫలము సాధించవచ్చునేగాని, అన్ని కాలములందును, అన్ని సాధనములచే శ్రీరాముని ఆంతర్యమైన సేవాభాగ్యము దుర్లభము. ఆ యానందమును అరణ్య నగర వాసములందు సమముగా ననుభవించిన సీతాలక్ష్మణులను చూచి, మురిసిన ఆనందముతో నీ కీర్తనము పాడుకొన్నారని తోచెడిని.

## 280. శూలిని - దేశాది

ప్రాణనాథ బిరాన బ్రోవవే ॥ప్రా॥

వేణుగానముచే పదియారు
వేల గోపికల పాలించి యేలే ॥ప్రా॥

వెన్న మీగడల వేడ్క మీరఁగను
కన్న పిన్నవాండ్ల కడుపునించి
తిన్నగా వెలయు దివ్యరూపమా
చిన్ని కృష్ణ దయచేసి త్యాగరాజ ॥ప్రా॥

శ్రీరామ, కృష్ణావతారములు నిత్యసన్నిహితములు. దివ్యలీలా విలసితములు. పరస్పర మధుర శృంగారభావములతో భావుకులను భక్తి తన్మయుల చేయఁగల రసోన్మేషములు.

అవతార ప్రణాళికలు వేర్వేరుగా నున్నను, భక్తులపాలిటి నిండైన ప్రేమభావముతో కల్పవృక్షములవలె ఆశ్రయమిచ్చునవి. ఇందు తత్త్వభేదము, భావభేదమునకు అవకాశము లేదు.

కావున, త్యాగరాజస్వామి ఇందు శ్రీకృష్ణ లీలావైభవముతో తన ఇష్టదైవమైన రాముని అభిన్నముగా కీర్తించినారు.

మొదట ప్రాణనాథ! యను సంబోధనయందే, సర్వేంద్రియములకు సకలజీవుల ప్రాణములకు సర్వైశ్వర్య విభూతులకు అంతర్యామి రూపమున నాథుడై, సర్వ నియామకుడైన భగవంతుని పిలిచినారు.

వేణుగాన నిమిత్తముగా అవ్యక్త మధురనాదముచే పదియారువేల గోపికలనెడి జీవుల చిత్తములను ఒక్కమాటుగా రంజింపఁజేయుటచే నాద శరీరుడైన భగవంతుని చిరాన చురుకుగా తనను కాపాడుమని కోరినారు.



## 281. స్వరావళి - జంప

ప్రారబ్ధ మిట్లుండగా ఒరుల నన పనిలేదు నీవుండగ ॥ప్రా॥

బాలగుణశీల జనపాల వరద కృపాల
వాల కాలాతీత శూలధర వినుత నా ॥ప్రా॥

ఉపకారి నేనైతె అపకారు లయ్యేరు
కృపఁజూచితే మిగుల నెపము లెంచేరయ్య
చపల చిత్తులు భక్త వేషులైననుఁజూచి
శత్రులయ్యేరు శ్రీత్యాగరాజాప్త నా ॥ప్రా॥

మనము కడచిన జన్మములలో చేసిన కర్మలు, ఆగామి సంచిత ప్రారబ్ధములని మూడు విధములుగా విభాగమగును. అందు అనుభవరూపమైన కర్మభాగమునకు ప్రారబ్ధమని పేరు. ప్రాక్–ముందుగా ఆరబ్ధము–ఆరంభమైనది, కావున ప్రారబ్ధమని సంకేతము.

ఈ కృతియందు శ్రీ త్యాగయ్యగారికి ఏదో చిత్తమందు ఇతరులవలన బాధలు కలిగినందున పరితాపముతో తన ప్రాక్తన కర్మఫలమే కారణమని భావించి ఆ కర్మ ఫలానుభవమును రామునితో చెప్పుకొనుటయే సరియైన పరిష్కార మార్గమనియు నిశ్చయించి, రామా! నా ప్రారబ్ధ కర్మఫలమిట్లుండగా పరులయందు దోషారోపణము చేయుట న్యాయము గాకపోగా, నాయందారోపించుకొని, నా దైనందిన కృత్యమును నీకే నివేదించి, నీకే అంకిత మొనర్చుటచేత, ఆ కర్మవేగము నా కంటదు. దాన నాకు శాంతి లభించును. లేదా వారు, వీరని వివాదముచే విక్షేపమే కలుగును.

ప్రస్తుతము నా చిత్తవృత్తిలో ఏ దోష మెరుఁగక అందరికీ ఉపకారిగా నుందమని భావించితిని. అదేమి చిత్రమో! నా ఉపకారములన్నియు అపకారములగుచున్నవి. ఎదుటివారిని చూచి జాలిగల్గితే, వీడు వ్యర్థుడని

నాపై నెపము లెంచుచున్నారు. పోనీ దైవభక్తిని వారిలో పురికొల్ప యత్నించగా, వారి స్వార్థము తీరునంతవరకు భక్తవేషులై యుండి, తర్వాత నన్నుఁజూచి అసూయతో శత్రులగుచున్నారు. ఇదేమి చిత్రమో! రామా! నీవే ఈ విషమగతికి పరిష్కారమిచ్చి అనుగ్రహింపుము.

ఈ కీర్తనయందలి వక్రభావమున కనుకూలముగా వక్రగతిగల స్వరావళిరాగములో, ఎదురెదురుగా ఎత్తిపొడుపువలె నుండు జంపగతిలో భావ, రాగ, తాళముల సమన్వయము ఇందు స్పష్టముగా నున్నది.

## 282. తోడి – చాపు

**పొద్దు పొయ్యేని శ్రీరాముని**
**పూని భజించవే మనసా ॥పొ॥**

**నిద్దురచేతఁగొన్నాళ్లు విషయ**
**బుద్ధులచేతఁగొన్నాళ్లు ఓ! మనసా ॥పొ॥**

**పొద్దునలేచి త్రితాపములను నరులఁ**
**పొగడి పొగడి కొన్నాళ్లు పట్టి**
**ఎద్దురీతి కన్న తావున భుజియించి**
**ఏమి తెలియక కొన్నాళ్లు**
**ముద్దుగతోచే భవసాగరమున**
**మునిఁగి తేలుచు కొన్నాళ్ళు**
**పద్దుమాలిన పామరజనులతో వెర్రి**
**పలుకులాడుచు కొన్నాళ్ళు ఓ! మనసా ॥పొ॥**

**ముదమున ధన తనయాగారములఁజూచి**
**మదముచేతఁగొన్నాళ్లు అందు**
**చెదరిన యంత శోకార్ణవగతుఁడై**
**జాలిచెందుటయు కొన్నాళ్లు**



**ఎదటి పచ్చుఁజూచి తాళలేక తా**
**నిలను తిరుగుట కొన్నాళ్ళు**
**ముది మదితప్పిన వృద్ధుతనమున**
**ముందు వెనుక తెలియకనె కొన్నాళ్ళు ॥పొ॥**

**యాగాది కర్మములను సేయవలెనని**
**యలసటచేత కొన్నాళ్ళు అందు**
**రాగ లోభములతో అపరాధములు చేసి**
**రాజసమున కొన్నాళ్లు**
**బాగుగ నామకీర్తనములు సేయుటే**
**భాగ్యమనక కొన్నాళ్లు**
**త్యాగరాజనుతుఁడైన శ్రీరాముని**
**తత్త్వము తెలియకనే కొన్నాళ్లు ॥పొ॥**

మానవ సాధారణముగా, దేహేంద్రియ కృత్యములతో కాలము గడుపుకొనుట సహజము. ఏదేని ప్రేరణ కలిగినపుడు, దైవ వాతావరణము లభించినపుడు, తీర్థయాత్రాటన మందు, ఏదో కొంత పరచింతయు అందరికి కలుగుట సహజమే. కాని, వివేకవంతులు దైనందిన జీవితమందు, తమ కాలము, తమ కృత్యములు సార్థకములు కావలెనని, కేవలప్రాపంచికముగా వ్యర్థములు కారాదని భావింతురు. శ్రీత్యాగరాజస్వామి ఈ కీర్తనమందు దైవచింతనము యొక్క అవసరమును సూచించుటయే గాక, తమ విలువైన ఆయుర్భాగ్యము వృథాగా వ్యయమగుటను, అందరకు గుర్తింపఁజేయుచూ, స్వభావసరళిలో ఓ! మనసా! ప్రొద్దుపోవుచున్నది. శ్రీరాముని భజించుము. అని పల్లవి ఎత్తుగడలోనే, మిక్కిలి నైజధోరణిలో దివ్యకీర్తనము చేయుచున్నారు. **''బాలస్తావత్క్రీడాసక్తః, తరుణస్తావత్తరుణీసక్తః. వృద్ధస్తావచ్చింతాసక్తః, పరే బ్రహ్మణికోపి న సక్తః''** అను ఆచార్యసూక్తిని ఈ గేయమందు సమన్వయించినారు. "నిద్దురచే కొన్నాళ్ళు, విషయ బుద్ధులచే

కొన్నాళ్ళు” అనుటయేగాక, నిత్యము లేచినది మొదలు త్రితాపములు, ఆధ్యాత్మిక, ఆధిదైవిక, ఆధిభౌతిక తాపములతో దీనులై అందరిని అన్నీ యాచించుచూ. “పట్టి ఎద్దురీతి” అనగా ఎంత తిన్ననూ ఎద్దుకుమేత యందే సదా మక్కువ యుండుట సహజము.

అట్లు ఆహార విహారములందే సక్తి కలిగి సంసారమందే మునిఁగి తేలుచూ కాలము గడిపితిని. మరియు పామర జనులతోచేరి అనవసరములైన లోకవార్తలు చెప్పుకొనుట పెద్దలార్జించిన ధనాగారములతో మదము కలిగి, అవి చెదరినపుడు శోకమొందుచు స్వయం పురుషార్థములేక, ఎదుటివారి పచ్చ చూచి, అసూయనందుచు ఇంతలో వార్ధక్యమురాగా, దురాశాలోభములతో అయ్యో! సకాలములో యాగాది సత్కర్మలు చేయనైతినని విచారముతో కొన్నాళ్ళు గడిపితిని. ఇన్ని లోపములున్ననూ, భగవంతుని నామకీర్తనాదులవలన పరిహారమొందవచ్చును. అదియు చేయనైతిని. ఈ తీరుగా సర్వోన్నతమైన మానవజీవితమందు సర్వాశ్రయుడై, సర్వనియామకుడు, సర్వరక్షకుఁడైన శ్రీరాముని తత్త్వమెరుఁగలేక వ్యర్థముగా కాలము గడపితిని. ఇపుడు ప్రొద్దపోయినది. ఏమిచేతును? అని తన మనసును శ్రీరాముని పూని భజించుమని హెచ్చరించుటచే మానవ జీవితమందలి అన్ని దశలను ఇందు పేర్కొనిరి. ఇది సహజమైన అనుభవము!

## 283. ఝుంకార ధ్వని - ఆది

**ఫణిపతిశాయీ మాంపాహి పాలితాబ్ధిపాయీ ॥ఫ॥**

**మణిమయ మకుట విరాజమానో-మన్మథకోటి సమానః ॥ఫ॥**

**గజవరగమనః కమనీయాననః**
**సుజన గణావన స్సుందర రదనః**
**గజముఖ వినుతః కరుణాకరః నీ**
**రజనయనః త్యాగరాజ హృత్సదనః ॥ఫ॥**



ఫణి....శాయీ= సర్పరాజైన ఆదిశేషునందు శయనించినవాడు. పాలితాబ్ధిపాయీ= సముద్రమును పానము చేసిన (అగస్త్యుని) రక్షించినవాడు. గజ....గమనః= ఏనుగురాజువంటి నడక కలవాడు. కమనీయాననః= మనోహరమైన ముఖము కలవాడు. సుజనగణావనః= సుజన సముదాయమును రక్షించువాడు. సుందరరదనః= చక్కని పలువరుస కలవాడు. గజముఖ వినుతః= మహాగణపతిచే నుతింపఁబడినవాడు. నీరజనయనః= పద్మనేత్రుఁడు త్యాగరాజుని హృదయము నివాసముగా కలవాడు.

## 284. హంసనాదం - దేశాది

**బంటురీతి కొలువీయ వయ్యరామ ॥బం॥**

**తుంట వింటివాని మొదలైన మదా**
**దులఁబట్టి నేలఁగూలఁజేయు నిజ ॥బం॥**

**రోమాంచమనే వరకంచుకము**
**రామభక్తుడనే ముద్రబిళ్ళయు**
**రామనామ మనే వరఖడ్గమిచ్చి**
**రాజిల్లునట్లు త్యాగరాజునికి ॥బం॥**

తుంట వింటి వాని మొదలైన= కామము క్రోధము మదము మొదలగువాటిని. రోమాంచము= గగుర్పాటు-కంచుకము= కవచము.

భగవద్భక్తికి సేవాధర్మము అతిముఖ్యము. అందును దాస్యము విశిష్టమైనది. ఇందు శ్రీరామ ప్రభువు దర్బారులో రామబంటుగా నాకు కొలువును అనుగ్రహించమని వేడినారు. నిరంతరము శ్రీవారి సన్నిధిలో జవాను ఉద్యోగమిప్పించమనిరి.

ఇట్లు నిరంతర సేవలో కామ క్రోధ మదాదులు నశించును. ప్రతిక్షణమందును తన ప్రభువు కనుసన్నలలో మెలఁగవలసి యుండును.

ఏమరపాటున కవకాశముండదు. ప్రభు ఆస్థాన గౌరవముండును. ఆ కొలువులో తానుచేసి, చేయని కర్తవ్యమునకు పరిగణనముండదు. తన సర్వవిధులు రామాంకితములయ్యేయుండును. అందుకు తగిన వేషభాషాలంకారములను చరణమందు రూపొందించుకొన్నారు.

నిరంతర శ్రీరామస్మరణ కీర్తనాదులచే తనకు కలిగిన గగుర్పాటు కంచుకమట. మెడలో ధరించు డవాలుపై "రామభక్తుడు" అని ముద్రించిన బిళ్ళ, ఇది అధికార చిహ్నము. రామనామమనే డాల్. (కత్తి) ఇవి రాజిల్లునట్లు త్యాగరాజునికి ఉద్యోగమిమ్ము. ఈ యుద్యోగము కాలాంతర లోకాంతరములందు సైతము శాశ్వతము, అజరామరము. ఇందుకు ప్రతిఫలము బ్రహ్మానందమే. శాస్త్రములందు భగవదను సంధానమునకు సాధకునికి అనేక ప్రక్రియలుకలవు. ఈ విధమైన సంవిధానము శ్రీ త్యాగరాజుని అంతరంగమందేర్పడుట, వారి ఆంతరంగిక నైజస్వభావము, కేవల దైవానుగ్రహ హేతుకమని తెలియుచున్నది. ఈ యనుసంధానము వైదిక, లౌకిక సత్సాధనలకొక వారధివంటిది. ఈ భావ సమాధి నిరుపమానమైనది.

## 285. చంద్రజ్యోతి - దేశాది

**బాగాయె నయ్యా నీ మాయలెంతో**
**బ్రహ్మకైనఁగొనియాడ తరమా ॥బా॥**

**ఈ గారడము నొనరించుచును**
**నేఁగాదనుచు బల్కేదియును ॥బా॥**

**అలనాడు కౌరవుల నణచ మన**
**అలరి దోసమనే నరునిఁజూచి పాప**
**ఫలము నీకు తనకు లేదని చక్కగ**
**పాలనము సేయలేదా త్యాగరాజనుత ॥బా॥**



భగవద్గీతా తాత్పర్యమును మామూలు ధోరణిలో లలితముగా ఇందు వివరించుట ఎంతో చమత్కారము.

కౌరవ పాండవ యుద్ధము, ధర్మాధర్మముల సంఘర్షణము. ధార్మికులు పాండవులు. అధార్మికులు కౌరవులు. అధర్మమునకు అపజయము, ధర్మమునకు విజయము భగవంతుని ప్రణాళికలో ప్రధాన విషయములు.

ధర్మాధర్మముల మిశ్రమమే జగత్తుయొక్క స్వరూపము. దర్మము తత్త్వజ్ఞానమునకు బహిరంగసాధనము. ధర్మాచరణమువలన పాపమాలిన్యము పోయి అంతఃకరణ పరిశుద్ధమయ్యేనేని అందు జ్ఞానముదయించును; ఆ జ్ఞానమువలన పరమాత్మకన్న వేరుగా తోచు జగమంతయు మాయా మాత్రమనియు, పరమాత్మయే సత్య వస్తువనియు, అది ద్వంద్వములకు అతీతమై అద్వయరూపము "ఏక" మనియు ఉపనిషత్సిద్ధాంతము. నేరు కర్తను. నేను భోక్తను అనెడి భావము కేవల కల్పితము. పరమాత్మ కర్తయు, భోక్తయు కానేరఁడు.

ఈ యభిప్రాయమే ఈ కీర్తనమందు లలితముగా వివరింపఁబడినది.

కౌరవ పాండవ యుద్ధరంగమందు, ఉభయసేనల మధ్యలో రథమందుండి భీష్మ ద్రోణాదులు, బంధువులు, పెద్దలు ఎదిరిసైన్యములో నుండఁజూచి, అర్జునుఁడు ప్రకృతి సహజమైన భావముతో జాలిచెంది, ఇంతలేసి పెద్దలను, బంధువులను, హింసాపూరితమైన క్షాత్రధర్మమను పేర చంపుటకంటె, బిచ్చమెత్తుకొని బ్రతుకుట మేలుగదా! యని తానేదో విలువైన అహింసాధర్మము నాశ్రయించిన వానివలె పల్కెను. అందుపై కృష్ణుడు. భీష్మాదుల ఆత్మలకు నాశములేదనియు, శరీరములకు జన్మ మరణములు సహజములనియు, శరీరాభిమానులెల్లరు స్వ స్వధర్మాచరణమువలన చిత్తశుద్ధి నంది, శరీరేంద్రియాదులకంటే వేరై నిత్య సత్యమైన ఆత్మను సాక్షాత్కరించు కొన్నపుడు, ధర్మాధర్మములతో పుణ్యపాపములతో, కర్తృత్వ, భోక్తృత్వాదులతో

సంబంధము లేనివారై ఆత్మానంద మొందుదురని ఉపదేశించుటయేకాక, సర్వము తనవల్లనే జరుగుచున్నదని తన భగవద్విభూతిని దర్శింపఁజేసెను. ఈ భావమును త్యాగరాజస్వామి చమత్కరించి, రామా! ఈవిధముగా గారడీచేయుచూ, అబ్బే! ఇందు నాకేమి శక్తిలేదు నేను గాదనుచు. విచిత్రముగా బల్కుచున్నావు. నీ మాయా విలసనములు బాగున్నవిలే! యనిరి.

నిత్యసత్యమైన వస్తువు పరమాత్మయే. ఈ కనుపించు జగమంతయు మాయా విలసనము కలదే. ఈ రెంటినడుమ పరమాత్మ రామ కృష్ణాది అవతార వైభవములచే, దుష్టశిక్షణము – శిష్టరక్షణముచేయుట స్వభావము, ఇదంతయు భగవంతుని లీలావిభూతి. మమ మాయా దురత్యయా" (గీత) (నా మాయను ఎవ్వరూ దాటలేరు) కావున, భక్తులు నిరంతరం భగవంతుని శరణొందుటయే ప్రధానము. **"మామేవ యే ప్రపద్యంతే మాయా మేతాం తరంతి తే"** నాయందే ప్రపన్నులగువారు నా మాయను తరింతురని భగవద్వచనము ప్రమాణము. కావున, రాముణ్ణే ఆడి, పాడుకొనుట వివేకలక్షణమని బోధించినారు.

## 286. రీతిగౌళ – ఆది

**బాలే బాలేందు భూషణి, భవరోగశమని ॥బా॥**

**ఫాలలోచని శ్రీధర్మ సంవర్ధని సకలలోక జనని ॥భా॥**

**శీలే నను రక్షింపను జా–గేలే పరమపావని సుగుణ**
**జాలే నతజన పరిపాలన–లోలే, కనకమయ సుచేలే**
**కాలవైరికి ప్రియమైన యి–ల్లాలవై ఇందు వెలసినందుకు**
**శ్రీలలితే నీ తనయుఁడని నను కు–శాలుగా పిలువవలె నమ్మా ॥బా॥**

**సారే సకల నిగమవన సం–చారే చపలాకోటి నిభ శ**
**రీరే దేవతాంగనా పరి–వారే పామర జన దూరే**
**కీరవాణి శ్రీపంచనదపుర వి–హారివై వెలసినందు కిక**
**నేరకోటులనెల్ల సహించి–గారవింపవలె నమ్మా ॥బా॥**

**రామే ప్రణతార్తి హరాభి–రామే దేవకామినీ ల**
**లామే త్యాగరాజ భజన స–కామే దుర్జనగణ భీమే**
**నా మనసు నీ చరణముల సదా–నేమమునఁబూజసేయనీ శ్రీ**
**రామ సోదరివై వెలసిన శ్రీ–శ్యామలే ధర్మ సంవర్ధనీ ॥బా॥**



బాలేందు భూషణి= చంద్రకళను ధరించినది. భవరోగశమని= సంసార రోగమును శమింపఁజేయునది. సకలనిగమ...చారే= వేదములనెడి వనమందు సంచరించునది. చపలా...శరీరే= మెరపుతీగలవంటి శరీరముకలది. ప్రణతార్తి...రామే= ప్రణతులైనవారి ఆర్తిని హరించు శివునికి మనోహరి.

పంచనద క్షేత్రమందు వెలసిన ధర్మసంవర్ధనినిఁగూర్చి స్తుతించుచూ, తనను తనయుడని ఆతల్లి కుశాలుగా స్వభావ మాతృవాత్సల్యముతో పిలువవలెనని ఆంతర్యముగా కోరినారు. నీవు త్రిలోక జననివయ్యును, నీ సన్నిధానమందుండి నీ సోదరుడైన రాముని శరణంది, క్షేత్రాధిదేవతయైన నీయందు భక్తికలిగి నియమముతో పూజించుకొనుచున్నాను. నిత్య సన్నిహితుఁడనై యున్నాను. నా నేరములను తల్లివలె నీవు సహించుట న్యాయము. కాలవైరి మృత్యుంజయునకు ప్రియమైన ఇల్లాలివి. కావున, నన్ను పరునిగా జూడక, స్వీయుడుగా ఆదరించి, నీ ఆంతర్య అనుగ్రహ భాగ్యమును నా కిమ్ము. అని ప్రార్థించుటలో కేవలం పంచనద క్షేత్రమందు తానూ నివసించుచున్నాననే లోకధర్మముగాక. తన జన్మాంతర భాగ్యముచే పరదేవతా సాన్నిధ్య వైభవము ఆంతరంగికముగా ననుభవించఁగల శక్తినిమ్మని ప్రార్థించినారు. అందరివలెగాక నాకు మాతృదేవతగా సన్నిహితురాలవు కావలెనని వేడుకొన్నారు. శ్రీ మాతృచరణ వరివస్యలేనిదే,

దేవతాంతర అనుగ్రహము దుర్లభము. కావున, తన ఇష్టదైవమైన రామునితో బాంధవ్యమును కూర్చుకొని, కీర్తించినారు.

## 287. శంకరాభరణం - చాపు

**బుద్ధిరాదు బుద్ధిరాదు**
**పెద్దల సుద్దులు వినకయె ॥బు॥**

**బుద్ధిరాదు బుద్ధిరాదు-భూరివిద్యల నేర్చిన ॥బు॥**

**ధాన్య ధనములచేత ధర్మమెంతయుఁజేసిన య**
**నన్యచిత్త భక్తుల వా-గమృత పానముసేయక ॥బు॥**

**మానక భాగవత రా-మాయణములు చదివిన**
**మానుషావతార చరిత-మర్మజ్ఞుల జతగూడక ॥బు॥**

**యోగము లభ్యసించిన-భోగము లెంతో కల్గిన**
**త్యాగరాజ నుతుడౌ రామ-దాసుల చెలిమి సేయక ॥బు॥**

వేదశాస్త్రములచే విధించబడిన ఆచరణము ధర్మము. **"తస్మాచ్ఛాస్త్రం ప్రమాణంతే కార్యాకార్యవ్యవస్థితౌ** (భగవద్గీత.) అయినను, పరంపరగా పెద్దలు ఆచరించుచూ వచ్చిన శిష్టాచార సంప్రదాయము శాస్త్రముకన్న బలీయమైనది. శిష్టాచారమునకు శాస్త్రవచనము కొంచెము విరోధమైనచో పెద్దల ఆచారమునే ప్రమాణముగా గ్రహించవలయును; కావున, పెద్దల సుద్దులు వినకయే, బుద్ధి రాదు. జ్ఞాన మేర్పడదని సూటిగా హెచ్చరించినారు.

తానెంత విద్వాంసుడైనను, ధర్మ నిర్ణయముపట్ల తన ఊహ సరిపడదు.

అదియుగాక, ధన, ధాన్యములుగల సంపన్నులు తామే స్వయంప్రజ్ఞ కలవారమని గర్వించి, తమకుఁదోచిన తీరున దాన ధర్మములను ఆచరించుట లోకమందు కలదు.



అట్లుగాక, భగవంతునియందు అనన్య భావము భక్తికల పెద్దలు బాహ్యముగా ద్రవ్యహీనులైనను, ఆంతర్యమున భగవంతునికి సన్నిహితులగుటచేతను, నిష్కాములగుటచేతను వారి అమృత మొల్కు మాటలకు విధేయత చూపవలెను. అంతకంటే మిన్నగా భాగవత రామాయణాది ఆర్ష గ్రంథములను, ప్రవచనము చేసినంత మాత్రముననే మేమెంతో గొప్పవారమని, భక్తులమని భావించుకొను దాంభికు లెందరో కలరు. వారు చెప్పునవి గ్రంథార్థములు. చేయునవి స్వేచ్ఛాచారములు. వీరికి భగవద్వచనములలోని మర్మమేమియు తెలియదు. స్వయంవక్తలగుట పెద్దలను సేవింపరు. ఇట్టివారికిన్నీ బుద్ధి రానేరదు.

ఇంతకన్న ప్రమాద విషయం, యోగులు భోగులు. వీరు అణిమాదులవల్లనో, ఏదో అల్పమైన ప్రక్రియలతో ప్రజలకు ఆశ్చర్యము కలుగునట్లు మహిమలను చూపి లోకమును వంచింతురు. వారు రామభక్తుల దరిచేరరు. అంతమాత్రమున వారున్నూ భగవంతునికి సన్నిహితులు కాలేరు. ఇట్టి దాంభికులను లోకమందు చూచి, శ్రీ త్యాగరాజస్వామి సూటి మాటలతో ఇందు న్యాయమైన సువిమర్శ మొనర్చినారు.

## 288. తోడి - రూపకం

**బృందావనలోల గో-విందా రవిందానన ॥బృం॥**

**సుందరాంగ ధృత రథాంగ-సుజనారి తిమిరపతంగ ॥బృం॥**

**మామవ శ్రీరమణీమణి-మదనాశ్రితమిత్ర**
**రామదాస దాసత్యాగ-రాజనుత చరిత్ర ॥బృం॥**

ధృతరథాంగ= చక్రమును ధరించినవాడు-శ్రీరమణీమణిమదన= మాం+వ= నన్ను రక్షింపుము.

## 289. బహుదారి - ఆది

**బ్రోవ భారమా రఘురామా**
**భువనమెల్ల నీవై నన్నొకని ॥బ్రో॥**

**శ్రీ వాసుదేవ అండకోట్లకుక్షిని నుంచుకో లేదా నన్ను ॥బ్రో॥**

**కలశాంబుధిలో దయతో నమ**
**రులకై యదిగాక గోపి**
**కలకై కొండలెత్తలేదా**
**కరుణాకర త్యాగరాజుని ॥బ్రో॥**

రామ కృష్ణావతారములను అభేదముగా తలచి, **"సర్వం విష్ణుమయం జగత్"** అను సూక్తి ననుసరించి అంతయు నీవైయుండి నన్నొకని కాపాడుటకు భారమయ్యెనా? యనుచు, భారమును వహించుటకు మరికొన్ని ఆదర్శములను చూపి కీర్తించినారు. అండకోట్ల చరాచర భూతసంఘము నీ కుక్షియందేకలదు. దేవాసురులు అమృతమునకై క్షీరసాగరమును మధించుపట్ల కూర్మరూపమున మందరమును మోయుట, గో, గోపీరక్షణకై గోవర్ధనమెత్తుట నీ దివ్యచరిత్రయందు నిదర్శనములు. కావున, నన్నొకని కాపాడుట భారమయ్యెనా? యని చమత్కారము.

## 290. శంకరాభరణం - రూపకం

**భక్తిబిచ్చమీయవే-భావుకమగు సాత్త్విక ॥భ॥**

**ముక్తి కఖిలశక్తికి త్రి-మూర్తుల కతి మేల్మిరామ ॥భ॥**

**ప్రాణము లేనివానికి-బంగారు పాగజుట్టి**
**ఆణి వజ్ర భూషణ మురమందు బెట్టురీతి**
**జాణలకు పురాణాగమ-శాస్త్రవేద జపప్రసంగ**
**త్రాణగల్గియేమి భక్త-త్యాగరాజనుత రామ ॥భ॥**



భగవంతునియందు అనన్య ప్రేమయే భక్తి. అది సాత్త్వికము. సర్వమంగళప్రదము. **"ముక్తిందదామి కర్హిచిన్నతు భక్తియోగం"** అడిగిన అర్హులకు ముక్తి నిత్తునేగాని, భక్తియోగమును ఇవ్వజాలను అని భగవద్వచనము. రామదాసు **"ముక్తి నేనొల్ల నీ పదభక్తి మాత్రమే చాలు"** అని కీర్తించినారు. **"భక్త్యాత్వనన్యయాలభ్యః"** (భగవద్గీత) మరియు **"భక్త్యామా మభిజానాతి యావాన్ యశ్చాస్మి తత్త్వతః"** అనుటవలన బ్రహ్మానందాను భవమునకు భక్తియోగము సాక్షాత్సాధనము. అది కేవల దైవానుగ్రహ హేతుకముగాని యత్నసాధ్యముగాదు. కావున, ఇందు రామునింగూర్చి భక్తిబిచ్చమీయవే! యని ఆర్తుడయ్యే బిచ్చ మడుగుకొనునుగాన, బిచ్చగానియందు బిరుసుతన ముండనేరదు గావున, త్యాగరాజు రాముని భక్తిబిచ్చ మడుగుటలో ఎంతో ఆర్తిపరిపాకము తెలియుచున్నది. ఇందు యాచ్నా దైన్యములేదు. భగవంతుని అడుగునది సర్వమంగళమగు భక్తి. ఈ అతిశయమునే వివరించుచూ, ముక్తికి, సర్వశక్తికి త్రిమూర్తులకు "మేల్మి" బంగారువలె వారికిని అలంకారమైన భక్తి, కేవల జీవబ్రహ్మైక్య మందుకంటె, భగవంతునికి అన్యముగాని ఈ దృశ్యమందు సర్వమున్ అతని దివ్య కళామయముగా రసోదయము కలిగించు భక్తిరమణీయము. అట్లే సర్వశక్తులకు గుణోపాధికులు అధికారికులునగు బ్రహ్మాదులకు సైతము అనుభవరూపమున భక్తి ఆనందరూపము, అని పరమసిద్ధాంతమును వివరించినారు.

మరియు, ప్రాణములేని వ్యక్తికి బంగారు పాగజుట్టి వజ్రరత్న మయాభరణముల నలంకరించిననూ, ఎట్లు కళావిహీనమై యుండునో, ఆ భక్తికళ యుండి, కడమ అలంకారములేవి లేకున్నను, ఎట్లు సహజమైన శోభయుండునో! (యని వ్యతిరేక ముఖమున అన్వయము) పరవంచన రాజసము అహంభావము కల జాణలైన స్త్రీలు అపర శారదామూర్తులవలె, వేదాగమ పురాణేతిహాస ప్రసంగములు చేయగల (త్రాణ)= శక్తికలవారైనను

తమ అంతరంగమందు నిర్మలమైన భావములేనిచో వారి ఔన్నత్యము శుకానువాదమువలె లోక ప్రతారణమగునేగాని, ఫలవంతము కానేరదు.

కావున, ఓ రామా! ఏవిధమైన అతిశయము లేక నిన్ను భక్తి బిచ్చమెత్తుకొనుచున్నా ననెడి ఆత్మీయమైన ఆర్తి అందరకును పురుషార్థ ప్రదము. ఇదియే సాత్త్వికానుభవము. ఈ రీతి భావశబలిత సంకీర్తనమునకు జీవము వంటిది.

## 291. సురటి - రూపకం

**భజన పరుకేలదండ పాణిభయము మనసా ॥భ॥**

**అజ రుద్ర సురేశుల కాయాస్థాన మొసగురామ ॥భ॥**

**అండకోట్లు నిండిన కో-దండపాణి ముఖమును హృత్**
**పుండరీకమునఁజూచి-పూజసల్పుచు**
**నిండు ప్రేమతో కరంగు-నిష్కాములకు వర వే**
**దండపాలు దాసుఁడైన-త్యాగరాజుసేయు రామ ॥భ॥**

సదా భగవంతుని భజించువారికి దండపాణి= యముని భయము లేదనుట ఇందలి ప్రధాన సిద్ధాంతము. భగవంతుని భజన యనగా తాదాత్మ్య భావనమే. కావున, బ్రహ్మరుద్రాదులకు స్థానాధికార సంపదల నిచ్చినది భజనానందమే. భజ= సేవాయాం అనుటవలన సేవాదృష్టియే జగద్విలాసమునకు ప్రధాన జీవము. భక్తులు భగవంతుని సేవించుట, భగవంతుడు భక్తుల వెన్నంటి కాపాడుటయు సేవాధర్మములే. కావున, భగవంతుని ఆ స్థాన మూలసూత్రము సేవయే. ఇక దండధరుడు యముడు సర్వ ప్రకృతిని నియమించు ఆధికారిక దైవము. వానివలన వచ్చునది మృత్యుభయము. కాలపరిణామ వికారములు సర్వభూతములకు సహజములు అపరిహార్యములు. రామభక్తులగువారు తమ అంతర్యామిగా



రాముని ఉపాసించువారగుటచే, వారికి బాహ్యేంద్రియ శరీరములతో అనుబంధము దూరమయ్యే యుండును; వారి అంతశ్శరీరము ఆనందమయమై నిత్యసత్యమైన ఆత్మారామునితో అంకితమై యుండును. బాహ్యశరీరమెపుడు నేలమీద రాలిననూ, త్రాగుబోతువానికి తన బుజముమీదగల వస్త్రము జారిపోయినను, ఆ మత్తులో వానికెట్లు తెలియదో వీరికిని అట్లే తెలియదు. కావున భజనపరులకు మృత్యువే లేదనుట నిర్వివాదము.

కాని, యముని జయించుటకు వలయు ఆంతరమైన అను సంధానమును చరణమందు వివరించినారు. జడ చేతన జీవకోటి యందంతటను శ్రీరామ దివ్యతత్త్వమే నిండియున్నది. అట్టి రాముని దివ్యముఖమును సాధకుడు తన హృదయ పద్మమున దర్శించవలెను. సూర్యకాంతి వలన పద్మము వికసించినట్లు శ్రీరాముని ముఖమందలి ప్రసన్న కటాక్షముచే భక్తునకు హృదయాంధకార ఆవరణము తొలఁగి వికసించును. అచట ఒక అపూర్వమై, దైవదత్తమై, మంచి పుణ్యావాసనలఁ జిమ్మునట్టి నిండు ప్రేమయనెడి రాగరంజితమైన పదార్థము కలదు. అదియే విశ్వవిలాసమునకు రక్తి నిచ్చునట్టిది. అట్టి నిండు ప్రేమతో, శ్రీరామునికి పూజ చేయవలెను. అనగా, అర్ఘ్యపాద్యాది షోడశోపచారములు మనము సహజముగా ననుభవించుచునేయున్నాము. వీటినే రాముడను లక్ష్యముతో ననుభవించుటయే పూజ. అట్లు, నిండుప్రేమతో కరగి పూజించువారికి రాముని కంటె వేరైన కోరికలుండవు. సర్వాశ్రయుడు సర్వకామపూర్ణుడునైన రామునితో అంతరంగానుభూతిని అనుభవించు భక్తుడు నిష్కాముడేయగును. ఈ తీరు భావనతో ఆర్తుడైన వేదండము= గజరాజు పరమాదర్శము.

ఆతఁడు ఆర్తుడై అనన్యశరణ్యుడై తన హృత్పుండరీకమును శ్రీహరి కభిముఖముగా నర్పించెను. అంతకుమించి, ఏవిధమగు అర్హతాధికారములు వానికి లేవు. శ్రీహరి అతనికి ప్రసన్నుడయ్యెను. కావున, మనము ఆ దివ్య

ఆదర్శముతో శ్రీరాముని భావింతుమేని వానికివలెనే మనకును దండపాణి భయము లేకుండు ననుటలో సందేహమే లేదు. కావున, యముడు తన కింకరులకు ఆదేశమిచ్చుచూ,

**"జిహ్వానవక్తి భగవద్గుణ నామధేయం**
**చేతశ్చనస్మరతి తచ్చరణారవిందం**
**కృష్ణాయ నోనమతి యచ్ఛిర ఏకదాపి**
**తానాన యధ్వం అసతోఽకృత విష్ణుకృత్యాన్"**

(ఓ దూతలారా! ఎవని నాలుక, భగవద్గుణనామకీర్తనము చేయదో ఎవని చిత్తము భగవచ్చరణారవిందము స్మరింపదో, ఎవని శిరము భగవంతునికి, తద్భక్తులకు వంగి నమస్కరింపదో, అట్టివారిని పట్టి నా కడకు తీసికొని రండు. వారిమీదనే నా యధికారము) అనెనట ఇదే తీరులో అన్వయ ముఖమున: **"శ్రీరామ రాఘువరమేశ్వర రావణారే, భూతేశ మన్మథరిపో ప్రమథాధినాథ! చాణూరమర్దన హృషీకపతే మురారే, త్యాజ్యాభటాయ ఇతి సంతత మామనంతి"** యని శివ, రామ, కృష్ణ నామరూపములను అభేద దృష్టితో కీర్తించువారిని విడిచిపెట్టుడు అని స్వారస్యము.

ఇట్లు భగవన్నామ గుణాను కీర్తనా పరవశులకు దండపాణి భయములేక శాశ్వతానంద స్వరూపులై యుందురనియు, ఇందుకు వలయు అంతరంగసాధనా వైభవమును, అందుకు ఆదర్శ లక్షణములను ఇందు చక్కగా వివరించినారు. ఇవియే ఉపనిషత్సూక్తులవంటివి

## 292. అఠాణ - రూపకం

**భజన సేయరాదా**
**అజరుద్రాదులకు సతతమాత్మ మంత్రమైన రామ ॥భ॥**



**పదని సరిస నిసదా-పదప సనిరి సనిసా**
**మప మద ప దపమగా-నిసరిమరి మపదాపమ ప**
**దానీస-దని సరీస నీనీ సరి-పని పరీరి**
**పదప సాస-గగ్గారి స-నీ సరినిసమాప దమప**
**గారి స-రీసని దాపమ ॥భ॥**

**కరకు బంగారువల్వ-కటి నెంతో మెరయఁగ**
**చిరునవ్వులు గల మొగమును-చింతించి చింతించి**
**అరుణాభా ధరమును-సురుచిర దంతావళిని**
**మెరయు కపోల యుగమును-నిరతమునను దలచి దలచి ॥భ॥**

**బాగుగ మానస భవ-సాగరమునను తరింప**
**త్యాగరాజు మనవిని విని -తారకమగు రామనామ ॥భ॥**

బ్రహ్మ రుద్రాదులకు శ్రీరామ మధురనామ కీర్తనముచేయుచు భజించుట సర్వప్రమాణ సిద్ధము. కావున, సంకీర్తనమునకు తోడుగా బంగారు వలువతో మందహాసముగల ముఖారవిందముతో రక్తిగల అధరము, మల్లెమొగ్గలవంటి పలువరుసగల ఆ దివ్యమంగళ రూపము ధ్యానించుచూ, మానస సంసారమునుండి ముక్తులు కావలెనని హెచ్చరిక.

## 293. కల్యాణి - రూపకం

**భజనసేయవే మనసా-పరమభక్తితో ॥భ॥**

**అజరుద్రాదులకు భూసు-రాదుల కరుదైన రామ ॥భ॥**

**నాద ప్రణవ సప్తస్వర-వేదవర్ణ శాస్త్ర పురా**
**ణాది చతుష్షష్టి కళల-భేదము కలిఁగే**
**మోద కర శరీరమెత్తి-ముక్తిమార్గమును తెలియక**
**వాదతర్కమేల శ్రీమ-దాది త్యాగరాజనుతుని ॥భ॥**

బ్రహ్మేంద్రాదులకు సైతము అపురూపమైన రామభజనయందు నాదము ప్రధాన మాతృకగానున్నది. ఆపై సకల ఛందోసారమైన ప్రణవము, దానినుండి వెడలిన సప్తస్వరములు సంకీర్తనమందు ఏకీభవించియున్నవి. ఆపై వేదములు వర్ణమనగా శబ్ద నిరుక్తియైన వ్యాకరణాది శాస్త్రములు, చతుష్షష్టి= అరువదినాల్గు కళలు భగవంతుని దివ్య విభూతులు. వీటివలన అంతర్బాహ్యములందు భగవంతుని దివ్యరూపము వ్యక్తమగును. వీటి పరస్పర భేదములను, స్వరూపమును మానవుడే గుర్తించఁగలడు. మరియు నాదము మొదలు వర్ణములు శబ్దములు మన శరీరమందు ఆయా స్థాన భేదములలోనున్నవి. సర్వకళలు ఈ శరీరమందే కలవు. యోగులు మనుష్యాకార శరీరములను శబ్ద బ్రహ్మరూపముగా నుపాసించుటయు కలవు. కావున, మానవుని విరాట్శరీరమందే యున్న నాదాదులను, వాటి కంతర్యామియై, అధిష్ఠానమైన రాముని తెలియక వాద వివాదములతో ముక్తికి దూరులగుట అన్యాయము. కావున, పరమభక్తితో భగవంతుని దివ్యరూపమును ఆత్మీయముగా గుర్తించి భజించుమని మనసును హెచ్చరించినారు.

## 294. కన్నడ - చాపు

**భజరే భజ మానస రామం ॥భ॥**

**అజముఖ శుక వినుతం శుభచరితం ॥భ॥**

**నిర్మితలోకం నిర్జితశోకం**
**పాలిత మునిజన-మధునా నృపపాకం ॥భ॥**

**శంకరమిత్రం శ్యామలగాత్రం**
**కింకర జనగణ తాపత్రయ తమోమిత్రం ॥భ॥**

**భూసమశాంతం-భూజాకాంతం వారమఖిలదం**
**త్యాగరాజ హృద్ధ్వాంతం ॥భ॥**



అజముఖ= బ్రహ్మ మొదలైన, పాలిత మునిజనం= మునుల రక్షించినవాడు. అధునా= ఇపుడు. నృపపాకం= రాజుగా ఫలించినవాడు. కింకర...మిత్రం= సేవక సముదాయముయొక్క తాపత్రయములనే చీకటికి సూర్యునివంటివాడు. భూ సమ శాంతం= భూదేవితో సమానమగు శాంతికలవాడు. భూజాకాంతం= భూపుత్రియైన సీతకు కాంతుడు. వారం= మాటిమాటికి. అఖిలదం= అన్నీ ఇచ్చువాడు. త్యాగ....ఖాంతం= త్యాగరాజుని హృదయమందు ప్రకాశించువాడు. స్తుతిపరములైన విశేషణములతో సంస్కృత సంకీర్తనము.

## 295. మోహన - ఆది

**భవనుత నా హృదయమున రమింపుము బదలిక దీర ॥భ॥**

**భవతారక నాతో బహుపల్కిన బదలికదీర కమలసం ॥భ॥**

**పవనసుతప్రియ తనకై తిరిగిన బదలికఁదీర**
**భవనముఁచేరి నన్ను వెరపించిన బదలిక దీర కమల సం ॥భ॥**

**వరమగు నై వేద్యములను సేయని బదలిక దీర**
**పరవలేక సరిపోయి నట్టాడిన బదలికదీర కమలసం ॥భ॥**

**ప్రబలఁజేసి నను బ్రోచే వనుకొన్న బదలిక దీర**
**ప్రభు నీవు త్యాగరాజునికి బదలికదీర కమలసం ॥భ॥**

మానవ ప్రకృతిలో ప్రతివారికి బాహ్యాశరీరము ఆంతర శరీరమను రెండు శరీరములు కలవు. హృదయమనునది అంతరాంతరము. బాహ్యా శరీరేంద్రియములతో మన మనుభవించు శ్రమయంతయు, హృదయములో చేర్చినచో, అనగా హృదయ పూర్వకమై, ఇష్టమగుచో అది ప్రియమగును. ఎదుటివానికి శ్రమగా తోచినను, తనకు మాత్రము ఆ శ్రమ హృదయమంటినచో ఆనందముగానే యుండును. లోపల వెలుపల కూడ

ఒకేతీరైన భావసంపద కలిగినచో అది అదృష్టమే. లోకవ్యవహార మందట్లుండును. అట్టి హృదయమందు తన సాక్షిచైతన్యము ప్రకాశించును. దానికే "పురి" అని సంకేతము. (పురి-శేత ఇతి= పురుషః.) అట్టి పురి అనగా హృదయాకాశమందు శయనించినవాడు కనక పురుషుడను సంకేతమేర్పడినది. లోకమందు మాటకాని, క్రియకాని హృదయమంటి ఆచరించినచో అది పవిత్రమనియు. ప్రియమనియు మనము తృప్తినందెదము.

ఇందు త్యాగరాజస్వామి, తన బాహ్యచేష్టలతో శ్రీరామునికి బడలిక కల్పించినట్లు భావించి, తన మెత్తని సున్నితమునైన చిత్తముతో జాలినంది, శ్రీరాముని తన హృదయమందు శయనించి తన బడలికను తీర్చికొమ్మని చక్కని మధుర భావముతో వేడుకొనుట రమణీయమగు భావ సౌందర్యము.

స్వామీ నే నెన్ని ఉపచారములు క్రియారూపమున నీకుఁజేసినను, నీకుఁదగిన విశ్రాంతిని, హాయిని అవి నీకు సమకూర్పజాలవు. కావున, నా హృదయమనెడి ఏకాంతస్థలమున రమింపుము అని ప్రార్థించినారు. ప్రతివానికి హృదయమందుగల ప్రేమాతిశయము రక్తినిచ్చి, అంతరమున సర్వభోగములను అనుభవించిన తృప్తి కలుగును. ఇదియే సృష్టి రహస్యము. కేవల నామరూపముల ఆడంబరముతో మనము స్థూలముగా కోటి భోగములనుభవించినను మన ఏకాంత హృదయమందు బాహ్య సామగ్రితో నిమిత్తములేకనే ఆత్మానందమున, అంతరారాములైన యోగులు అనుభవింతురు. వారికి బాహ్య సామగ్రితో నిమిత్తమేలేదు. **"యదేష ఆకాశ ఆనందో నస్యాత్ కోహ్యే వాన్యాత్ కః ప్రాణ్యాత్"** యీ ఆకాశమంతయు, విశేషించి, నీ హృదయాకాశమే చిదానంద రూపము కానిచో ప్రాణాపాన చేష్టలెట్లు కల్గుచున్నవని తైత్తిరీయశృతి సూటిగా ప్రశ్నించుచున్నది.

ఎంతటి విషయమందును. తనకు ప్రీతిలేనిదే ఎదుటి వస్తువే ఆనంద మీయఁజాలదు. **"ఆత్మనస్తు కామాయ సర్వం ప్రియం భవతి"** అను



శ్రుతియుగలదు. ఆపై చరణములలో శ్రీరామునికి కలిఁగిన బడలికను వేర్వేర పేర్కొనినారు. తనతో రాముడెన్నో మాటలు మాట్లాడినా బడలిక, ఓ పవనసుతప్రియ! = ఆంజనేయునికి ప్రియమైన రామా! నాకై నీవు తిరిగినది, నా ఇంటఁజేరి, నన్నెన్నో తీరుల భయపెట్టినది (తనయందు చిత్తము లగ్నమగుటకు భగవంతుఁడు భక్తుల నెన్నోతీరుల పరీక్షించి త్రిప్పలు పెట్టును.)

రామునికి ఇష్టమైన నైవేద్యములను సేయకపోవుటచే కలిగిన బడలిక. నా ఇష్టమువచ్చినట్లు నిన్నుఁగూర్చి అన్నమాటలవలన, నన్ను అనేకవిధములుగా కాపాడుటకు రామా! నీవుపడిన శ్రమవలన బడలిక, ఇట్లెన్నో తీరుల నీకుకల్గిన శ్రమకు, నా హృదయ శయ్యయందు శయనించుటయే పరిష్కారమని, ఎంతో గంభీరమైన భావమును, సహజ ధోరణిలో ఇందు కీర్తించినారు.

## 296. బేగడ - ఆది

**భక్తుని చారిత్రము వినవే మనసా సీతారామ ||భ||**

**(అ)సక్తిలేక తాఁగోరుచు జీవన్ముక్తుడై ఆనందమునొందు ||భ||**

**జపతపములు తాఁజేసితి ననరాదు అదిగాక మరి**
**కపటాత్ముఁడు మనమై బల్కరాదు**
**ఉపమ తనకు లేక యుండవలెనని**
**ఊర యూర తిరుగగరాదు**
**చపలచిత్తుడై ఆలు సుతులపై**
**సారెకు భ్రమ కారాదనే హరి ||భ||**

**భవవిభవము నిజమని యెంచగరాదు అదిగాక మరి**
**శివ మాధవ భేదముఁజేయగరాదు**

**భువనమందు తానే యోగ్యుడనని**
**బొంకి పొట్టసాకఁగరాదు**
**పవనాత్మజ ధృతమౌ సీతాపతి**
**పాదములను యేమర రాదను హరి ॥భ॥**

**రాజస తామస గుణములు గారాదు అదిగాకను అ**
**వ్యాజమునను రాలేదనగా రాదు**
**రాజయోగమార్గము నీ చిత్తము**
**రాఁజూచుట విడువఁగరాదు–రాజశిఖామణియైన**
**త్యాగరాజ సఖుని మరువరాదనేహరి ॥భ॥**

ప్రాపంచికములైన విషయ భోగములందు హృదయపూర్వకమైన ఆసక్తిలేక సక్తతకలవానివలె నటించుచూ, భగవంతు డొక్కడే సత్యమని, కడమ ప్రపంచమంతయు వ్యవహార కాలమందు మాత్రమే సత్యముగా తోచునుగాని, పరమార్థమందు ఆనందమివ్వఁజాలదను జ్ఞానముతో జీవన్ముక్తుడైన పరమ భాగవత భక్తుని చరిత్రమును శీలమును ఇందు మనస్సంబోధనతో వివరించినారు.

భక్తుడగువాడు. తాను జపతపాదులొనర్చు శిష్టుడనని తన గొప్ప చెప్పరాదు. కాపట్యముకలిగి, తనంతటి భక్తుడుగాని, వివేకిగాని, మరెవ్వడులేడని ఊరూర చాటుకొనరాదు. చిత్త చాపల్యముతో తన భార్యా పుత్రాదులందు, వారి యనుభవమందు భ్రమకలవాడై యుండరాదు. అనగా వారిని విడువవలెనని కాక, వారి అవసరములనే తాను తీర్చవలెనని, వారానందించిన తనకు చాలునని భ్రాంతుడుగాక దారాపుత్రులను కూడ, తన ఏకైక లక్ష్యమైన భగవంతుని సేవానందమందే సహకారులుగా నడిపించవలెను అని భావము. కావుననే జన్మ, సంసార విభవము శాశ్వతము కాదనుటయు, మతిభేదముతో మతభేదమొంది శివ–విష్ణు భేదమును పాటించరాదు. లోకములో తానే అందరికన్న గొప్పవాడనని సమ్మాన



గౌరవములతో ఉదరంభరుడు కారాదు. తనకు అప్రయత్నముగా లోకమందలి వస్తు ధనసంపదలు రాలేదని ఆక్రోశించరాదు. తన కృతార్థతకు మూలమైన సీతాపతి పాదములను, ఆంజనేయుని ఆదర్శముతో విడువక, రాజస, తామసాదిగుణములను దరిఁజేరనీయక, జ్ఞానమునకు ఎంతో బలమిచ్చునట్టి రాజయోగ మార్గమున తన చిత్తమును సదా శ్రీ త్యాగరాజేశ్వరుని నెచ్చెలియగు శ్రీరామునియందు లగ్నమొనర్చుట భక్తుని చరిత్ర–భక్తుని సద్గుణములనెల్లను ఇందు మాలికగా అభివర్ణించుటలో అయ్యగారి స్వానుభవ పరిపాకము సహజమైనదిగా గోచరించుచున్నది. భగవద్గీత ద్వాదశాధ్యాయము భక్తియోగమందు "అమానిత్వమదం భిత్వ మహింసా క్షాంతిరార్జవం" ఇత్యాది సూక్తులు ఇందుకు ప్రమాణములై యున్నవి.

## 297. నారాయణి – దేశాది

**భజనసేయు మార్గమును జూపవే**
**పరమ భాగవత భాగధేయ స ॥ద్భ॥**

**అజుఁడు రుద్రుఁడాఖండల పవనజ**
**విజయాదులు గుమిగూడి నీదు చరణ ॥భ॥**

**సకల వేదశాస్త్ర పురాణాది దీప**
**సకల మంత్రతంత్రరూప సీతాప**
**సకల దేవ రిపు సమర ప్రతాప**
**సాధు త్యాగరాజనుత శ్రీరామ నిజ ॥భ॥**

భగవంతుని భజనము అనునది దైవ దర్శనమునకు సాక్షాత్సాధనము. భజించువాని అధికారార్హతల ననుసరించి, భగవంతునితో అనేకవిధములుగా దగ్గర సంబంధమును కలిగించుకొనవచ్చును. ఇట్టి భజనమునకు బ్రహ్మరుద్రులు ఇంద్రుడు హనుమంతుడు అర్జునుఁడు అనువారు

ఆదర్శప్రాయులు: వీరు అనుసరించిన మార్గములు వేర్వేరు. బ్రహ్మ, రుద్రుల భజనము. రామునితో అభేదమును భావించినది. ఇంద్రునిది ఆధికారిక భజనము. ఆంజనేయునిది సర్వతోముఖమైన దాస్యభక్తి. అర్జునునిది నిరుపమానమగు సఖ్య భజనము. ఇందరు గుమిగూడి నిన్ను భజించిన మార్గములను నాకు చూపమని ఇందు రాముని వేడుకొన్నారు.

పై భజనము సకల వేదశాస్త్ర పురాణాగమ మంత్ర తంత్ర సారము. కావున ఓ! సీతాప= సీతాపతీ! సర్వవిధములుగా పూర్ణముగా నిన్ను భజించు మార్గమును నా కనుగ్రహింపుమని వేడుకొన్నారు.

పరమ భాగవతులకు నిధివంటి భాగ్యదేవత భగవంతుడేయని తాత్పర్యము.

## 298. వరాళి - ఆది

**భవసన్నుత నాదఘమెంత ఘనీభవమో ॥భ॥**

**భవనీరధి తారక సుగుణ నా క**
**భయమియ్యను తోచనందు కబ్జ ॥భ॥**

**పాపహరణ శ్రీ రఘువర మధురా**
**లాప దీన జన ధన పావన నీ**
**దాపు గలుగగోరి దొరకని పరి**
**తాపము గని మనసు కరఁగనందుకు ॥భ॥**

**కరుణాకర నీ చరణము శిలను**
**వర నారిగఁజేసినది గాకను**
**శర మసురుని గాచెనే నీకు నా**
**దురితములను పోగొట్టి బ్రోచుటకు ॥భ॥**

**ఇవ్విధమున నుండు ననుఁజూచి**
**యౌవన గర్వము మించిన నరులు**



**నవ్వగాను రోసమేల రాదో**
**యెవ్వరితోడను విన్నవింతును కాదని ॥భ॥**

**ఈ జన్మమునను మోసబోకను**
**నీ జపములకు విఘాతమైన భవ**
**వ్యాజము లెల్లను రోసిన త్యాగ**
**రాజునిపైని దయ రానందుకు ॥భ॥**

సంసార సముద్రమును సైతము తరింపఁజేయు దివ్యగుణ సంపన్నుఁడవైనను, నా కభయ మివ్వకుండుటలో కారణము నా జన్మార్జిత పాపమెంతగా ఘనీభవించియున్నదో! నేనెంత పాపాత్ముడనైననూ. నీవు పాపహరుడవు, దీనబాంధవుడవు. మధురాలాపములు పల్కువాడవు, ఇన్నింట నేను దీనుడనై, ఏ గతియులేక సర్వశరణ్యుడవైన నీ దాపు కోరుకొన్నాను. నీ మనసు కరగుటలేదు. అఖండ కరుణామూర్తీ! నీ దివ్యపాదము రాతినే స్త్రీగా మార్చినది. నా పాప మంతకన్న కఠినమేమో! ఇది నీ దయకు నిదర్శనము. పోనీ లోకమందు నీకన్న శరణ్యులెవ్వరైన కలరేమో వారి దరిచేరుదమన్నచో, కాకాసురునిపై నీవు ప్రయోగించిన శరమునకు త్రిలోకములందును తిరుగులేక ఆ యసురుడు నిన్నే శరణందగా అపరాధియని విడువక వానిని కాపాడితివి. కాని నాపట్ల దయరాకున్నది. లోకమందు వేర్వేరు మార్గములలో వయోదర్పములు కల మనుజులు నన్నుఁజూచి నవ్వుచున్నారు. నీకేల రోషములేదో! లోకమందు ఆయా దేవతలను సేవించి అనేక భోగభాగ్యములను తాత్కాలికముగా పొందుటయందు కోరికలేక, మోసపోక, నిరంతరము నిన్నే జపించుచు, ఇందుకు విఘాతములైన సర్వవిషయములను రోసి, నీయందే తదేక చిత్తుడనైన నన్ను కాపాడకున్నావు. కావున, జన్మాంతర సంస్కారమే కారణమేమో! అని భావించినారు.

## 299. శ్రీరంజని – దేశాది

**భువిని దాసుడనే పేరాసచే**
**బొంకులాడితినా బుధమనోహర ॥భు॥**

**అవివేక మానవుల కోరి కోరి**
**అడ్డత్రోవఁద్రొక్కితినా బ్రోవవే ॥భు॥**

**చాలసౌఖ్యమో కష్టమో నేనుజాలి చెందితినా సరివారిలో**
**పాలముంచిన నీటముంచిన పదములేగతి త్యాగరాజనుత ॥భు॥**

శ్రీరామా! నేను నీకు దాసుడనని, బొంకులాడి పేరాసతో లోకులను, అవివేకులను ఆశ్రయించి వక్రమార్గమున సంచరించలేదు. నా కష్టసుఖములఁగూర్చి నేనే పరిష్కార మొనర్చుకొంటినేగాని, సరివారితో నే నేమియు జాలిపడి వారిదృష్టిలో తేలికఁగాలేదు. **"భగ్నా కృషేః భాగవతా భవంతి"** అనగా (బ్రతుకుతెరువు లేక భాగవతులైరి) అను లోక హాస్యోక్తికి గురికాక, నా ఏకాంతచిత్తమున నిన్నే స్మరించి కీర్తించుచున్నాను. కావున నన్ను పాలముంచినా, నీటముంచినా నీ దివ్య పాదములే గతియని నమ్మికొనియున్నాను. అని వ్యంగ్య మర్యాదలో తన ఏకైక నిష్ఠను ఇందు వ్యక్తపరచినారు.

## 300. కోలాహలం – దేశాది

**మదిలోన యోచన పుట్టలేదా**
**మహరాజ రాజేశ్వరా ॥మ॥**

**పదివేసములలో రామవేసమే**
**బహు బాగనుచుఁగోరు నన్నుఁబ్రోవ ॥మ॥**

**ఇట్టివేళ నీకెట్లు తోచునని ఇల్లాలితో ముచ్చటాడెదు**
**రట్టునీమనసు కెట్టు తోచెనోరక్షించుటకు త్యాగరాజనుత ॥మ॥**



మహరాజులకు రాజేశ్వరుడవైన రామా! మమ్ము రక్షించుటకు నీ కాలోచనయే కలుగలేదా? యని సోపాలంభముగా తన ఆర్తిని ఇందు కీర్తించిరి. ఏమి! నిన్ను రక్షించవలసిన అగత్యమందువా? పది వేషములు మత్స్య కూర్మాది అవతారములు ధరించి ధర్మరక్షణము చేయు సాక్షాద్భగవంతుడవు నీవని గుర్తించితిని. అదిగాక, ఇన్ని అవతారములు ఆయా అవతార విశేషములు మాకంత సహజములు కావు. వారి ఉపాసనా పద్ధతులు సంప్రదాయములు మేమెరుగము. మా అదృష్టవశమున **"రామో విగ్రహవాన్ ధర్మః"** అని ధర్మదేవతామూర్తిగా నిన్ను భావించుటయేగాక, మానవులమగు మాకు మధురానుభవమునిచ్చు నీ రామ వేషము మా కెంతో సన్నిహితమైనది. నిన్ను దీనులమై ఆర్తితో మొరపెట్టుకొన్న చాలును. రక్షింతువని మా నమ్మిక; ఇంత అవసరమైన సమయమందు, నీవు ఇల్లాలితో ముచ్చటలాడుకొనుచున్నావేమో! (ఇట్లనుట మానవసాధారణమైన జాతీయ చమత్కారము) అదిగాక మారట్టు= అలజడి మా గందరగోళము నీ చిత్తమునకెట్లు తోచెనో! ఇదియు మానవ సహజమైన రీతియే; అట్లు సర్వరక్షకుడవుగాన, పరాకులేక మమ్ము కాపాడుము అని ప్రార్థన.

## 301. వర్ధని – రూపకం

**మనసా మన సామర్థ్యమేమి ఓ! ॥మ॥**

**విను సాకేతరాజు విశ్వమనే రథమునెక్కి**
**తన సారథ్యముచే తానే నడిపించెనే ॥మ॥**

**అలనాడు వసిష్ఠాదులు పట్టముఁగట్టే పలు**
**కులవిని వేగమె భూషణముల నొసఁగిన కైకను**
**పలుమారు జగములు కల్లలనిన రవిజుని మాయ**
**వలవేసి త్యాగరాజవరదుఁడు తాఁజనగలేదా ॥మ॥**

లోకమందు తమ పురుషకారముచే పనులు చేయుచున్నను, దైవానుకూల్యమున్నూ ఉండవలెనని ప్రసిద్ధి కలదు. కాని, దైవ, పురుషకారములకు పరస్పరము పోటీ ఏర్పడినపుడు, దైవమే బలీయమని శాస్త్రకర్తల నిర్ణయము.

ఈయభిప్రాయము ననుసరించియే ఇందు "మన సామర్థ్యమేమి?" యని కీర్తన మారంభించి, రాముఁడు విశ్వరూపుడు, విశ్వనియామకు డైనందున విశ్వమునే తన శరీరముగా భావించి, "శరీరం రథమేవచ" అను రీతి, యాన సాధనమైన తన శరీరమనెడి రథమునెక్కి తన సామర్థ్యములేక సారథ్యముచే విశ్వమును నడిపించుచున్నాడు. గాన మన సామర్థ్యము వ్యర్థము. ఇందుకు నిదర్శనముగా ఉదాత్తమైన రామచరిత్రనుండియే రెండు ఉదాహరణలను చూపించినారు.

వసిష్ఠాదులందరు ఏకగ్రీవముగా సంకల్పించిన రామపట్టాభిషేక వార్త కైక విని అమితానందముతో తన మెడలోని ఆభరణములను దాసి కిచ్చెను. అప్పటి కామె చిత్తమందు ఏ వికారము లేకుండెను. అందుకు వ్యతిరేకముగా, రావణాది దుష్టసంహారము శిష్టులైన ఋషుల రక్షణము ప్రధాన కృత్యములుగా రాముడై యవతరించిన భగవంతుడు ఎవ్వరూ సంకల్పించని ఊహించని సంఘటనముతో అరణ్యవాసమున కేగి తన అవతార ప్రయోజనమును సాధించెను. మంథర కృత్రిమ బుద్ధి రాముని అరణ్యవాసమునకు నిమిత్తమైనట్లు కథారీతి యున్నను, ఇంతటి యుద్యమమునకు కేవల దాసి మాత్రురాలు కారణమగుట సరిగాదు.

అందు దైవమే బలీయము.

ఇట్లే రవిజుని= సుగ్రీవుని ముందుగా వాలితో యుద్ధమునకు వెడలుమనియు, నేను సహాయము వత్తువని చెప్పి, తొల్త తాను మరలి వచ్చెను. రెండవమారు చాటునుండి వాలిని సంహరించెను. ఇందునూ



దేవ రహస్యము కలదు. వాలి సుగ్రీవుల మొదటి యుద్ధమందే తాను వాలిని వధించలేకనా తిరిగివచ్చినది? తాను భగవంతుడయ్యును వాలిపట్ల తానే ముందుగా విరోధ భావమును చూపరాదని తోచెడిని. ఇట్లు, ముందు తలచిన దొకటి, జరిగినది మరొకటి అయినందున దైవ విధి ఇందు అంతర్లీనమై యుండును.

కావున, కేవలము మన సంకల్పమే బలీయమనుట న్యాయముగాదు. దైవానుగ్రహమును భావించుటయే వివేక లక్షణము.

## 302. మలయమారుతం - రూపకం

**మనసా ఎటు లోర్తునే నా-మనవి చేకొనవే ఓ! ॥మ॥**

**దినకరకుల భూషణుని దీనుడవై భజనచేసి**
**దినము గడుపుమనిన నీవు-విన వదేల గుణవిహీన ॥మ॥**

**కలిలో రాజస తామసగుణములు-కలవారి చెలిమి**
**కలసి మెలసి తిరుగుచు మరి-కాలము గడపకనే**
**సులభముగా కడతేరను, సూచనలను తెలియఁజేయు**
**ఇలను త్యాగరాజుమాట-విన వదేల గుణవిహీన ॥మ॥**

మనసు కల్పించు సాంసారిక విషయభ్రమకు తాను వేరై ఎంతో అలసటనొంది, తానెన్ని చెప్పినా వినని పిల్లవానినో! భార్యనో! ఓదార్చి బ్రతిమాలుకొన్నట్లు ఓ! మనసా! నేనెట్లు ఓర్తునే నా మనవి వినవే! యను జాలిమాటలతో తాను విసువుతో సోలినట్లు లలిత పదవిన్యాసముతో పల్కుట ఎంతో సహజ ధోరణిలోనున్నది. ఈ తీరు పల్కులు చిత్తమునకు సూటిగా నాటుకొనును. నేనేమియు భారమును నీపై మోపలేదు. దినకరుకుల భూషణుడు= సూర్యవంశమునకు అలంకారమైన శ్రీరాముని దీనుడై భజన చేయుచు రోజు గడుపమన్న నీవు వినవేమి? సూర్యునికి మన ఆత్మ

సజాతీయమైనది. సూర్యుడే సర్వ దేవతామయుఁడు. ఆ వంశమందే అవతరించిన తారక రాముని భజనమే మానవసహజమైన సంపద.

ఈ మహాకలిలో రాజస తామస గుణములతో అసుర ప్రకృతి విహరించును. కావుననే, సత్త్వగుణ సంపన్నులైన సజ్జనుల సాంగత్యము చేయుచూ, సుమధుర తారకమగు రామ నామమును కీర్తించుట, స్మరించుటలు, తదితర యుగములలోని ఫలములకన్న విశేష ఫలమిచ్చును. కావున, పరమ సులభమైన మార్గము అని చెప్పి, తాను మనసుకన్న వేరై, నా మాట వినవేమి? యని తన మనసును నిందించుట అనుభవ రహస్యము.

## 303. మారరంజని – ఆది

**మనసా శ్రీరాముని దయలేక, మాయమైన విత మేమే ॥మ॥**

**ఘనదురితముల కొడిగట్టినా–కార్యములను చెరచితివో ॥మ॥**

**పరదారల పరధనములకాసపడి చెడి తిరిగితివో లేక**
**పరజీవాత్ముల హింసించితివో,**
**వర త్యాగరాజనుతుని మరచితివో ॥మ॥**

ఇందు మనస్సంబోధనముతో శ్రీరాముని దయలేమిని, అందుకు వలయు కారణములను వివరించినారు.

మాయమైన వితమేమే! యనుటలో తన కిష్టమైన పని చేయనివారిని ఏమి ఇట్లు మాయమైనారని అనుట లోక సహజము. ఇంత లలితముగా తన మనసు మాయమైనది. అనగా చాటైనది అని విచారించినారు. అందుకు కారణములలో

మహాపాపముల కొడిగట్టుట, పరదార ధనముల కోరి చెడి తిరుగుట, ఇతరుల–మనో, వాక్ కాయములకు హింస కలిగించుట మొదలగు పాపకృత్యములలో పడి భగవంతుని మరచితివి. నా మాట విని మనసా!



పొరబాటుబడక శ్రీరాముని దయ సంపాదింపుము. వాని దయలేక నీవు చేసిన పనులు సాఫల్య మొందవు.

భగవంతుని తప్పించుకొని చేయు పనులన్నియు పాపకార్యములే యని హెచ్చరించినారు.

## 304. ఈశ మనోహరి – ఆది

**మనసా శ్రీరామచంద్రుని మరవకే–ఏమరకే ఓ ॥మ॥**

**మును పుట్టను పుట్టిన మునికృతమున**
**మూడున్నారధ్యాయములఁజూచుకో ॥మ॥**

**సృష్టి పుష్టి నష్టిచేయు పనులు ని–**
**కృష్టమనుచును త్రిమూర్తుల కొసఁగి**
**తుష్టుఁడై బరగె సద్భక్తమనో**
**భీష్టములిచ్చే త్యాగరాజనుతుని ॥మ॥**

మనసా శ్రీరాముని మరువకుము. మరియు, జ్ఞాపకమున్నను, ఏమరవలదు. అనగా శ్రీరాముని దివ్యమంగళస్మరణము సేయుచూ, వాని కార్యములపట్ల అశ్రద్ధ కలిగియుండకుము. మరచుట యనగా విమర్శాత్మకమైన జ్ఞానము లేకుండుట యని భావము.

సత్సంగమువల్లనో, జన్మాంతర పుణ్యముననో, వాతావరణము ననుసరించియో స్మృతి కలిగినపుడు మామూలు రివాజుగా గాక, మిక్కిలి శ్రద్ధతో, శ్రవణ, స్మరణ కీర్తనార్చనాదులను కావింపుమని విశేషము. మనము నిత్యము చేయు పనులతో బాటే, దైవారాధనము కూడా కార్యనియతిగా భావింతుము. అట్లుగాక, శ్రీరాముని దివ్యస్మృతి కలిగినపుడు, ఏమరక శ్రద్ధగా ననుష్ఠింపు మనుట ఇందలి భావము.

అందుకు అలంబముగా, పుట్టను పుట్టిన ముని= వాల్మీకి, (లేక పుట్టిని= నావలో పుట్టిన ముని= వ్యాసులు) అనియు అర్థాంతరము.

వాల్మీకి కృతమైనది శ్రీమద్రామాయణము, వ్యాస కృతము భగవద్గీత.

అందు రామాయణమందు మూడవ అధ్యాయములో నారద గురూపదేశమున దివ్యదృష్టి కలిఁగి, శ్రీరాముని దివ్యచరిత్రను సమగ్రముగా భావనము చేసిన కథ కలదు. అట్లే ఆరవ అధ్యాయమున (అనగా సర్గలో) అయోధ్యానగరవైభవము ప్రజల ధర్మనిరతి, భగవంతుడు అవతరించుటకు అనువైన వర్ణనము కలదు.

కావున, పుట్టను బుట్టిన ముని కృతమైన రామాయణమందీ భాగమును విమర్శించుకొనుమని చెప్పిరి. అట్లుగాక, పుట్టిని= నావలో పుట్టిన వ్యాసకృతమై మూడున్నారధ్యాయములు= మూడు ఆర్లు పదునెన్మిది గాన భగవద్గీత యనియు, అధ్యాయమనుటయు సరిపడును.

ఈ రెండు గ్రంథములును భగవంతుని స్వరూప వైభవమును చక్కగా బోధించునవే అయినను, రామాయణమనుట ప్రసక్తము.

శ్రీరాముని తత్త్వస్వరూపమును చరణమందు వివరించినారు.

సృష్టిస్థితి-నష్టి= సంహారములు సత్త్వ రజ స్తమోగుణ కార్యములు కావున ఆయా గుణోపాధులచే త్రిమూర్తులు బ్రహ్మవిష్ణు శివులు వ్యవహరించఁ బడుచున్నారు. ఈ మూర్తిత్రయమునకు అధిష్ఠానమైన సచ్చిదానంద బ్రహ్మవస్తువు సర్వాధారము. అట్టి సచ్చిదానంద బ్రహ్మతత్త్వమే తారకరామ రూపమున సమన్వయమగుచున్నది. అనగా రామతత్త్వము ఏవిధమైన పరిహారములు లేక సచ్చిదానంద రూపముగానే యోగులు భావింతురు.

కాని, ఇక్ష్వాకు వంశమున ఆవిర్భవించుట దుష్టశిక్షణము-శిష్టరక్షణము కొరకే. శ్రవణ, స్మరణ కీర్తనాదులు చేయు భక్తులను అవ్యాజ కరుణతో



రక్షించుట. **"అభయం సర్వభూతేభ్యోదదామ్యేత ద్ర్వతం మమ"** యని పతితపావనుడనియు రాముని ప్రతిజ్ఞా వాక్యములు. కావున, అట్టి రాముని మరువక, అశ్రద్ధచేయక స్మరించి, కీర్తించుమని మనస్సంబోధనముతో మన కాదేశమిచ్చినారు.

## 305. ఆభోగి - ఆది

**మనసు నిల్ప శక్తిలేకపోతే**
**మధురఘంట విరుల [1]పూజలేటికి ॥మ॥**

**ఘన దర్మదుడై తామునిఁగితే**
**కావేరి మందాకిని ఎటు బ్రోచును ॥మ॥**

**సోమిదమ్మ సొగసుగాంద్ర కోరితే**
**సోమయాజి స్వర్గార్హుడౌనో**
**కామక్రోధుడు తపం బొనర్చితే**
**కాచి రక్షించునే త్యాగరాజనుత ॥మ॥**

సర్వధర్మములు సత్కర్మలు మనసుయొక్క ఏకాగ్రత యం దాధారపడియున్నవి.

భగవద్గీతలో-

**"వ్యవసాయాత్మికా బుద్ధిః ఏకేహ కురునందన!**
**బహుశాఖా హ్యనంతాశ్చ బుద్ధయోఽవ్యవసాయినాం."**

ఏకాగ్రమైన బుద్ధి కలిగియుండుము. బహుశాఖలుగా, అనంతములైన బుద్ధులు ఏకైక నిశ్చయమునకు ఎప్పటికిని రానేరవు.

మరియు శ్రీమద్భాగవతమందు తొల్తనే సూతులవారు, సకల విద్యావిశారదులు తాపసులైన శౌనకాదులకు ప్రథమోపదేశమందు ఈ విషయమునే హెచ్చరించుట ఆశ్చర్యము.

1. పూజేమి చేయును

**"తస్మాదేకేన మనసా హరిస్సర్వత్ర సర్వదా**
**శ్రోతవ్యః కీర్తి తవ్యశ్చ ధ్యేయః పూజ్యశ్చ నిత్యధా."**

ఏకాగ్రమైన మనసుతో శ్రీహరినిగూర్చి శ్రవణకీర్తనాదులు చేయవలయునని తాత్పర్యము. సర్వకర్మములు మనోనిగ్రహ లక్షణాంతములని సిద్ధాంతము.

నిరంతరం అల్లలనాడి కదలుచున్న ఆసనముపై మనమెట్లు స్తిమితముగా కూర్చొనజాలమో చంచలమైన చిత్తమందును శ్రీహరి నిలకడనందలేదు.

ప్రకృతం పై భావమును, సహజము జాతీయమునైన ఉపమానముతో ఇందు వివరించినారు.

మనసు నిలకడలేక, మధుర ఘంటానాదములతో పుష్పములతో పూజించిన ఏమి ప్రయోజనమనుట లేదా మధురములైన ఘంట విరులు= ఘంటాకారము గల పుష్పజాతి యనియు చెప్పవచ్చును.

పూజోపచారములకు ముందు తీర్థస్నానము ముఖ్యము గదా! మానసికముగ, గర్వాహంకారములతో దుర్మదము కలవాడు, కేవల శారీరకముగా, వ్యయప్రయాసలంది కావేరి, గంగా నదులలో మునిగినంత మాత్రమున అంతశ్శుద్ధి ఏర్పడదు.

ఇందుకొక చిత్రమైన జాతీయముగా, శాస్త్రీయమునైన ఉపమాన మిచ్చినారు.

వేదోక్తములైన, యజ్ఞయాగాదులు-ధర్మపత్నీ మూలకములు. యజ్ఞము చేసిన యజమానికి సోమయాజి యనియు, ఆతని పత్నికి సోమిదేవమ్మ యని సార్థకములైన పేర్లు శాస్త్రసిద్ధములు.



ఈ యజ్ఞములు రెండు విధములు. కేవల కర్మపరము, ఆధ్యాత్మికము అని. ఆధ్యాత్మికమైన సమన్వయమందు **"ఆత్మాయజమానః శ్రద్ధాపత్నీ"** యని నారాయణోపనిషత్తు పేర్కొన్నది. మన అంతర్యామి ఆత్మయే యజమాని (సోమయాజి) ఆతని శ్రద్ధయే పత్ని (సోమిదేవమ్మ) యని సమన్వయము కావున, శ్రద్ధాస్థానీయురాలైన సోమిదేవమ్మ సొగసుగాండ్ర కోరితే అనగా ఇంద్రియ విషయములందు చంచలమైయుంటే, సోమయాజి యజ్ఞముచేసి, స్వర్గార్హుడెట్లగును? అని అయ్యగారు తమ సమకాలీనమైన భావము నిందు చమత్కరించినారు. ఇట్లే, కామక్రోధాది దోషములు కలవాడు తపస్సు చేసిననూ, అది అసురముగాన, రావణాదులకువలె వానికి దైవ రక్షణము కలుగదు.

ఇంతకూ, మనసును ఏకాగ్రమొనర్చి సత్కర్మములను, శ్రవణకీర్తనములను చేయుట ఉభయత్ర సార్థకము సఫలమునని తాత్పర్యము.

**"శ్రద్ధామయోఽయం పురుషః"** అనియు గీతావచనము.

## 306. హిందోళం - ఆది

**మనసులోని మర్మమును తెలుసుకో**
**మానరక్షక మరకతాంగ నా ॥మ॥**

**ఇనకులాప్త నీవేగాని [1]వేరెవరులేరు ఆనందహృదయ ॥మ॥**

**మునుపు ప్రేమగల దొరవై సదా**
**చనువు నేలినది గొప్పగాదయా**
**కనికరమ్ముతో నీవేళ నా**
**కరముఁబట్టు త్యాగరాజవినుత ॥మ॥**

1. వేరెవరయా.

శ్రీ త్యాగరాజస్వామికి తన దైనందిన జీవితమందు ఏదోయొక ఇరుకు కలిగి యుండవచ్చును. దానిని స్పష్టముగా చెప్పుకొనుట మానవంతులకు నైజముకాదు. కావుననే ఇందు "మానరక్షక!" ఎదుటివారి మర్యాదను రక్షించువాడా! యని పిలిచి, రామా! నా మనసులో నొక మర్మము రహస్యమున్నది. దానిని నీవే గుర్తించుమనీ, నీ వెల్లప్పుడు ఆనంద హృదయము కలవాడవే కావుననూ, ఇనకులాప్త= సూర్యవంశమునకు బంధువగుట సదాస్వయం ప్రకాశము కలిగి చీకటిలేని వాడవగుట వలన, నీవే నా చిత్త దోషమును గమనించవలెనేగాని, మరెవ్వరూలేరు అని విశేషము. నీ రక్షకత్వము ఈనాడే క్రొత్తగాదు. నిరంతరం నన్నేగాక, మరెందరినో, కనికరముతో కాపాడితివి. కాదనలేదుగాని, ఈనాడు కరముఁ బట్టి, చేతి ఆలంబనమిచ్చి కాపాడుటలో ఎంతో విశేషమున్నది అనుటలో మహాభక్తుల చిత్తములు దైవానుగ్రహముచే ఏదోయొక క్షణమందు విలక్షణమైన పరిపాకము కలిగి ఆర్తములగును. ఆ యవసరము ముందుగా తెలియదు. అది పైకి చెప్పుకొనుట కలవియుఁగాదు. ఆ పొంగు భగవంతునికే తెలియును. అట్టి ఆత్మానుభవ మిందు గోచరమగుచున్నది.

## 307. నాట కురంజి - ఆది

**మనసు విషయ నట విటుల కొసఁగితే**
**మా రాముని కృప కల్గునో! మనసా ॥మ॥**

**తన తలుపు తీసిపెట్టి ఒకరింటికి**
**తాఁగుక్కల తోలు రీతిగాదో ॥మ॥**

**తవిటికి రంకాడబోతె కూటి-**
**తపిల కోతి కొంపోయినటుగాదో**
**చెవిటికి ఉపదేశించినటుగాదో**
**శ్రీత్యాగరాజనుతునిఁదలంచక ॥మ॥**



అంతరంగ సాధనమైన మనసు బాహ్యములైన విషయేంద్రియముల కంటె' భగవంతునికి సన్నిహితమైనది. అట్టి మనసును శబ్దాది విషయములనెడి నటులకు, విటులకు వశముచేసినచో మా రాముని కృప కలుగనేరదని లోక సహజములైన ఉదాహరణలతో ఇందు నిరూపించినారు.

లోకమందు శబ్దము, స్పర్శ మొదలగువిషయముల ననుభవించుట శరీరధారులకు సహజము, ధర్మమునకు, దైవమునకు నీతికి సరిపడని విషయానుభవము వ్యర్థమేకాక, మహాపాపకారణమగును. కావున వివేకవంతులు, న్యాయమైన తీరులో విషయసంగము కలిగియుందురు. **"ధర్మా విరుద్ధో భూతేషు కామోఽస్మి భరతర్షభ"** 'ధర్మవిరుద్ధముగాని కామము నా విభూతియే' అని భగవద్గీత ప్రమాణము: ఇందు విషయములను, నట విటులతో పోల్చి చెప్పినారు. అనగా మనసునకు భర్త జీవము, అధిష్ఠాతయైనవాడు భగవంతుఁడు. అట్టి భగవంతుని యందే మనసు ఆంతర్యముగా అనుబంధమై యుండవలెను. లేదా తాననుభవించు విషయములందు భగవంతుని యాజమాన్యమును భావించవలెను. ఇది ధర్మపథము. అట్లుగాక, కేవల భోగలాలసుడై తన సర్వస్వమునకు యజమాని యగు దైవమును ఉపేక్షించి, ఆతడిచ్చిన భోగభాగ్యముల ననుభవించుట న్యాయము కాదు గదా! కావున, ఇట్టి అవివేకులను నటులతో, విటులతో పోలిక చెప్పినారు.

తన స్వత్వమును కాపాడుకొనుటయే గదా, వివేకలక్షణము! ఇందు కుపమానముగా.

ఒక ఇల్లాలు తన యింటి తలుపు తీసి ఎదురింటి వారికిచ్చి, తన ఇంటికి తలుపు లేకపోవడంచే కుక్కలు లోనికి రాకుండా రాత్రంతా కాపలా కాస్తున్నరట!

ఇట్లే ఒక పడుచు, తన పశువుల కాపూట తవుడు లేదని చింతించి, తన పొరుగింటికి వెళ్ళి అడుగఁబోయినదట, ఆ ఇంటి వాడామెతో సమయము చిక్కినదని సరసములాడుట కారంభించినాడట. ఈమెయు వెంటనే కాదనలేక, తనకు తవుడిచ్చునను ఆశతో వాని వాకిట రంకాడబోయినది. అనగా సరసప్రసంగముతో ఆలసించినదట. ఇంతలో తనకై తాను వండుకొన్న కూటి తపిలె–అన్నంగిన్నెను కోతి వచ్చి ఎత్తుకపోయినదట. పై యుపమానము నటునకు, రెండవ యుపమానము విటునకు సరిపడినవి. ఆపై చెవిటికి ఎంత ఉపదేశించినను వినపడనట్లు నీ మనసు అన్యాయత్తమైయున్నపుడు, అనగా అంతరంగసాధనము సక్రమముగా లేనపుడు కేవల బాహ్యాడంబరములు ఏ విధముగానూ ప్రయోజన మివ్వవని, లోకసహజములైన సామెతలతో వివరించినారు. కావున, మానసిక శుద్ధి అన్ని కార్యములందును, ధర్మమును, ఉత్తమ ఫలితమును యిచ్చునని ఇందలి తాత్పర్యము.

## 308. జయనారాయణి – దేశాది

**మనవిని వినుమా మఱవ సమయమా ॥మ॥**

**కనుఁగొనఁగోరి దుష్కల్పన మానితి**
**కనికరమున నినుఁబాడుచున్న నా ॥మ॥**

**పరులకు హితమగు భావనగాని**
**చెరుచు మార్గములఁ జింతింపలేను**
**పరమదయాకర భక్తమనోహర**
**ధరాధిప కరార్చిత త్యాగరాజుని ॥మ॥**

రామచంద్రా! నీ సాక్షాత్కారమును కోరి, అందుకు ప్రతిబంధములైన దుష్టకల్పనలను కట్టిపెట్టితిని. నా ఆంతరమున దైవదత్తమైన అనాహత



నాదమును నీ దివ్యమంగళ స్వరూపమందే సమర్పించి, సుందరసప్తస్వర మేళనముతో నిన్నే పాడుకొనుచున్నాను. మరియు చిత్తమందు పరహితమునే చింతించుచూ, అవినీతి కరములైన దారులను అనుసరించఁజాలను. నీవు పరమ దయా కరుఁడవు. వినిర్మల చిత్తులైన భక్తుల మనసులను సహజముగానే హరింతువు. భూపతివి, లేక రారాజులకు సైతము పూజనీయుడవు. కావున, నా మనవి చిత్తగించి నన్ను మరువవలదని తన అంతస్సాక్షిగా తన అనుభవమును కీర్తించినారు.

## 309. నళినకాంతి – దేశాది

**మనవాలకించరాదటే**
**మర్మమెల్లఁదెల్పెదనే మనసా ॥మ॥**

**ఘనుఁడైన రామచంద్రుని**
**కరుణాంతరంగము దెలిసి నా ॥మ॥**

**కర్మకాండ మతాకృష్టులై భవ**
**గహనచారులైగాసిఁజెందఁగ**
**కనిమానవావతారుఁడై**
**కనిపించినాడే నడత త్యాగరాజు ॥మ॥**

ఇందు తాను మనస్సాక్షిగా రాముని వాడుగా భావించుకొని తనకు ఆప్తమైన మనసును సంబోధించి, ఓ. మనసా! నీ స్వరూప స్వభావము లందలి మర్మమును రహస్యమును నీకు తెల్పెదను వినుమనియు, నేను నీకన్న అతీతమైన విశుద్ధ బుద్ధి సంస్కారముతో సమాధియందుండి, శ్రీరాముని కరుణాంతరంగము పరామర్శించితిని. అంతర్యామిగా, సర్వ దేహేంద్రియ ప్రపంచముయొక్క మనుగడకు, సచిత్సుఖరూపమైన తన వైభవమునే సర్వమునకు అనుగ్రహించుచున్నాడు. మనబుద్ధి మొదలగు పరికరముల కన్నింటికి ఆతడే జీవము. ఆతడే కర్త. ఆతడే భోక్త. సర్వస్వమూ

ఆతని కళావైభవమే. అట్టి కరుణాంతరంగుడైన భగవంతుడు లోకమందలి జీవులను అనుగ్రహించు కొరకు, మానవావతారము ధరించి, కర చరణాదులతో మనకు గోచరించుచున్నాడు. లోకమందలి మానవులు తమ పరికరములతో ఏవేవో కర్మలనాచరించుచూ కర్మ నిమిత్తమైన జన్మ సంసారారణ్యములో చిక్కుకొని, యాతా యాతములొందుచూ, అదే అలవాటుగా కర్తృత్వ భోక్తృత్వములతో అహంకరించుచూ, తమ చిత్తములకు అధిష్ఠానమైన భగవద్వస్తు తత్త్వమును గుర్తించలేకున్నారు. యీ రహస్యమును, నాదాత్మకోపాసనమున నాకుఁగోచరించినది. అది నీకు తెల్పెదను ఆలకింపుమని తాను వేరై ఆదేశించినారు.

## 310. వరాళి – ఆది

**మరకతమణివర్ణ రామ నన్ను**
**మరవక, నా యన్న ॥మ॥**

**పరమపురుష బిన్న బ్రోవుము దే–**
**వర శరణను కొన్న ॥మ॥**

**వరభక్త సువర్ణ వాహన–కరుణా రసపూర్ణ**
**ధరణి తనయకున్న ప్రేమరసము–**
**త్యాగరాజుకీవన్న ॥మ॥**

మరకత మాణిక్యకాంతి శ్యామలము. అందు సత్వ రజ స్తమో గుణములు (తెలుపు ఎరుపు నీలము) ఏకీభవించినపుడు విలక్షణమైన **"శ్యామల వర్ణ"** మేర్పడును. అదియే ప్రకృతి. **"అజామేకాం లోహిత శుక్ల కృష్ణాం"** అని శృతి. గుణములకు వర్ణములను పేర్కొన్నది. ప్రకృతియే పరమాత్మకు శరీరము వంటిది గాన, రాముఁడు శ్యామలమూర్తి కావున నాయన్న! నా తండ్రీ! నీలో అంతర్భవించిన నన్ను నీవే మరవకు మని



నిన్నే శరణనుటయే నా అర్హతకావున బిన్న= త్వరగా నన్ను కాపాడుమని ప్రార్థన. నీకు పరమ భక్తుడు గాన గరుడుని వాహనముగా స్వీకరించితివి. అట్లే ప్రకృతి స్థానీయు రాలైన భూ పుత్రికను సీతను ప్రేమించితివి. అదే తీరున వాత్సల్యమును ప్రేమను నాపై చూపుటలో శంక ఏమి? అనగా భగవంతుని వివేకముతో గుర్తించి, వాని యధీనుడుగా శరణందుటయే మానవుని ఉత్తమాధికారము.

## 311. కేదారం – ఆది

**మఱచేవాడనా రామ నిన్ను మదనజనక ॥మ॥**

**మరకతాంగ నీయొక్క–మదినెంచవలదు ॥మ॥**

**కాని మానవులు–కరుణ లేక నాపై**
**లేని నేరము–లెంచినఁగాని**
**శ్రీనిజముగ నా–చెంతఁజేరినఁగాని**
**రాని నీ దయ త్యాగరాజనుత ॥మ॥**

ఓ! మరకతాంగ! శ్యామ సుందర రామా! నిన్ను మరువజాలను. నిన్ను మరతునవి నీ వెంతమాత్రము భావించవలదు. నాకీ యనుమానము కలుగుటకు కారణములున్నవి; నా భక్తిఁజూచి అసహనపరులు, నాపైలేని నేరములను ఎంచెదరు. ఏదో విధముగా ధన ద్రవ్యాది సంపద నావద్దకు చేరిన చేరవచ్చు నేమో! ఇవి యున్ననూ నిన్ను మాత్రము మరువలేను. నీదయ రానిమ్ము. అని ప్రార్థించినారు.

ఇందొక అమాయకమైన భావనకలదు. ఇతరులు తనను గూర్చి అసూయచే అనే మాటలు రాముడు వినునేమో! లేక యత్కించిత్ ధన ద్రవ్యాదులు తనకు కలిగినచో, రాముని మరతు నేమో! యనే తహ తహ అమాయకమైన ఊహ అనగా రాముని దయ సంపాదించుటలో భావుకుని భావమింత సహజముగా నుండునని విశేషము.

## 312. కాంభోజి - ఆది

**మరి మరి నిన్నే మొఱలిడ నీ**
**మనసున దయరాదు ॥మ॥**

**కరి మొరవిని సరగున చన నీకు**
**కారణమేమి సర్వాంతర్యామి ॥మ॥**

**కరుణతో ధ్రువుని కెదుట నిల్చిన**
**కథ విన్నానయ్యా!**
**సురరిపు తనయునికై, నరమృగమౌ**
**సూచన లేమయ్యా!!**
**మరచియున్న వనచరుని బ్రోచిన**
**మహిమఁదెలుపవయ్యా!**
**ధరను వెలయు త్యాగరాజసన్నుత**
**తరముఁ గాదిక నే విననయ్యా!! ॥మ॥**

ఆర్తులు-అనగా లోకమందు తమంత తాముగా మన కలిగే ధైర్యము ఏమాత్రము లేక, సర్వరక్షకుడైన శ్రీహరిని శరణు వేడువారు. ఇట్లు సర్వాత్మనా భగవంతుని ఆశ్రయము కోరుటయే వీరికిఁగల అధికారము. అట్టి వారిని ఏ వావి వరుసలు లేకున్నను సంరక్షించుట దైవమునకున్నూ సహజ ధర్మము.

అందుకు మొదటి ఉదాహరణము మదోన్మత్తమైన గజరాజు మానవ సంస్కృతియే లేని కరి, తన ప్రాణములు కడంటినపుడు "లా వొక్కింతయు లేక" రక్షకుడు భగవంతుడనియు తెలియక, తన శరీరేంద్రియ ప్రాణములు తన యధీనములు కావనియు, వీటికి మరెవ్వరో అధికారి కలడని ఊహించి ఎవ్వడు సర్వాధారుడో వాడే రక్షించుగాక! యని ప్రార్థించెను. అధికార స్థానములోనున్న త్రిమూర్తులు తమ పని గాదని తమను రూప నామములతో ఈతఁడు పిలువలేదని రారైరి. భగవంతుడు సర్వాంతర్యామి. అంతటను



నిండియున్న వాడగుటచే గజరాజు ఆర్తిని గుర్తించి, "హరి"యను ప్రత్యేక అవతారముతో కరిని రక్షించెను. త్యాగరాజస్వామి ఈ ఆదర్శమును భావించి, రామా! మరి మరి నిన్నే నేను మొరలిడుచున్నాను. నీకు దయరాని కారణము తెలియుట లేదు. అనుట ఎంతో భావ గౌరవమునకు నిదర్శనము. ఇంతకన్న విశేషము, సవతి తల్లి సూటి మాటలచే శూరత్వము కలిగి ఆట పాటల వయసుగల ధ్రువబాలుని పట్టుదలకు భగవంతుఁడు వాని ఎదుట నిలఁ బడుటయు, ఇట్లే ప్రహ్లాద బాలునికై, విని కవి ఎరుగని నర-సింహ వేషమున ఉక్కుస్తంభము నుండి వెడలి రక్షించుటేమి?

ఇంతకన్న విడ్డూరము. నీవలన వాలి సంహారమంత ఉపకారమును పొంది, నిన్నెరిఁగి కూడా, నాల్గు నెలలు తన ఏకాంతమందు నిన్నే మరచిన వనచరుడు-వానర మాత్రుడైన సుగ్రీవుని నీవే ఆదుకొనుటలో ఏమి ఆంతర్యమున్నదో! ఈ కథలు, నేనెన్నో విన్నానయా! అనుట ఎంతో ప్రయోగ వైచిత్ర్యము. ఈ సూచనలు నాకు తెలియుటలేదు. మరే కారణములు ఎవరు చెప్పిననూ "నేవిన నయ్యా" సర్వవిధములా నన్ను ఆదరించుటయే విధియని పై కథా చిత్రములకొక బిగువైన సంవిధానమును కల్పించి తన మాటలకు చక్కని అత్యవసర పరిస్థితిని కలిగించుటయే ఈ గేయమందలి గాంభీర్యము. తెలిసిన విషయములకే భావగౌరవముతో విలక్షణమైన మలుపునిచ్చుట భావుకుల లక్షణము.

## 313. భైరవి - దేశాది

**మరియాద గాదయా-మనుప వదేమయా ॥మ॥**

**సరివారిలో నన్ను-చౌకచేయుటెల్ల శ్రీ**
**హరిహరి నీవంటి-కరుణానిధికి ॥మ॥**

**తనవారలన్యులనే-తారతమ్యము మును**
**ఘనుఁడైన దాశరథికే-గలదని కీర్తిగాదా**

**నిను బాయనేరని-నను(బ్రోవకుండేది**
**ధనద సఖుఁడగు-త్యాగ రాజపూజిత ॥మ॥**

తనను మనుపకుండుట-రక్షింపఁకుండుట రామునికే చిన్నతన మనియు, పైగా ఇదివరకు రాముని రక్షణ పొందిన వారందరు తనవారనీ, క్రొత్తగా వేడుకొనుచున్న తనబోటి వారందరు అన్యులనియు వర్గీకరించి, ఈ తరతమ భావము దాశరథికే గలదని లోకులు నిన్నాడుకొందురనియు, రాముడు కరుణానిధియను ప్రసిద్ధికి భంగమనియు చెప్పి, తనను రక్షించమని అన్వయముఖమున ప్రార్థించుటగాక, తనను రక్షించనిచో రామునికే ఎంతో మర్యాదకు లోపమనుటలో మాట మాత్రంగాక, తాను రామునికి అంటియున్నట్లు భావసమాధి త్యాగరాజుని అనుభవము. పైగా ధనదుని=కుబేరుని తనకు సన్నిహితమైన సఖుడుగా త్యాగరాజేశ్వరుడు శివుడు భావింపలేదా? కుబేరునివలన శివునికేమి స్వార్థము? ఇట్లే నీవంటి కరుణానిధులు, నిన్నే అనుసరించు మావంటి ఆప్తులను కనిపెట్టియుండుట మర్యాదయని న్యాయమును వివరించిరి.

## 314. శంకరాభరణం - ఆది

**మరియాద గాదురా ॥మ॥**

**కరుణాకర! వారిని వీరిని**
**సరిజేసి చూచుచుండేది ॥మ॥**

**రాగము తాళము రక్తి భక్తి జ్ఞాన**
**యోగము మరి యనురాగములేని**
**భాగవతు లుదరశయనులేగాని,**
**త్యాగరాజార్చిత తారకచరిత ॥మ॥**

వారిని వీరిని సరిచేసి యనుట జాతీయము. అయినవారిని, కానివారిని ఒక వరుసలో చేర్చి చూచుట లోకమందు మర్యాద కాదనుట ప్రసిద్ధము.



కాని, ఇందు యీ రెండు పక్షములను చరణమందు వివరించినారు. రాగ తాళములతో వినువారికి రక్తిగా వారి వారి యభిరుచులకు తగినట్లు రంజింపఁజేయువారు, భాగవతులుగా కేవల సంకేతముతో ఉదర శయనులు= అనగా కుక్షింభరులు. (లేక, ఉదరశబ్దము తిండికి, శయనమను మాట నిద్రకు సంకేతములు) అనగా లోకజీవనులు మాత్రమే; అట్లుగాక, కేవల దైవదత్తమైన రాగ తాళ రక్తితో నాదోపాసన తమ కబ్బినందుకు, భక్తి, జ్ఞానము, యోగము వారికి మనః ప్రసాదముచే సులువుగా సిద్ధికల్గును. అయినను భక్తి జ్ఞానములకు దూరులగువారు నింద్యులు. కావున, వారిని వీరిని సరిచూచుట మరియాదగాదని భావము.

## 315. జయంతశ్రీ - దేశాది

**మరుగేలరా! ఓ! రాఘవా ॥మ॥**

**మరుగేల చరాచరరూప పరా-**
**త్పర సూర్యసుధాకర లోచన ॥మ॥**

**అన్ని నీవనుచు అంతరంగమున**
**తిన్నగా వెదకి తెలిసికొంటినయ్య**
**నిన్నెఁగాని మది నెన్నఁజాల నొరుల**
**నన్నుఁబ్రోవవయ్య త్యాగరాజనుత ॥మ॥**

లోకమందు వెలుపల లోపల నిండియున్నది పరమాత్ముడే; యనునది సకల శ్రుతి స్మృతీహాస ప్రామాణ్యము. బుద్ధిమంతులకు అనుభవము. అయినను అజ్ఞులు ఆతడు మరుగుననున్నట్లు భావింతురు. భగవంతుఁడును వారిపట్ల అట్లేయుండును. ప్రకృత మీ గేయమందు ఉభయత్ర నీకు మరుగు= చాటుతనమేలరా? యని ప్రశ్నించి, అనుపల్లవి చరణములందు ఆ పరమాత్ముని స్వరూప సత్తా వైభవమును వివరించినారు. పరాత్పర! ఎదుటి సర్వ ప్రపంచమును, చూచుటకు వినుటకు సాధనములు

ఇంద్రియములు. కావున, లోకముకన్న పరమైనవి చక్షురాదీంద్రియములు. ఇంద్రియములకన్న పరమైనది మనసు. దానికన్న పరము బుద్ధి. ఆ బుద్ధికి పరమైనవాడు పరమాత్ముడు.

**"ఇంద్రియాణి పరాణ్యాహుః ఇంద్రియేభ్యః పరంమనః**
**మనసస్తు పరాబుద్ధిః యో బుద్ధేః పరతస్తు సః"**

కావున, పరాత్పరుడు భగవంతుడు. అట్టివానిచే భాసించునట్టి చరాచర ప్రపంచము ఆతనికి అధీనము. దైవ సత్తాకము. కాబట్టి, భగవద్రూపము అనుట ఆంతర్యము. సూర్యచంద్రులు భగవంతుని నేత్రములు అనుట అంతర్బాహ్యములందలి వెలుఁగు పరమాత్మయే. ఈ తీరుగా **"అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణ స్థితః"** అని నా అంతరంగమున పరిశోధించి తెలిసికొంటిని. ఓ! రామా! నీ దివ్య సత్తాస్ఫూర్తులే సర్వత్ర స్పష్టముగా వెలుగొందుచున్నపుడు ఉభయత్ర మరుగుండు నవసరములేదు అని భావము. కావున, నీకంటె ఒరులు ఆశ్రయులులేరు. అంతరంగమున తిన్నగా వెదకుటయే వివేకుల కర్తవ్యము; అట్టి నిరంతర నిత్య మంగళ స్ఫురణము అంతటను నా కనుగ్రహించుటయే నా రక్షణము. అని తేలిక మాటలలో ఉపనిషత్సిద్ధాంతమును వివరించినారు.

## 316. ఋషభప్రియ - దేశాది

**మహిమ దక్కించుకోవయ్య**

**మహిని సత్యస్వరూపుడను**
**మహిరాజ రాజేశ్వర నీ ॥మ॥**

**విహితమార్గ భక్తులుగా మహాత్ములు**
**వెలయగ వినలేదా స్వకీయమగు ॥మ॥**

**పనికిరాని పనులుచేసి శరణను**
**వారి వెతలు దీర్చి బ్రోచితివే**



**తనివిఁదీర నమ్మినాడనుచు శ్రీ**
**త్యాగరాజనుత తప్పులాడకు ॥మ॥**

రాముఁడు సత్యస్వరూపుడు. సత్యపరాక్రమము కలవాడు. మహారాజ రాజేశ్వరుడు. కావున, వాని మహిమను సార్థకపరచుకోమనియు, అందుకు నిదర్శనముగ తనివిదీర నమ్మినవాడను గావున నన్ను కాపాడుటయే ముఖ్యమనియు, నాపై తప్పులెంచుట మాత్రము తగదనియు కోరుకొన్నారు. ఇందు శ్రీరాముని సత్యమహిమకు లోపము కలుగునేమో! యని తనకేల విచారమందురేమో! అందుకు జవాబుగా, పనికిమాలిన పనులు చేసినవారైనను శరణనగానే రక్షించితివి. విభీషణాదులు శరణనగా సుగ్రీవాదులు వలదన్ననూ **"సుదుష్టోవా ప్యదుష్టోవా"** యనియు, **"అభయం సర్వభూతేభ్యో దదామ్యేత ద్వ్రతం మమ"** యని ప్రతిజ్ఞలుచేసి కాపాడితివి. అట్లే సుగ్రీవాదుల యందును, అనేక లోపములు లేకపోలేదు. అయినను వారిని కాపాడితివి. శాస్త్ర విహితమైన భక్తి మార్గములతో నిన్నుపాసించిన మహాత్ములు కలరు. వారి పరిశుద్ధి నీ వెరుఁగనిది గాదు. అని రెండు విధములైన అర్హతలను సూచించి, తన అర్హతను ఎంతో చిత్రముగా నిందు పొందుపరచినారు. నేను మహాత్ములవలె యధాశాస్త్రీయమైన భక్తికలవాడననీకాదు, బొత్తుగా అనర్హుడననీకాదు. తనివిదీర వేరు ఆశ్రయమేదియూ చూచుకొనక, అన్నీ వదలి నిన్నే నమ్మితిని. అట్లని లోకువచేసి నాపై తప్పులెంచవలదు. నావంటివానిని కాపాడుటలోనే నీ మహిమకు సాఫల్యము. అని ఒకరకమైన చమత్కారముగా ఎత్తిపొడుపు, తదేక శరణత్వము, ఆర్తి, చనవు ఇన్నీ గోచరించుచున్నవి.

## 317. శంకరాభరణము - రూపకము

**మనసు స్వాధీనమైన యా ఘనునికి**
**మరి మంత్రతంత్రములేల ॥మ॥**

**తనువు తాను గాదని యెంచువానికి**
**తపసు చేయనేల దశరథబాల** ॥మ॥

**అన్ని నీ వనుచు యెంచినవానికి**
**యా(శమ భేదములేల**
**కన్నుఁగట్టు మాయలని యెంచువానికి**
**కాంతల భ్రమలేల దశరథబాల** ॥మ॥

**ఆ జన్మము దుర్విషయ రహితునికి గ**
**తాగత మికయేల**
**రాజరాజేశ నిరంజన నిరుపమ**
**రాజవదన త్యాగరాజ వినుత** ॥మ॥

**"మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః"** - ఏవమాది శతాధిక సూక్తులు మనస్సుయొక్క ప్రాధాన్యమును మాత్రమేగాక, దాని నిగ్రహమువలన కలుగు సిద్ధులను పేర్కొన్నవి. సర్వధర్మములు మనోనిగ్రహలక్షణమే పర్యవసానముగా గలవి. **"చిత్తస్య శుద్ధయే కర్మ"** యని శ్రీ శంకర భగవత్పాదులు వేదశాస్త్ర ప్రోక్తములైన సర్వకర్మలకు చిత్తశుద్ధియే ఫలమని సిద్ధాంతీకరించినారు.

ఇన్నింటిని ఒక్కమాటలో సూటిగా పల్లవిలో మనసు స్వాధీనమైన మహనీయునికి, మంత్రతంత్రములతో పనియేమి? యని సూత్రప్రాయముగా పల్కి, జ్ఞాన, యోగ, వైరాగ్య సంపదలను క్రమముగా పేర్కొన్నారు.

## 318. కాంభోజి - చాపు

**మహిత ప్రవృద్ధ శ్రీమతి గుహగణపతి జననీ** ॥మ॥

**పాహి వదనజిత సుధాకరే శ్రీకరే**
**పాహి సుగుణ రత్నాకరే** ॥మ॥



**దేహి చరణ భక్తి మఖిల-దేహిని సదా శుభఫల**
**దే! హిమగిరి తనయే వై-దేహీప సహోదరి** ॥మ॥

**వాహినీశ సన్ను తేన-వాహి భూషవల్ల భే భ**
**వాహి నీకంఠి! సింహ-వాహినీ జననీ** ॥మ॥

**పార్థ సన్నుతప్రియే ప-దార్థ పుణ్యదూరే కామి**
**తార్థ ఫలదే శ్రీ తప-స్తీర్థ పురనివాసి నీ** ॥మ॥

**రాజశేఖరాత్మ భూ వి-రాజరాజ సన్ను తే స**
**రోజదళ నిభాక్షీ త్యాగ-రాజ భాగ్యదాయవి** ॥మ॥

మహిత ప్రవృద్ధ శ్రీమతి= లాల్గుడి క్షేత్రాది దేవతయొక్క సంకేతము. గుహ= కుమారస్వామి గణపతులజనని. వదన...కరే= చంద్రుని మించిన వదనము కలది. శ్రీకరే= లక్ష్మి నిచ్చునది. సుగుణ రత్నాకరే= సుగుణములకు సముద్రమువంటిది. చరణభక్తి= నీ పాదభక్తిని. దేహి= ఇమ్ము. అఖిలదేహిని= చరాచర భూతములు దేహముగాగలది. (సర్వజనని మహాప్రకృతి) సదా= ఎల్లపుడు, శుభఫలదే= శుభఫలముల నిచ్చునది. హిమగిరి తనయే= హిమవంతుని కూతురు. వైదేహీప= సీతాపతికి. సోదరి= తోబుట్టువు. వాహినీశ సన్నుతే= సేనాపతి కుమారస్వామిచే సన్నుతురాలు. నవాహి భూషవల్లభే= నిత్యనూతనములైన సర్పములు అలంకారముగాగల శివునికి ఇల్లాలు భవాహినీలకంఠి= జన్మ సంసారమనెడి సర్పములకు నెమలి వంటిది. సింహవాహినీ= సింహవాహనము కలది. పార్థసన్నుతప్రియే= అర్జునునిచే నుతింపఁబడు పశుపతికి ప్రియురాలు. శ్రీతపస్తీర్థపురము= లాల్గుడి నివాసినీ రాజశేఖరాత్మభూవిరాజరాజసన్నుతే= చంద్రశేఖరుడు శివుడు, ఆత్మభూ= బ్రహ్మ, విరాజ= పక్షిరాజైన గరుడునికి రాజైన విష్ణువులచే సన్నుతురాలు సరోజదళనిభాక్షీ= పద్మ పత్రములవంటి కనులుకలది. త్యాగరాజునికి భాగ్యమిచ్చునది.

ఈ కీర్తనము లాల్గుడియను మహాక్షేత్రాధి దేవతయైన "మహిత ప్రవృద్ధ శ్రీమతి" యను అమ్మవారిని గూర్చి స్తుతించినది. లాల్గుడి పంచరత్నములను పేర శివునిఁగూర్చినవి వేరుగా కలవు. ఇందు విలక్షణములైన విశేషణములతో కేవల సంస్కృతమందు కీర్తించినారు.

## 319. రవిచంద్రిక – దేశాది

**మాకేలరా విచారము–మముగన్న శ్రీరామచంద్ర ॥మా॥**

**సాకేత రాజకుమార–సద్భక్తమందార శ్రీకర ॥మా॥**

**జతఁగూర్చి నాటక సూత్రమును**
**జగమెల్ల మెచ్చగ కరముననిడి**
**గతి తప్పకాడించేవు సుమీ!**
**నత త్యాగరాజ! గిరీశ వినుత ॥మా॥**

శ్రీరాముడు భగవంతుడుగా సకల ప్రపంచమును కన్నతండ్రి. అనగా ప్రపంచమంతయు రామునికి గర్భభూతము. గర్భవాసియగు శిశువుయొక్క లాలన పోషణాదులు తలిదండ్రుల యధీనము. అట్లే మముఁగన్న శ్రీరామచంద్రా! మా శ్రేయమును గూర్చి నీవే సర్వరక్షకుడ వుండగా మాకేల విచారమని యనుటతోబాటు, ప్రపంచ మర్యాదలో కూడా సాకేత ప్రభువు; భక్తులపాలిటి మందారము= కల్పవృక్షమనియు, శ్రీకరుడనియు కీర్తించుట పై రక్షణా బాధ్యతకు బలకరములు. ఇక చరణమందు ప్రపంచమందలి జీవులకు, భగవంతునికిఁగల సంబంధముయొక్క తాత్త్వికమగు సిద్ధాంతమును నాటకరంగమనే ఉపమానముతో వివరించినారు.

లోకమందు "నాటక" మన్నంతనే కొంత సత్యము కొంత అసత్యము మిశ్రమమై యుండుట సహజము. ఇచట నాటకమనగా. ప్రాచీనరీతిలో ఆడ, మగ ప్రతిమలను కొయ్యలతో నిర్మించి, వాటికన్నిటికి వేర్వేరు సూత్రములతో నొక ప్రధాన సూత్రమును బంధించి, తెరవెనకనుండి ఆ



సూత్రమును త్రిప్పుచూ ఆయా పాత్రల అభినయములతో ప్రేక్షకులకు కథారసమును ప్రదర్శించును. ఇట్లే భగవంతుడున్నూ సర్వ ప్రపంచమందు మానవులందరిలో "అహం" "నేను" అను సూత్రమును "నాది" "మమ" అను సూత్రమును బంధించి, వారి వారి గుణకర్మాను రూపములైన విలాసములను ప్రదర్శింపఁజేయుచున్నాడు. నాటక సమాప్తిలో ఈ వివిధ విలాసములు ప్రదర్శకుని చాతుర్యమువల్లనే కలుగుచున్నవి గాని, ఈ ఆడునట్టి కొయ్యబొమ్మల కేవిధమైన అనుభవము వాస్తవముగాదు. దీనివలన సత్యాసత్యములు, సుఖదుఃఖములు, జనన మరణములు, పుణ్యాపాపములు మొదలగు ద్వంద్వములయొక్క బండారము బయలుపడును. ఈ దృశ్యమును చూచినవారిలో విజ్ఞులు, ప్రసన్నచిత్తులు, ఇందలి సూత్రధారుని ప్రజ్ఞనే భావింతురుగాని, ఈ సంఘటనలన్నియు పరమసత్యములని భావింపరు. తాత్కాలికముగ హర్ష శోకములను వినోదమును పొందుదురు. ఇట్లు రాముడు భగవంతుడై, సూత్రధారుడై, తానుకూడ యీ నాటకమందు దశరథరాజ కుమారుడుగా కూడ నటించుచు, తానుమాత్రము పరవశుడుగాక, మనలనందర పరవశులుగా చేయుచున్నాడు. ఈ సత్యమును గుర్తించి శ్రీ త్యాగరాజస్వామి తన భావములను హర్షశోకములను తనమీదగాక రామునియందే సమర్పించి, మాకేలరా! విచారము అని హాయిగా పాడుకొన్నారు.

**"ఈశ్వరస్సర్వ భూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి**
**భ్రామయన్ సర్వ భూతాని యంత్రా రూఢాని మాయయా"**

అను భగవద్గీతాసూక్తి పై యంశమునకు పరమ ప్రమాణము.

## 320. కాంభోజి – దేశాది

**మా జానకి చెట్టఁబట్టగా మహరాజవైతివి ॥మా॥**

**రాజ రాజవర! రాజీవాక్ష విను**
**రావణారియని రాజిల్లు కీర్తియు ॥మా॥**

**కానకేగి యాజ్ఞమీరక మాయా**
**కార మునిచి శిఖి చెంతనేయుండి**
**దానవుని వెంటనె చని-యశోక తరుమూలనుండి**
**వాని మాటలకు కోపగించి కంట**
**వధియించకనేయుండి**
**శ్రీనాయక యశము నీకే కల్గc**
**జేయలేదా త్యాగరాజ పరిపాల** ॥మా॥

ఈ గేయమందు జగన్మంగళ కల్యాణ దంపతులగు సీతారాముల దాంపత్యానుభవము, పరస్పర పురుషకారము పరాకాష్ఠ నందినవి. అనేకములైన తాత్త్విక సమన్వయము లిందున్నవి.

మా, జానకి యనుటలో మా= లక్ష్మీ స్వరూపురాలైన జానకి యనుభావము కలదు. **"రాఘవత్వేఽ భవత్సీతా రుక్మిణీ కృష్ణ జన్మని"** బ్రహ్మాండాధీశ్వరియగు శ్రీ మహాలక్ష్మియే రామావతారమున సీతగా, కృష్ణావతారమున రుక్మిణిగా నవతరించెనని భావము. అదిగాక లోకమందును నూత్న వధూవరులను లక్ష్మీనారాయణులుగా భావించుట భారతీయ సంప్రదాయము. ఇక "మా" యనుటలో తాను జానకీ సంబంధుడనని భావించుటయు ప్రకృతి శక్తియొక్క పారమ్యమును సూచించుచున్నది. అట్టి సీతను చెట్ట బట్టుట చేతనే రామా! నీవు మహారాజువై, కీర్తి ప్రతిష్ఠల నందితివిగదా! యని విశేషించి అందుకు కారణమును దిగువ వివరించినారు.

రామావతారమునకు పరమ ప్రయోజనము రావణ సంహారమే. **"పౌలస్త్యవధమిత్యేవ చకార భగవాన్ ఋషిః"** అని శ్రీమద్రామాయణము. సీతా చరిత్ర-రావణ వధ ప్రధానముగా గలది. యని, వాల్మీకి ప్రతిజ్ఞా వాక్యము. కావున, రావణారి యని కీర్తియే రాముని మహారాజత్వమునకు గీటురాయి. ఇంత ప్రధానమైన, అలౌకిక ప్రణాళికతో రూపొందిన రావణ



వధ కేవలం రామునికి మాత్రమే పరిమితమైన పురుషకారమా? ఇందు జానకి యనుబంధము కలదా? యను విచారణచేసి, సాక్షాత్పరదేవతయొక్క ప్రాధాన్యమును ఉపపత్తితో నిరూపించినారు.

సీతా మహాసాధ్విరాముని ఆజ్ఞా వశవర్తినిగానే యుండి, తన స్వస్వరూపమును అగ్నియందు నిక్షిప్త మొనర్చుకొని మాయాకారమున రావణునితో లంకకేగి అశోక వనమందుండి, రావణుడు తనను గూర్చి అన్నమాటలను లెక్కచేయక, తాను కోప మందక, వాని కెన్నో హితోక్తులను చెప్పిననూ ఆతడు వినలేదని తన కంట వధియింపక ఒక వర్షము తపసుచేసి, ఆంజనేయుని వెంట తాను కదలక, రావణుని సంహరించిన కీర్తి నీకే కలిగించినది గదా! యని అమ్మవారి వైభవమును కీర్తించిరి. ఇట్లనుటవలన రాముని ప్రాతినిధ్యమునకు న్యూనత భావించరాదు. శ్రీరాముడు స్వరూపతః చిన్మయుడు. వానికెట్టి రాగ ద్వేషములంటవు. ప్రకృతియు ఆ పరతత్త్వమునకు వేరుగాక, ఈ ఉభయ తత్త్వములు పరస్పరము చక్కని సమన్వయ మందినపుడే నిజమైన ఆనందము తాండవించును. ఇదియే ఉపాసనాసారము. అట్టి ప్రకృతి పురుషుల పరస్పరైక్యతను, సీతారాముల దాంపత్య వైభవముతో కీర్తించి, లోకమందలి దాంపత్య ధర్మము యొక్క విశిష్ట, సంప్రదాయమును ప్రబోధించినారు.

## 321. నీలాంబరి - ఆది

**మాటడవేమి నాతో-మాధుర్య పూర్ణాధర** ॥మా॥

**సాటి దొరకని రామ-స్వామి మది రంజిల్ల** ॥మా॥

**ఎదురెదురె చూచి-యెందు గానక నా-**
**హృదయానికెంతో-హితవులేక**
**సదయుడ! నేనుండగ-సముఖము దొరకితే నీ-**
**రదవర్ణ శ్రీ త్యాగరాజార్చిత ముద్దుగ** ॥మా॥

పుంసాం మోహన రూపుడైన శ్రీరాముని దివ్య దర్శనము, ఒకప్పుడు తనకు సమ్ముఖమున దొరికినట్లు తన యనుభవమును ఇందు కీర్తించినట్లున్నది. ఆ దర్శనమునకై ఎదురుచూచి కొంత వేచియున్నట్లు చెప్పుకొన్నారు. ఆపై తనతో ముద్దుగ మాటాడలేదనియు తెల్పి సాటిలేని రామస్వామియొక్క స్వరూప సౌందర్యము మాధుర్యమైన వాక్కును ఎంతో అపురూపముగ భావించుకొనుట కేవల ఆత్మానుభవము.

## 322. మోహన - త్రిపుట

**మాటిమాటికి తెల్పవలెనా ముని-**
**మానసార్చిత చరణ రామయ్య నీతో ॥మా॥**

**సూటికొక్కటే మాటచాలదా**
**నాటి మొదలుకొని సాటిలేని నీతో ॥మా॥**

**పంకజ వదనా సరస వినోదా**
**సంకటములను వేగమె దీర్పరాదా ॥మా॥**

**శంకరప్రియ, సర్వాంతర్యామివి గాదా**
**ఇంక నా మది నీకు తెలియగలేదా ॥మా॥**

**కరుణాసాగర పరిపూర్ణ నీకు**
**సరివేల్పులు లేరనుచు నీవరకు ॥మా॥**

**మొఱఁబెట్టిన నాపై ఏల పరాకు**
**వరులుఁజూతురు భాండమున కొక్కమెతుకు ॥మా॥**

**శృంగారశేఖర సురవైరి రాజ**
**భంగ సుజన హృత్కుముదభ రాజ**
**మంగళకరరూప జితరతిరాజ**
**గంగాజనక పాలిత త్యాగరాజ ॥మా॥**



ఇందు సూటిగా ఒక్కమాట చాలదా! మాటి మాటికి నే వేడుకోవలెనా? సర్వాంతర్యామియైన నీకు నా చిత్తము తెలియదా! యనుటలో, సదా నిన్నేకోరి నీ కభిముఖముగానున్న నా చిత్తమును గమనించుటలో ప్రత్యేక శ్రమ పనిలేదని భావము. నా విన్నపములో ఆర్తి నీకు తెలియదా? యని. అన్నపు గిన్నెలో ఒక్కమెతుకు మాత్రమే పలుకున్నదా! యని చూతురు. అట్లే నా పరిపాకము ఎపుడో నీవు పరిశీలింపఁగలవు.

సురవైరి రాజభంగ= దేవశత్రువులైన రాజులను భంగించువాడు, సుజన...భరాజ= సుజనుల హృదయములను కలువలకు చంద్రుడు.

## 323. అమీర్‌కల్యాణి - దేశాది

**మానము లేదా తనవాడని యభి ॥మా॥**

**మానమురా నీవలె నిర్మోహిని**
**గానరుచి తెలియు కుశలవ జనక ॥మా॥**

**నీ సముఖాన రవితనయుఁడు నిన్ను**
**బాసలు బల్కగ రోసముతో సిం-**
**హాసనాధిపతిఁజేసిన నీకు**
**దాసుఁడైన త్యాగరాజ కరార్చిత ॥మా॥**

రామా! తనవాడనే మానము, లోక మర్యాదలేక అభిమానము వాత్సల్యభావముగాని నీకులేదా? అలనాడు నీ కుమారులని చూచాయగా గుర్తించిన అభిమానముకన్న మిన్నగా. తంత్రీలయ సమన్వితమైన వారి రామ కథా గాన మాధుర్యమునకు పరవశుడవైతివే. నాపట్ల మాత్రమీ నిర్మోహము= నిర్మోగమాటమేమి? యనుటలో, కుశలవగాన సామ్యమును, కీర్తించుట ఎంతో యుక్తముగా నున్నది.

కుశలవులను వీరెవ్వరనిగాని, ఎవరి కుమారులనిగాని, ఏయూరనిగాని ప్రశ్నించునంతటి విలంబమును కూడ సహించక, **"గాయనే తా వచోదయత్"**

పరివారముతో కొలువుతీర్చి వారి మధురగాన మాస్వాదించెను. నాయందా ఆదరమేల లేదు. ఆనాడు వానరరాజు సుగ్రీవుడు, నీ ప్రతాప శౌర్యములఁ గూర్చి ఎన్నోరీతుల శంకించినపుడు రోసముతో వానికన్ని బుజువులుచూపి, వాలి సంహారమొనర్చి సింహాసనాధిపత్య మిచ్చితివే.

నేనట్లు, నిన్నునుమానించకున్నను, వానివలె రాజ్యాధికాంక్షలేక, కేవల దాసుడనై, నీ వాడనని వేడుకొన్ననూ నాయందు లోకసహజమైన మర్యాదగాని, అభిమానమునుగాని చూపకుండుట న్యాయమా! యని కీర్తించినారు.

## 324. జగన్మోహిని - ఆది

**మామవ సతతం రఘునాథ ॥మా॥**

**శ్రీమదినాన్వయ సాగరచంద్ర-**
**శ్రిత జన శుభఫలద సుగుణసాంద్ర ॥మా॥**

**భక్తిరహిత శాస్త్రవిదతి దూర**
**పంకజదళనయన నృపకుమార**
**శక్తితనయ హృదాలయ రఘువీర శాంతనిర్వికార**
**యుక్తవచన కనకాచల ధీర,**
**ఉరగశయన మునిజన పరివార**
**త్యక్త కామ మోహ మద వికార!**
**త్యాగరాజ రిపు జలద సమీర ॥మా॥**

మాం+అవ= నన్ను రక్షింపుము. శ్రీమదినాన్వయ...చంద్ర= సూర్య వంశమనెడి సముద్రమునకు చంద్రునివంటివాడు. భక్తిరహిత...దూర= భక్తిలేని కేవల వేదశాస్త్ర విద్వాంసులకు మిక్కిలి దూరమైనవాడు, శక్తితనయ= శక్తితనయుడైన, వసిష్ఠుని, హృదాలయ= హృదయమే నివాసముగా కలవాడు. ఉరగశయన= శేషశయనుడు, త్యాగరాజ...సమీర= త్యాగేశుని శత్రువులనెడి



మేఘములకు వాయువు వంటివాడు. కేవల సంస్కృతమందే స్తుతిపరములైన విశేషణములచే స్తుతించినారు.

## 325. శ్రీరంజని - ఆది

**మారుఁబల్కకున్నా వేమిరా-మా మనోరమణ ॥మా॥**

**జారచోర భజనచేసితినా-సాకేత సదన ॥మా॥**

**దూరభారమందు నా హృదయారవిందమందు నెలకొను**
**దారి నెరిఁగి సంతసిల్లినట్టి, త్యాగరాజనుత ॥మా॥**

నిరంతరం భగవదను సంధానముకల భావుకులు మహోపాసకుల చిత్త పరిపాకము అనేక తీరులుగానుండును. వాటికొక క్రమమును మనము భావించలేము. ఈ కీర్తనమందు శ్రీరామునితో తానేదో అన్నట్లున్నూ, రాముని సమాధానమునకై తానెదురు చూచినట్లున్నూ, తాననుకొన్నంతలో ఆ సమాధానము రాకున్నపుడు, "రామా! మారు పల్కవేమి? అనుపల్లవి సరిపడును. త్యాగరాజస్వామి అనుభూతి కింతటి పూర్వరంగమును మన మూహించినఁగాని ఆ మాటలు అతుకవు.

మా, మనోరమణ= యను సంబోధనము రమణీయము. మా= లక్ష్మి. ఇచట విద్యాస్వరూపిణి, అట్టి సత్పురుషుల మనసులందు రమించువాడు. అని ధ్వని కలదు.

ఆపై, నేనేమి జార, చోర భజన చేసితినా? అనుటలో తనకు దుష్ట సాంగత్యము లేదని క్రొత్తగా నిరూపించుకొనుటలో విశేషమేమి? ఇచట జార-చోర శబ్దములు మనోధర్మములైన కామ రాగాదులు. అవి తనకులేవని భావము.

అందువల్లనే, నా వినిర్మల హృదయారవిందమందు నెలకొన్న నీదారి నెరిఁగి ఎచటనో దూరభారమందు సాకేతమందున్నట్లుకాక, నాకు మిక్కిలి

సన్నిహితుఁడవయ్యే యున్నట్లు తెలిసి ఎంతో ఆనందించునట్టి నాతో మారు మాటాడవేమి రామా! యనుట ఎంతో సందర్భశుద్ధిగా నున్నది.

## 326. అసావేరి–ఆది

**మాపాల వెలసి ఇక–మముఁబ్రోవగరాదా శ్రీరామచంద్ర ॥మా॥**

**నీ పాదముల భక్తి నిండారగ నిచ్చి**
**కాపాడు శక్తినీ కరమున నుండగ ॥మా॥**

**పాపసంహార నా పరితాపములను దునుమ**
**నేపాటిరా కరుణాపయోనిధివైన శ్రీపతీ విధృత**
**చాపబాణ! యీ పాపమతి నరు లాపదలను నే**
**నేపనిఁజూతును ఆపద్బాంధవ కాపాడ నీకీ పరాకేల ॥మా॥**

**దీనరక్షక భక్తాధీన సాకేత నగరీశ నా మది పద–**
**రిన సుజన మానాభిమాన పాలన సమాన రహిత! రో**
**సాన నీదు దాసానుదాసుడను దానవాంతక ము**
**దాన నారద సుగానలోల దరిగాన సంతతము ॥మా॥**

**నాగాధిప వినుత నాగారి రథ నినువినాగతి నెరుఁగ**
**నాగరాజ హృత్సాగరాబ్జ! భవసాగరాంత కా సు–**
**రాఘహర! కనకాగధీర! సురనాగ గమన శర**
**ణాగతాప్త శ్రీ త్యాగరాజనుత ॥మా॥**

మాపాల వెలయుట అనునది జాతీయమైన మాట. మా ఇలువేల్పు, లేక మాపాలిటి రక్షకుఁడవు. లేక మా కందుబాటులో మానవావతార మెత్తినవాడవు. ఇన్ని అనుబంధములున్నందున మా అర్హతలతో నిమిత్తము లేకుండగనే, నీపాద భక్తిని నీవే అనుగ్రహించి మామ్మాదుకొని రక్షించవలసిన బాధ్యత నీకేకలదు. నీవు పాపములను పోగొట్టు బిరుదు కలవాడవు. కరుణా సముద్రుడవైన నీకు మా పాపములను పరిహరించు టెంతపని? నీవు



శ్రీపతివి. ధనుర్ధారియైన శూరుడవు. లోకమందలి పాపమతులైన నరులు పొందే ఆపదలను నేను చూడలేకున్నాను. నీ వాపద్బాంధవుడవు గదా!

సమానరహిత! సాటిలేనివాడా! నామదిలో ఒక విధమైన రోసము పదరినది. కుదురుకొన్నది. నీ దాసాను దాసుడ ననేదే నా రోసము. నీవో, సుజనుల మానాభిమానములను గౌరవ మర్యాదలను పరిపాలించువాడవు. పైగా నారదగానలోలుఁడవు. నిన్ను సదా నే కీర్తించువాడను. కావున, నా పరిసరములలోని పాపమతులను కాపాడి నీ దాసుడనను నా రోసమును నిలబెట్టుమని స్వారస్యము.

నాగాధిప వినుత= శేషునిచే స్తుతింపఁబడువాడు. నాగారి రథ= సర్ప శత్రువైన గరుడుడు వాహనమైనవాడు. సురాఘహర= దేవతల పాపముల హరించువాడు. కనకాగధీర= మేరు సమానధీరుడు. సుర నాగ గమన= గజగమనుడు (ఐరావతము) అని సాభిప్రాయ విశేషణములతో కీర్తించినారు.

## 327. మధ్యమావతి – ఆది

**ముచ్చట బ్రహ్మాదులకు దొరకునా**
**ముదితలార చూతాము రారే ॥ము॥**

**పచ్చని దేహిని పరమ పావనిని**
**పార్వతిని తలఁచుచును హరుడేగెడు ॥ము॥**

**చల్లరె వేల్పుల రీతి విరుల కర**
**పల్లవములను తళుక్కనుచు బిరుదు**
**లెల్ల మెరయ నిజభక్తులు పొగడగ**
**ఉల్లము రంజిల్ల**
**తెల్లని మేనున నిండు సొమ్ములతో**
**మల్లెహారములు మతి శోభిల్లగ**

**చల్లనివేళ సకల నవరత్నపు**
**పల్లకిలో వేంచేసి వచ్చు** ॥ము॥

**హితమైన సకలనై వేద్యంబుల స-**
**మ్మతమున అడుగడుగు కారగింపుచు**
**మితము లేని యుపచారములతో**
**నతి సంతోషమున సతతము జ**
**పతపముల నొనరించు**
**నతజనుల కభీష్టము లవ్వారిగ**
**వెతకి యొసఁగుదు ననుచుఁబంచనదీ**
**పతి వెడలి సొగసు మీరగ వచ్చు** ॥ము॥

**భాగవతులు హరినామకీర్తనము**
**బాగుగ సుస్వరములతో వింత**
**రాగములను యాలాపముచేయు, వై**
**భోగములను చూచి**
**నాగభూషణుఁడు కరుణానిధియై**
**వేగమ సకల సుజన రక్షణమున**
**జాగరూకుఁడై కోర్కెల నొసఁగు**
**త్యాగరాజు తాననుచును వచ్చు** ॥ము॥

తిరువాదిలో శ్రీ పంచనదేశ్వరుడు వార్షికముగ జరుగు కల్యాణ మహోత్సవ సందర్భమున ఎదురు సన్నాహమను వేడుకలో పరమశివుడు నవరత్నపు పల్లకిలో వేంచేసి రాజవీధిలో తిరువీధి ఉత్సవము జరుగుచున్న సమయమున శ్రీ త్యాగరాజస్వామి పరమానందముతో గానముచేయుచూ, మహోత్సవములలో ముదితలు ముత్తైదువుల పరివారమే. ప్రత్యేకాలంకారమై నందున ఓ! ముదితలారా! బ్రహ్మాదులకు సైతము దొరకని ఈ ముచ్చటను చూతాము రారే! యని తనను మరచి దివ్యమోహన గానముతో



పేరంటమునకు పిలచుట మనకెంతో ముచ్చటఁగొల్పుచున్నది. సర్వమంగళయై పచ్చని తల్లియైన పార్వతిని ఎపుడు చూతునో యని ఉవ్విళ్లూరుచున్న శివుని ఎదురు సన్నాహ వైభవమును నవ్య శృంగారముగ కన్నులఁగట్టునట్లు కీర్తించుట ఎంతో ముచ్చట. దేవతలు పువ్వులు చల్లినట్లు, కరపల్లవములతో ముత్తైదువులను పువ్వులు చల్లుడని హెచ్చరించుటయు, ఆ తల్లుల కరములు పల్లవములని ఉపమించుటయు ఎంతో రసవంతము;

ఆపై ఆ పెండ్లికొడుకు బిరుదములు కేవలాడంబరములు కాక లోక కల్యాణ కారకములగు బిరుదులనుటచే ఆ అలంకారములు సార్థకములు. నీలకంఠము= హాలాహల భక్షణముచే లోక శాంతికరము. ఆపై గంగాధరత్వము, గజ చర్మాంబరము, నాగభూషణము, ఈ బిరుదులు అనితర సాధారణములు. ఇవి భక్తజనుల బాహ్యాభ్యంతరములైన కనులలో తళుక్కుమని మెరయుచున్నవని వర్ణించుట విశేషము. మరియు పరమశివుని శరీరము భస్మోద్ధూళితమై తెల్లగానున్నదట. ఆపై మల్లెపూల దండల నలంకరించిరట. ఇట్లు చల్లనివేళ నవరత్న పల్లకిలో స్వామివారు వేంచేయునపుడు, అడుగడుగుననూ హితములైన సకల నైవేద్యములను ఆరగింపుచేయుట ఉత్సవ విశేషమందు ప్రధానమైన ఉపచారము. ఆ మార్గమున పంచనదపతి ప్రభులక్షణముతో, జప, తపస్స్వాధ్యాయములతో తన పరివారులై స్వస్తి వాచనములతో, విచ్చేయు భూసురులను, తదితర భక్తులను, వేర్వేరపిలచి ప్రసన్న కటాక్షముతో వారి వారి అభీష్టములను వెతకి వెతకి అనుగ్రహించుచు, ఆనందోత్సాహముతో పెండ్లికూతురి గృహమునకు వేంచేయు స్వామిముచ్చట వర్ణనాతీతము.

ఈ సన్నాహమందు అయ్యగారు తన శిష్య పరివారముతో, తంబుర ధరించి తిరువీధి యుత్సవమున దివ్యమోహన గాంధర్వ గానముతో, వింత వింత రాగములతో సంకీర్తనము సేయు సంఘటనమును ఎంతో

రమణీయముగా సంతరించిరి. తన పేరును త్యాగరాజేశ్వరునితో అభిన్నముగ భావించి, భాగవతుల హరికీర్తనము, ఈ మహోత్సవమున కొక మకుటము. హరికీర్తనము హరుని కిష్టమనుట విశిష్ట సంప్రదాయము. ఈ మాటయం దెంతో భావ గాంభీర్యమున్నది. ఇట్లు వింత రాగములతో భాగవతుల హరికీర్తనమును నాగభూషణుఁడు వినుచున్నాడట. నాదబ్రహ్మాను భవమందు సర్పములు రాసిక్యము కలవనుట ధ్వని. ఈ గాన పారవశ్యమున నటరాజైన శివుడు ఆనందమొంది, సకల సుజన రక్షణమునం దుల్లాసముతో జాగరూకుడై, ఎవరేది కోరినను అందరికన్ని వరములనిచ్చి, త్యాగరాజు మాత్రము తాననే తాదాత్మ్యముతో భావించు, ఈ యుత్సవముయొక్క ముచ్చట బ్రహ్మేంద్రాదులకు సైతము అపురూపమనుటలో సందేహములేదు.

దక్షిణ భారతమున తత్రాపి చోళ మండలమందు కన్నులఁగట్టినట్లు ఈ గౌరీ కల్యాణ వైభోగమును తీర్చిదిద్ది తా నా కల్యాణమూర్తియం దంతర్లీనుడైన శ్రీ త్యాగరాజస్వామి కారణ జన్ముడుగాక మరేమి?

## 328. ముఖారి – ఆది

**మురిపెము కలిగె గదా రామ స–**
**న్మునినుత కరి వరద శ్రీరామ ॥ము॥**

**పరమపురుష జగదీశ వరమృదు**
**భాష సుగుణమణికోశ నీకు ॥ము॥**

**ఈడులేని మలయమారుతము చే**
**కూడిన కావేరీ తటమందు**
**మేడల మిద్దెలతో శృంగారము**
**మించు సదనములతో**
**వేడుచు భూసురు లగ్నిహోత్రులై**
**వేదఘోషములచే నుతియింపఁ**



**జూడ శివుడు కోరు యోగ్యమైన**
**సుందరమగు పురము దొరికెననుచు ॥ము॥**

**సకల సుగంధరాజ సుమములు**
**సలలితములగు కోకిలనాదమ్ములు**
**శుకముఖ సనకాదు లనుతమైన**
**సురతరువులు కలిఁగి**
**నికటమందు వాణికొలువ సురపతి**
**నీలమణి నిభశరీర నేడు**
**ప్రకటమైన నవరత్న ఖచిత హా–**
**టక మంటప వాసము గలిగె ననుచు ॥ము॥**

**ఈ మహిలో సొగసైన చోళ**
**సీమయందు వరమైన పంచనద పుర**
**ధాముని చెంతను వసించుటకై నీ మదినెంచగ**
**కామ జనక త్యాగరాజ సన్నుత**
**నామ పవన తనయ విధృతచరణ**
**క్షేమముగ వర్ధిల్లునట్టి పురమున సీతా**
**భామ సౌమిత్రి ప్రక్కఁగొలిచెదరని ॥ము॥**

తిరువాదిలో తమ ఇంట దివ్యమంటపమందు వేంచేసి వేకువ ప్రభాతసేవ మొదలు ఏకాంతసేవ వరకు, నిత్యకైంకర్యము పొందుచూ, శ్రోత్రియంముగా శ్రీపంచనదీశ్వరస్వామివారి దివ్యసన్నిధిలో, మహావైభవముగానున్న శ్రీరామునిఁగూర్చి తనలోనే ఆనందం పొంగి శ్రీరామునికే మురిపెము–అనగా సౌందర్యముచేత, సంపదచేత, భోగభాగ్యములచేతనూ కలిగే ఒకానొక అతిశయము (ఠీవి)ను, ఈ కీర్తనమందు వర్ణించారు. యీ ఠీవి తానునుభవించి రాముని పరంగా ఆరోపించుట ఇందొక విశేషము.

రామా! మలయమారుతము వీచుచున్న కావేరీతటమందు రాజమర్యాదలు కలమేడలు మిద్దెలు, శృంగారభవనములు కలది తిరువాది. కేవల రాజవీధి మాత్రమేగాక, తన చిత్ర వీధిలో ఆహితాగ్నులైన వేద, వేదంగవేత్తలు వేదఘోషములచే పరమశివుని స్తుతించుచున్నారట. ఇంతటి సుందర నగరమందు నా ఇంట నవరత్న మంటపవాసము నీకు లభించినదని మురిసిపోవుచున్నావు. ఈ సహజవైభవము అయోధ్యయందున్నదో! లేదో! లోకాంతరములందైననూ యీ వాతావరణము అపురూపమే. మరియు చోళమండలము ప్రకృతి రమణీయము. అందునూ పంచనదప్రాంతము, దేవోద్యానములవలె వివిధ సుగంధ పుష్పములు, సురతరువులంబోలు మహావృక్షములు, ఫలభరితములై, అందలి చిలుకలు కోయిలలు మధుర కలకలధ్వనులు చేయుచుండగా, సకల సంగీత సాహిత్యములతో వాణి నిత్యసన్నిధానమను గ్రహించుచుండగా, సీతాలక్ష్మణులతో సకలోప చారములను పొందుచూ వసించియున్న రాముని దివ్యవైభవమును వర్ణించినారు.

ఇంతటి వాతావరణమందు తనకే మురిపము కలిగినది కాబోలును, శ్రీరాముని తన ఆత్మీయునిగా భావించి కీర్తించినారు. **"ఆత్మనస్తు కామాయసర్వం ప్రియంభవతి"** అను శ్రుతికి ఈ సుందర సన్నివేశము ప్రతిబింబమువంటిది.

## 329. సూర్యకాంతం - ఆది

**ముద్దు మోము ఏలాగు చెలంగెనో**
**మును లెట్లకని మోహించిరో! ॥ము॥**

**కద్దనుచు చిరకాలము హృదయము**
**కరఁగి కరఁగి నిల్చువారి కెదుట రాముని ॥ము॥**

**మనసు నిర్మలమగు భూసుర కృతమో**
**మంచి పూజాఫలమో తొలుతటి తపమో**



**ఘననిభ దేహుని జనన స్వభావమో**
**ధనపతి సఖుడైన త్యాగరాజార్చితుని ॥ము॥**

రాముని దివ్య మోహనమైన ముఖసౌందర్యముఁగూర్చి ఆశ్చర్యానందమొకపుడు కలిగి, రామా! నీ ముద్దులొల్కు ముఖ మెట్లుండెనాయని పల్లవి నెత్తుకొనుట త్యాగరాజస్వామి అంతరంగాను భూతిని, ఆ దివ్యదర్శనమందుకల ఆకాంక్షను వ్యక్తము చేయుచున్నది. ఇందుకు కారణము. తపోనిష్ఠులై పరమ విరక్తులైన దండకారణ్యమందలి మహామునులు శ్రీరాముని పుంసాం మోహనమైన సౌందర్యముఁజూచి, **"ఆలింగామో వయంరామ"** "నిన్నాలింగన మొనర్చుకొను కుతూహలము కలదన్నట్లు" ఉపనిషత్తు పేర్కొన్నది. దాని నాధారముగా ఆనాడు నిన్నుఁ జూచి మునులెట్లు మోహించిరో! యనుటయు తగియున్నది.

ఇంతటి అఖండసౌందర్యము భగవంతుని యందుండుటలో వింతలేదు. అన్ని రూపనామములు భగవత్కళకు అంశములే. అట్లుగాక, కేవలం రాముని ఒక దివ్య సుందరమూర్తిగా భావించుకొని, రామా! నీకీ సౌందర్యము, వేదవేత్తలైన భూసురుల ఆశీర్వాద బలముచే కలిగినదా? వర్చస్సు సౌభాగ్యము కలుగుటకు వారివారి జన్మాంతర పూజాఫలము, తపస్సువల్ల కలుగుననుట లోకసహజము కాన, ఆ తీరులో అట్లని, అసలు వాని పుట్టుకతీరు అట్టిదేమో! యని పరిష్కార మిచ్చుట ఎంతో స్వభావ మధురమైన భావము.

సౌందర్యభావము భగవత్కళామయము. అట్టి కళాత్మకమైన భావనయే ప్రత్యేక తపస్సు. దీనినే సౌందర్యార్చన మందురు. యీ సంపద రాధాకృష్ణుల పరస్పర మధురానుభూతిలో జయదేవ మహాకవి సిద్ధినందినాడు. ఆ సంప్రదాయమే ఇందును గోచరమగుచున్నది.

## 330. బంగాళ - ఆది

**మునుపే తెలియకపోయెనా**
**మునినుత దయ లేదాయెనా ॥ము॥**

**అను విసుమంత లేదనుచును**
**నన్నలయించి వేడుక జూచుటకు ॥ము॥**

**ఆనాటి మంచి నడతను చూచి,**
**నీ వత్యంత కృపసేయలేదా**
**ఈనాడు నామది ఇట్లౌనని**
**నీకినకుల తిలక! శ్రీ త్యాగరాజనుత ॥ము॥**

మునుపెన్నడో వెనుక తననెంతో గమనించి రక్షించినట్లునూ, ప్రస్తుతము ఆ దయలేక తనను ఉపేక్షించుచున్నట్లున్నూ భావించి తాను వేడుకొనుటకొక సన్నివేశమును కల్పించుకొని, ప్రభువుల చిత్తమొక తీరుగా నుండునా? యన్నట్లు లోక సహజమైన రీతిలో కీర్తించినారు.

రామా! నీవు మునులచే నుతింపఁబడువాడవు. అయిననూ, నా స్వరూపస్వభావములు నీకు మునుపే తెలియలేదా! అనువు= అనుకూలమైన పరిస్థితి ఇసుమంత కొంచెమేని, లేదని, నన్ను ఆశపెట్టి నేనిపుడు పరివేదన నొందగా చూచుట నీకు వేడుకగా నున్నదా? ఆనాడు ఒకప్పుడు నా మంచి నడవడిని చూచి కృపజూపితివిగదా! ఈనాడు నేనిట్లుందునని మాత్రము, నా చిత్తమిట్లు పరితాపమొందునని నీకు తెలియవలదా? మానవ స్వభావము చిత్తవృత్తులు మారుట సహజము. మేము మారినను, నీ దయ రక్షకత్వము మాత్రమొక్క తీరుననే యుండవలెనుగాని, నీ వ్యక్తిత్వము మారరాదు. ఇదిగదా ప్రభులక్షణమని భావము.

## 331. తోడి - జంప

**మున్ను రావణ బాధనోర్వక విభీషణుడు**
**మొఱఁబెట్టగా రామచంద్ర ॥ము॥**

**మన్నింతుననుచు కులబిరుదులను పొగడిన**
**మాట మరచితివో శ్రీరామచంద్ర ॥ము॥**



**ముసు వజ్రబాధల నోర్వఁజాలకను**
**ఇనజుండు నిను రామచంద్ర**
**కొనియాడ పరితాపమును జూచి వాని మది**
**కొరవఁదీర్చిన రామచంద్ర ॥ము॥**

**మును హేమకశిపు బాధ సహింపగలేక**
**మురహరీ! యన రామచంద్ర**
**చనువుతో ప్రహ్లాదు సంతాపమును దీర్చి**
**సౌఖ్యమొసఁగిన రామచంద్ర ॥ము॥**

**మున్ను నీ మహిమ నే విన్నదేగాని స**
**న్మునివంద్య శ్రీరామచంద్ర**
**పన్నగాధిప శయన పాలించి నా వెతలు**
**పరిహరించవే రామచంద్ర ॥ము॥**

**రాజరాజ విరాజవాహ రవికుల జలధి**
**రాజ రాఘవ రామచంద్ర**
**రాజీవనేత్ర జలజభవస్తుత త్యాగ**
**రాజ వందిత రామచంద్ర ॥ము॥**

భక్తులను సమయమెరిఁగి పాలించుటయే భగవంతునికొక మర్యాదయైనట్లున్నూ, అట్లు పాలించనిచో ఆ రివాజుకు న్యూనత చేకూరినట్లున్నూ ఒక విచిత్రమైన రీతిని భావించి ఇందు నాల్గవ చరణములో రామా! భక్తులపట్ల నీ తీరుతెన్నులు ఇదివరకు నేవిన్నవేగాని ప్రస్తుతము నా మాట ఏమి? ఇపుడు నా వెతలు తీర్చి పాలించినచో నీ దైవత్వమునకు విధేయుడనై యుందునని చమత్కారముగా రాముని పూర్వావతార సంపదను కీర్తించినారు.

వెనుకవారివలెనే తానున్నూ రాముని కుల బిరుదులను కీర్తిస్తూ, రాజరాజ, విరాజవాహా= పక్షిరాజైన గరుడుడు వాహనమైనవాడా! రవికుల జలధిరాజ= సూర్యవంశమనెడి సముద్రమునకు చంద్రునివంటివాడా! జలజభవ= బ్రహ్మ మొదలైనవారిచే స్తుతింపఁబడువాడా! యని పొగడినారు.

ఇక తానెరిఁగిన పూర్వచరిత్రలను జ్ఞాపకము చేయుచూ, రావణుని బాధలు సహించలేక సోదరన్యాయమునుకూడ పాటించక విభీషణుడు నిన్ను శరణువేడెను. నీ అనుయాయులైన సుగ్రీవాదులు సైతము శత్రుసోదరుఁ డని విభీషణుని తమ పక్షమందు చేర్చుకొనుటకు శంకించిననూ, నీ కులగౌరవమును చెప్పుకొని **"అభయంసర్వభూతేభ్యోదదామి ఏతద్వ్రతంమమ"** యని వానిని కాపాడితివి. అట్లే మరియొక సోదరద్వేషి ఇనజుఁడు= సుగ్రీవుడు, ఇంద్రకుమారుఁడైన వాలియొక్క వజ్రసమములైన ఆయుధములను సహించలేక నిన్ను శరణందెను. అంతకన్న మించి హేమకశిపుడు, హిరణ్యకశిపునికి కుమారుడైన ప్రహ్లాదుని వైరమందు, నృసింహమూర్తివై ప్రహ్లాదుని కాపాడితివి. ఇవన్నియు చట్టమునకు వ్యతిరేకములైన దృష్టాంతములే! ఇక నన్ను కాపాడుటలో ఆలోచన ఎందులకు? ఇవన్నీ నేను విన్నానులే. యని చమత్కారము.

## 332. అఠాణ – దేశాది

**ముమ్మూర్తులు గుమిగూడి పొగడే ముచ్చట వినుకోరె ॥ము॥**

**సమ్మతిగా రాజుకొడు కనఁగ విని**
**సంశయము దీరక శ్రీరాముని ॥ము॥**

**రోసముతో రఘురాముని గుణముల–**
**రూఢిగ తమ గుణముల నటువ్రాసి**
**త్రాసుననిడ సరినిల్వలేదని–**
**త్యాగరాజనుతుడెవడో! అనుచును ॥ము॥**



ప్రకృతి అంతయు సత్వ రజ స్తమో గుణాత్మకము. ఈ గుణత్రయమే ఉపాధులుగా కలవారు త్రిమూర్తులు. బ్రహ్మవిష్ణుశివులు సృష్టి స్థితి సంహారముల నొనర్తురు. అట్టి ముమ్మూర్తులు శ్రీరామావతార వైభవమును పొగడిన ముచ్చట వినుడనుటలో శ్రీరామతత్త్వము యొక్క పరత్వమును ఇందు కీర్తించినారు.

శ్రీరాముని నిరతిశయమైన దివ్యత్వమును భక్తరక్షణమును, ధర్మమూర్తిగా చేసిన అమానుష కృత్యములను త్రిమూర్తులు విని కేవలము రాజు కొడుకుగా, మానవుడుగా వ్యక్తమగుటచూచి, వారికే సంశయము కలిగి మాకన్న వీని అతిశయమేమని రోసముతో పరీక్షించిరట. తమ గుణములను రాముని గుణములను వేర్వేర వ్రాసి త్రాసులో తూచిరట. తమ గుణములు సరిగా తూగకపోవుటచే రాముడెవఁడో!! యని ఆశ్చర్యపడి పొగడినారట. అనగా రాముని స్వరూపము చిన్మయము. మాయామానుషము. తపోమూర్తులు, ధర్మస్వరూపులును అగు మహర్షుల తపఃఫలరూపము. రామునికి ఉపాధియున్నట్లు సర్వకార్యములు నిర్వహించుచున్నట్లు మనకు కన్పించునే కాని, వ్యవహారకాలమందుకూడ, శరీరేంద్రియములతో స్వరూపము మలికితముకాదు. కేవల భక్తాను గ్రహమునకై ఏర్పడిన నిర్వికారమైన తత్త్వము.

త్రిమూర్తులు అట్లుగాక, గుణత్రయోపాధికులై, వారివారి నియతములైన కృత్యములను మాత్రము అమలుజరుపువారు.

అయిననూ, వారి స్వరూపములకుగాని, స్వరూప జ్ఞానమునకుఁగాని ప్రతిబంధముండదు. ఇంతకూ శ్రీరాముని గుణాతిశయముకూడ నిశ్శ్రేయము కలిగించునది. వాని దివ్యనామము రూపముకూడ భక్తులకు సర్వపురుషార్థములు కలిగించును. ఈ స్వభావము కృష్ణావతార తత్త్వమందును కలదు. ఇది ఆధ్యాత్మికము.

## 333. దర్బారు - ఆది

**ముందు వెనక ఇరు ప్రక్కల తోడై**
**ముర[1] ఖరమార! రారా రారా ॥ముం॥**

**ఎందుఁగాన నీయందమువలె రఘు-**
**నందన వేగమే రారా రారా ॥ముం॥**

**చండ భాస్కర కులాబ్ధి చంద్ర కో**
**దండపాణియై రారా రారా**
**అండఁగొలుచు సౌమిత్రి సహితుఁడై**
**అమిత పరాక్రమ రారా రామ నా ॥ముం॥**

**ఓ! గజరక్షక ఓ! రాజకుమారా**
**ఓంకార సదన రారా రారా**

**భాగవత ప్రియ! బాగ బ్రోవవయ్య**
**త్యాగరాజనుత రారా రామ ॥ముం॥**

శ్రీ త్యాగరాజస్వామి తిరువత్తియూరివద్ద కోవూరు సుందరేశ్వరుని దర్శించు నిమిత్తమై పల్లకిలో పయనించి, మరలి వచ్చునపుడు, సుందరేశమొదలియార్ అను భక్తుడు మార్గవ్యయమునకై కొంత ద్రవ్యమును శిష్యులకు మాత్రం తెల్పి, పల్లకిలోనుంచెనట. మధ్యేమార్గమున దైవప్రేరణచే దొంగలురాగా, శిష్యులు భయపడి, పల్లకిలో ద్రవ్యమున్నమాట అయ్యగారికి చెప్పిరట. అంతట నీ మహనీయునికి వాల్మీకమందలి ఒక శ్లోకము **"అగ్రతః పృష్ఠతశ్చైవ! పార్శ్వతశ్చ మహాబలౌ। ఆకర్ణపూర్ణ ధన్వానౌ రక్షేతాం రామలక్ష్మణౌ"** స్ఫురించి ఈ శ్లోక తాత్పర్యమునే ధ్యానించి, ఈ కీర్తనము పాడినట్లున్నూ. వెంటనే ధనుర్బాణ ధరులైన రామలక్ష్మణులు దొంగలకు

1. మురహర! వేగ



కన్పించగా, ఆ దొంగలు వెరగంది, శ్రీ త్యాగరాజుని పాదములపై బడి తమ అకార్యమును మన్నింపుడని వేడినట్లు పరంపరగా ప్రతీతికలదు:

అంతట త్యాగరాజస్వామి ఆ దొంగలకు దర్శనమిచ్చి తనకా దర్శనభాగ్యమను గ్రహించలేదని పరితపించినట్లు తెలియుచున్నది.

రామా! నా ముందు వెనుకలను తోడై రమ్ము అను పల్లవితో మురఖరాదులను సైతము సంహరించిన ప్రతాపశాలివి. చండభాస్కర వంశమనెడి సముద్రమునకు చంద్రునివంటివాడవనుటలో దుష్టులకు పరితాపమును శిష్టులకు చలువనిచ్చువాడవని విశేషము. కావుననే, నీయందము మరెచటను దర్శింపఁజాలము. లక్ష్మణునితో కోదండ ధారివైరమ్ము.

ఆర్తుడై వేడుకొన్న గజరాజును రక్షించితివి. రాజకుమారుడవై వెలసినను, తారకనామరూపుడవగుటచే ఓంకార సదనమందున్న వానిగా, మహాయోగులు నిన్ను దర్శింతురు.

అట్టి భాగవతులకు సర్వవిధములా నీవు ప్రియుఁడవు. మమ్ము కాపాడుమని, దొంగలవలని భయము, ద్రవ్యలోభముచేతనూ గాక, శ్రీరాముని దర్శించవలెననుకోరిక నిరంతరము కలిగియుండి, దైవికముగా వచ్చిన పై సంఘటనము నిందు సార్థక మొనర్చుకొనుట విశేషము.

## 334. సరసాంగి - దేశాది

**మేనుఁజూచి మోసపోకుమీ మనసా**
**లోని జాడ లీలాగు గాదా ॥మే॥**

**హీనమైన మల మూత్ర రక్తముల**
**కిరవంచు మాయామయమైన చాన ॥మే॥**

**కనులనేటి యంపకోల చేత గుచ్చి**
**చనులనెడి గిరుల శిరము నుంచి**

**పనులఁజేతురట, త్యాగరాజనుతుని**
**బాగనీవు భజనఁజేసికొమ్మి స్త్రీల ॥మే॥**

సర్వసాధారణముగ, మాయాజాలమున చిక్కి స్త్రీ మోహమున చిక్కికొనియే యుందురు. రక్త మాంసాదులగు మాలిన్యములతో నిండిన స్త్రీల శరీరములు, స్త్రీ సంగులైనవారున్నూ, పురుషులైననూ, స్త్రైణులనియే సంకేతము కావున, వారి హావభావ విలాసములు కనుగట్టు మాయలు. కావుననే, సహజ మోహినులగు స్త్రీలు తమ కనుల చూపులనే అంపకోలలు= అనగా ఇనుముచే వాడిగల బాణాకారములుచేసి కట్టెలకు అమర్చినవి. వాటితో గ్రుచ్చియెత్తి ఉన్నతములైన కుచములనెడి గిరులపై శిరములను మోపి ఏమేమో అకృత్యములు చేతురు. ఓ! మనసా! నీవావంకఁబోక, శ్రీరాముని బాగుగా భజన చేసికొని బాగుపడుమని అన్యాపదేశముగ బోధించినారు.

## 335. మాయా మాళవగౌళ – దేశాది

**మేరు సమానధీర వరద రఘు**
**వీరఁజూతాము రారా! మహా ॥మే॥**

**సారసారపొయ్యారపు నడలను**
**నీరదకాంతిని నీఠీవిని మహా ॥మే॥**

**అలకల ముద్దును తిలకపుఁదీరును**
**తళుకు చెక్కులచేఁదనరు నెమ్మోమును**
**గళమున శోభిల్లు కనక భూషణముల**
**దళిత దుర్మానవ త్యాగరా జార్చిత ॥మే॥**

దివ్య మోహన శృంగార వైభవముతో శ్రీరాముని భావించుకొని, తన హృదయమున రూపుగట్టినట్లు, భావానుకూలమైన స్వరరాగ మేళనముతో, రారా! యని చనవుగల తల్లి లాలించునట్లు ఇందు రాముని



ఆహ్వానించుచున్నారు. మేరువు బంగారు కొండ కదలి వచ్చినట్లు ధీరత్వముకలిగి, అందరి కన్ని వరములనిచ్చు, ఓ! రఘువీరా! నిన్ను చూతామని ఉవ్విళ్ళూరుచున్నాము. రమ్ము. నీ రాకలో సారవంతమైన అనగా సార్థకమైన ఒయ్యారముతో కూడిన గమనముకలదు. నీలమేఘ సమమైన నీ కాంతి ఠీవిని కులుకుచున్నది. చూడవలెనని యున్నది.

ఆపై అలకలు ముద్దు లొలుకుచున్నవట. వాటి శోభలో తీర్చిదిద్దిన కస్తూరి తిలకము తళుకు చెక్కిళ్ళచే శోభాయమానమైన నీ ముఖారవిందము, వాటికి దోహదముగ కంఠసీమ నలంకరించిన సువర్ణ భూషణములు, కలిగిన నీ మోహన రూపము చూడవలెనని చిత్తము తత్తరపడుచున్నది. చూతాము రారే! యని తన పరివారమును పేరంటమునకై పిలచినట్లు తన్మయత్వ మిందు గోచరించుచున్నది.

అన్ని యానందములకు, సుఖములకు చిత్తమే మూలము. దానిని రసపుష్టితో స్వాధీనమొనర్చి కొన్నవారే భావుకులు. వారి భావనా సౌందర్యము వారి పలుకులలో వ్యక్తమై లలితపద విన్యాసముతో ఆ మూర్తియే మన కున్నులఁగట్టినట్లు గోచరమగును.

అట్టి మహనీయుల, పాటలు మాటలలో నేదో యొక విలక్షణమైన చైతన్యము జడులను సైతము కదలించి, పులకాంకితులఁజేయును. ఆ మధురానుభూతి ఈ గేయమందు ప్రతి పదమందును వ్యక్తమగుచున్నది; ఇందు ఉపాసన ధ్యానము, యోగము ముప్పిరిగొని లక్ష్యసిద్ధి నందినవి.

## 336. సౌరాష్ట్రం – ఆది

**మేలు మేలు రామనామ సుఖమీ ధరలో మనసా**
**ఫాలలోచన వాల్మీకాది బాలా నిలజాదులు సాక్షిగ ॥మే॥**

**నిండు దాహముఁగొన్న మనుజులకు**
**నీరుఁద్రాగిన సుఖంబుకంటే**

**చండ దారిద్ర్య మనుజులకు ధన-**
**భాండమబ్బిన సుఖంబు కంటే** ॥మే॥

**తాపము సైరించని జనుల కమృత**
**వాపి యబ్బిన సుఖంబు కంటే దరి-**
**దాపులేక భయమందు వేళల**
**ధైర్యముఁగల్గు సుఖంబు కంటే** ॥మే॥

**ఆకలి వేళల పంచ భక్ష్య పర-**
**మాన్న మబ్బిన సుఖంబు కంటే**
**శ్రీకరుఁడౌ శ్రీరాముని మనసున**
**చింతించు సుఖంబు కంటే** ॥మే॥

**సారహీనమౌ క్రోధ సమయమున**
**శాంతము కల్గిన సుఖంబు కంటే**
**నేరని మూఢులకు సకల విద్యా**
**పారముఁదెలియు సుఖంబు కంటే** ॥మే॥

**రామునిపై నిజభక్తి కలిఁగి గాన-**
**రసము తెలిసిన సుఖంబు కంటే**
**పామర చెలిమి సేయనివారి**
**భావములోని సుఖంబు కంటే** ॥మే॥

**చేయఁదగు వేదాంత విచారణ**
**చేయఁగ గల్గు సుఖంబు కంటే**
**బాయక నిర్గుణ భావముగల పర**
**బ్రహ్మాను భవ సుఖంబు కంటే** ॥మే॥

**రాజస తామస గుణములు లేని**
**పూజలఁగల్గు సుఖంబు కంటే**



**రాజశిఖామణియైన త్యాగ**
**రాజుకొసంగు సుఖంబుకంటే** ॥మే॥

రామనామము తారకనామము. ఆంతరమగు పరత్త్వమును ప్రతిపాదించునది. ఆ మహిమ పరమశివునికి, పార్వతికి, వాల్మీకి హనుమదాదులకు మాత్రము తెలియునట. "అగస్త్యోవేత్తి వా? నవా?" అగస్త్యునికి తెలియునో! లేదో! యని సంశయమే. అట్టి రామనామ సుఖము అన్నిటికన్న మేలు అను వరవడిలో, లోకమందలి సర్వసుఖములను క్రమముగా చరణములందు వివరించినారు. దేహ, ఇంద్రియ, మనోబుద్ధులు మనకు సుఖము ననుభవించు ప్రధాన సాధనములు. అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానానంద మయములనెడి కోశములు కేంద్రములు.

ఈ రెండు విభాగములందును మన మనుభవించు సుఖములను వరుసగా చూపి రామనామ సుఖముయొక్క అతిశయము, అనుభవైక వేద్యమని నిర్ణయించుటయే, ఈ కీర్తనయొక్క ముఖ్య తాత్పర్యము.

అందు మొదట ప్రధానమైనవి ఆకలి దప్పులు. ఆకలినైన కొంత సహించవచ్చును గాని, దప్పికి తాళలేము. అంత నిండు దాహము కలవానికి చల్లని నీరు లభించుటచే కలుగు ఆనందము మాటలతో చెప్పనలవికానిది. అట్లే నిరంతర దారిద్ర్యమనుభవించువానికి అప్రయత్నముగ ధనభాండమబ్బుట, తాప తప్తున కమృతము, భీతునికి ధైర్యము, తీవ్రమైన క్రోధము కలిగినపుడు, శాంతము కలుగుట, మూఢునికి సకల విద్యలు లభించుట మొదలగు అనేక సుఖములకంటె రామనామము మేలని నిరూపించుట ఎంతో సహజమై యున్నది.

రామునిపై భక్తియుండి, పూజోపచారములు సల్పుటకన్న మంచి గానముతో రాముని కీర్తించుట అంతరంగానుభవము. ఎంతో గొప్పది.

కాని, దానియందును, కొంత యత్న మవసరమైయున్నది. కావున ఆ సుఖముకన్న రామనామమునట్లే ఆత్మీయ మొనర్చుకొని తన్మయుడగుట విశేషమని చెప్పుట, అయ్యగారి స్వానుభవమైయుండును.

ఆపై విజ్ఞానమయానంద కోశముల భూమికలో, వేదాంత వాక్య విచారణము, నిర్గుణబ్రహ్మ భావమును సైతము స్మరించి, అంతకంటె రామనామ సుఖానుభవము మేలనుటయు, గుణత్రయాను బంధముతో కర్మోపాసనలు చేయుటకంటె, సర్వాత్మనా, సకల సాధనలను రామునందే సమర్పించి, రామనామ సుఖానుభవి యగుటయే విశేషమనుట ఆత్మానుభవము. మరొక కీర్తనలో “సుఖి ఎవ్వరో! రామ నామ సుఖి ఎవ్వరో” యనియు కీర్తించుట గమనింప తగినది.

## 337. గౌళిపంతు - ఆది

**మోసపోకు వినవే, సత్సహవాసము విడువకవే ॥మో॥**

**దాసజనార్తిహరుని శ్రీరాముని**
**వాసవ హృదయ నివాసునిఁదెలియక ॥మో॥**

**అల్పాశ్రయమునఁగల్గు వెసనములు**
**కల్పాంతరమైనఁబోదు శేష-**
**తల్పశయనుని నెరనమ్మితే సం**
**కల్ప మెల్ల నీడేరును మనసా ॥మో॥**

**ధన తరుణుల కాసించుటెల్ల**
**వెనుక తనువు కలసటె గాని**
**మనసుచేత సేవ్యుని దలఁచితే సు-**
**మనసత్వము నొసఁగునే మనసా ॥మో॥**

**గౌరవహీన ధనికులఁగాచుటయు**
**నేరములకు నెడమౌనుఁగాని**



**గారవించు త్యాగరాజ హృదయా**
**గారుని లోకాధారుని దలఁచక ॥మో॥**

మన మనుభవించు సమస్త భోగభాగ్యములు భగవంతుని అధీనములు. ఈ విశ్వమంతయు ఆతని సంపదయే. భగవంతుని విడచినచో మనకేవిధమైన స్వార్థములేక నిరర్థకులగుదుము. ఈ వివేకము సత్సంగమువలన కలుగును. సజ్జనులీ రహస్యమును గుర్తించుట మాత్రమేగాక, సదా ఈ సద్భావమును పోషించుకొనుచూ, తాత్కాలికములు అల్పములు నైన కష్టసుఖములకై ఆశపడరు. చలింపరు. వాసవాదులు= ఇంద్రాదులు సైతము భగవంతుని హృదయమందు భావించుటవల్లనే వారివారి అధికారములందు క్షేమముగా నున్నారు. భగవంతుడు “దాసోఽహం” అన్నవారి ఆర్తిని హరించువాడు. అట్లుగాక, తాత్కాలిక భోగములకై అల్పుల నాశ్రయించినచో, సుఖములేకపోగా అనేక వెసనములు-కష్టములు కలిగి ఆ వాసనలు కల్పాంతమైనను నశించవు. కావున, శేషతల్పుని సేవించినచో, నీ సంకల్పము లన్నియు, స్వార్థములు సైతము ఫలించి, బంధకములుగావు.

ప్రకృతము ధనము, స్త్రీలు అను విషయ సుఖముల నాసించిన, తత్కాలమందు రుచిగా నుండినను. వెనుక తనువునకు= పునర్జన్మకు ఇవన్నియు కష్టములై అలసటనిచ్చును. జన్మపరంపరలో చిక్కులు కలుగునను మాటను ఎంతో లలితముగా సూటిగా తెల్పినారు. అన్ని అనర్థములకు మనసే కారణము. వివేకమునకు మనసే సాధనము. కావున, మనసున కధిష్ఠానమైన భగవంతుని సేవించినచో సమనసత్వము-సౌమనస్యము, దివ్యత్వమే కలుగును. మానవాతీతమైన దేవత్వమే కలుగును.

గౌరవము లేని ధనికుల ఆశ్రయము తర్వాత నేరములకే మూలమగును. గారాబముతో నిన్నుఁజూచు హృదయాగారుడు నీ హృదయమందున్నవాడు,

నీకెంతో సన్నిహితుడైన భగవంతుని సేవించుము. మోసపోకుమని ప్రబోధించినారు.

## 338. మోహన - ఆది

**మోహన రామ! ముఖజితసోమ! ముద్దుగ బల్కుమా ॥మో॥**

**మోహన రామ మొదటి దైవమా!**
**మోహము నీపై మొనసియున్నదిరా ॥మో॥**

**ధర మనుజావతార మహిమ విని**
**సురకింపురుష కిన్నర విద్యాధర**
**సురపతి విధి విభాకర చంద్రాదులు కరుగుచు ప్రేమతో**
**వర మృగ పక్షి వానర తనువులచే**
**గిరిని వెలయు సీతావర చిరకాలము**
**గురి తప్పక మైమరచి సేవించిరి**
**వర త్యాగరాజ వరదాఖిల జగన్మో ॥మో॥**

భగవంతుఁడు శిష్టరక్షణము, దుష్టశిక్షణము ప్రధానకర్తవ్యములుగా ఆయా అవతారము లెత్తుట సహజము. మత్స్య అశ్వ, వరాహాద్యవతారములు మనకు సన్నిహితములుకావు. వాటిని అపురూపము చేసికొనఁగల ఉపాసనారీతులు మహాత్ములకే పరిమితములు. వాటి తర్వాత నరసింహరూపమందు సగము మానవాకారమున్నను మహాభయంకరము. ఒక్క ప్రహ్లాద బాలునికి మాత్రమే వారిపట్ల చనువుకలదు. ఆ తర్వాత మొదటి దైవము చరాచర ప్రకృతికి మోహనమైనది రామావతారమే. కావున మోహనరామా! యని పల్లవి నెత్తుకొనుట ఎంతో బాగున్నది: **"ఇష్టస్సర్వస్య లోకస్య శశాంక ఇవ నిర్మలః"** సర్వలోకమునకు ప్రియమ్మైన చంద్రునియందైనను, శశాంకమున్నది. (కుందేలు చిహ్నము) గాని రాముని దివ్య ముఖారవిందము నిర్మలమని వాల్మీకి పేర్కొనినట్లు రాముడు



ముఖజితసోముడు. అట్టి మోహనరామా! నాతో నొకపరి ముద్దుగ మాట్లాడుమని కోరుట ఎంతో మోహనము. విశ్వమానవ ప్రకృతిలో నీవంటి మోహనమూర్తిని మొదటిసారిగా ఇపుడే చూచితిమి. కావున, నీవు మొదటి దైవమవని పిలచుటయు స్వభావమే.

మా మాట అటుంచి, స్వర్గాది లోకవాసులు సైతము, జగన్మోహనమైన నీ మనుజావతారమును చూచి ప్రేమతో కరcగి, వారికి అసహజములైనను, మృగములుగా పక్షులుగా, తుదకు వానర భల్లూకములుగా, తమ అంశలచే పుట్టి మైమరచి గురితప్పక నిన్నే సేవించిరి. నర వానర మైత్రిలోcగల రహస్యమిపుడు మాకర్థమైనది. లేకున్న మనుష్యేతర జంతువులకు నీపై ప్రేమ యుండుటలో ప్రసక్తి ఏమి? వారికిని నీ దివ్యమోహన మనుజాకృతి ఆశ్చర్యకరమైనది అని రామావతార వైభవమును మోహనరూపముగా కీర్తించుట తగియున్నది. "గిరిని వెలయు సీతావర! అను సంబోధనమందు, రాముని మోహనరూపము, అయోధ్యారాజ్య ప్రజలకన్న ఆరణ్యకమైన జీవ జాలమునకే ఎంతో ఆప్యాయతను కలిగించినదను సూచనకు గిరిని=అనగా భద్రగిరిని స్మరించి, అచటవెలసి నీవు ఆరణ్యక జన ప్రియుడవైతివని విశేషభావము. కాని, వారితో నీవు మాట్లాడు నవకాశములేదయ్యో! నాతో మాత్రమట్లుగాక ఒక్కమారు ముద్దుగ పల్కుమని వేడుకొనుట ఎంతో స్వారస్యము.

యీ గేయమును మోహన రాగమందు సంతరించుట, బంగారమునకు పరీమళమబ్బి నట్లున్నది.

## 339. సారమతి - దేశాది

**మోక్షము కలదా భువిలో జీవ-న్ముక్తులుకానివారలకు ॥మో॥**

**సాక్షాత్కార నీ సద్భక్తి-సంగీత జ్ఞానవిహీనులకు ॥మో॥**

**ప్రాణానల సంయోగమువల్ల**
**ప్రణవనాదము సప్తస్వరములై బరగ**
**వీణావాదనలోలుడౌ శివమనో**
**విత మెరుఁగరు త్యాగరాజవినుత ॥మో॥**

జీవన్ముక్తి విదేహముక్తి యని శాస్త్రకర్తలు ముక్తిని రెండు విధములుగా సిద్ధాంతీకరించిరి. పరమార్థాను భవమున వీటికి భేదము లేకున్నను, ముందు వెనకలలో అందమున్నది.

దేహేంద్రియాది సకల పరికరములుండియే, శాస్త్రాచార్యోపదేశమునను, శ్రవణ మననాదులచే, తాను సచ్చిదానంద బ్రహ్మమునను నిశ్చయము కలుగును. సహజ ధ్యానయోగముచే పరమాత్మభావ నిరూఢికలిగి, దేహేంద్రియాది వ్యాపారములు, ప్రారబ్ధాధీనములని, వాటినంటక బ్రహ్మనిష్ఠుడై యుండువాడు జీవన్ముక్తుఁడు. ఇట్టి మహనీయుఁడు జగత్పావనుఁడు. వీని దర్శన, స్పర్శనాలాపములు ప్రజలకు శ్రేయోమూలములు. దేహమును విడచినజ్ఞాని విదేహముక్తుడు. ప్రకృతము ఈ కీర్తనమందు జీవన్ముక్తుడైన వాని అతిశయమును వర్ణించినారు.

జన్మ జన్మాంతరార్జిత సత్కర్మానుష్ఠాన ఫలముచే, ప్రారబ్ధాధీనమైన దేహము విముక్తమై విదేహ ముక్తికలదని శాస్త్ర సిద్ధాంతమున్ననూ, జీవించి యుండగనే అపరోక్షజ్ఞానము సిద్ధించుట యుక్తము.

ఈ జీవన్ముక్తి సాధనములను దిగువ వివరించిరి. సాక్షాత్కార! యను సంబోధనముచే, సర్వేంద్రియాధిష్ఠాత, ప్రేరకమునైన బ్రహ్మమే, ప్రత్యక్షమైయున్నది. అది సిద్ధమయ్యే యున్నందున సాక్షాత్కార! యనుట యుక్తము. అట్టి సిద్ధమైన ఆత్మను దర్శించుటకు భక్తి అంతరంగసాధనము. అట్టి భక్తియు సహజమైన నాదబ్రహ్మోపాసనము కలవారికి ఎంతో సుకరము. నాదబ్రహ్మము సకలేంద్రియ వృత్తులను దాటి సూటిగా ఆత్మను



స్పృశించునది. బుద్ధివృత్తి ఈ నాద సూత్రము ననుసరించెనేని, వినిర్మలమై ఆత్మ సాక్షాత్కార భాగ్యమును పొందును. అట్టి విశుద్ధ నాదము ప్రణవ స్వరూపమై యుండునని యోగుల అనుభవము.

ప్రణవ నాదము, ప్రాణ, అనల= (అగ్ని) సంయోగమునంది, వేర్వేరు భూమికలు అనగా నాభి, హృత్, కంఠ రసన నాసాదులను తాకుటవలన వికృతమై, "రిగమ పదనీ" యను సప్తస్వరములుగా విభక్తమగును. వీటి కలయికనే సంగీతమందురు. లయ వీటియందు, స్వభావముగానే మాత్రాకాల ప్రమాణముతో కుదురుకొనును.

ఈ యనుభవమునకు "వీణ" అనుకూలమైన జంత్రము, వెన్నెముకయైన సుషుమ్న నాడియందు వీణయొక్క ప్రక్రియలు కలవు. కావుననే, కేవల జీవబ్రహ్మైక్య జ్ఞానము నుపదేశించుటకు ఏర్పడిన శివమూర్తి శ్రీ దక్షిణామూర్తి గురురూపముయొక్క స్వరూప ధ్యాన ప్రభేదములలో, మేధా దక్షిణామూర్తి, జ్ఞాన దక్షిణామూర్తి యన్నట్లే "వీణా దక్షిణామూర్తి" యనియు ప్రత్యేక రూపముకలదు. కావుననే, సంగీతము సాక్షాన్ముక్తి హేతువు కానిచో శ్రీ పరమశివుడు వీణను ధరించుట అసంభవము. ఈ విశేషము మంత్రశాస్త్ర ప్రసిద్ధము. కావున "శివమనో వితమెరుఁగరు" అని త్యాగరాజస్వామి సద్భక్తి సహితమైన సంగీతము సాక్షాన్ముక్తి హేతువు అని అనుభవముతో నిరూపించినారు.

కావున, అట్టి నాదానుభవముతో ఇహమందే ముక్తిని సాధించి జీవన్ముక్తుడగుట కృతార్థతయగును.

## 340. జయమనోహరి – ఆది

**యజ్ఞాదులు సుఖమనువారికి సము–**
**లజ్ఞానులు కలరా ఓ! మనసా ॥య॥**

**సుజ్ఞాన దరిద్ర పరంపరుల**
**సురచిత్తుల జీవాత్మ హింసఁగల ॥య॥**

**బహు జన్మంబుల వాసనయుతులై**
**అహి విషసమ విషయాకృష్టులై**
**బహిరాననులై త్యాగరాజు**
**భజియించే శ్రీరామునిఁదెలియక ॥య॥**

భక్తి సిద్ధాంతముయొక్క అతిశయమును తెల్పుపట్ల కర్మయోగ జ్ఞానయోగములు కూడ భక్తిలేనిచో శోభించవని, సార్థకములు కావని అనేక ప్రమాణ వాక్యములు కలవు. కేవల ఆసుర సంపత్తికలిఁగి జీవహింసల చేయుచూ, ఇదేమి? యని అడిగినపుడు, ఈ కృత్యము శిష్ట పరంపరా ప్రాప్తమనియో, విహితమనియో, సమాధాన మిత్తురేకాని, అందలి పరమార్థమును రాజసులై గమనింపరు. వీరు సుజ్ఞాన దరిద్ర పరంపరులు–అనగా పారంపర్యముగా కూడ జ్ఞాన వాసనలేని కర్మఠులని భావము. వారికి సములైన అజ్ఞానులున్నారా? యని ఆశ్చర్యము. **"యజ్ఞోదానం తపశ్చైవ పావనాని మనీషిణాం, యజ్ఞో వై విష్ణుః" యజ్ఞార్థత్కర్మణోన్యత్ర లోకోఽయం కర్మ బంధనః** "ఇత్యాది ప్రమాణ వచనములు యజ్ఞములను స్తుతించినవి; అవి పవిత్రకర్మలని చెప్పినవి. కాని, వేదోక్త కర్మలు కేవల మీశ్వరార్పణ బుద్ధికలిగి నిష్కామ్యముగా చేసినపుడే చిత్తశుద్ధిద్వారా భగవదనుగ్రహమునకు పాత్రములై, విష్ణుప్రీతికరములగునే గాని, కేవల దర్పమునకై రజోగుణ సంపత్తుచే సత్కర్మల నాచరించిననూ, పరమార్థఫలము నియ్యనేరవనియు ప్రమాణములు కలవు.

**"రజసా ఘోర సంకల్పా కాముకా అహిమన్యవః, దాంభికా మానినః పాపాః....యజన్త్యసృష్టాన్నవిధాన దక్షిణం వృత్త్యైపరం ఘ్నంతి పశూన్ అతద్విదః"** రజోగుణముచే ఘోర సంకల్పములు కలవారై కాములు



సర్వక్రోధులు తమ స్వార్థమునకై, విధి దూరులై దాంభికులు హింసాప్రాయములైన యజ్ఞముల నాచరింతురని, వీరు విష్ణుభక్తి దూరులని **"యజంత్య విధిపూర్వకం"** అని భాగవతాది గ్రంథములు నిందించినవి.

కావున, భగవదర్పణ బుద్ధితో సత్కర్మాచరణము యుక్తమని సారాంశము. ఇట్లు భక్తి దూరములైన కర్మాచరణ మెంత విధి విహితమన్ననూ, పరమార్థము కాదని తేలినది.

అందుననూ, శ్రీ త్యాగరాజస్వామివారి కాలమున తిరువాదిలో అందరు ఆహితాగ్నులై యజ్ఞాది కర్మల నాచరించు వాతావరణమందు, వీరీ రీతిని కేవల యజ్ఞనింద చేయు స్వభావము కలిగియుండరు.

పరమేశ్వర భక్తి ప్రామాణ్యమును నిరూపించుటయే ఈ గేయముయొక్క పరమ తాత్పర్యముగాని, యజ్ఞాది సత్కర్మలను నిందించుటగాదని విజ్ఞులు గమనింతురు గాత!

## 341. శ్రీరాగం - ఆది

**యుక్తముగాదు నను రక్షింపకయుండేది రామ ॥యు॥**

**భక్తవత్సల పతితపావన త్రి–**
**శక్తియు కలిగిన దేవుడు నీవె ॥యు॥**

**తొలి దుష్కృతముల నణచే నీ బిరు–**
**దిలను దడుసుకొనెనో**
**పలికి బొంకడను నీ కీర్తియు నే–బాగు లేదు అనెనో**
**తెలిసి తెలియని నీ దాసులఁబ్రోవ–**
**దేవ దయరానననెనోమును**
**వెలసిన భక్తులకే నీ శక్తియు–**
**నెలవైపోయెనో తెల్పుము ॥యు॥**

**వద్దయుండు జనకాత్మజ బల్కవద్దనెనో లేక**
**నిద్దురజితుఁడతికోపముతోడను-నీకేమి వించెనో**
**ముద్దుగ భరతుఁడానందబాష్ప-ముల గనులనించెనో**
**పద్దున పవనసుతుఁడు వద్దని నీ-**
**పదము పట్టుకొనెనో తెల్పుము ॥యు॥**

**చల్లని నీ భక్తి లేదని విధి-కల్లలాడుకొనెనో నా**
**వల్లగాదని పలుకు చెలి మిక్కిలి-వార్తలాడుకొనెనో**
**ఉల్లమునను శ్రీత్యాగరాజు ని-న్నుంచుకొన మరచెనో**
**చెల్లెలైన ధర్మసంవర్ధని-చేరఁబోకు మనెనో దెల్పుము ॥యు॥**

శ్రీరాముడు తననింతవరకు రక్షింపకుండుట యుక్తముగా లేదని తీర్మానించి, అందుకువలయు కారణములను వరుసగా పేర్కొనుటకు ముందు, భక్తవత్సల! పతిత పావన! యని సంబోధించుట ఎంతో యుక్తము. భక్తులయందు వాత్సల్యము కలవాడు భగవంతుఁడు. అట్టి భక్తులయొక్క ఇతర అర్హతలతో, నిమిత్తములేక, పతితపావనుఁడు ఇంకేమి కావలెను? మరియు, త్రిశక్తియు కలిఁగిన దేవుడట. సృష్టి, స్థితి, సంహారములనెడి శక్తి కలవారు త్రిమూర్తులు.

ఆ త్రిమూర్తుల యంశములు రామునియందు మూర్తీభవించియున్నవి. మానవావతారము స్వతంత్రము. సర్వశక్తులు కలది. సర్వదేవతలు పరిపూర్ణమైన మనుష్య స్వరూపమందుండియే, తమ తమ కార్యములను ప్రవర్తింపఁజేయుదురు. **"దైవం మానుష రూపేణ"** అనుమాట సత్యము. శుద్ధసత్త్వ ప్రకృతిగల మానవునకు దేవునికి భేదములేదు. మనుష్యుని అంతః కరణము మలిన సత్త్వప్రధానమైనపుడే జీవత్వము ఏర్పడును. లేనిచో దేవుడే యగును. అదికాక, మానవుని చర్యలందే సృష్టి, స్థితిలయములు వ్యక్తమగును. విశేషించి, మానవావతారమైన శ్రీరాముడు త్రిమూర్తుల స్వరూపమైన



వాడనుట నిర్వివాదము. కావున భక్త రక్షకుడు పతితపావనుడు అనునవి రామునియందు స్వభావరమణీయములు అని వివరించిరి.

భక్తరక్షకుని స్వభావమేమనగా :- జీవులందరు సహజముగా పాపములు కలవారై యుందురు. వారిలో కొందరు పాపకృత్యములనుండి నిర్వేదమంది ఆర్తులై భగవంతుని శరణంది భక్తులగుదురు.

అపుడు భగవంతుని నిర్హేతుక దయయే వీరి పాపములను పరిహరించి, రక్షణనిచ్చును. కావున, పతితపావనుడని భగవంతునికి కీర్తి కలిఁగినది.

ఆపై ఏ అర్హతలు తమకు లేకున్ననూ, దీనులై ఆర్తులై రామా! నీవాడనన్నంత మాత్రమున రక్షింతునని రాముడు పలికియున్నాడు;

నా రక్షణలో, ఎంతటి పాపములనైన అణచే నీ బిరుదు, దీనరక్షణలో నీ ప్రతిజ్ఞ నాపట్ల ఊరుకొన్నవి. నా పాపములను చూచి నీ బిరుదు జడుసుకొన్నదా? నీ ప్రతిజ్ఞకు నే చాలలేదా? యని అన్యాపదేశముగా చమత్కరించినారు. దీనివలన రాముని యందు తనకుఁగల భక్తి విశ్వాసములలో తనకెట్టి యనుమానము లేదని స్పష్టము.

లోకమందు తెలియుట మంచి అధికారమే. ఏమీ తెలియకుండుటయు అధికారమే. తెలిసి, తెలియనివానిని బ్రహ్మకూడ రంజింపఁజేయలేదని ప్రతీతి. అందువల్ల, నీ దయ నన్నట్లు భావించి నా రక్షణకు రాననెనా? లేక ఇదివరకే వెలసిన భక్తులను రక్షించుటలో నా దయ సెలవైపోయెనా? అనగా ఖర్చుపడినదేమో! నని లోకసాధారణమైన భావము.

ఇంతవరకు రాముని స్వీయధర్మమును చమత్కరించి, ఇక వారి పరివారములను స్మరించి, వినోదముగా పలుకుచున్నారు.

రామా! సదా నీ చెంతనే యుండు జానకమ్మ, ఏదో భావముతో నిష్కారణముగా నిన్ను త్యాగరాజునితో పలుకవద్దని వారించినదా? అనగా

భార్య మాటలకు ఎంతటివారైన విచారణ లేకయే లొంగియుందురని, స్త్రీలు, తమకుఁదోచినట్లు మాట్లాడుదురనియు లోకధర్మమును, సహజమర్యాదలో సీతారాములయందు ఆరోపించి పల్కుట చిత్రము.

లేక పదునాల్గువత్సరములు నీకైంకర్యమందే యుండి నిద్దురను సైతము జయించిన లక్ష్మణుడు, విసువుతో ఇంక నెన్నాళ్ళు ఎందరిని రక్షింతువు? చాలును త్యాగరాజుని గొడవ నీకేల? యనెనా?

లేదా తనను విడిచి, మరల ఎచటికైననూ భక్తరక్షణా వ్యాజమున నీవు వెడలుదువేమో! యని భరతుడు ముద్దు చూపుచూ ఆనందబాష్పములు విడచెనా? నీ పాదభక్తుడు ఆంజనేయుడు నిన్ను కదలనీయక నీ పాదములను గట్టిగా పట్టుకొనెనా?

ఇట్లు నీ పరివారమంతయు నాయందేమేమో చెప్పియున్నందుననే నీ విట్లు మిన్నకుంటివి. ఇంతకూ నా విధి సక్రమముగా నున్ననూ నా కింత చింతలేదు. అట్టి విధాతయు, నీయందు త్యాగరాజునకు చల్లని భక్తి అనగా శుద్ధ సాత్త్వికమైన భక్తికలదనియు, కొంచెము రాజసము కలవాడనియు ఏమేమో కల్లమాటలు చెప్పియుండెనేమో! విధియొక్క చేతలలో కల్లతనము ఇంచుక కలిసియే యుండును. అదియే వాని సృష్టిరహస్యము. వాణీ కటాక్షమున్నచో వాడు ముల్లోకములలో రాణించగలఁడు. అట్టి పలుకుల చెలికూడ నా రక్షణయందు ప్రాలుమాలెనేమో!

ఇందరిని విమర్శించుటకంటె, నా పేరింటి దైవము త్యాగరాజస్వామి నాపట్ల నీ ఉపేక్షా భావముఁగూర్చి తలంచలేదేమో! పోనీ నీ తోబుట్టువు నా క్షేత్రాది దేవత ధర్మసంవర్ధనియైననూ, నా ఆర్తిని నీతో చెప్పకూడదా? నా రక్షణలో నీ ఉపేక్ష నాకు సహించరానిది. ఈ తీరు న్యాయముగాదు.

త్యాగరాజస్వామి ఇందు ఇందరి నిన్నివిధములుగా విమర్శించి, ఇందరూ తన రక్షణయందు సహకరించుటలేదని కీర్తించుటలో, అతి



స్నేహము దోషమునే శంకించునన్న న్యాయమున తనకు రామునియందుగల నిర్హేతుకభక్తి నిరూపింపఁబడినది. తన రక్షణలో ఎవ్వరెట్లు అడ్డుపడిరేమో! యను శంకతో, రామపరివారమునంతను పరామర్శించినారు.

రాముడే తనకు ఏకైక శరణ్యమనియు, ఈ పరివారమంతయు రామునికి నిత్య సన్నిహితులనియు రాముడు తప్ప వేరే రక్షకుడు లేడనే సిద్ధాంతమును వ్యంగ్యమర్యాదలో కీర్తించుకొన్నారు. మరియు ఇందరకూ రామునియందు స్వార్థము అనగా పరమార్థము ఉన్నటుల తెలియుచున్నది.

## 342. [1]దర్బారు - ఆది

**యోచనా కమల-లోచనా! ననుబ్రోవ ॥యో॥**

**సూచన తెలియకనొరుల-**
**యాచనఁజేతు ననుచు, నీకు**
**తోచెనా? ద్యుతివిజితాయుత వి-**
**రోచన నన్నుఁబ్రోవనింక ॥యో॥**

**కేచన నిజభక్తనిచయ పాప వి-**
**మోచన గల బిరుదెల్లఁగొని న**

**న్నేచనా? కృతవిపిన చరవరాభి-**
**షేచనా త్యాగరాజ పూజిత ॥యో॥**

రామా! నన్ను కాపాడుటకేదో యోచనచేయుచున్నావా? నాయందే మేని లోపములు నీకు గోచరించెనా? యని పలికి, అందుకు తానే సమాధానించుకొన్నారు.

లోకమందు ఏ పని చేయుటకైనను ఒక పద్ధతి సూటి తెలియవలెను. అట్లు రీతి తెలియక తానేదో చేసినచో ఏదో విపరీత పరిణామము కల్గును.

1. కాపి.

ప్రధానముగా భగవంతుని భజించి, శరణాగతి చేయువానికి రాజరికము లభించినను చిత్తము ప్రలోభమందకూడదు. సర్వార్థములకు భగవంతుడే శరణ్యమనెడి రూఢి యుండవలెను.

త్యాగరాజస్వామి భావనలో అదియే సూచన. అనగా రీతి, సంప్రదాయము. అది తెలియక, నే నితరులను, అనగా ఇతర దైవములను, తాత్కాలికముగా అల్పఫలముల నిచ్చువారిని ఆశ్రయించి, ఏమేని యాచించితినా? అడుగుకొంటినని నీకు తోచినదా ఏమి? నీవద్ద నా దాపరికమేమి?

ద్యుతి విజిత అయుత విరోచనుడవు-పదివేలమంది సూర్యులకన్న మిన్నయైన తేజము కలవాడవు. నీవద్ద ఎవరి కాపట్యము నిలువనేరదు. కావున, నన్ను బ్రోచుటలో యోచనవలదు.

అథవా, నాలో నింకేమైన దోషములుండవచ్చును. ఆ దోషములను చూచి, సామాన్యులు దరికి రానివ్వరు.

రామా! నీ వన్ననో కేచన, ఎవరో కొందరైన నిజభక్తులు ఏ అర్హతలులేని వారైనను, వారి జన్మాంతర సుకృతముచే నీకు నిజభక్తులైనంతనే వారి పాపములను నీవే పరిహరించి, నీవారుగా భావింతువు. అట్టి బిరుదు నీకు కలదు. అందుకు నిదర్శనము విపినచరులు-అరణ్యసంచారులైన వానరులకు రాజైన సుగ్రీవుని ఆప్తుడుగా భావించి, వానికి సామ్రాజ్యము నొసంగితివి. ఆతనియడల ఏ దోషములులేవా? ఉన్ననూ, నిన్ను శరణొందినాడు. అట్టి వానరులను సైతము కాపాడిన నీవు? మనుష్యుడనై నిన్నే భజించు నన్ను ఏచనా? ఏచుట అనగా బాధించుట న్యాయమా అని విశేషము.

## 343. శుద్ధసావేరి - దేశాది

**రఘునందన రాజమోహన!**
**రమియింపవె నా మనసున ॥ర॥**



**నగజానిలజ నారదాది హృ**
**న్నాళీక నివాసుఁడైనఁగాని శ్రీ ॥ర॥**

**చిత్తమందు నిన్నుంచి ప్రేమతోఁజింతించు సద్భక్తుల**
**నుత్తమోత్తములంచు నామది-నెంచి పూజించలేదా**
**తత్తరంబు దీర్పకారణంబు నీవే**
**తాళజాలనిక త్యాగరాజనుత ॥ర॥**

యోగుల చిత్తములను రమింపఁజేయువాడు, తానుగా రమించువాడు కావుననే, రాముడని సార్థకమైన పేరుగలవాడు. విశేషించి, రఘువంశమందు పుట్టినవాడు. ఆపై రాజమోహనుఁడు, అనగా చంద్రునివలె ఆహ్లాద మిచ్చువాడు. చల్లనివాడు. దివ్యసౌందర్యము కలవాడు: అని విశేషించి, రామా! నా చిత్తమున రమింపుమని కోరినారు.

నగజ= పార్వతి, అనిలజ= ఆంజనేయుడు, నారదుఁడు మొదలైనవారి హృదయములనెడి పద్మములందు నిత్యనివాసము కలవాడవైనను, అనగా గొప్పవారి చిత్తములను రమింపచేయువాడవైననూ, నా తాహతులో నా చిత్తమున్నూ నీయందు ఆర్తికలిగి యున్నది. కావున, నా మనసున రమించుట నీకేమి న్యూనతగాదు. కారణమేమనగా:

నీ యంతరంగభక్తులైన మహనీయులను, నా చిత్తమందు భావించుచూ మిక్కిలి ప్రేమతో వారిని చింతించుచునే యున్నాను. భగవంతుని సేవకన్న భాగవతులసేవ భగవంతుని ఆనందింపఁజేయునను సంప్రదాయమును తెలిసి పూజించుచున్నాను.

ఇందు నాకు వేరే కోరికలు లేవు. నా చిత్తమందుకల తత్తరపాటు= తొందరపాటువలన నిలుకడలేదు. చిత్తము చంచలమైయున్నచో భగవద్రూపవైభవము గోచరము గాదు. కావున అనుగ్రహింపుమని వేడుకొన్నారు.

## 344. హంసధ్వని - దేశాది

**రఘునాయక నీపాదయుగ**
**రాజీవములనే విడజాల శ్రీ ॥ర॥**

**అఘజాలములఁబాఱఁదోలి న**
**న్నాదరించ నీవేగతి గాదా! శ్రీ**

**భవసాగరము దాటలేక నే**
**బలుగాసిఁబడి నీ మఱుగుఁజేరితిని**
**అవనిజాధి పాశ్రిత రక్షక-**
**ఆనందకర శ్రీ త్యాగరాజనుత ॥ర॥**

రాఘవా! నీ పాద పద్మములను విడచియుండలేను. నా పాపములను పోగొట్టి నన్నాదరించుటకు నీకన్న వేరెవ్వరూ గతిలేరు. సముద్రమును లీలగా నిగ్రహించిన నీవు భవసాగరమును సైతము దాటించఁగలవాడవనియు, అవనిజాధిపుడవగుటచే పరాశక్తి నీ యధీన మందుండుటయు, ఆశ్రిత రక్షకుడ వగుటను, ఆంతరమున తారకరూపుడవై ఆనందమిచ్చువాడ వగుటను, సర్వస్వమునకు నీవే ఆధారుడవని నీ మరుఁగు చేరితిని, నీవే శరణ్యమని నమ్మియున్నాను. కావున, నన్నాదరించమని వేడినారు.

## 345. శహన - రూపకం

**రఘుపతేరామ రాక్షస భీమ ॥ర॥**

**భృగుసుత మదహరణ ముని-బృందవందిత చరణ ॥ర॥**

**సరసీరుహ నయన సజ్జనహృదయ నికేతన**
**ధరణీధర ధీర సీతామనోహర**
**నిరవధి సుఖదాప్రమేయ-నిరుపమ నారదసుగేయ**
**కరధృతశరజాల నీలఘనవర్ణామరపాల ॥ర॥**



**తరుణారుణ శుభచరణ, తరణివంశ విభూషణ**
**వరుణాలయ మద దమన వారణావన**
**కరుణాకర గిరీశచాపఖండన నిర్జితతాప**
**పరిపూర్ణావతార పరభామినీ దూర ॥ర॥**

**హరిహయ పంకజ భవనుత పురవైరి పరాశర హిత**
**నరవర వేషతారక నామధేయ**
**స్వరజిత ఘనరవపరేశ శతభాస్కర సంకాశ**
**పరిపాలిత త్యాగరాజ పాహి భక్తసమాజ ॥ర॥**

భృగుసుతమదహరణ= పరశురాముని గర్వమును హరించినవాడు, ధరణీధరధీర= పర్వతమువంటిధైర్యము కలవాడు. నిరవధిసుఖద= అఖండమై సుఖమిచ్చువాడు. అమరపాల దేవతలకు పాలకుఁడు. తరుణారుణ శుభచరణ= బాలసూర్యునివంటి రక్తిమ కల పాదములు కలవాడు. తరణివంశ= సూర్యవంశము వరుణాలయ= సముద్రముయొక్క వారణావన= గజరాజరక్షకుడు.

గిరీశచాపఖండన= శివునివిల్లు విరచినవాడు. నిర్జితతాప= తాపముల కతీతుడు.

హరి....నుత= ఇంద్రబ్రహ్మలచే స్తుతింపఁబడువాడు. స్వరజిత ఘనరవ= మేఘధ్వనివంటి స్వరముకలవాడు-

కేవల సంస్కృత విశేషములతో శ్రీరాముని స్తుతించి కీర్తించినారు.

## 346. పంతువరాళి - ఆది

**రఘువర నన్ను మరువ తగునా ॥ర॥**

**నగధర భక్తజనాఘ నివారణ ॥ర॥**

**తల్లిదండ్రు లన్నదమ్ములు ఉన్న**
**పొలతికి ఒకఁడు పురుషుండౌనా** ॥ర॥

**పరదైవములు బాగుసొమ్ములు**
**సురనుత మంగళసూత్రమౌనా** ॥ర॥

**చేసిన పుణ్యచయము బ్రాహ్మణ్య**
**ఆసనొసఁగితి అనుపమ లావణ్య** ॥ర॥

**మనసున నీకై మరులుకొన్నాను స**
**జ్జనహిత త్యాగరాజ వినుత రామ** ॥ర॥

భక్తుల పాపములను నివారించుట భగవంతునికే సాధ్యమగును. లోకమందు ఆప్తులనుకొనువారుకూడ ఎదుటివారల మంచినే అనుభవింతురుగాని దోషములున్న దరికిరారు. భగవంతుడు తనను శరణన్నవారి దోషములనే పరిహరించి వారికి సద్గతిని కలిగించును. భక్తులపట్ల భగవంతునికి ఏదో ఆంతర్యమైన అనుబంధమున్నది. **“సాధవోహృదయం మహ్యం సాధూనాం హృదయం త్వహం”** అది హార్దమైనది. అసలు భక్తజన హితవు కొరకేగదా! భగవంతుఁడు శరీరధర్మముతో నవతరించును.

కావుననే, భక్తజనాఘనివారణ= భక్తుల పాపములను నివారించునట్టి రఘువరా! నన్ను మరువవలదని పల్లవిలో పాడుకొని, తర్వాతిచరణములందు ఆంతర్యమైన ఆదర్శములను వరుసగా కీర్తించినారు. తల్లిదండ్రులు, అన్నదమ్ములెందరున్నను స్త్రీకి సన్నిహితముగా బాహ్యాభ్యంతరములలో ఐహికాముష్మిక ఫలానుభవములో ధర్మార్థకామ పురుషార్థములో ఒక పురుషుడు, అనగా భర్తవంటివారగుదురా? యనుట ఎంతో ఆంతరమైన ఆదర్శము. మన భారత సంస్కృతిలో దాంపత్య ధర్మము లోకాంతరములందు



సైతము రాయబారము సేయఁగలది. భక్తియొక్క రక్తిని సూచించుచూ **“సాధ్వీనైజవిభుం”** అని ఆదిశంకరులు ఉదాహరించినారు.

అంతకన్న విశేషించి స్త్రీకి ఎన్ని విలువైన ఆభరణములు ఉన్నను సుమంగళీ చిహ్నము, పాతివ్రత్యమును సూచించు మంగళసూత్రమువంటి వగునా? యని సూటిగా ఉపమించిరి. ఇతర అలంకారములు న్యూనములు కాకున్నను, మాంగళ్యముకన్న ఖరీదైనవైననూ, ఇతర దైవములవంటివనియు, రాముడు తారకనాముడై సాక్షాదాత్మీయుడనియు, ఇష్టదైవమనియు, విశేషించుట ఎంతో బాగున్నది. ప్రథమ మానవావతారము. పుంసాం మోహనరూపము. అన్ని విధములైన ఆదర్శములతో మానవులకు దివ్యత్వము ననుగ్రహించఁగల దైవము. అని ఇందలి ఆంతర్యము.

కావుననే, తాను చేసిన పుణ్యవిశేషమునంతను రామా! నీకై సమర్పించితిని. నీవు బ్రహ్మణ్యుఁడవు–అనగా బ్రహ్మణ్యులు తపస్సంపన్నులు. జ్ఞానులగువారిని దైవముగా భావించువాడు, భగవంతుఁడు. ఈ మాట బ్రాహ్మణాది జాతిమాత్ర పరముగాదు. **“యజ్ఞోదానం తపశ్చైవ పావనాని మనీషిణాం”** అనుటచే యజ్ఞాదులే భగవంతుని శరీరేంద్రియ ప్రాణశక్తులు. కావున, బ్రహ్మణ్యము విలువైనది. కావున, నీ, నా ఆంతర్యము విశిష్టము. ఇన్నిటికి మనసు ప్రధానము. అయ్యది నీకే మరలుకొనియున్నది. సజ్జన హితుడవు కావున, అనేక కారణములచే నన్ను మరువఁదగదు. నీ, నా నడుమ మరుగుండరాదని ఆంతరంగిక భావములతో కీర్తించినారు.

## 347. [1]హుసేని – రూపకం

**రఘువీర రణధీర–రారా రాజకుమార** ॥ర॥

**భృగుసూనుమదవిదార–బృందారకాధార** ॥ర॥

1. ఖరహరప్రియ.

**రావణ ఘటకర్ణబలారాతిరిపు నగనగారీ,**
**స్థావర జంగమరూప–త్యాగరాజహృచ్చారీ ॥ర॥**

భృగుసూను= పరశురాముడు, బృందారకాధార= దేవతలకు ఆధారమైనవాడు ఘటకర్ణ= కుంభకర్ణుడు, బలారాతి= ఇంద్రజిత్తులనెడు, రిపుశత్రువులనెడి, నగ= పర్వతములకు, నగారీ= ఇంద్రునివంటివాడు.

రాముడు రణధీరుడు రాజకుమారుడనుటచే ఉత్తమక్షాత్రధర్మము (స్వధర్మము) సూచితము. పరశురామ గర్వభంగ మొనర్చుటచేతను దేవతలకు ఆధారమగుటచేతను, రావణాదులను సంహరించుటద్వారా దుష్టశిక్షణ–శిష్టరక్షణయను దివ్యలక్షణములు సూచితములు. ఆపై స్థావరజంగమ ప్రపంచమంతయు రామరూపమనుటచే, నామరూపములు వదలి చిన్మయస్వరూపుడనియు, త్యాగరాజహృదయ సంచారుడనుటచే, శివునికి అభిన్నుడనుటయేగాక, ఆత్మస్వరూపుడనియు స్తుతిలోనే పరమాత్మలక్షణములను క్రమముగా పేర్కొన్నారు.

## 348. శంకరాభరణం – ఆది

**రమారమణ రారా ఓ ॥ర॥**

**సమానమెవరు వినుమా నా మనవిని**
**తమాము పొగడఁదరమా౾హిపతికిని ॥ర॥**

**బుధాద్యవన దశరథార్భక మనో**
**రథం బొసఁగు సుమరథార్వసద్గుణ ॥ర॥**

**కలార్థభూష సకలార్థ శశధర**
**కలాధరనుత వికలార్తి సంహర ॥ర॥**

**రణాధిశూర శరణాగతాత్మ చ**
**రణంబు భవతారణంబు చేసును ॥ర॥**



**ముఖాబ్జమును శతముఖారి జూపు స**
**ముఖానఁగొలుతు, దుర్ముఖాసుర హరణ ॥ర॥**

**బిరాన బ్రోవగరాద శ్రీమద**
**గ రాజధర త్యాగరాజ సన్నుత ॥ర॥**

ఓ రమారమణుడా! రారా యని విలక్షణమైన అనుభవముతో, చనవుతో పిలచుటలో నొక తన్మయ భావము గోచరించును. మామూలు ధోరణి తమాము= ఎల్లపుడూ లేక పూర్తిగా నిన్ను స్తుతించుటకు అహిపతికి= ఆదిశేషునికైన తరమా! యనుట అనంతకల్యాణగుణపూర్ణుడు రాముడని ఉదాత్తమైన భావము. ఆపై కలార్థభూష–అనగా అరువది నాల్గుకళలయొక్క అర్థమే అలంకారమైనవాడు. కళలు పరస్పర భేదములు కలవి – ఈ కళలకన్నిటికీ అర్థమైన పరమార్థవస్తువు సాక్షాత్ శ్రీరాముడేయని భావము. అన్ని కళలు ఆ రామతారక బ్రహ్మమందే ఏకీభవించి ఆనందమిచ్చునవి. కావున, సకలార్థ! యనుటచే సర్వార్థములచే పూర్ణమైనవాడు రాముడని సారాంశము. అందువల్లనే శశధరుడైన చంద్రుని కళను ధరించిన శివునిచే నుతింపఁబడువాడు. ఇందుకు పరమ ప్రయోజనమే, వికలులు దీనులైనవారి ఆర్తిని హరించుట. విశ్వరక్షణము రామునికే చెల్లినది.

రాముడు రణాధిశూరుడు, మహావీరుడైనను, శరణాగతులైనవారికి, ఆత్మచరణంబు, యోగిధ్యేయమైన దివ్యపాదారవిందము, తాత్కాలికమేగాని, భవతారణము–జన్మ సంసారములనుండి తరింపఁజేయును.

దుర్ముఖుడు మొదలైన అసురులను హరించుటేగాక, శతముఖములుగల రావణుని సైతము సంహరించిన నీ దివ్యముఖారవిందమును నాకొకమాటు చూపుము. నీ సముఖాన నిలిచి సేవించుకొందును. అనగా శతముఖరావణుడు, దుర్ముఖుడు మొదలైన శత్రువులుకూడ నీ ముఖారవింద దర్శనముచే ముక్తులైనారు. కావున, నేను భక్తితో నీ సముఖమున కొల్తును.

కావున, త్వరగా నన్ను కాపాడుము. అగరాజధరుడవు. కొండలను సైతము భక్తరక్షణకై ఎత్తిన నీకు అస్మదాదులను రక్షించుట భారముగాదని; ఈ కీర్తనమును ఎంతో రక్తితో భక్తితో, ఉత్సాహముతో కీర్తించినట్లు ఇందలి విశేషములు సూచించుచున్నవి.

## 349. సుపోషణి - రూపకం

**రమించువారెవరురా-రఘూత్తమా నిను వినా ॥ర॥**

**శమాదిషడ్గుణగణ-సకలభువన జనులలో ॥ర॥**

**"రమ్" యనే సుమర్మము, రామయనే శర్మము, లస**
**దమరవరుల కబ్బెనో-త్యాగరాజ సన్నుత ॥ర॥**

"రామ" అను మధుర నామమందుగల అర్థపరమార్థములను ఈ కీర్తనయందు వివరించినారు.

రఘువంశమందు ఉత్తముడుగా అవతరించిన రాముడే యోగులను, భోగులను ఏకముఖముగా రమింపజేయుటయే విశేషము.

**"రమంతే యోగినోఽనంతే పరానందే చిదాత్మని, తేన రామ ఇతి ప్రోక్తః"** చిదానంద ఘనమైన పరమాత్మ తత్త్వమందే యోగులు రమింతురట; అనగా రాముని దివ్యరూపమును దర్శించినంతనే, యోగులకు పరానంద సుఖము కలిగి పరమాత్మ సాక్షాత్కారమందెదరట. ఇందుకు ఆత్మగుణములైన. 1. శమము - అంతరింద్రియ నిగ్రహము. 2. దమము - బాహ్యేంద్రియ నిగ్రహము. శాంతి, ఉపరతి, తితిక్ష. శ్రద్ధ సమాధానము. అనునవి కలిగినగాని అంతర్దర్శనము సిద్ధించదు. ఇట్టి ఉత్తమసాధనా సంపన్నులకు పరమాత్మ తత్త్వము రామరూపమున గోచరించును. ఇది ఆంతరనుభవము. ఇక సకల భువనములందలి జనులలో రామునివంటి పుంసాం మోహనరూప మెవ్వరియందును కానరాదు. అందరియందును, అంశాంశములుగానే



ఆనందము, రూపసౌందర్యము పరిమితములై యుండును. పరిపూర్ణమైన సౌందర్యము, ఆనందము రామునియందే కలవు. కావున, రాముడే, సర్వసౌందర్యములకు సద్గుణములకు కేంద్రము. అందుచేతనే నిను వినా సగుణ-నిర్గుణతత్త్వములచే రమించువారెవరురా? యని కీర్తించినారు.

చరణమందు రామనామవైభవమును కీర్తించుచూ. రమయతీతి= రామః, అందరినీ రమింపఁజేయువాడుగాన రాముడు అనే అర్థమందు రమ్= ధాతువునకు క్రీడయని అర్థమనియు ఇది సుమర్మమనియు, అనగా రహస్యార్థమనీ, "రామ" యనే మధురనామము ఉచ్చరించినంతనే "శర్మము" పరమ సుఖము కలుగుననియు వివరించి, ఈ రామశబ్దమాధుర్యము దేవతల కబ్బినదని ఆ దేవతలందరు రామతత్త్వము నుపాసించియే వారివారి ఆనందములను అనుభవించినారనియు విశేషభావమును కీర్తించినారు.

రాముడు, శివ-విష్ణువుల అవతారమైనను, శివ విష్ణువులందు అనుభవించలేని ఆనందము-రక్తి, సుఖము దేవతలకు సైతము రామునివల్లనూ, రామనామమువల్లనూ కలిగినవని తాత్పర్యము. కావున, రామావతారము, సకల మానవులకు దేవతలకు ఆనందమిచ్చి రమింపఁ జేయు వారధివంటిది. భగవంతుని ఇతరావతారములందు దేవ, మానవుల సారధ్యము ఇంతగా కన్పించదు. అవి దుష్టశిక్షణము-శిష్టరక్షణము అనే చట్టబద్ధమైన లక్షణములు కలవి. శ్రీకృష్ణావతారము మానవస్వరూపముగా గోచరించిననూ, యోగీశ్వరేశ్వరుడగుట మానవాతీతమైన పద్ధతులుకలవు. రాముడట్లుగాక, యోగుల మొదలు సామాన్య మానవుల ప్రవృత్తివరకును తన దివ్యలక్షణములచే అందరి నన్నివిధములచేతను రమింపఁజేసినాడు. అందరు వారి వారి అధికారానుసారముగా రామునియందు, రూప, నామ, స్వరూపములందు ఏకముఖముగా రమించి, ఆనందించినారనుట విశేషము-ఇంతటి తత్త్వార్థమును ఈ చిన్న కీర్తనయందు ఇమిడ్చి శ్రీత్యాగరాజస్వామి, రామతత్త్వమును మనకాదేశించినారు.

## 350. టక్కా – ఆది

**రాకాశశివదన ఇంక పరాకా ॥రా॥**

**నీకా గుణము కారాదవనీ–కాంతకరుణా స్వాంత ॥రా॥**

**నమ్మియున్న నిజదాసులకు–నమ్మికలనొసఁగి మరతురా.**
**తమ్మికనులనొక పారినను–దయఁజూడరాదా మరియాదా ॥రా॥**

**పారి పారి నిన్నుదినము– కోరికోరిన వారిని, యీ**
**దారిఁబ్రోచితివా మాయా–ధార! రారా ఏలుకోరా ॥రా॥**

**నీవే తెలిసికొందు వనుచును–భావించుచును నేను నీ పద**
**సేవ జేసితి మహాను–భావ త్యాగరాజునిపై ॥రా॥**

రామా! నీవు రాకాశశివదనుడవు. పూర్ణిమనాటి చంద్రుని కాంతిగల వదనము కలవాడవు. (నీ కనుచూపుమేరలో కూడ చీకటి ఆవరణము లేదని భావము) అయినను నా విషయమై నీకింత పరాకా? "నీకా గుణము కారాదు. కరుణాంతరంగుడవు సర్వప్రకాశమానుడవైన నీకీ పరాకుండుట న్యాయముగాదు. విశేషించి అవనీకాంతుడవగుటచే జాగరూకుడవై, అందరినన్ని విధముల పరిపాలించు బాధ్యత కలిగియున్నావు. నిన్నే నమ్మియున్న నిజదాసుల నమ్మికలను విశ్వాసములను మరతువా? ఏదీ నీ తమ్మికనులు–పద్మనేత్రములతో నన్నొకమారు చూడరాదా! ఇట్లుండుట నీకు మర్యాదయగునా! ఈవరకెందరో పదేపదే నిన్నే కోరి వేడుకొన్నారు గదా? వారి నందరినిట్లే ఈ దారినే ఆదరించితివా! వారివారి నుద్ధరించుటకెంత క్లేశమునైనను సహించి, వీరు నన్నే నమ్మియున్నారని తలచి ఓ! మాయాధారీ! అనేక మాయలను ధరించి కాపాడితివే. నేనట్లు కాదా!" మాయాధారి. మాయలమారివని అధిక్షేపము.)

ఇంతవరకూ నాదైన్యమును నీవే గమనింతువని నా ఆర్తిని తొలగింతువని పదేపదే నిన్ను వినిపించనేరక, నీ పాదసేవ సేయుచున్నాను.



ఓ మహానుభావుడా (చమత్కారము) నా పట్ల పరాకువహించుట న్యాయముగాదని తానెంతో రాముని నేరమును సహించినట్లు అమాయకమైన ఆర్తితో, స్వాతంత్ర్యముతో తన నిజాయితీని నిరూపించుకొనుచు కీర్తించుట స్వభావ రమణీయమై యున్నది.

## 351. ఆందోళిక – దేశాది

**రాగ సుధారస పానముఁజేసి రాజిల్ల వె ఓ మనసా ॥రా॥**

**యాగ యోగత్యాగ–భోగఫల మొసంగే ॥రా॥**

**సదాశివమయమగు–నాదోంకారస్వర**
**విదులు జీవన్ముక్తులని–త్యాగరాజు తెలియు ॥రా॥**

సంగీతమందు రాగమనునది కేవల నాదాత్మకమై, సప్తస్వర వినిమయ విన్యాసములతో గాయకుని మనోధర్మమునను సరించి వినువారికి ఆపాత మధురమైన ఆనందాన్ని కలిగించును. ఆ రాగము మాధుర్యముతో సుధారసము–అమృతమువంటిదే. అది ఆంతర్యముగా మనసునకు హాయిని ఆనందమును కలిగించును. ఇందు భాషాసాహిత్యము యొక్క ప్రసక్తిలేదు. సప్తస్వరముల కలయికలో కూర్పులోనే గాయకునికి సాహిత్యపుష్టి కలగవలెను. వాని సమ్మేళనమే సాహిత్యము. **"సహితానాంభావః సాహిత్యం"** అని నిర్వచనం. కొన్ని విభిన్ననాదముల యొక్కగాని, శబ్దార్థముల యొక్కగాని కలయికనే సాహిత్యమని లక్షణకారులు చెప్పిరి. కావున వేర్వేరు స్వరసమ్మేళముతో కేవల నాదాత్మకమైన రాగములు, వాటి భావములు ఆయా రసానుకూలముగా ఆయాదేవతాస్వరూపములను, నాదోపాసలకు సాక్షాత్కరింపఁజేయును. కావుననే, శ్రీ త్యాగరాజస్వామి అట్టి రాగసుధారసపానముచే రక్తినందమని మనసును హెచ్చరించినారు. ఈ నాదానుభవము, యాగములయు, యోగము యొక్కయు, తదేక ధ్యానముచే కలుగును. త్యాగము యొక్కయు ఫలము నిచ్చుచూ లోకమందనుభవించు

అన్ని భోగములనుదాటి బ్రహ్మానంద ఫలమిచ్చునని భావించినారు. కేవల నాదోపాసనము బ్రహ్మానందమునకెట్లు సాధనమో చరణమందు వివరించినారు. నాదము ఓంకారమయము. సదాశివతత్త్వమునకు ఈ ఓంకారమే ప్రతీకము. **అకార ఉకార మకార స్వరముల కలయిక అయిన ఓంకారమే సప్తస్వరములకు మాతృక అయియున్నది.** సప్తస్వరములు ప్రణవనాదమందే అంతర్లీనములైయున్నందున, రాగభావమును ప్రణవనాదలక్ష్యముతో నాదోపాసనము చేయువారు జీవన్ముక్తులు. వీరికి ఇతర సాధనా క్లేశములేదు. ఈ యందము త్యాగరాజునికి తెలియును. అనగా శివునికి తెలియునని తనతో శివునికి అభేదమును కీర్తించినారు.

## 352. రీతిగౌళ - రూపకం

**రాగరత్నమాలికచే-రంజిల్లునట హరిశత ॥రా॥**

**బాగసేవించి సకల-భాగ్యమందుదాము రారె ॥రా॥**

**నైగమషట్ఛాస్త్రపురా-ణాగమార్థ సహితమట**
**యోగివరులు ఆనందము-నొందే సన్మార్గమట**
**భాగవతోత్తములుకూడి-పాడే కీర్తనములట**
**త్యాగరాజుకడతేర-తారకమని చేసిన శత ॥రా॥**

ఇందు శ్రీ త్యాగరాజస్వామి, స్వభావమధురము, విలక్షణమైన తీరులో శ్రీరాముని శతరాగ రత్నమాలికతో నలంకరించి, తన సర్వస్వమును రామునికే అంకితమొనర్చి, తనతోడి వారలకునూ, ఈ భాగ్య మందించవలెనని "బాగ సేవించి భాగ్యమందుదాము రారే!" యనుట విశ్వప్రేమను విశ్వశ్రేయమును అందించుచున్నారు. ఇదొక విలక్షణమైన దృశ్యము.

ఇందు, రాగము వేదమువంటిది. మాతృక. అందు రత్నముల వంటివే షడంగములు. వేదాంగములు. వ్యాకరణ మీమాంసాదిశాస్త్రములు.



మాలికలో వివిధ పుష్పసౌరభములవంటివే సప్తస్వరములు. ఈ మాలికలో సూత్రమువంటిదే భక్తి. శతరాగ రత్నమాలిక అనగా నూరు మాత్రమే పరిమితమనికాదు. శతసంఖ్య అనంతవాచకము. ఇట్టి మాలికను రాముని కలంకరించుటయే భాగ్యమనినారు. నైగమ= అనగా వేదము మొదలు పురాణాగమార్థములన్నియు ఈ మాలికయం దిమిడియున్నవని భావము మహాయోగులు ఆనందమనుభవింతురు. వీరి ఆనందము అంతరనుభవము. భాగవతోత్తములు కూడి కీర్తనములను పాడుకొందురు. త్యాగరాజు కృతార్థుడగుటకు, తారకమంత్రసారము అను మకరందమును ఈ మాలికయందు సంతరించుకొని కృతార్థుడగుచున్నాడని తాత్పర్యము.

## 353. దేశికతోడి - రూపకం

**రాజు వెడలె చూతాము-రారె కస్తూరి రంగ ॥రా॥**

**తేజినెక్కి సామంత-రాజు లూడిగము సేయ**
**తేజరిల్లు నవరత్నపు-దివ్యభూషణములిడి రంగ ॥రా॥**

**కావేరి తీరమునను-పావనమగు రంగపురిని**
**శ్రీవెలయు చిత్రవీధిలో-వేడ్కగరాగ**
**సేవనుగని సురలు విరులచే-ప్రేమను పూజించగ**
**భావించి త్యాగరాజు-పాడగ వైభోగరంగ ॥రా॥**

శ్రీరంగ క్షేత్రమున రంగనాథుని తిరునాళ్ళలో నొకరోజు రంగనాథునికి రాజవేష మలంకరించి, అశ్వవాహనమున (తేజి) వేంచేపుచేసి, ఇరు పార్శ్వములందును సామంతరాజులు కొలువు సేయుచున్నటుల రాజ మర్యాదలుగల వేషములను ధరించిన పరివారముతో ఉత్సవము సేయుచుండగా శ్రీత్యాగరాజస్వామి స్వయముగా దర్శించి ఈ కీర్తనను పాడుకొన్నారు.

ఈ యుత్సవ మిప్పటికి చిత్రవీధిలో జరుగుట సంప్రదాయము. ఆ దృశ్యమే ఇందు వర్ణించఁబడినది. కస్తూరిరంగడనియు, వైభోగరంగడనియు, శ్రీరంగనాథునికి ప్రసిద్ధ దివ్యనామములు. ఆపై దివ్యభూషణముల నలంకరించగా దేవతలు కల్పతరు కుసుమములను చల్లుచు పూజించ, ఆ వైభవములో త్యాగరాజు ఎదురుగా నిలిచి పాడుటను ఎంతో ముచ్చటగా శృంగారముగా చిత్రించినారు.

## 354. మణిరంగు - అది

**రానిది రాదు సురాసురులకైన**

**పోనిది పోదు భూసురులకైన**
**దేవేంద్రునికి సుదేహము పూర్వ**
**దేవుళ్ల కమృత మభావమే గాని**
**ఆ వనచర బాధలా మునులకే గాని**
**పావన త్యాగరాజ భాగ్యమా శ్రీరామ ॥రా॥**

కేవల సాత్త్వికమైన దైవసంపదచే సర్వసిద్ధుల నందగలవారు దేవతలు. రాజస తామస గుణసంపద గలవారైనను, తపోబలముచేతగాని, ఇతర సాధనలచేతగాని, ఎంతటి విజయములనైనా, భౌతికంగా సాధించగల సమర్థులు అసురులు. ఈ రెండు విభాగములే సర్వజీవులందును కలవు. **"ద్వౌభూత సర్గౌలోకేఽస్మిన్ దైవ ఆసుర ఏవచ"** (భగవద్గీత). ఈ రెండు వర్గములకుపైన అధికారముగలది దైవము. ఇంతటి వారైనను, భగవదనుగ్రహము లేనిదే, రానిది రాదనియు కేవల దైవసంపదచే, తపస్సే వ్రతముగాగలిగి, ఆకు అలము తినుచూ కేవల వైరాగ్యముతో, మాకేమియు వద్దన్న భూసురులగు మహామునులకు సైతము భౌతికముగా కల్గు దుఃఖములు భగవదనుగ్రహము లేకున్నపోనేరవనే భావముతో "పోనిది పోదు" అని అనుభవరూపమైన సిద్ధాంతమును సూటిగా ఇందు వివరించినారు.



కావున, మనపై సర్వస్వతంత్రము, స్వేచ్ఛా మూలమునైన భగవచ్ఛక్తి అధికారము వహించియున్నదని సోదాహరణముగా ఇందు నిర్ణయించినారు. ఆత్మవేత్తలైన జ్ఞానులు ఈ వర్గములోనివారు కారు. వారు రాకపోకలకు అతీతులు.

పై వివరించిన తీరుగా రానిది రాకుండుట కొక ఉదాహరణము: దేవరాజగు ఇంద్రునికి గౌతమ శాప నిమిత్తముగా శరీరమంతయు కన్నులైనవట. అదేమి సౌందర్యము? వాని హోదాకు తగినట్లు సుదేహమును పొందుటకెన్నో ప్రయత్నములు చేసిననూ, వానికి రానేరదయ్యె. సహస్రాక్షుడనియే కదా ప్రసిద్ధి. ఇట్లే అసురులున్నూ, తేజోబల సంపన్నులయ్యును, అన్నివిధముల దేవతలకు తీసిపోక, వారితో ఎంతో స్నేహమంది, తుల్యమైన ప్రయాసమునంది క్షీరసాగరమును మధించినారు. అందు ప్రధానముగా, అజరామరమైన అమృతము దేవతల పాలైనదేగాని, అసురులకు రాలేదు. ఇట్లే "పోనిది పోదు భూసురులకైన" అనుట కుదాహరణముగా:-బ్రహ్మతేజస్సుగల మునులు మంత్రసిద్ధులు, తపస్సిద్ధులునై జగత్తునంతను తమ వశమం దుంచుకొను ప్రజ్ఞకలవారైననూ, "ఆ వనచర బాధలా మునులకేగాని" అరణ్య జంతువులచేతను, రాక్షసులచేతను నిరంతరము బాధలనుభవించుట మునులకే పరిపాటియైనట్లు పురాణములందనేక దృష్టాంతములు కలవు. అదేమి చిత్రమోగాని ఒకనాటికైన వారికా బాధలు తీరక, రాజవీరుల సహాయ మర్థించక తప్పలేదు. ఇదొక విచిత్రమైన యనుభవము. కావున ఓ! త్యాగరాజ భాగ్యమా! లోకమందలి పై యంశములను పరిశీలింపగా గురు, దైవానుగ్రహమున్న గాని, మానవుని సత్ప్రయత్నములైనను ఫలితమివ్వనేరవని తెలియుచున్నది. దైవమును భజించువారి పరిశ్రమ భగవదనుగ్రహమును ఒక్కటిగా కుదురందవలెను. కావున, నిరంతరం భగవంతుని దయ కెదురుచూచుచూ, తన కర్తవ్యమును నిర్వహించుటయే ఉత్తమమని ఉపదేశము.

## 355. సావేరి - ఆది

రామ బాణత్రాణ శౌర్య
మేమని పొగడుదురా ఓ! మనసా ॥రా॥

భామకాసపడు రావణు మూల
బలముల నేలఁగూలఁజేయు ॥రా॥

తమ్ముడు బడలినవేళ సురరిపు-
తెమ్మని చక్కెర బంచీయగ గని
లెమ్మనుచును ఇంద్రాది బల్క సమ-యమ్మని లేవగా
సమ్మతితో నిలబడి కోదండపు
జ్యాఘోషము లశనులఁజేసి తా
నెమ్మదిగల తోడును జూచెనురా
నిజమైన త్యాగరాజనుతుడగు ॥రా॥

ఈ కీర్తనమందు శ్రీరామ బాణముయొక్క అతిశయమును వర్ణించినారు.

సర్వసాధారణముగా వీరుల బాణములు, వాటి శక్తికొలది ప్రయోగించువాని శక్తితో శత్రు సంహార మొనర్చుట సహజమే. అది ప్రయోక్తయొక్క శౌర్యమును చూపును. రామబాణ మట్లుగాక ప్రయోక్తయైన రామునియొక్క వ్యక్తిత్వముతోబాటు వాని బాణమునకున్నూ ఒక ప్రత్యేక వ్యక్తిత్వమున్నట్లు, రామాయణమం దనేక నిదర్శములున్నవి. కావుననే, ఈ కీర్తనయందు పల్లవిలో "రామబాణ త్రాణశౌర్యమని" విశేష ప్రయోగము కలదు. అనగా, లోకమందలి అందరి శూరుల బాణములు శత్రు సంహారమందే సమర్థములు. రామబాణ మట్లుగాక, శత్రువులను సంహరించిన అనంతరము వారి కుత్తమగతి కల్గునట్లు రక్షణమందును సమర్థతగలదని, ఇందలి "త్రాణ" అను పదమునకు స్వారస్యము.



కావుననే, రామబాణముచే సంహారమును మారీచాదులు, రావణాదులున్నూ కోరుకొన్నట్లు రామాయణమందు కలదు. కాని, ప్రస్తుతము రామబాణశౌర్యము ధర్మరక్షణమందే ప్రవణమై యున్నదను చరిత్ర నిందు వివరించినారు. వాల్మీకియు **"రామస్సత్య పరాక్రమః"** అని పదేపదే కీర్తించును.

భామ కాసపడు రావణు మూలబలమును నేల గూలజేయుట ఒక ఘట్టము. రావణుని దుష్టత్వము పరదారాపహరణము. దానిమూలమున రావణ మూలబలము నేల కూలినది. పరధన పరకాంతల కాసపడువాడు ఆతతాయి. **"ఆతతాయీ వధార్హణః"** అని ధర్మము. కావున, వాని అధర్మమే వాని మూలబల వినాశమునకు హేతువైనది. తర్వాత చరణమందు సౌభ్రాత్రము. భ్రాతృప్రేమ చూపఁబడినది. రావణయుద్ధరంగమందు శక్తిపాతముచే లక్ష్మణుడు నిశ్చేష్టుడైనాడు. అపుడు శత్రువైన రావణుడు తనకు విజయసూచనగా, చక్కెర పంచిపెట్టెనట. అదే సమయమున ఇంద్రజిత్తు, తన సైన్యములను లెండని యుద్ధసన్నద్ధులు కండని హెచ్చరించెనట.

ఎదుటి వీరులు యుద్ధమునకు సన్నద్ధులు కానపుడు తాము యుద్ధమును ప్రోత్సహించరాదు. ఇది యుద్ధ ధర్మము. ఇంద్రజిత్తు ఈ న్యాయమును పాటించక రామ సైన్యముపై దండెత్తి వచ్చెనట. అపుడు రాముడు కోపముచే నిలబడి కోదండముయొక్క నారిని మ్రోగించి పిడుగులవంటి ధ్వనులఁజేసి శత్రువులను చికాకుపరచెను. ఇంతలో లక్ష్మణుడు మూర్ఛనుండి తెప్పరిల్లెను. అట్టి రామబాణత్రాణశౌర్యమెంతని పొగడుదునని కీర్తించినారు. ఇందు భ్రాతృవాత్సల్యరూపమైన ధర్మము వ్యక్తమైనది. కావున, రాముని వ్యక్తిత్వము రామబాణముయొక్క వ్యక్తిత్వము పరస్పరోన్నతి గలవి. అని నిరూపించుట ఇందలి భావము.

## 356. శుద్ధ బంగాళ - ఆది

**రామభక్తి సామ్రాజ్య-మే మానవులకబ్బెనో మనసా ॥రా॥**

**ఆ మానవుల సందర్శన-మత్యంత బ్రహ్మానందమే ॥రా॥**
**ఈ లాగని వివరింపలేను-చాలా స్వానుభవవేద్యమే**
**లీలాసృష్టజగత్రయమనే-కోలాహలత్యాగరాజనుతుడగు ॥రా॥**

మానవజీవితమందు సుఖముయొక్క పరమావధి సార్వభౌమ సామ్రాజ్యము. **"తస్యేయం పృథివీసర్వావిత్తస్యపూర్ణాస్యాత్"** అను శ్రుతియు ప్రమాణము కలదు. ఇది పరమార్థముగాదని యోగుల నిర్ణయము. చిత్తేంద్రియముల వ్యాపారము శాంతించి నిర్వికల్ప సమాధి భాగ్యమే పరమావధి యని యోగశాస్త్రము అనుభవపూర్వకముగ నిర్ధారించినది. ఈ సిద్ధి సాధనములచే సాధ్యముగాదు. కేవల భగవంతుని కృపవల్లనే సిద్ధించునది. భగవంతుని పరముగా ''కృప'' యనియు, అదియే మానవస్వభావమందు "భక్తి" యనియు పెద్దల నిర్ణయము. మనకు భక్తి భగవత్కృపవలనగాని సిద్ధించదు. భక్తియనునది ఫలస్వరూపమేగాని, సాధనగాదు. **"స్వస్వరూపానుసంధానం భక్తిరిత్యభి ధీయతే"** (శ్రీశంకర భగవత్పాదులు) భక్తియొక్క స్వరూపము, శ్రవణకీర్తన స్మరణ పాదసేవనార్చనవందన దాస్య సఖ్య ఆత్మనివేదనా మయమే. ఈ సంపద కేవల భగవత్కృపారూపమే. వేదములందు గల సకల విధులు-కర్మలు సాధనాత్మకములు. భక్తి సిద్ధఫలము-నిర్వికల్పమైన నాదోపాసనము. ఈ భక్తికి ఆత్మభూతమైనది. ప్రకృతం శ్రీ త్యాగరాజస్వామి నాదానుసంధానముతో రామభక్తిని, అనేక జన్మాంతర పుణ్యపరీపాకమున పొంది, అట్టి రామభక్తిని సామ్రాజ్యముతో నుపమించి, యీ భాగ్యమే మానవుల కబ్బెనో యని పాడినారు. ఇందు తనకు అనిన అహంభావము సూచితమగును.

కావున, ఏ మానవులకో! యనుట స్వారస్యము. అట్టి భక్తి నిరంతరము పోషించుకొనుటకు సత్సంగము మిక్కిలి అవసరము. ఈ సత్సంగమున్నూ



కేవల భగవత్కృపవల్లనే కలుగును గాని, మనయత్నసాధ్యముగాదు. ఇదియు తన పుణ్యఫలమేగాని, సాధనముగాదు. ఆ మానవుల సందర్శనము అత్యంత బ్రహ్మానందమని, అయ్యగారి స్వానుభవము. ఈ భాగ్యమును వివరించుటకు మాటలు చాలవు. ఇదంతయు భగవంతుని లీల.

భగవంతుని లీలా సృష్టమైన జగమంతయు సామాన్యులకు కార్య కారణ స్వరూపమైన అనేక భేదభిన్నమై నామ రూపాది చిత్ర విచిత్రమై, భోగ్యమై గోచరించును. భక్తుల కట్లుగాక, భగవంతుని లీలాత్మకముగా, అనగా భగవంతుని శక్తి రూపమున, భగవన్మయముగానే గోచరించును. ఈ దివ్య లీలామూర్తినే "కోలాహలుడు" అని వ్యవహరింతురు. లోకమందు కోలాహల మన్నచో ఏదో సందడి గలభాయని ప్రతీతిగలదు. దక్షిణ భారతమందట్లుగాక, "భక్తకోలాహలుడు" అను పేర దైవమే ప్రతిష్ఠితమై భక్తులచే సేవింపఁబడును. (విళ్ళిపురం ప్రక్క పరనూర్ అను క్షేత్రమున భక్త కోలాహలస్వామి దేవస్థానము మహావైభవముగా భక్తులపాలిటి సిద్ధిక్షేత్రమైయున్నది) ("మరియు ఈ మహాకలిలో సంకీర్తనా ప్రాయములైన యజ్ఞములే, సిద్ధినిచ్చునవి" భాగవతం ఏకాదశ స్కంధమందు కరభాజనుని దివ్యోపదేశము ప్రసిద్ధము.")

కావుననే, పండరియందు పరబ్రహ్మ లింగమైన పాండురంగని నిరంతర సంకీర్తనముతో తరించిన మహాభక్తుల చరిత్రములు ప్రసిద్ధములై యున్నవి.

ఆ పండరినాథుని ప్రతినిధియే భక్త కోలాహలుడనియు తెలియుచున్నది.

కావున, ఈ గేయము భక్తి సిద్ధాంతమునకు స్వానుభవరూపమైన మహోపదేశము.

## 357. ధన్యాసి - దేశాది

**రామాభిరామ మనసు-రంజిల్ల బల్కరాదా ॥రా॥**

**ఈ మహిని వెలసినదేమి- సదా నాతో ॥రా॥**

**బంగారుమేటి పాన్పుపై-భామామణి జానకి**
**శృంగారించుకొని-చెలువొంద నిన్నుఁగని**
**పొంగుచు మల్లెవిరులఁబూజించువేళ శ్రీహరి**
**సంగీతముఁబాడుమను-సామి త్యాగరాజునితో ॥రా॥**

శ్రీరాముడు ఒకపుడేని తనతో మనసు రంజిల్ల మాటలాడవలెనని శ్రీ త్యాగరాజస్వామి వారికి కోరిక కలిగి అందు కనువైన సన్నివేశమును ఈ కృతియందు భావించుకొన్నారు.

ఎందుకింత తమి? యందురేమో! ఈ మహిలో రామా! నిన్నుగాదని, నీ దివ్యకీర్తనా లాపములు గాక, ఇచటవెలసిన సామ్రాజ్యమేమున్నది? ఇచటి విషయ విశేషములేవియు నాకానంద మిచ్చునవిగావు, అని చనువున, నొక సూచన కావించుచున్నారు. భగవంతునిపట్ల స్వాతంత్ర్యముతోబాటు విధేయత చూపుట పరమభక్తులకు పరిపాటి.

రామా! బంగారు మేటి పాన్పుపై సీత శృంగారించుకొని ఏకాంతమున నిన్ను కని పొంగుచూ, "పుంసాం మోహన రూపుడైన రాముడు తనకే భర్తగా లభించినాడని, బాహ్యాభ్యంతరములలో ఆనందమొందుచూ, వసంతమందు మల్లె విరులతో శ్రీరామ పాదార విందములను పూజించువేళ, నన్ను పిలిచి సంగీతము పాడుమని ఆదేశించరాదా!" యని ఒక చక్కని సన్నివేశమును సూచించినారు. సీతారాముల ఏకాంత సన్నిధానము భృగ్వాదులైన మహర్షులకే లభించునది. వారికి సౌఖశాయనికులని సుఖముగా శయనింపఁజేయువారని) కాళిదాసు పేర్కొనినారు. అంతటి వైభవము నిందు అయ్యగారు కోరుకొన్నారు. ఎందరో ప్రభువులు నన్ను సంగీతము పాడుమని ఆహ్వానించుచున్నారు. కాని నా జన్మాంతర సుకృతముచే నాకబ్బిన ఈ నాదోపాసనమును తొల్త నీ దివ్యసన్నిధిలో విన్పించి, ఆ తర్వాత ఎచట పాడినను నాకు తృప్తికలుగును.



కావున, నీ సన్నిధిలో ఈ సేవా భాగ్యము ననుగ్రహించమని ఆదర్శవంతముగా కోరినారు. ఉత్తమ గాయకులకొక విలక్షణమైన సంప్రదాయము నిందు ఆదేశించుటయు విశేషము, చిత్తము సున్నితమైన పరిపాకము గల్గినదైనఁగాని, ఇంతటి అపూర్వమైన భావసంపదరాదు. ఇతర విద్యలకంటె గూడ నాదోపాసకులకీ ఉత్తమ లక్ష్యముండుట జన్మాంతర భాగ్యమనక తప్పదు.

## 358. సావేరి - ఆది

**రామం భజేహం సదా రాక్షసకుల భీమం ॥రా॥**

**శ్యామం సకల సుజన హృదయ జలధి**
**సోమం జనకసుతాభి రామం ॥రా॥**

**సుందరముఖ మరవిందనయన మఘ**
**బృంద పర్వత పురందర మనఘ స**
**నందన నుత మానందజలధి మహి**
**బృంద సుభూషణ వందిత చరితం ॥రా॥**

**ధీరం సురపరివారం భువనా**
**ధారం సుగుణాకారం సమలం**
**కారం దుర్జనదూరం శ్రీ రఘు**
**వీరం మే హృదివారం వారం ॥రా॥**

**రాజం నతసురరాజం స్తుత గజ**
**రాజం శ్రుతి వినుతాజం నుత రతి**
**రాజం తురగ విరాజం సుజన స**
**మాజం త్యాగరాజ రాజం ॥రా॥**

సకల సుజన...సోమం= సుజనుల హృదయములనెడి సముద్రమునకు చంద్రునివంటివాడు. అఘ...పురందరం= పాపములనెడి పర్వతములను

ఛేదించు ఇంద్రునివంటివాడు. అహి...చరితం= సర్ప భూషణుడైన శివునిచే నమస్కరింపఁబడు చరిత్రకలవాడు. (శివునికి రామాయణమందు ప్రీతి) వారం వారం= మాటి మాటికి, నతసురరాజం= ఇంద్రునిచే నమస్కరింపఁ బడువాడు. స్తుతగజరాజం= గజరాజుచే నుతింపఁబడువాడు. నుతరతిరాజం= మన్మథునిచే నుతింపఁబడువాడు. తురగవిరాజం= గరుడవాహనుఁడు–

లలితములైన యమక ప్రాసములతో శ్రీరాముని స్తుతిపరమైన కీర్తనము.

## 359. ఖరహరప్రియ – రూపకం

**రామ నీ సమానమెవరు–రఘువంశోద్ధారక ॥రా॥**

**భామా మరువంపు మొలక–భక్త్యను పంజరపు చిలుక ॥రా॥**

**పలుకు పలుకులకు తేనె–లొలుకు మాటలాడు సోద**
**రులుగల హరి త్యాగరాజ–కులవిభూష మృదుసుభాష ॥రా॥**

శ్రీరాముని దివ్యావతారము మానుషము. మనుష్య ధర్మమందు, తలిదండ్రులు, భార్యా సోదరులు అను కుటుంబ పరిరక్షణము పరమ ధర్మము. ఈ ధర్మాచరణమే దైవానుగ్రహ మందుటకు ప్రత్యేక సాధనము. విధి విహితమైన ధర్మాచరణము భగవంతుని అవతారమునకు ఆదర్శము. విశేషించి, రామావతారము **"రామో విగ్రహవాన్ ధర్మః"** మర్త్య శిక్షణమే పరమ ప్రయోజనము. ఈ సంపదను ఈ కీర్తనమందు వివరించినారు. రామునికి సమానులైన వారెవ్వరూలేరని కీర్తించినారు. రఘువంశోద్ధారక! అని సాభిప్రాయ విశేషణము.

రామా! భామయైన సీత మరువంపుమొలక= అనగా: మరువపు పూవు అనునది ఎల్లపుడూ చెట్టును విడువక చుట్టుకొనియుండు పుష్పజాతి విశేషము. చెట్టునుండి విడదీయుచో ఆ పువ్వుయొక్క ఆకారమే చెడిపోవును.



దీనినే తమిళములో **"మొగడంపూ"** యని వాడుకగలదు. ఈ యుపమానముచే, సూర్యుని సూర్యప్రభను వేరుచేయశక్యముగానట్లు, సీతారాముల దాంపత్యమును వేరుచేయుటకు శక్యముగాదు. అని భావము. మరియు భక్తియను పంజరములోని "చిలుక"యని ఉపమించుట ఎంతో రమణీయము. భక్తియే జ్ఞానము కావున దాని కధిష్ఠానమైనదని భావము.

అట్లే పలుకు పలుకునకు తేనె లొలుకునట్లు మాటలాడు భరతాది సోదరులున్నూ శ్రీరాముని కనన్య భావము కలవారు. రామాదులు నల్వురు సోదరులుగా రూప భేదమున్ననూ, ఆంతర్యముగా వారి ఆత్మీయత రామాయణ మందనేక సన్నివేశములందు స్పష్టముగా తెలియును. కావుననే శ్రీరాముని మానుషావతారము భార్యాసోదర రూపమున గోచరించినను పరమార్థరూపమున ఒక్కటే భగవత్తత్త్వముగా భావుకులు, ఋషులు భావించినారు. ఈ ఉదాత్త భావమునే శ్రీ త్యాగరాజస్వామియు భావించి, రామా! నీ సమాన మెవరని కీర్తించినారు. జీవబ్రహ్మైక్య రూపమైన సిద్ధాంత మిందు వివరింపఁబడినది.

## 360. [1]దిలీపకం – దేశాది

**రామా నీయెడ ప్రేమరహితులకు**
**నామ రుచి తెలుసునా ఓ సీతా ॥రా॥**

**కామినీ వేషధారికి సాధ్వీ నడత**
**లేమైన తెలుసునా రీతి సీతా ॥రా॥**

**తన సౌఖ్యము తానెరుఁగక యొరులకు**
**తగు బోధన సుఖమా**
**ఘనమగు పులి గోరూపమైతే త్యా**
**గరాజనుత శిశువు పాలు కల్గునా ॥రా॥**

---

1. ఖరహరప్రియ–మధ్యాది.

మానవుని హృదయమందు దైవదత్తమైనది రాగము–లేక “ప్రేమ” యనునది దివ్యసంపద. సహజమునైనది. అది ఈశ్వరునియందు కలిగెనేని ఆ పరానురక్తియే భక్తి. అట్లుగాక విషయ భోగములందు మరగెనేని శోక, మోహములను కలిగించును. ఈ రెంటికిని నడుమ మరియొక ఆభాసామాత్రమైన వికారమొకటియున్నది. ఒక వస్తువునందు ప్రేమయున్నట్లు నటించుట వాని హృదయమందు అచ్చముగా నుండదు. దీనిని ఆభాసమందురు. రాముడే సర్వరక్షకుడు. సర్వశరణ్యుడని–మాట మాత్రముగా తెలిసినను, శుద్ధసత్త్వవృత్తితో రామునియందు విశుద్ధ ప్రేమ యున్నచో, రామనామ మందలి రుచియు, రామ చింతనమందు సేవయందును ఆసక్తియు అలవడును. అట్లుగాక భక్తునివలె నటించి, ఎదుటి వారలవలన తన ప్రాపంచిక స్వార్థమునకై ప్రాకులాడు దాంభికుని బండార మొకపుడేని బయలుపడక తీరదు. ఈ భావమునే ఈ కీర్తనయందు సోదాహరణముగా నిరూపించినారు.

రామా! నీయందు ప్రేమ రహితులైనవారికి నీనామ రుచి తెలియునా? యని ఇందు కుదాహరణము.

నీనామ కీర్తనము చేయువారు సైతము, వాతావరణమును బట్టిగాని, సాంఘిక ఆచార మర్యాదలలో మెప్పు నందుటకుగాని పాటింతురేగాని, వారికి నీనామ రుచి తెలిసికాదు.

ఒక నటకుడు స్త్రీ వేషము ధరించి రంగస్థలమున ఆటపాటలచే వినోదించినంత మాత్రమున, కులకాంతలు సాధ్వీమ తల్లులు దైనందినము నడచుకొను తీరు తెన్నులు వానికేమి తెలియును?

మరియు తన సౌఖ్యమే తానెరుఁగక, తనకు ఆత్మానుభవము లేక, తాను విద్యావంతుడైన మాత్రమున ఎదుటివారికి బోధనలు చేసినను, ఒకపుడేని వాని ఆచరణ వెల వెలఁబోక తప్పదు.



ఇంతకూ తానుచేయు కార్యములందు తనకు హృదయమున్నచో అది రాణించి తనకు సర్వ ప్రయోజనములను సమకూర్చును.

ఒక పులికి అచ్చముగా గోవువలె వేషము వేసినను, ఎంత మచ్చిక చేసిననూ, దానికి ఆవుపాలు కల్గునా? పులిపాలే వచ్చును. వేషభాషలతో ప్రకృతి మారదనుటకిది చక్కని ఉదాహరణ–కావున రాముడు సర్వాధారుడు సర్వశరణ్యుడు నని సర్వాత్మనా ప్రేమగలవానికే రామనామ రుచి తెలియుననియు, ఆ రామ తత్త్వము మనలో ఆత్మరూపముగా, గోవుకు క్షీరములట్లు సహజమైయున్నదనియు, కడమ ప్రపంచమందలి సకల విషయములు వస్తువులు మనకెంతో దూరమందున్నవనియు, వివేకులు తమ సౌఖ్యమేదో తామెరిఁగిన బుద్ధిమంతులు తారకనామమునే కీర్తించి రాముని శరణొందినచో ఇహ పరములైన శ్రేయములన్నియు సిద్ధించి ఆనందింతురనే తత్త్వమును అనుభవ ప్రమాణముతో ఆదేశించినారు.

## 361. మధ్యమావతి – దేశాది

**రామ కథా సుధారస పానమొక–రాజ్యము చేసునే ॥రా॥**

**భామామణి జానకి సౌమిత్రి–**
**భరతాదులతో భూమివెలయు శ్రీ**

**ధర్మాద్యఖిల ఫలదమె మనసా**
**ధైర్యానంద సౌఖ్యనికేతనమే**
**కర్మబంధ జ్వలనాబ్ధి నావ మే**
**కలిహరమే త్యాగరాజనుతుఁడగు ॥రా॥**

ప్రపంచమందు రాజ్యాంగవ్యవస్థ మిక్కిలి ప్రధానము. ప్రాచీనము నుండి నేటి వరకును ప్రజలు ఎంతటి శక్తియుక్తులు కలవారైనను తాము సంఘటితముగా నొక పాలకవ్యవస్థను రూపొందించుకొని ప్రభుస్థానము నేర్పరచుకొని అందుకు వలయు నిబంధనముల నేర్పరుచుకొని

ఇహలోకమందు సర్వసౌఖ్యములనందగలరు. ఎవరికి వారు పెత్తనముతో మేమే ప్రభువులమన్నచో, విప్లవమే చెలరేగునుగాని ఎవ్వరికీ సౌఖ్యముండదు. సౌఖ్యమనగా మానవ పురుషార్థములైన ధర్మార్థ కామమోక్షములు పరస్పర విరోధమందక, ఏకముఖముగా మానవునికి అనుభవము కావలయును. అందుకు ప్రధానము గృహరాజ్యము. అందు తలిదండ్రులు సోదరులు భార్యాపుత్రులు పరివారము. ముందీ గృహరాజ్యము చక్కగా తీర్చిదిద్దుకొనురీతి ఏర్పడినచో, లోక రాజ్యమున్నూ చక్కగా నుండును. ఈ రెండిటికిని మూలసూత్రము లొక్కటే. ప్రపంచ రాజ్యాంగమందు, మంత్రి సామంత పురోహితాదివర్గము చతురంగ సేనా పరివారము ప్రధానశాఖలు. ఇంటగెల్చి రచ్చ గెలువమన్న సామెత ఎంతో విలువైనది. ఈ రెంటి విధములైన గృహరాజ్య–లోకరాజ్యములలో ధర్మాది పురుషార్థములు పరస్పర విరోధమొందరాదు. ప్రాచీన భారత ఋషులు చక్కని రాజ్యాంగ చట్టమును నిబంధించినారు. ఆ వరవడిలో సమస్తలోకములందు సకలభూతములందు ధర్మమును పరిపోషించి శ్రీరాముడు రాజ్యమేలినాడు. నిరంతరం **"రామో రామో రామ ఇతి ప్రజానాం అభవన్ కథాః। రామ భూతంజగదభూత్ రామేరాజ్యం ప్రశాసతి"** అని వాల్మీకి కీర్తించినారు. అట్టి రామరాజ్య కాలమందు మనం లేకున్ననూ, ఆ రాజ్యాంగ పద్ధతులు చట్టములు–ప్రధాన సూత్రములకు, కాలపరిణామం లేక శాశ్వతముగా, రామకథ= రామాయణమందు కలవు. రాజ్యాంగ మూల సూత్రములకు దేశ, కాల పరిస్థితులవల్ల మార్పురాదు. వాటి సాధనములు, పరికరములే మారును. మానవుని మానవత్వము మానవధర్మము మారదు. వాని వేషభాషా, విహారములు మారుచుండును. ఇంతమాత్రమున మూలసూత్రమునకు భంగము రాదు. ఈ ప్రపంచము నీతోటే పుట్టలేదు. అనాది, అనంతము. ఇందు మనము మన ధర్మసూత్రముతో కృతార్థులమై, ముందు వారికి ధర్మమార్గమును చూపుటయే మన కర్తవ్యము. కావున, రామరాజ్యము



రామకథ సర్వకాలములందును, సర్వదేశములందును అందరికీ ఆదర్శప్రాయము. రామాయణమే మనకు నిబంధన గ్రంథము.

ఈ విషయమును శ్రీత్యాగరాజస్వామి చక్కని స్వర లయ సమ్మేళనముతో ఈ కీర్తనమందు వివరించినారు.

రామకథా సుధారసము= రామకథ యనెడి అమృతము త్రాగినచో, ఇహపరములందు సామ్రాజ్యసుఖమిచ్చునని పల్లవి.

ఇందు భామామణి జానకి, రామకైంకర్యమందే వెన్నంటిసేవచేయు లక్ష్మణుడు, రామపాదారవిందభక్తి, భ్రాతృగౌరవముతో ఇక్ష్వాకు సామ్రాజ్యమును సైతము తృణప్రాయముగా భావించి యోగియైన భరతుడు, సుగ్రీవ హనుమాదులు మిగిలిన సామంత రాజ పురోహితాది వర్గములతో ఇదే భూలోకమున, మానుషరూపముతో అనేక కష్టసుఖములను పరిష్కరించిన రాముని దివ్యచరిత్రయే మన కాదర్శమనుచున్నారు.

మరియు రామకథా సుధారసము అనుభవించిన కొలదియు, ధర్మాదిపురుషార్థములనందించును. ధైర్యము, ఆనందము, సౌఖ్యమును పదేపదేఅందించును. కర్మబంధమనెడి బడబాగ్నికల సముద్రమును తరించుటకు నావవంటిది, కలి దోషములను హరించునది. రామకథాను సరణమువలన సమస్త వేదోక్త కర్మఫలసిద్ధి కలుగును. కర్మబంధములు తొలఁగును. కలిలో ఆ దివ్య చరిత్రము సకల దోషములను హరించును. శ్రమలేక రామకథను అమృతమట్లు ఆస్వాదించుమని గంభీరమైన భావములతో రామకథా కీర్తన శ్రవణములను ప్రబోధించినారు.

## 362. కాపి – చాపు

**రామ రఘుకుల జలనిధిసోమ లోకాభి ॥రా॥**

**తామర చూలికైనను–నీ మహిమలు తెలియవశమా ॥రా॥**

**శరణాగత జనరక్షక-సురపాల ముఖజితసుధా**
**కర నిన్ను విభీషణుడు-శరణనగానే**
**సురముని జనవైరి సహో-దరు డనుచును ఎంచక నీ**
**బిరుదును బొగడుచు లంకా-పురపతిగాఁజేసిన శ్రీ** ॥రా॥

**సురపూజిత పద నీదు-వరరూపముఁగనజాలక**
**గిరిజారిపుమర్దన శంకర సౌమిత్రి**
**ధరజానిల తనయ విభాకరసుత దశవదనానుజ**
**భరతులు పొగడగఁదొమ్మిది-గురికి దివ్యదృష్టిచ్చిన** ॥రా॥

**జలజారుణ చరణాసుర-జలదాశుగ శ్రీరఘుకుల**
**తిలకాద్భుతగుణ శుభములు-గల త్యాగరాజ**
**కులపావన కలియుగ మను-జులకును నీ తారకము ని**
**టలనేత్రుని చేతను వీ-నులఁబల్కనుగాఁజేసిన** ॥రా॥

ఇందు శ్రీరాముని దివ్యమహిమలను వారి అవతార రహస్యములను వివరించినారు. ఈ మహిమలు తామరచూలి= బ్రహ్మకైన తెలియునవి కావు. పరమ భక్తులై నిన్నుపాసించు సత్పురుషులకు మాత్రమే ఈ మహిమల ఆంతర్యము తెలియును.

అందు మొదటి మహిమ. శరణాగత జనరక్షణము. ఈ శరణాగతి ఒక్క భూలోకమునకే వరప్రసాదము వంటిది. ఇతర లోకములందీ భాగ్యము నెరుఁగరు. దేవరక్షకుడువు చంద్రునివలె ప్రసన్నము శీతలమునైన ముఖముకల నిన్ను, విభీషణుడు శరణందినాడు. దేవమునులకు, సాధువులకు పరమ శత్రువైన రావణుని సోదరుడు, సర్వాత్మనా నీ భక్తజనులతో, దేశకాల పాత్రాదులచే సరియైనవాడుకాడు. శత్రుసోదరుడు. నీ పరివారులందరూ వలదన్నను వినక **"ఇక్ష్వాకూణామయం ధర్మః. యధార్థాను పాలనం"** అని. **"అభయం సర్వభూతేభ్యో దదామ్యేత ద్వ్రతం మమ"** యని, నీ ఇక్ష్వాకు



కుల బిరుదమును, నీ ప్రతిజ్ఞా వాక్యమును గమనించుకొని, ఏమీ సందేహములేక, విభీషణునికి అభయమిచ్చుటేగాక, వెంటనే సముద్రోదకముతో వానిని లంకా రాజ్యాధిపతిగా చేసిన నీ సాహసోపేతమైన పరమానుగ్రహమును ఎవ్వరూహించఁగలరు? ఈ మహిమనెవ్వరు స్తుతించఁ గలరు?

ఇంతకన్న మరొక విశేషము:- శ్రీరామ తారక మంత్ర జపపరాయణురాలు 1. పార్వతి (గిరిజ) 2. రిపుమర్దనుడు= శత్రుఘ్నుడు. 3. శంకరుడు 4. సౌమిత్రి= లక్ష్మణుడు 5. ధరజ= సీత 6. అనిలతనయుడు= ఆంజనేయుడు 7. విభాకరసుతుడు= సుగ్రీవుడు 8. దశవదనానుజ= విభీషణుడు, 9. భరతుడు. వీరందరు శ్రీరాముని కంతరంగులై, రాముని దివ్యరూపములను దర్శించవలెనని కోరినారట. అంతట వారియందు పరమానుగ్రహము కలిగి వారికి దివ్యదృష్టిని ప్రసాదించెనట. (ఈ వివరము శ్రీరామతాపనీయోపనిషత్తునందును, సంహితాత్మకమైన స్కాందమందును ప్రసిద్ధమైయున్నది-ఇంతటి నీ దివ్యమహిమ వర్ణించతరమా? మరియొక విశేషము: తామర పువ్వులవంటి ఎర్రని చరణములుకలిగి. అసుర జలదాశుగ= అసురులనెడి మేఘములకు వాయువువంటివాడును శ్రీ రఘువంశమునకు తిలకమైనవాడును అద్భుతగుణములుకల ఓ రామా! కలిమానవులు నీ దివ్యోపాసనము శ్రమించి చేయఁజాలరని పరమదయతో, నీ రామ తారకమంత్ర రాజమును కాశియందు అవసానకాలమందు చెవిలో నుపదేశించునట్లు శ్రీ విశ్వేశ్వర శ్రీ మహాదేవుని ప్రేరేపించిన నీ అద్భుతమహిమ పరమ గోప్యమైనది. బ్రహ్మాదిలోకములందును ఈ భాగ్యము దుర్లభము; ఓ! త్యాగరాజ కులపావనా! నీకివే వందనములు.)

## 363. దర్బారు - ఆది

**రామలోభ మేలనను-రక్షించుపట్ల నీకింత శ్రీ** ॥రా॥

**సోమార్కలోచన సుగుణ సుత్రామాదులెల్ల నవ్వరా** ॥రా॥

**శరణనుకొన్న కాకా-సురుని రావణుని సో**
**దరుని బ్రోవలేదా సరగున-కరినిగాచిన శ్రీ ॥రా॥**

**గతిలేనివేళ ద్రౌపది వే-గమె కృష్ణాయన**
**అతిప్రేమతో వేంచేసిన-మతి నేడెందుపోయెనో ॥రా॥**

**దేగకై మేనొసంగు-రాఘవాన్వయమున**
**బాగ జన్మించి శ్రీకర-త్యాగరాజంటే ॥రా॥**

రామా! నీవంశపరంగా ఎవ్వరికినీ లేని లోభమంతయు నన్ను రక్షించుపట్ల నీకే కలిగినట్లున్నది. చంద్రసూర్యులు నీకు నేత్రములై యున్నారు. నీకు తెలియనిదేమియు లేదు. సర్వజ్ఞుఁడవు. నా ఆర్తిని గమనించి నన్ను రక్షింపకున్నచో సుత్రామాదులు= ఇంద్రాదులు నిన్నపహసింతురు. నేను ఆర్తితో నిన్ను సేవించుటయే నా పని. నిన్ను కీర్తించుటయే నా జన్మాంతర పుణ్యఫలము. నాకిక వేరే అధికార మక్కరలేదు. నీవు రక్షింపకుండుట నీకు సరియైన న్యాయముగాదు.

ఒకవేళ నీ కపచారము చేసిన కాకాసురుని కాపాడితివి. ఆతడింద్రుని కుమారుడు. అట్లే రావణ సోదరుడు విభీషణుడు నీ దయకు పాత్రులైనారు. నీ కృష్ణావతారమున ద్రౌపది సభలో మానభంగమంది ఆర్తితో కృష్ణా! యని పిలిచినంతనే కాపాడితివి. ఇట్టివెన్నో నిదర్శనములు కలవు. నీ వంశవృద్ధుడు శిబిచక్రవర్తి ఆకలి గొన్నంతమాత్రమున ఆ ఆర్తిని సహించలేక తన శరీరమాంసమునే ఇచ్చి వాని ఆర్తి బాపెను. ఇన్ని సంప్రదాయములున్ననూ అన్నీ తెలిసికూడ నన్ను రక్షింపకుండుటలో కారణము తెలియుటలేదని అన్యాపదేశముగా వేడుకొన్నారు.

## 364. హుసేని - ఆది

**రామా! నిన్నే నమ్మినాను-నిజముగ సీతా ॥రా॥**

**కామ జనక కమనీయ వదన నను**
**కావవే కరుణాజలధే ॥రా॥**



**సార! సామాది వేదసార-**
**సంతత బుధవిహార రాజిత ముక్తా**
**హార కనక కేయూర ధరసుగుణ-**
**పారావార సురారాధిత పద ॥రా॥**

**ధీర! సుజన హృత్పంజర-కీర నీపద భక్తి మా**
**కీర! మదన సుందరా-కార దనుజ సంహార దుష్టజన-**
**దూర! రఘుకులోద్ధారోదార ॥రా॥**

**రాజ రాజవందిత భూజానాయక సుర స**
**మాజ శ్రీకర త్యాగరాజ మానస సరోజ**
**కుసుమ! దినరాజ! పంక్తిరథరాజ తనయ శ్రీ ॥రా॥**

రామా! సర్వాత్మనా నిన్నే శరణొందినాను కాపాడుమని ప్రార్థించుచూ, శ్రీరాముని దివ్యస్వరూప స్వభావ లక్షణములను కీర్తించినారు.

ఇన్నింటికి మకుటముగా చివర పంక్తి రథరాజతనయ= దశరథ రాజకుమారా! యని సంబోధించుటలో మానుషావతార వైభవంలో పితృభక్తి ప్రధానమని సూచితము. మరియు త్యాగరాజుని మానసమనెడి సరోజ కుసుమమునకు= పద్మమునకు= దినరాజు= సూర్యునివంటివాడని పిలచుటలో రామునితో తనకుఁగల సంబంధము అతి సహజమనియు సూచించుచూ, అందరకట్లే రాముని యనుబంధము స్వభావ రమణీయమని భావము.

## 365. హరికాంభోజి - రూపకం

**రామ నన్ను బ్రోవ రా వేమొకో లోకాభి ॥రా॥**

**చీమలో బ్రహ్మలో శివకేశవాదులలో**
**ప్రేమ మీర మెలఁగుచుండే బిరుదు వహించిన సీతా ॥రా॥**

**మెప్పులకై కన్నతావు నప్పుబడక విర్రవీగి**
**తప్పుపనులు లేకయుంటే, త్యాగరాజవినుత సీతా ॥రా॥**

రామా! నన్ను రక్షించరాకున్నావేమి యని ఆశ్చర్యమును వెల్లడించుచూ, శ్రీరాముడు అంతటను వ్యాపించియున్నాడని స్తుతించినారు.

చీమలో బ్రహ్మలో (పిపీలికాది బ్రహ్మపర్యంతం) మరియు శివ, కేశవాది హరి హరతత్త్వమందు ఏకరూపమై యున్నావనియు, ఇందరిలో ప్రేమస్వరూపుడవై యున్నావని విశేషము.

సర్వజీవులు, తమ కిష్టవస్తువులందు హృదయగతమైన ప్రేమ కలిగియుండుట సహజము. ఆమూలమైన ప్రేమయే రాముని స్వరూపము. సర్వజీవులను భగవంతుడు ఆ విశ్వవిశాలప్రేమ భావముచేతనే బంధించి యున్నాడు. ఈ స్వారస్యమెఱిఁగినవారు, ఏ రూపమును దర్శించినా భగవంతుడనియే భావింతురు. అపుడు జీవభేదం దైవభేదమునకు తావులేదు. అట్టి ప్రేమస్వరూపిణి హ్లాదినీశక్తియే సీతమ్మ తల్లి. సీతారాములు ఏకతత్త్వ స్వరూపులు. ఇట్టి ప్రేమ భగవంతునియందు కల్గుటకు, తనను కన్న తల్లిదండ్రులయందు ఋణస్థుడుకాక, ప్రేమానురాగములు కలిగియుండుట ప్రాథమికమైన వరవడి. ఈ వరవడిలోనే ప్రేమను చూపలేని వ్యర్థునికి భగవంతునియందు ప్రేమ ఎట్లు కలుగును? **"మాతృదేవోభవ పితృదేవోభవ"** అని కదా శ్రుతి.

కావున, తల్లిదండ్రుల పట్ల అప్పు పడకుండుటయు, విర్రవీగి తప్పుపనులు లేకుండుటయు, అనగా శాస్త్రవిహితములైన ధర్మముల నాచరించుట అటుంచి నిషిద్ధములైన పనులు చేయకుండుట కూడ ఉత్తమ లక్షణమే. అట్టి వానికి సహజమైన భగవదనుగ్రహం కలుగును. సర్వకర్మలకు **"సంసిద్ధిర్హరితోషణం"** అనే నిర్ణయం ప్రధానమైనది. కావున, సహజముగా



దైవదత్తమైన నీ ప్రేమ సంపదను మూలమెఱిఁగి విశ్వప్రేమ మూర్తియైన సీతారామునియందు వినియోగించి కృతార్థతనందుమని ఉపదేశము.

## 366. సురటి – దేశాది

**రామచంద్ర నీదయ–రామ ఏల రాదయ ॥రా॥**

**కామకోటి సుందర–కరధృత మందర**
**ప్రేమమీర ముందర–బిల్వరాకయుందుర ॥రా॥**

**కాననంబు తాపమో–కైకమీద కోపమో**
**నేను చేయు పాపమో–నీకు శక్తి లోపమో ॥రా॥**

**ఆడదన్న రోసమో–అలనా దుపాసమో!**
**మేదలేని వాసమో–మేముసేయు దోసమో ॥రా॥**

**కల్లలైననేయ మా–కంటె నీకు హేయమా**
**తల్లడిల్ల న్యాయమా–త్యాగరాజ గేయమా ॥రా॥**

మిక్కిలి ప్రేమతో పిలిచినను నా ముందు రాకున్నావు. రామా! నీ దయ ఎందులకు రాదు? అని ప్రశ్నించుట విలక్షణమైన మధురానుభూతి. నాయికా భావము వహించి, నిన్నేల ప్రేమించవలెనన్నచో రామా; నీవు కామకోటి సుందరుఁడవు. దీనులను కాపాడుటకు పర్వతములనైన ధరించఁ గల దయాశాలివి. ప్రేమతో నిన్నాహ్వానించినా ముందరకు రాకున్నావు. అని ఎత్తిపొడుపు మాటలాడి రాముడు రాకుండుటకుఁగల కారణములను చూపుటలో చమత్కరించినారు.

కాననంబు తాపమా? అరణ్యసంచారము వలనకలిగిన తాపమా? అందుకు కారణమైన కైకయందు నీకు కలిగిన కోపము శాంతించ లేదా? ఇంతకూ, ఇతర కారణముల కంటె రామా! నీకు శక్తిలోపమేమో! కానిచో ఇంతగా ప్రేమించిన నన్నే ఉపేక్షింతువా?

మరియొక కారణమున్నూ తోచెడిని. నీ వరణ్యావాసమున కేగునపుడు నీ వెంట సీతను రావలదని నివారించితివి. అరణ్య సంచారమందనేక విధములైన ఇబ్బందులున్నవని, నీవు సూచించితివి. అపుడు మహాసాధ్వి వీరవనిత సీత నిన్ను అధిక్షేపించుచు, రామా! నీవు మహావీరుఁడవై ఒక్క ఆడుదానిని అరణ్యమందు రక్షించుకోలేని బేలవైతివి. జనకుడు నన్నిచ్చునపుడు, పురుషకారం గల మహావీరుడవని భావించినారు. అట్లుగాక నీవు **"రామ! జామాతరం ప్రాప్యస్త్రియం పురుష విగ్రహం"** (విగ్రహం మాత్రం పురుషుడుగాని, స్వభావంచేత అబలవే) ఆ ఆక్షేపణచేత నీకు రోషము కలిగి రాకున్నావేమో!

అలనాడుపాసమో! అనగా రామసామ్రాజ్య పట్టాభిషేకమునకు ముందురోజు **"సీతయాప్యుపవస్తవ్యం"** అని వసిష్ఠుడు సీతారాముల కుపవాసము నాదేశించెను. తీరా పట్టాభిషేకం భంగమైనది. అందుకు కలిగిన కోపమా? అదిగాక నీ నేయము= నేస్తము కల్లలేమో! మమ్ముఁజూడవచ్చుట నీ హోదాకు తగినట్లుగాక, హేయమేమో! నిన్నే కీర్తించుమేమిట్లు తల్లడిల్లుట న్యాయమా? అని అనేక విచిత్రభావములతో అనేక తీరులలో శ్రీరామకథా విశేషములనే స్మరించుచూ నైజమైన రీతిలో రాముని దయనర్థించుట విచిత్రము. రామునితో ఎంతో సఖ్యభావము కలిగియున్నఁగాని యిట్లనుట కుదరదు.

## 367. సురటి - రూపకం

**రామ దైవమా రాగ-రాగ లోభమా ॥రా॥**

**మోముఁజూపుమా-జగన్మోహనకరమా ॥రా॥**

**దొంగజాడలేల ఇల్లు-బంగరాయెనా**
**రంగడా విభీషణునికి-పంగనామ మిడినరీతి ॥రా॥**



**వెన్నతా భుజించి గోప-కన్య ముఖమున**
**తిన్నగా నలందినట్లు-దీనరక్షక సీతా ॥రా॥**

**నేర్పుఁజూపుమా యంగ-లార్పుఁబాపుమా**
**ఓర్పుగల్గు త్యాగరాజు-ఒకపారి శరణంటే ॥రా॥**

మా దైవమవగు రామా! రాగరాగ, అంతకంతకు నీకు లోభగుణ మెక్కువగుచున్నదేమి?

జగము నంతను మోహింపఁజేయు దివ్యరూపము కలవాడవగుట, నీ మోముఁజూపుటకు మురియుచున్నావు కాబోలును? నీ ఇల్లు బంగారముగానూ! దొంగజాడలు చూపుచున్నావేమి? (అనుటలో జాతీయంగా రామునితో దోబూచులాడు చున్నట్లున్నది) ఈ దొంగజాడలు, పూర్వచరిత్రనుబట్టి పరంపరగా కలిగినట్లున్నవి. నీ రూపాంతరమైన రంగనాథుడు విభీషణునిపట్ల తొల్త అనురాగమునేచూపి, తీరా లంకకుపోవుదారిలో ఉభయకావేరీ మధ్యమందుండి "ఇక లంకకు నీ వెంట రానని యు, నిత్యము నీ విచటకే వచ్చి నన్నర్చించుకు పొమ్మని" వానికి పంగనామముపెట్టి బంపితివి. (మోసముచేయుటకు పంగనామములు బెట్టుట యని జాతీయము.)

కృష్ణరూపమున గోపిక ఇంట వెన్న భుజించి, తిన్న కృతజ్ఞతయైన లేకపోగా, ఇదేమి దొంగిలించినావని ఆమె ఎదురురాగా నీకు వెక్కసమైన వెన్నను ఆమె ముఖమునందు పులిమి చిలిపిచేష్టలు చేసినావట. కావున, నీ జాడలీనాటివి గావు.

నాకడ మాత్రమట్లు చేయక, నా దైన్యమును బాపి నేర్పుతో నీ దివ్యముఖారవిందమును చూపి అనుగ్రహింపుము. సర్వాత్మనా నిన్నే శరణందినవాడనని ప్రార్థించినారు.

## 368. నారాయణి - ఆది

రామా నీవేగాని నన్ను-రక్షించేవారెవరే ॥రా॥

సోమ సూర్యలోచన-సుందరవదన శ్రీ
తాత వచన పరిపాల పురు-హూతాద్యమర పారి
జాత సౌమిత్రితో-సీతారమణితో వెలసిన ॥రా॥

ధారాధరాభ శరీర-భావజ సుకు
మార సాకేతపుర వి-హార నన్నేలుకోర ॥రా॥

నాగశయన ముని-యాగపాలన భక్త
భాగధేయ పావన-త్యాగరాజ వినుత ॥రా॥

తాత...పాల= తండ్రిమాటను పరిపాలించువాడు పురుహూతా... పారిజాత= ఇంద్రాది దేవతలకు పారిజాతమువంటివాడు. ధారా...శరీర= మేఘమువంటి శరీరముకలవాడు. భావజ సుకుమార= మన్మథునివలె సుకుమారుడు.

సూర్యచంద్రులే నేత్రములుగా కలిగి, మన్మథ సౌందర్యము కలిగి ధర్మనియతికి నిదర్శనముగా పితృవాక్య పరిపాలనముచేసి, సకల దేవతలకాశ్రయమై లోకాతీత మర్యాద చూపుచున్న రామా! నీవే నన్ను రక్షించవలెనుగాని మరెవ్వరు కలరు?

మరియు మూలప్రకృతి పరదేవతయగు సీతారమణితో, శేషావతారమగు సౌమిత్రితోడను వెలసియున్నావు. నీ దివ్యరూపము అరణ్యసంచార నిమిత్తముగా సకల జగమునకు నియామకమై, భక్తులపాలిటి, భాగ్యరూపమై ధర్మరక్షణము చేయుచున్నదని స్తుతించినారు.



## 369. శంకరాభరణము - రూపకం

రామ నిను వినా నను-రక్షింప నొరులఁగాన ॥రా॥

తల్లిదండ్రి యన్నఁదమ్ములు-దైవము నీవని
యుల్లమునను యన్నిట నిను-చల్లగ బాగుగఁజూచెద ॥రా॥

పావన నీ భక్తి సదా-పాలించును మోక్షమొసగు
మావర నీ సన్నిధిని ప్ర-మాణముచేసి బల్కెద ॥రా॥

సత్త్వగుణంబునను యుపాసన యొనరించిరి పెద్దలు
తత్త్వముఁదెలిసెను ఇక భవ-తరుణోపాయము నీవని ॥రా॥

లోకులు నిజదాసులఁగని-లోపడుదు రసూయలతో
శ్రీకర నిను దూషించిన-చెడిపోలేరుగాని ॥రా॥

కోరిన కోరిక లొసఁగే-శ్రీరమణా నిన్ననిశము
చేరితి శరణనుకొంటిని-శ్రీత్యాగరాజ వినుత ॥రా॥

రామా! తల్లిదండ్రులు సోదరాదులు దైవము నీవనియే నా మనసున భావింతును. మరెవ్వరూ లోకమునకు రక్షకులు లేరు. లక్ష్మీపతీ! నీ భక్తియే సదా లోకమును పరిపాలించును. అని ముందుగా తీర్మానించుకొనుటకు అనేక ప్రమాణములు స్వానుభవము ఋజువు చేయుచున్నవి. నానా చిత్ర విచిత్రమైన ఈ దృశ్య ప్రపంచమునకు మానవుడు యజమాని. ప్రపంచమందలి అన్ని విషయములు మానవునికే భోగ్యమగుచున్నవి. అట్టి మానవుని స్వరూప స్వభావములను పరిశోధించినచో ఆంతరమైన అంతః కరణమనునది సర్వవృత్తులకు నిలయము. ఆ అంతఃకరణమున్నూ భౌతికమగుటచే జడమనియే తత్త్వవేత్తలన్నారు. అద్దమువంటి ఆ అంతః కరణ మందొక విలక్షణమైన చేతన శక్తికలదు. ఆ చేతన శక్తియే సర్వ

ప్రపంచమును, వేర్వేరు ఇంద్రియాది సాధనములతో వేర్వేరుగానే గ్రహించి, తన తెలివియందిముడ్చుకొని జ్ఞానాకార వృత్తితో, (అనగా తెలివితో) సర్వమును తెలిసికొనుచున్నది.

ఆ తెలివి, సత్త్వగుణము నభిమానించినచో సజాతీయములైన సాత్త్విక వృత్తులవల్ల తన స్వస్వరూపమును గుర్తించ గల్గుచున్నది. స్వస్వరూపమును తెలిసికొనుటయే భక్తి. అపుడు తన స్వస్వరూపమునకు, శ్రీరామ కృష్ణాది అవతారమూర్తులకు భేదములేనట్లు గోచరించును. కావున, మన చిత్తమందు తొల్తసాత్విక వృత్తులను, సాత్త్విక భావములను పెంపొందించుకొనుట ఉత్తమ లక్షణము. ఆ సత్త్వమువల్ల జ్ఞానము. ఆ జ్ఞానమువలన స్వస్వరూప పరిజ్ఞానము, దానివల్ల అంతకూ రక్షకము దైవమొక్కటే యను నిశ్చయము కలుగును. కాబట్టి పై వివరమును త్యాగరాజస్వామి ఈ గేయమందు పొందుపరచినారు. రామా! నీ సన్నిధిని ప్రమాణముచేసి పల్కుచున్నాను. నీ దివ్యభక్తియే లోకమునకు రక్షకమైనది. నీ సృష్టి విలాసము, నీ దివ్య విభూతియు, నా ఉల్లమున సత్త్వ వృత్తితో చల్లగా స్తిమితముగా చూచుచున్నాను. పెద్దలందరూ ఈవిధమైన సత్త్వ వృత్తిచేతనే ఉపాసించి తత్త్వమును తెలిసికొన్నారు. నిన్ను స్తుతించినను, నిందించినను చిత్తవృత్తి నీయందే లగ్నమైన కారణముచే వారికి సద్గతి కలుగును. కాని నిజదాసులైన భక్తులను చూసి, వీరి శాంతి దాంతులను చూచి కొందరు అసూయకు లోబడుచున్నారు. అట్టివారి కెప్పటికిని సన్మార్గము లభించదు. వారు కామ లోభులైనను, వారికి అవసరమైన కోరికలను నీ వలననే పొందవచ్చును. ఆ తెలివిలేక అసూయాపరులైనచో వ్యర్థులగుదురు. కావున ఓ! రామా! ఇవన్నియూ ఆలోచించియే అనిశము నిన్నేచేరి శరణంటిని. నీవు వినా రక్షకులులేరని భగవంతుని ఏకైక శరణ్యత్వమును స్వానుభవముచే ఇందు వివరించినారు.



## 370. కేదారం - ఆది

**రామా! నీపై తనకు ప్రేమబోదు సీతా ॥రా॥**

**తామరసనయన నీదేమో మాయగాని ॥రా॥**

**మనసు నీపదముల నే జేర-కనులు నీ రూపమునే కోర**
**విను నీ పేరులకే నోరూర-తనపై నీ కరుణేర ॥రా॥**

**జననీ జనకాప్తులన్యులు-ధన కనక గురు వేల్పులు**
**దినము నీవేయని మాటలు-అనఘ! ఇవి నా భూషణములు ॥రా॥**

**భోగానుభవములందు-బాగుగా బుద్ధి నీయందు**
**త్యాగరాజుని హృదయమందు-వాగీశానందమందు ॥రా॥**

విష్ణుమాయ జనులను భ్రాంతులుగా చేయుట సహజము. ఇందు రామా! ఏమో నీ మాయ. నాకు నీపై ప్రేమ నిండుకొన్నది. నిన్ను విడచియుండదు. అనుట విచిత్రము.

నా చిత్తము నీ పాదములచెంతకే పరువిడును. నా కనులు నీ రూపమునే చూడవలెనని కోరును. వినుము నీ పేరు కీర్తించుటకే నోరూరుచున్నది. దీనికి కారణము నీ కృపయే. నా జననీ జనకులు ఆప్తులు ధనకనకాదులు నా సర్వస్వము నీవే యనుట, నా కెంతో అలంకారము "భూషణములు చెవులకు-బుధ తోషణములు అని ప్రహ్లాద సూక్తి."

రామా! నేను భోగములనుభవించు వేళ నా బుద్ధి నీ యందే లగ్నమైయుండును. భోక్త అంతర్యామియే కాని, నేను కాదనుట తత్త్వ నిశ్చయము. కావున, భోజనమునకుముందు. **"అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాస్థితః। ప్రాణాపాన సమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్."** ప్రాణుల జఠరాగ్ని రూపమున నేనే యున్నానని భగవంతుని గీతా వచనము. కర్తృత్వభోక్తృత్వములను తమయం దారోపించుకొనట

అజ్ఞానలక్షణము. ఈ విధముగా జీవులందరు అనుభవించు ప్రత్యేకానందములన్నియు వాగీశానందమందు= బ్రహ్మానందమందు అంతర్భవించి యున్నవనే యంశము ఇందు వివరింపఁబడి రాముని యందలి ప్రేమ సర్వజీవులకు సహజమని సారాంశము.

## 371. కల్యాణి - ఆది

**రామ నీవాదుకొందువో కొనవో**
**తొలి మా నోము ఫలమెటులదో ॥రా॥**

**నా మనసున నీయందు ప్రేమ మీరఁగను**
**నమ్మినామనుచు చాల తిరిగేముగాని నిజమనుచు ॥రా॥**

**భవసాగరమున కలుగు బాధ లంటక యుండుట**
**కవివేక మానవుల చెలిమి అబ్బకుండుటకు**
**అవనియందు కలుగు వేదాగమ మర్మము దెలిసి**
**నవనీరదనిభ నమ్మినది చాలుననుచు ॥రా॥**

**పద్దు తప్పకను ఉండే భక్తులకు నిత్యసుఖము**
**కద్దనుచు బలికిన పెద్దలనమ్మి**
**ముద్దుగారు నీ రూపమును, మోదమున ధ్యానించుచునే**
**ప్రొద్దు పొగడినాముగాని, పూర్ణశశివదన శ్రీ ॥రా॥**

**నీ జపమే దిక్కుగాని, నీరజలోచన మాకు**
**వాజికర ధనములు వరముఁగాదురా**
**జాజి సుమధర భూజా మనోహర శ్రీత్యాగ**
**రాజనుత బహురవితేజనా తప్పులెంచక ॥రా॥**

భక్తులు భగవంతుని సేవింతురు. ఇంత సేవ కింత ఫలమను నిర్ణయములేదు. భగవంతునికి ఎపుడు కృప కలుగునో ఎవరికీ తెలియదు.



అంతవరకు సహనముతో వేచియుంటూ, హార్దమైన ప్రేమ భావమున భగవంతుని శరణాగతి చేయుటయే భక్తి లక్షణము. ఈ కీర్తనమందు పై భావమునే చిత్తమం దుంచుకొని భక్తుల లక్షణములను వివరించినారు. రామా! నీవు మమ్మాదుకొందువో. లేదో! మా జన్మాంతర పుణ్యమెట్లున్నదో! యని సందేహమును సూచించుట చమత్కారము.

మేము నీయందే చిత్తముంచి నిన్నే నమ్ముకొన్నామనుచూ, తిరుఁగుచున్నామేగాని నీ చిత్తమెట్లున్నదో! ఇక మా నడవడి మాత్రము వేదశాస్త్ర తాత్పర్యమునకు అనుసారముగా దైనందిన సంసార తాపత్రయములను చిత్తమున కంటనీయక, అవివేకుల సాంగత్యము చేయక, నిన్నే నమ్మియుండుట చాలునని యుంటిమి. దైవభక్తియే ఫలస్వరూపమనియు, వారికి సాధనాంతరములతో అపేక్షలేక నిత్యసుఖము కలుగుననియు, దైవానుగ్రహము, సాధనలచే సాధ్యమగునది గాదనియు పెద్దల మాటలను విశ్వసించి, నీ ముద్దురూపమును సదా ధ్యానించుచూ, నిన్నే జపించుచున్నాము. మాకు రథ గజాశ్వాది భోగసాధనలు సుఖమివ్వనేరవని, భూజామనోహరా= సీతాపతీ నీ యందే రక్తి ననుభవించుచున్నాము.

ఇంకను మాయందేవో లోపముల నెంచుట న్యాయముగాదు. పాలింతువో! పాలించవో! నీదయ= మా ప్రాప్తమనుట సహజమైన రీతి.

## 372. హిందోళ వసంత - రూపకం

**రార సీతారమణీ మనోహర ॥రా॥**

**నీరజనయన యొక ముద్దీర ధీరముంగల**
**పాధ మగస-మగ రిగసా-నిసగగమస-పాధమగమ**
**పధనీదమ-పదసనినిధ-ససానిధమ-మాగసగమ ॥రా॥**

**బంగారు వల్వలు నే బాగుగ గట్టెద మరి**
**శృంగారించి సేవఁజేసి కౌగిటఁజేర్చెద ॥రా॥**

**సారెకు నుదుటను కస్తూరి తిలకము బెట్టెద**
**సారమైన ముక్తాహారములనిక దిద్దెద**
**యోగము నీపై యనురాగముగాని వే**
**రేగతి యెవరు? శ్రీ త్యాగరాజవినుత ॥రా॥**

ఇందు శ్రీత్యాగరాజస్వామి కేవల మధురభక్తిభావముతో శృంగార నాయికవలె లాలిత్యమొలుకునట్లు రామా! రారా ఒక ముద్దీరా! యనుట ఎంతో ముద్దుగానున్నది.

ఆపై రామునికి అందచందములను సంతరించుకొన్నారు. బంగారు వలువలు నేను బాగుగా కట్టెదను. ఇంకనెన్నో విధముల నిన్ను శృంగారించి కౌగిట చేర్చుకొందును. నీ దివ్యముఖారవిందమందు కస్తూరీ తిలకమును తీర్చిదిద్ది, మంచి ముత్యాలహారములను అలంకరించుకొందును.

ఈ సేవ నీకై చేయునదికాదు. నీపై యనురాగముతో నాకు కలిగిన యోగానుభవమే. దివ్యమోహన సుందరస్వరూపమందు అయత్నముగా చిత్తేంద్రియములు ఆకర్షితములగును. దీనినే సౌందర్యార్చనమని అందురు. ఆపై చిత్తమందు అనురాగముదయించి, ఇతర చిత్తవృత్తులను దరికి రానీయదు. చిత్తవృత్తి నిరోధమే యోగలక్షణము. కావున, ఇదంతయు నా ఆత్మానందమే. నీవు తప్పవేరేది గతి? అన్ని యందములు నీవే అయియున్నవి. కావున, నీయందే మా యోగమునకు సాఫల్యము.

## 373. ఖరహరప్రియ - చాపు

**రామ కోదండరామ పాహి-రామ పట్టాభిరామ ॥రా॥**

**ఇమ్మహిని బొమ్మలాటcజూచి-**
**కమ్మగాను ఒకమాట లేదా ॥రా॥**

**పాలుగారు మోముజూప నీకు-పాలుమాలిక ఏల శ్రీప ॥రా॥**



**ఆసించి నామేను కరcగగని నీ-**
**వాశున రాకుండెడి దెరుcగ ॥రా॥**

**మరులుకొంటిని ఇందాకయే పా-మరులు శపించిరోలేక ॥రా॥**

**చెయిబట్టి నలుగురిలోన యురము-**
**జేర్చcబాత్రుడనుగాన ॥రా॥**

**జగమునొల్ల ననుకొంటి భు-జగశయన నమ్ముకొంటి ॥రా॥**

**ఎదుట నిలచి బ్రోవు రాజముఖ-**
**సదయపాలిత త్యాగరాజ ॥రా॥**

ఓ! కోదండరామా! నన్ను సంరక్షింపుము. ఈ ప్రపంచమున అస్మదాదుల సంసారములు మాకే ఒక బొమ్మలాటవలె నున్నవి. ఇందు నే ననేక పరితాపముల నందుచున్నాను. కావున, కమ్మగా, నీవొక మాట పల్కరాదా! నీ మాట మాకెంతో శాంతినిచ్చుగదా? పాలుcగారు నీ సుందర ముఖారవిందమునేని చూపుటకు నీ వింత పాలుమాలుచున్నావేమి?

నీకై ఆసించి ఎదురుచూచి, నా శరీరము నీరగుచున్నది. నీవు ఆశు= త్వరగా రాకుండుటకు కారణమేమో? నీపై నేనెంతో ప్రేమcగొనియుండుటc జూచి ఓర్వలేక పాపులెవరైన శపించిరేమో!

రామా! నా చేయిబట్టి, నన్ను నీ హృదయమున చేర్చుకొనుము. నే నందుకర్హుcడను కానా? ఈ జగము నిత్యమని నమ్మక నిన్నే నమ్మియున్నాను. నీ సన్నిధి భాగ్యమొసcగుమని ప్రార్థన.

## 374. మోహన - ఆది

**రామా! నిను నమ్మినవారము-గామా సకల లోకాభి ॥రా॥**

**పామర జనదూర వరగుణ ఘృణా**
**పాంగ శుభాంగ మునిహృదబ్జ భృంగ ॥రా॥**

**వాలాయముగాను రాను జా-గేల సుగుణ దశరథ నృ**
**పాల హృదయానందకర శ్రీ-లోల పాలవెలయు మిక**
**ఫాలలోచన హృదయాలయా ప్రజనపాల కనకమయ**
**చేల ఇక పరాకేల యిపుడు మ-**
**మ్మేల నీదుమనసేలరాదు ॥రా॥**

**నీవేగతి యంటినిగాని-నే వేరేమి యెరుఁగన ముందర**
**రావే నీపద పంకజ భక్తి-నీవే, భావజారినుత**
**దేవ నీదు పదసేవా ఫలము మముగావునే పతిత**
**పావన త్రిదశనాథనీయ ముని-**
**జీవనానిశముఁబ్రోవవేల శ్రీరామ ॥రా॥**

**ధారాధర నిభదేహ జనా-ధారా దురితౌఘ జలద స**
**మీరా త్యాగరాజ హృదయా-గార సారహీన సం**
**సారమందు వేసారి నిన్ను మన-సార నమ్ముకొన నేరలేని నే**
**నూరక యిక విచారమందుటకు-మేరగాదు శ్రీరామ ॥రా॥**

ఘృణాపాంగ= కృపాకటాక్షము కలవాడు. ముని...భృంగ= మునుల హృదయములనెడి పద్మములకు తుమ్మెదవంటివాడు. వాలాయముగా= రివాజుగా, పాల= ముందట. భావజారినుత= మన్మథ శత్రువైన శివునిచే నుతింపఁబడువాడు. త్రిదశనాథనీయ= దేవతలకు నాథుడైనవాడు. ధారాధరనిభదేహ= మేఘమువంటి శరీరము కలవాడు. దురితౌఘ....సమీర= పాప సముదాయ మనెడి మేఘములకు వాయువు వంటివాడు.

ఇందు శ్రీరాముని దివ్యగుణములను స్తుతించుచూ, ఆర్తి, తాననుభవించు సంసార పరితాపమును వెల్లడించుకొన్నారు.

సారహీనమైన సంసారమందొక వంక విసివి వేసారుచున్ననూ, మనసార నిన్ను నమ్ముకొననేరని, నా విచారమునకు పరిహారమేమి? నీవే



నా దైన్యమును తీర్చి కాపాడవలెను. నీవే గతియని నమ్ముకొని యున్నానని చక్కని పద లాలిత్యముతో స్వభావమైన రీతిలో ప్రార్థించినారు.

## 375. కల్యాణి - చాపు

**రామ రామ రామ నాపై నీ దయ**
**రాకయుండ వచ్చునా ఓ రామ ॥రా॥**

**తనయుని ఏ జాతియైనఁబ్రోవని**
**తల్లియు భువిని గలదా ఓ రామ ॥రా॥**

**తనకుఁదాను వంచన చేసుకొను**
**ధనవంతుఁడు గలడా ఓ! రామ ॥రా॥**

**ఇలను నిశ్చయముగ నీవులేని, తా-**
**వెందైనను కలదా ఓ రామ ॥రా॥**

**సుతుని మాటకు తల్లిదండ్రులు య**
**సూయ పడుట కలదా! ఓ రామ ॥రా॥**
**బ్రహ్మనిష్ఠుడైనట్టి యా ఘనునికి**
**ప్రబల వంచన గలదా ఓ రామ ॥రా॥**

**తొల్లిఁజేయు కర్మమనుభవించకను**
**తోయువారు కలరా ఓరామ ॥రా॥**

**కనక తరుణులాసలేని సంసారులు**
**కలనైనను గలరా ఓరామ ॥రా॥**

**నిర్వికార శ్రీత్యాగరాజునికి**
**నిన్ను వినాగలరా ఓ రామ ॥రా॥**

రాముని దయ రాకుండుట స్వభావ విరోధమనీ, అందుకు లోకములోని కొన్ని అనుభవములను చూపి, తన లోపమెట్లున్ననూ, రాముడే

గతియనుభావము తనకున్నందున ఆ ప్రధాన లక్షణమునే గమనించి తనను రాముడు కాపాడుటయే యుక్తమనుచున్నారు. ఏ జాతిలోనైనా, క్రూరములైన సింహ వ్యాఘ్రాది జంతువులలోనైనా, తన బిడ్డను వాత్సల్యముగా చూడనితల్లి యుండునా? ఎవరిబిడ్డ వారికి ముద్దుగదా! అనుటలో తాను రామునికి, అంతటి వాత్సల్యమును చూపతగినవాడనని భావించుట ఆత్మీయమైన భావము; లోకమందు ధనవంతుడు ఇతరులను వంచించుటకు యత్నించునేగాని, తననే తాను వంచించుకొనునా! అనగా మోసగించుకొనునా?

ఇట్లే బ్రహ్మవేత్తయైన మహనీయునికి, ఎవరేని వంచన, అపచారము చేసినను, మానావమానములు తనకు లేవని అంతయు మిథ్యయని భావించునేకాని. ఏ విధమైన పరితాపమందదు.

మరియు, తొలికర్మ అనుభవించక తీరదను వివేకము కలిగి, తనకు లోకానుసారముగా కలిగే కష్ట సుఖములను వివేకవంతుడు లెక్కచేయడు.

రామా! కాంతా కనకములందు ఆసలేని సంసారులుందురా? అనుటచే ప్రాకృతులైన జీవులందరకు ఏవో కొన్ని సహజ లక్షణములు అనివార్యములైయుండును. వీటిని గమనించకుండుటే వివేక లక్షణముగాని, ఎందుకుండవలెననుట కుదరదు. ఈ లక్షణములెట్లు స్వభావములో, త్యాగరాజునికి నిన్నువినా కలరా? యనుటవలన, నిరంతరం రాముని యందే లక్ష్యము కలిగియున్నానని, తన అనుభవమున్నూ పైవాటివలె అనివార్యమైనదే యనుట ఎంతో సహజముగా నున్నది.

ఇందు గుణదోష విచారణము. అర్హత అనర్హతలు విచారించఁదగిన యంశములు కావు.

వీటి కతీతమైన యనుబంధము రామునికిని–తనకును ఏర్పరచుకొని కీర్తించుట చాలా ఉన్నతమైన అనుభవము.



## 376. శంకరాభరణము – ఆది

రామ సీతారామ రామ–రామ సీతారామ రామ
రామ సీతారామ–రామ రామ సీతారామ రామ ॥రా॥

తప్పు లెన్నఁబోతే మాకు–గొప్పతనము రాదు, మా
యప్ప దయచేసి కండ్ల–గప్పుకొని పాలింపదే ॥రా॥

దాపులేక నేను నీదు–ప్రాపు కోరుకొంటిగాని,
రేపు మాపనుచు దోవ–జూపగ రాదయ్య బ్రోవ ॥రా॥

నీలవర్ణ పాపముల–కాలయమైతిని నాదు
జాలిఁదీర్చి భయమునీ–కేలయని యాదుకోవే ॥రా॥

వాలాయముగ కృపాల–వాల రక్షించు కనక
చేల యిందరిలో నాదు–చెయిలాగియ్య సమయము ॥రా॥

ఇతరులందు మనసుబోదు–వెతలు నీకు తెలియరాదు
గతియు ముమ్మాటికి లేదు–క్షితి నెవ్వరిని వేడబోదు ॥రా॥

రామ రామ నిత్యశత్రు–భీమ భీమనుత గత
కామ కామ వైరినుత–నామ నా మదిని రావే ॥రా॥

దేవ దేవార్చిత సర్వ–జీవ జీవన మహాను
భావ భావజ రూపశ్రీ–పాఽవ పావన రాఘవ ॥రా॥

మాయ మాయెడ వద్దురా, ధ్యేయ ధ్యేయ విషయాలేల
రోయరో ఎప్పుడు దేవ–రాయ రాయా ఈ దేహము ॥రా॥

రాజరాజ వందిత వి–రాజరాజ హరే దిన
రాజరాజ నయన త్యాగ–రాజరాజ దశరథ ॥రా॥

చెయ్యిలాగు+ఇయ్యి= హస్తావలంబనము. నిత్యశత్రుభీమ= నిత్యశత్రువులైన కామాదులకు భయంకరుడు. భీమనుత= శివునిచే స్తుతింపఁబడువాడు. కామవైరి= శివునిచే, నుతనామ= స్తుతింపఁబడిన నామములు కలవాడు. సర్వజీవజీవన= సర్వజీవులకు జీవనమైనవాడు. శ్రీప+అవ= లక్ష్మీపతీ రక్షింపుము. ధ్యేయ ధ్యేయ= ధ్యానించ తగినవారిలో ధ్యానించ తగినవాడవు. దినరాజ, రాజనయన= సూర్యచంద్రులు నేత్రములు గలవాడు.

సీతారామనామ మకుటముతో ఇందు సహజముగా మాటల ధోరణిలో ఉన్నత భావములను కీర్తించినారు. మా తప్పు లెన్నబోతే నీకేమీ గొప్పతనము రాదు. మా యప్పా రామా! కండ్లగప్పి మమ్ము రక్షించుము. అనగా నీ పూర్ణమైన కటాక్షముతో కాపాడుము. కండ్లగప్పి కాపాడుట చక్కని జాతీయ ప్రయోగము. అట్లే నా కెచటను దాపులేక నీ ప్రాపుకోరియున్నాను, రేపు మాపని ఆలసించవద్దని కోరినారు. నేను పాపముల కాలయమై యున్నాను. కాని, నీవే గతియని నమ్మియున్నాను. విషయములను రోసి, నిన్నే ధ్యానింతును-నిన్నే విశ్వసింతును. రక్షింపుమని వేడుకొన్నారు.

## 377. మధ్యమావతి - ఆది

**రామ సమయము బ్రోవరా-నా పాలి దైవమా ॥రా॥**

**రామదనుజగణభీమ నవఘన-**
**శ్యామ సంతతము నామకీర్తనము**
**ఏమరకను అతి నేమముఁజే-**
**సే మహాత్ములకు కామితఫలద ॥రా॥**

**దాంత సంరక్షణాగమాంతచర భాగవ**
**తాంతరంగ చర శ్రీకాంత కమనీయ గు**
**ణాంత కాంతక హితాంత రహిత ముని**
**చింతనీయ వేదాంతవేద్య సా**



**మంత రాజనుత యాంతభాంత ని**
**శాంత సుకరుణాస్వాంత నీకిది ॥రా॥**

**బృందారకాది ముని బృందార్చిత పదార**
**వింద సద్భక్తి జీవానందకర సూర్యకుల**
**చందనారి హర నందకాయుధ స**
**నందనాదినుత కుందరదన వర**
**మందర ధర గోవింద ముకుంద**
**సందేహము నీకెందుకు నాపై ॥రా॥**

**ఈ జగతిని నీ వవ్యాజ కరుణామూర్తివని**
**పూజఁజేసితి గజరాజ రక్షక త్యాగ**
**రాజ వందిత ఇభరాజవందన ఫణి**
**రాజశయన వినరా జగత్పతీ**
**భూజానాయక రాజితమకుట ధ**
**రాజ సన్నుత సురాజ ఇపుడే ॥రా॥**

దనుజ గణ భీమ= రాక్షస గణమునకు భయంకరుడు. నవఘనశ్యామ= నూత్నమేఘమువలె శ్యామలకాంతి గలవాడు. దాంత సంరక్షణ= నిగ్రహముగల మహనీయులను రక్షించుట. ఆగమాంతచర= ఉపనిషత్తులందు విహరించుట. భాగవతాంతరంగచర= భక్తుల అంతరంగములందు చరించుట. **"సాధూనాం హృదయం త్వహం"** శ్రీకాంత+కమనీయగుణ+అంతకాంతకహిత= మృత్యుంజయునికి హితుడు. అంతరహిత= అవసానములేనివాడు. మునిచింతనీయ, సామంతరాజనుత= సామంతరాజులచే నుతింపఁబడువాడు. యాంత= యకారముయొక్క చివరి అక్షరము. (రా) భాంత= భకారము తర్వాతది (మ) అనగా "రామ" (యని అక్షర సంకేతము). బృందారకాది...విందు= దేవతలు మునులచే అర్చింపఁ

బడు పదారవిందములు కలవాడు. సూర్యకులచందన= సూర్యవంశమునకు చందనమువలె చల్లనైనవాడు. అరిహర= శత్రుహరుడు. నందకాయుధ= నందకమనెడి ఖడ్గమును ధరించువాడు.

ఇందు ధారావాహికమైన విశేషణములతో శ్రీరాముని దైవమానుష విభూతులను కీర్తించి, రామా నీవు అవ్యాజ కరుణామూర్తివని పూజచేసితిని. జగత్పతీ! నామాట వినరా? యని, నాపై నీకు సందేహ మెందుకని, నాపాలి దైవమా! యని–ఎంతో చనువు, జాలిని చూపుచూ, అప్రయత్నముగా సహజముగా వచ్చిన ప్రాససొగసులతో కీర్తించినారు.

## 378. కేదారగౌళ – ఆది

**రాముని మరవకవే ఓ! మనసా ॥రా॥**

**రాముని యాగముఁగాచిన పాప వి–**
**రాముని సద్గుణ ధాముని సీతా ॥రా॥**

**ధీరుని దైత్యవిదారుని లోకా–ధారుని వంశోద్ధారునిసీతా ॥రా॥**

**ధ్యేయుని మునిజనగేయుని ఘననిభ–కాయుని**
**దేవరాయుని సీతా ॥రా॥**

**వాసవ హృదయ నివాసుని బహురవి**
**భాసుని శుభకరవేసుని సీతా ॥రా॥**

**గీతప్రియుని విధాతనుతుని కం**
**జాత బంధుకుల జాతుని సీతా ॥రా॥**

**ఈ జగతిని అవ్యాజమున ఆప్త స**
**మాజమును బ్రోచు జగత్పతిని సీతా ॥రా॥**

**దానవ హరు నీశాన వినుతుని స**
**దా సరోత్తముల మానరక్షకుని ॥రా॥**



**శోభనదుని, గిరిజా బాహుని దురి**
**తేభ హరుని బహు ప్రభావుని సదా ॥రా॥**

**శీలిని సద్గుణ శాలిని ఘనుని క–**
**పాలినుతుని వనమాలిని సీతా ॥రా॥**

**శ్రీగురు చరణము లే గతియనిన స**
**దాగతిజ హితుని త్యాగరాజనుతుని ॥రా॥**

శోభనదుని= శుభముల నిచ్చువానిని గిరిజాబాహుని= పార్వతికి తోడబుట్టినవాడు. దురితేభహరుని= పాపములనెడి ఏనుగులకు సింహము వంటివానిని. సదాగతిజ హితుని= వాయు కుమారునికి హితుడైనవాని.

ఇందు శ్రీరాముని మరువకుండుమని, మనస్సంబోధనముతో రాముని దివ్య లక్షణములను కీర్తించినారు.

## 379. సౌరాష్ట్రము – చాపు

**రారా నన్నేలుకోరా శ్రీ–రఘువీర నన్నే చ మేరా ॥రా॥**
**సారాసారోదారయఖిలా, ధారాద్భుతగుణధారాళముగ ॥రా॥**

**ధారాధరాభ శరీర నాయెడ నీవు**
**నేరమెన్నక యాదుకోర శ్రీరామ సం**
**సారకానన విహారుడైన నాకు**
**సారమౌ నామమే తారకమౌర ॥రా॥**

**సీతాహృత్కమల ఖద్యోతాప్త జనపారి–**
**జాతా ఘనిధి పోతాబ్జ హితకుల**
**జాత రక్షించు విధాతజనక ఇష్ట**
**దాత వైన సాకేతాగారా ॥రా॥**

**రా జాగేల ధర జామాతవై**
**నా జాలెరింగి ఓ! యాజానుబాహుజ, వి**
**రాజమాన ద్విజరాజానన సుర**
**రాజార్చిత త్యాగరాజనుతాజ ॥రా॥**

ఏచ= బాధించ, మేరా= న్యాయమా, సీతా...ఖద్యోత= సీతా హృదయమనెడి కమలమునకు సూర్యుడు, అఘనిధిపోత= పాప సముద్రమునకు నావ, అబ్జహితకులజాత= సూర్య వంశమునందు పుట్టినవాడు, ధరజామాతవై= భూమికి అల్లుడవై.

రామా ధారాళముగ నీ విచటికి వచ్చి నన్నేలుకొనుము. నన్ను బాధించుట నీకు తగునా? యని ప్రార్థించినారు.

సంసార కాననమున చరించు నాకు నీ దివ్య తారకనామమే తారకము. ఆప్తులకు కల్పవృక్షమువంటి నీవు నా ఇష్టముదీర్చి కాపాడుము. పైగా నీవు భూదేవి కల్లుడవౌటచేత, ఈ జాలు నీ వెరింగినదే యని చమత్కారమును, చుట్టరికమును చూపి కీర్తించినారు!

## 380. దేశితోడి - ఆది

**రూకలు పదివేలున్న చేరెడు-**
**నూకలుగతిగాని ఓ మనసా ॥రూ॥**
**కోకలు వెయ్యున్నకట్టు-**
**కొనుటకొకటేగాని ఓ మనసా ॥రూ॥**

**ఊరేలిన తాపండుట మూడు మూరతావుగాని**
**నూరు భక్షణము లబ్బిన, నోటికంతగాని**
**ఏరు నిండి పారిన పాత్రకుతగు-నీరు వచ్చుగాని**
**సారతరుని హరిని త్యాగరాజ-సన్నుతునిమరవకే మనసా ॥రూ॥**



లోకమందలి విషయభోగములను తాననుభవించుటతో తృప్తినందక మనుష్యులు దురాశకులోనై, భగవంతుని మరచుచున్నారు. **"శారీరం కేవలం కర్మ కుర్వన్నాప్నోతి కిల్బిషం"** (గీత) (శరీర స్థితికి తగినంత సంపాదించుకొని జీవించుటలో పాపమంటదు) అని యున్ననూ మానవుడు లోభముచే తనకెంత యున్నను, తృప్తినందక విషయలోలు డగుచున్నాడు. ఈ యంశమును లోక సహజములైన అనుభవములతో, మనస్సంబోధనముతో హరిని భజించి శాశ్వతానంద మొందుమని ఇందు కీర్తించినారు.

రూకలు పదివేలున్ననూ, నిత్యకృత్యములో చేరెడు నూకలే వాని యాహారమునకు చాలును. అట్లే కోకలు వెయ్యున్ననూ, వస్త్రము లెన్నియున్ననూ, కట్టుకొనుట కొక్కటియే చాలును. గ్రామమునకు తానెంత పెద్ద అయిననూ, ఎన్ని గృహములున్నను, తీరా తాను పండుకొనుటకు మూడు మూరల తావు చాలును. (ఈ కొల్త ఆద్యంతములకు సరిపడును) భక్షణము లెన్నియున్ననూ, తన నోటి కందినంతవరకే గదా! తినును. నది యెంతయున్నను, తన పాత్రకు తగినంత నీరు మాత్రమే వచ్చును. అయిననూ, మున్ముందు తనకే యవసరమగునేమో! నని ఆలోచన మానవసహజము. కాని, తనకు ప్రాప్తమగునదిపోదు. తనకు ప్రాప్తములేనిది లభించదనే పరమార్థ సత్యాన్ని గుర్తించుట వివేక లక్షణము. ఆపై శ్రీహరి చింతనము తన సమస్యకు శాశ్వత పరిష్కారము, శాంతిప్రదము అని ఈ గేయమందలి దివ్యోపదేశము.

## 381. భైరవి - ఆది

**లలితే శ్రీప్రవృద్ధే శ్రీమతి-లావణ్యనిధిమతి శ్రీమతి ॥ల॥**

**తెలివిని వర్ధిల్లు శ్రీ-తపస్తీర్థనగర నిలయే ॥ల॥**

**తెలియని బాలుడగాదా అంబ-తెలివి నీ సొమ్ముగాదా**
**చలముసేయ మరియాదా-చల్లని మాటలు బల్కరాదా ॥ల॥**

**బ్రోచువారిలనులేక-జూచిచూడక పరాకా**
**యీసుజనుల వేడగలేకనే-దాసుడ నీవే గతిగాక ॥ల॥**

**కన్నతల్లి శుభవదనే మీ-యన్నదయకు పాత్రుడనే**
**తిన్నగ శరణు జొచ్చితినే-త్యాగరాజ మానససదనే ॥ల॥**

లలితాంబకు, "శ్రీప్రవృద్ధ శ్రీమతి" యను ప్రత్యేక సంకేతము దక్షిణ దేశమందొక క్షేత్రమున ప్రసిద్ధమైయున్నది.

ధర్మసంవర్ధని-పర్వతవర్ధని మొదలగు నామములట్లు శ్రీ ప్రవృద్ధ శ్రీమతి యను పరమ సౌభాగ్య సంకేతము. ఆ క్షేత్రమునకు "తప స్తీర్థ నగరము" అను సంకేతము ప్రకృతం వాడుకలో ప్రసిద్ధిగలదై యున్నది.

ఆ పరదేవతయందు మాతృదేవతా దృష్టితో నేను బాలుడగాదా! తెలివి అనగా జ్ఞానము నీ స్వరూపమే కావున నా అధికార అర్హతలతో నిమిత్తములేకనే నాతో చల్లగ మాట్లాడరాదా! నీవు పరాకుతో నన్ను చూచి చూడనట్లుండుట న్యాయముగాదనియూ, నాకు తల్లివైన నీవు తప్ప వేరేగతి ఎవ్వరులేక నీ దాసుడనై తిననియు, లోకమందలి ఈసుజనులు= అనగా ఈర్ష్యగలవారిని నేను వేడలేను. కావున నిన్నే శరణుచొచ్చితిని. మరియు "మీ యన్న దయకు పాత్రుడనే-" యనుట ఎంతో ముచ్చటగానున్నది. అమ్మవారికి రాముడు అన్న కావున, వారి బాంధవ్యమును స్మరించి లలితాంబికకు తనదగ్గర చుట్టరికమును విన్నవించుకొన్నారు.

## 382. శుద్ధసావేరి - ఆది

**లక్షణములు కల రామునికి ప్ర**
**దక్షిణ మొనరింతాము రారే ॥ల॥**

**కుక్షిని బ్రహ్మాండము లున్నవట వి**
**చక్షణుడట దీక్షాగురుడట శుభ ॥ల॥**



**లక్షణ లక్ష్యము గలశ్రుతులకు ప్రత్యక్షం బౌనట**
**గురు శిక్షితుడై సభను మెప్పించు భక్తరక్షకుండౌనట**
**అక్షరస్థులైన భజన పరులకే అంతరంగడౌనట**
**సాక్షియై వెలయు త్యాగరాజపక్షుండౌనట ముప్పదిరెండు ॥ల॥**

శ్రీరామునికి ముప్పదిరెండు ప్రదక్షిణములను చేయుదము రండని తన తోడి సమాజమును ఆహ్వానించుటలో పరమాత్మ తత్త్వమును ఇందు కీర్తించినారు. పరమాత్మకు ముప్పదిరెండు ఆవరణములున్నవి.

అవ్యక్తము, మహ దహంకారములు, పంచన్మాత్రలు, మహాభూతములు ప్రాణాదులు, దశేంద్రియములు, అంతఃకరణ చతుష్టయము కలిసి ముప్పదిరెండు ఆవరణములు.

ఒక్కొక ప్రదక్షిణ నమస్కారముచే క్రమముగా ముప్పదిరెండు ఆవరణములు తొలగి జీవునకు పరమాత్మ సాక్షాత్కారము సిద్ధించునని ప్రదక్షిణములయొక్క భావము.

మరియు **''ద్వాత్రింశల్లక్షణోపేతః''** అని వాల్మీకి శ్రీరాముని కల్యాణగుణములను **"ఇక్ష్వాకువంశ ప్రభవో రామోనామ జనైశ్రుతః, నియతాత్మా మహావీర్యోద్యుతిమాన్ ధృతిమాన్ వశీ"** ఇత్యాది ముప్పదిరెండు గుణములను, రామాయణ మందు వర్ణించియున్నారు. మరియు, రాజ్యాంగ లక్షణములున్నూ, సంధి విగ్రహ యానము మొదలగునవి ముప్పదిరెండే కావున, ఏవంవిధ లక్షణములతో పరమాత్మగా, మహాపురుషుడుగా, సార్వభౌముడుగా దివ్యలక్షణములుగల రామునికి ప్రదక్షిణచేసి ఉపాసింతమని ఉన్నతమైన భావమిందిమిడియున్నది.

ఇదిగాక, విశ్వరూపుడు ప్రపంచమునంతను తనలో నిముడ్చుకొన్న వాసుదేవుడే రాముడనుటకు "కుక్షిని బ్రహ్మాండములున్నవట" అనుటలో సాక్షాద్విశ్వ మూర్తియని భావము. విచక్షణుడనగా, సకల జీవుల కార్యా కార్యములను అంతర్యామియై ఎరింగిన సర్వజ్ఞుడనియు విశేషము. ఇక

“దీక్షాగురుడట” తన నాశ్రయించినవారికి వారి యంతరంగమందలి చైతన్యకళను పరమేశ్వరునితో చేర్చునట్టి గురుదీక్షను అనుగ్రహించునట్టి వానిని దీక్షాగురుడందురు. స్పర్శదీక్ష, దృగ్దీక్ష, మనోదీక్ష మొదలైనవి. ఇందొక్కొకదానిని గురువు శిష్యునికి అనుగ్రహించి, వాని శిక్షితుని చేసి, ఆయా లక్ష్యములందు వాని చిత్తవృత్తులను లయింపఁజేయుచూ, ధ్యాననిష్ఠను కలిగించును. క్రమముగా శిష్యుని బుద్ధివృత్తియందలి ‘నేను’ ‘నాది’ యను అహంకార మమకార వృత్తులు తొలఁగును.

ఆపై జీవాత్మ పరమాత్మ భేదమంతరించి, ఏకాకారమైన సాక్షాత్కార సిద్ధి కలుగును. అట్టి ఆచార్యమూర్తి రాముడేయని విశేషభావమును తెల్పినారు. తారక రాముడగుటచే తారక మంత్రరాజ మీ అంతరంగానుభవమును ఉపాసకులకు కలిగించును. మరియు “లక్ష్యము–లక్షణముగల శ్రుతులకు ప్రత్యక్షంబౌనట” యనుటలో **“సర్వేవేదాః యత్పద మామనంతి”** అను ప్రమాణముచే, వేద వచనము లన్నియు, లక్ష్య లక్షణ సమన్వయముచేసి తమ పరమ తాత్పర్యమును పరమాత్మ స్వరూపమందు సమన్వయించును. ఇచట లక్ష్యమనగా వస్తుతత్త్వము–లక్షణమనగా వస్తు స్వరూపమును, సర్వవిధములచేతను నిరూపించు వచనములు–వీటికి పర్యవసానము పరమాత్మ వస్తుతత్త్వము తానుగా తెలియుటయే. కావున, శ్రుతులకే రాముడు స్వరూపతః ప్రత్యక్షమౌనని భావము. గురుశిక్షితుడై–యనుటలో పై వివరించిన తత్త్వవైభవము గురువు అనుగ్రహము, వారి శిక్షలేనిదే ఎవ్వరికినీ లభించదు. కాబట్టి ఆ శిక్షలో ఉత్తీర్ణుడై సభను, సభ్యతగల విజ్ఞ సమాజమును, ఆనందింపఁచేయు భక్తులను ఆత్మీయులుగా రక్షించువాడు రాముడు **“జ్ఞానీత్వాత్మైవ మే మతం”** గీత. అనుట అట్టి జ్ఞానులైన భక్తులకు తన స్వరూప సాక్షాత్కార మిచ్చువాడని భావము.

మరియు “అక్షరస్థులైన భజన పరులకే అంతరంగుడు= అక్షరుడు పరమాత్మయని తెలిసి, వివిధ నామ, రూప క్రియలను వివరించు కీర్తనా



భావములను పరమాత్మయందు సమన్వయించుకొని భజనచేయు భక్తులకు రాముడు అంతరంగుడగును. అనగా వారి అంతఃకరణలందే సాక్షాత్కరించి స్వీయ వైభవము నందించును.

రాముడు కేవల చిద్రూపము అసంగము సాక్షిమాత్రమునైన వాడైనను, నాదోపాసనా ద్వారమున కీర్తించువారికి అంతరంగుడై, వీరికి జ్ఞానమును, లక్ష్యసిద్ధిని ప్రసాదించునని భావము.

అందుచేత, శ్రీరామునికి ప్రదక్షిణ నమస్కారములు సమర్పించి అనుగ్రహమొందుడని, ఈ చిన్న గేయమందు, వేద, వేదాంత సిద్ధాంతములను తమ అనుభవముతో మనకు ఆదేశించినారు.

## 383. [1]పూర్ణషడ్జము – రూపకం

**లావణ్యరామ కన్ను–లారజూడవే అతి ॥లా॥**

**శ్రీవనితా చిత్తకుముద–శీతకర శతానన్యజ ॥లా॥**

**నీమనసు నీ సొగసు–నీ దినుసు వేరే**
**తామస మత దైవమేల–త్యాగరాజనుత దివ్య ॥లా॥**

ఇందు లావణ్యమూర్తియగు శ్రీరాముని, కటాక్షముచే తనను చూడమని ప్రార్థించుచున్నారు. శ్రీ వనితాచిత్తమనెడి కలువకు చంద్రునివంటి వాడనుటచే, సకల సౌందర్యకళలకు నిలయుడనియు, శతమన్మథ సమానుడనియు భావము.

రామునియందు పుంసాం మోహనమైన సౌందర్యభావమేగాక, “నీ మనసు నీ సొగసు నీ దినుసు వేరే” అనగా–లోకమం దెచట చూచినను, సౌందర్యమునకు మనసుయొక్క పరిపాకమునకు పొత్తుకుదరదు. ఈ రెండు కలిసియున్ననూ, అవి తమ స్వార్థమునకేగాని, ఇతరులకు సుఖమివ్వజాలవు. కావున, మనసుయొక్క దయార్ద్రసంపద, విశ్వమోహన సౌందర్యము; దినుసు=

1. రుద్రప్రియ.

వస్తుతత్త్వము (మోక్షాన్ని అనుగ్రహించు మార్గము) వేరే= ప్రత్యేకత కలిగినది. రాముని యందే పొత్తుకలిగియున్నవని కీర్తించినారు. ఈ దివ్యలక్షణములు శత్రువులను సైతము ఆకర్షించగలవనుటలో శ్రీరాముని దివ్యచరిత్రమే ప్రమాణమైయున్నది. రామా! నీయందివి వేరే–అనగా విలక్షణములు.

కావున, తామస మతములుకల ఇతర దైవములకన్న విశుద్ధ సత్త్వమూర్తియగు నీ కటాక్షమునే అర్థించుచున్నాము. ఇందుకు ఆదర్శముగా రామా! నీవు శ్రీవనితా చిత్త చోరుఁడవు= శ్రీమహాలక్ష్మియొక్క చిత్తము నాకర్షించినవాడవు. బ్రహ్మేంద్రాది దేవతానాయకు లెందరున్ననూ, క్షీరసాగరమం దవతరించిన శ్రీమహాలక్ష్మి తన వరాన్వేషణమును స్వయముగా పరిశీలించుకొన్నదని భాగవతమందు కలదు. (రుక్మిణీకల్యాణము–పోతన) ఒకరియందు అనగా దూర్వాసునియందు తపసుయొక్క ఆధిక్యతయున్ననూ, వారికి క్రోధమున్నదనీ, జ్ఞానాతిశయముకల వారయ్యును సనకాదులు సంగవర్జితులు గారనియు ఇట్లే బ్రహ్మ కాముకుడనియు, మరొకరు ధర్మానుష్ఠాతలయ్యును, భూత దయలేనివారనియు అన్నియున్న శివుడుకూడ శ్మశానవాసియనియు, ఇట్లందరినీ ఎంచి. **"సుమంగళః కశ్చన కాంక్షతే హిమాం"** అని అనంత కల్యాణగుణై కతానమగు శ్రీహరినే భర్తగా వరించినదనికలదు. కావున, పరిపూర్ణ విభూతిగలవాడు రాముఁడనియు, ఇతర దైవోపాసనవలన రాజసాది వృత్తులు ప్రకోపమందుననియు నిరూపించి, అతి లావణ్యరామా! నన్నొకమారు నీ కన్నులార చూడవే! యని కీర్తించినారు.

## 384. [1]దుందుభి – దేశాది

**లీలగాను జూచే [2]కులశీలుల నా–[3]పాలగల్గజేసి**
**పాలింతువయ్యా ॥లీ॥**
**పాలుమాలిన పామరుల [4]నొల్ల–పరమాత్మ**
**ఈలోకములను ॥లీ॥**

1. దివ్యమణి 2. గుణ 3. పాలింప 4. నెల్ల



**నరకిన్నర కింపురుషాసుర ని–ర్జరరాజశివాది**
**రమాపతుల ॥లీ॥**
**తరు భూధరానేకాండముల–త్యాగరాజనుత**
**శ్రీరామనీ ॥లీ॥**

జన్మ జన్మాంతరములందైననూ, సాధుసంగము కలుగవలెనని వివేకవంతులు సదా భగవంతుని ప్రార్థించుదురు. ఈ భావము సర్వకాలములందును మార్పులేనిది. సాంప్రదాయికంగా హరికీర్తనాంతమున **"నీపాదకమల సేవయు, నీపాదార్చకులతోడి నెయ్యమును, నితాంతాపార భూతదయయును, తాపస మందార! నాకు దయసేయగదే"** (పోతన) అనుట ఆచారము. ఇందు అట్టి సాధువులనే "కులశీలులు" అని వాడినారు. వారి వారి కులక్రమాగతముగా, పెద్దల పరంపరనుండి దైవోపాసన ఆర్చనా రీతులలో వరవడి తప్పనివారు, సత్సంప్రదాయముకల దైవభక్తులు. అట్టి సాధు సత్పురుషులను నాపాల కలుగజేసి పాలింతువయ్యా అనగా పాలించుమని భావము. సర్వశాస్త్రములందును సత్సంగమే తరించుటకు ప్రధాన సాధనమని కలదు. పాలుమాలిన–అలసులైన పామరుల సాంగత్యముకోరను. పరమసాధువులు నరులు కిన్నరులు, దేవాసురులు శివ బ్రహ్మేంద్రాదులు మొదలు సర్వభూతములను తరు లతా గుల్మములను, తదితర అచేతనములను కేవల భగవదంశములుగా, సమదృష్టికలవారై, క్రియాతంత్రములందు వారి వారి స్వరూప స్వభావములను వేర్వేరుగా నీ విచిత్ర లీలా విభూతులుగాను దర్శింతురు. తదితరులైన పామరులు అట్లుగాక, ఈ ప్రపంచమందుగల వైవిధ్యములందు భోగానుభవములందు, తమకేదో జన్మహక్కు కలదన్నట్లు భావింతురేకాని. సర్వనియామకుడు సర్వజ్ఞుడునైన భగవంతుని సర్వనియామకుడని భావింపరు. కావున,

**"ఖం వాయు మగ్నిం సలిలం మహీంచ**
**జ్యోతీంషి సత్త్వాని దిశోద్రుమాద్రీన్**

**సరిత్సముద్రాంశ్చ హరేశ్శరీరం**
**యత్కించ భూతం ప్రణమే దనన్యః" (భాగవతం)**

(చేతనా చేతనములైన సర్వభూతములు శ్రీహరి శరీరమని భావించి మానసికముగా ప్రణమిల్లుదురు) ఈ ఉదాత్త భావముకల సాధు సత్పురుషుల సాంగత్య భాగ్యమును మాపాల కలిగించుమని కోరినారు.

## 385. అసావేరి – దేశాది

**లేకనా నిన్ను చుట్టుకొన్నారు**
**ఏకహృదయులై నిత్యానందము ॥లే॥**

**శ్రీకర కరుణాసాగర నిరుపమ**
**చిన్మయ శ్రిత చింతామణి నీయెడ ॥లే॥**

**సౌందర్యములో సుఖము సీతమ్మకు**
**సౌమిత్రికి కనుల జాడలో సుఖము ॥లే॥**

**సుందర ముఖమున సుఖము భరతునికి**
**సుజ్ఞాన రూపమున సుఖము రిపుఘ్నునికి॥ ॥లే॥**

**చరణ యుగమునందు సుఖమాంజనేయునికి**
**వరగుణ త్యాగరాజ వరదానందము ॥లే॥**

హనుమత్సీతా లక్ష్మణ భరతశత్రుఘ్నులు శ్రీరాముని అంతరంగ పరివారము. రాముని అనుబంధులు. కాని, రాముడు దార సోదరాదులు కలిగి, వీరితో వినోదించు కేవల మనుజుడు మాత్రమే కాడుగదా! రాముడు కేవల చిన్మయుడైన భగవంతుడని కదా విజ్ఞులు భావింతురు. అట్టి చిన్మయుడే లోకమును ఉద్ధరించుటకు మానవావతార మెత్తెననుట పరమార్థము. రామాయణము కేవల రాజమాత్రుని చరిత్ర మాత్రమేగాక, భగవంతుని దివ్యలీలామయమనీ, ఆదర్శమనీ బుద్ధిమంతుల భావనము. రామావతారమందు సర్వభూతదయ, ఆశ్రితుల సంరక్షణము ప్రధాన లక్షణములు.



కావున, సీతా లక్ష్మణాదులకు రామునితోగల అనుబంధము మాత్రమేగాక, ఈ పరివారమునకు ఆంతర్యముగా రాముని అనుసరించుటలో అనిర్వచనీయము విలక్షణమునైన బ్రహ్మానందము, వేర్వేరు తీరుతెన్నులలో వీరికి కలదని, గమనించి శ్రీ త్యాగరాజస్వామి ఇన్ని తీరులలో ఆ మధురానుభవము ననుభవించి, వారి వారి దివ్యానుభవములను ఈ గేయమందు అభివర్ణించినారు. పల్లవిలో యెంతో సహజమైన రీతిలో "లేకనా నిన్ను చుట్టుకొన్నారు." అని యెత్తుకొని చివర నిత్యానందము అని పల్లవిని పూరించుట యందెంతో లాలిత్యము సంభ్రమాశ్చర్యములు సూచితము లగుచున్నవి.

తర్వాత ఒక్కొక్కసారి ప్రత్యేకానందమును వివరించుచూ, సౌందర్యములో సుఖము సీతమ్మకట, నిత్యకల్యాణ దంపతులుగా నవతరించిన లక్ష్మీనారాయణులలో పరస్పర సౌందర్య లక్షణము, వారికే చెల్లునుగాని తారతమ్యముల నెంచుట యెవరితరము? కావుననే సర్వసామ్రాజ్య భోగభాగ్యములను తృణప్రాయముగ భావించి, అరణ్యవాసమందు శ్రీరాముని వెన్నంటి, తానే కోరుకొని నారచీరలతో వెడలిన గృహలక్ష్మియైన సీతమ్మకు రాముని దివ్య సౌందర్యములోనే బ్రహ్మానందము అనుభవమైనది. తన లంకా నివాసము నందును, శ్రీరాముని నిత్య సన్నిధానమునే భావించుచూ, రాముని రాకనే కోరుకొన్న సాధ్వీమతల్లి. ఆ దంపతుల దివ్యచరిత్రను భావించువారికి ఇహ పరములలో సర్వసిద్ధులు సిద్ధించును.

ఈ తల్లి కన్న మిన్నగా, సుమిత్రా కుమారుడైన లక్ష్మణునికి శ్రీరాముని కనులజాడలే బ్రహ్మానందహేతువులై, నిద్రాహారములను సైతము లెక్కచేయని దివ్య కైంకర్యమే తన సర్వస్వముగా భావనము కుదురుకొన్నది. కైంకర్యమందు వీరికి వీరేసాటి.

అంతకన్న విశేషించి, రాముడు తనకెదుట లేకున్ననూ, పరోక్షముగా శ్రీరాముని దివ్యముఖారవిందమునే భావించుకొనుచూ, తన అంతర్బాహ్యములను, రాజ్యాంగమును రామమయముగా భావించిన మహాయోగి భరతుడు. అరణ్యవాసానంతమున వెంటనే రామదర్శనము కానిచో అగ్నిప్రవేశము చేయుటకు కూడా వెనుకాడని మహా త్యాగధనుడు.

సుజ్ఞాన రూపమున సుఖము శత్రుఘ్ననికట. ''శత్రుఘ్నో నిత్యశత్రుఘ్నః" ఆంతరమున కామాది శత్రువర్గమును జయించి, రాముని చిన్మయుడుగా భావించినమహాజ్ఞాని శత్రుఘ్ననికి బ్రహ్మానందము స్వతస్సిద్ధము – ఇక "రామ పాదసేవా ధురంధరః" శంకరాంశుడైన ఆంజనేయుడు; తన నాయకుడైన రామునికి గూడ అసాధ్యములైన సముద్రలంఘనము సీతాన్వేషణము మొదలైన మహాకార్యములను సాధించిన మహావీరుడైనను **"దాసోఽ హం కోసలేంద్రస్య రామస్య"** అనే తిరుమంత్రమును జపించు దాస్యభక్తిలో అసమానుడై, **"రామాయణ మహామాలా రత్నం"** అని వాల్మీకి ప్రస్తుతిఁగన్న దివ్య విభూతిగల రామదాసుడు. ఇందు సీత మధుర సౌందర్య భక్తిలో, కైంకర్య భక్తియందు లక్ష్మణుడు, సౌభ్రాత్రమందు భరతుడు, జ్ఞాన భక్తిలో శత్రుఘ్నుడు, దాస్యభక్తిలో హనుమంతుడు అసమానులు. ఇందరినీ కీర్తించి ఇందరి ఆనందములలో తాను భాగస్వామియై, రాగరంజితమైన నాదోపాసనతో సపరివారుడైన శ్రీరాముని కీర్తించి, సంకీర్తనానందమందే పరమాత్మను అనుభవించిన శ్రీ త్యాగరాజస్వామి మనకు, ఆదర్శమూర్తి. వారి దివ్యానుభవమే మనకు శ్రీరామరక్ష –

## 386. నవనీతం – ఆది

**లేమి దెల్ప పెద్దలెవరు లేరో ॥లే॥**

**ఆ మహిమలెల్ల మాని–ఈ మహిలోబుట్టిరో ॥లే॥**

**నీరూపము బూని మనసు–**
**నిర్మలులై యుండలేదా**
**ధారాధరాభ శరీర–త్యాగరాజ వినుత ॥లే॥**



రామా! నీ అవతార సమకాలమందున్న భక్తులు ఋషులు పరివారము ఇపుడు లేరా? లేక ఆ మహిమలను విడచి, ఈ లోకమందిపుడు వేర్వేరు జన్మలెత్తియున్నారా? ఉన్నచో, ఈ నా దైన్యమును వెంటనే నీకు నివేదించి, నాకు రక్షణ నొసంగి యుండేవారే.

సుగ్రీవ విభీషణాదులు ఆర్తులై నీ ఆశ్రయము కోరినపుడు, పెద్దలందరు నీకు రాయబారములు సలహాలు జరిపియుండిరిగదా! వారందరేమైరి? వారందరు అన్ని విధములుగా నీ సన్నిధాన భాగ్యమునేకాక నీ సారూప్యసిద్ధినే అనుభవించినారు. వారికెన్ని క్లేశములు కలిగిననూ, మనసు నిర్మలులై నీ అనుగ్రహమునకు పాత్రులైరి. నేనట్లు కాకూడదా? నీ, నా, మధ్య రాయబార మెందులకని పరమభాగవతులైన రామ భక్తులను స్మరించినారు.

## 387. బేగడ – ఆది

**లోకావన చతుర పాహి మాం ॥లో॥**

**సాకేతాధిప సరసగుణాప్రమేయ–**
**సరసిజాసన సనందన వందితాంఘ్రి–**
**యుగ పదనిర్జితముని శాప ॥లో॥**

**రాకాబ్జముఖ పరాకా చెంతకు**
**రాక తన కోర్వతరమా**
**పాకారి వినుత నీకాసించితి**
**గాక నేనన్యమెంచను నీదువాడనయ్య రామయ్య ॥లో॥**

**నీలాకృతిగల నీలావణ్యము**
**నీలాగని కనుపింపవే**
**బాలార్కాభ సుచేలావృత న**
**న్నేలుకో మనసురాదిక తాళజాల న్యాయమారామ ॥లో॥**

**చేప ఆదిగ పది రూపాలను గొను**
**చాపాలంకృత సుందర అవ-**
**నీపాద్భుతమగు నీపాదమె గతి**
**శ్రీపతే వరద పాలిత త్యాగరాజ సార్వభౌమాఖిల ॥లో॥**

లోకావన చతురుడు-తన దివ్యగుణ రూప లీలాదులచే సర్వజీవులను రమింపఁజేసి. లోకమునంతను రక్షించుటలో నేర్పరివగు రామా! నన్ను రక్షింపుము. నీవు సాకేతప్రభుడవై, పరిపాలనలో సరసగుణములుకల రాజమాత్రుడవేగాక. ఊహకందని అద్భుతగుణములు కలవాడవు. బ్రహ్మ సనకాదియోగులు నీ పాదములకు వందన మొనర్తురు. గౌతమముని శాపమును సైతము నీ పాద రజస్స్పర్శచే పోగొట్టితివి. నీ చంద్రబింబము వంటి ముఖమును చూపి నా చెంతకు వచ్చుటలో నీకింత పరాకా? తన కోర్వతరమా? నేను సహించగలనా? నిన్నే ఆసించి, ఇతరాశ్రయములేక నీవాడనై యున్నాను. నీల శరీరముగల నీ లావణ్యమును నాకు చూపుము! నీరెండకాంతిగల చేలము ధరించి దర్శనమిమ్ము. నా చిత్తము కార్యాంతరములకు రాదు. సహించలేనని, దైవమానుషభావముల కిచట చక్కని సమన్వయము చూపుచూ తన రక్షణను అర్థించినారు.

నీవు చాపాలంకృతుడవై కోదండధారివై, అవనీశులకు= సమస్తరాజన్యులకు అద్భుతముగొల్పు మహావీరుడవయ్యును, ఆయా యుగములందు, చేప= మత్స్యము మొదలగు అనేకావతారములనెత్తి, మానావమానములను లెక్కచేయక, సత్పురుషులను కాపాడుటకై దుష్టులను శిక్షించిన సార్వభౌముడవైన ఓ! లక్ష్మీపతీ! నీ పాదమే శరణ్యమనియున్న నన్ను రక్షించుటలో పరాకువహించుట న్యాయముగాదని సాభిప్రాయముగ ప్రార్థించినారు.



## 388. షణ్ముఖప్రియ - ఆది

**వద్దనేవారు లేరు ॥వ॥**

**అద్దంపు మోమును జూడనే-ననయ మంగలార్చితే జూచి ॥వ॥**

**కోరిక లిలలో దివిలో-కొంచెమైనలేని నా మనసు**
**దారి తెలియు దైవము నీవు సుమీ**
**త్యాగరాజ హృద్భూషణ నిను వినా ॥వ॥**

అద్దమువలె ప్రసన్నతకల చెక్కిళ్ళచే ముద్దులొలుకు నీ ముఖారవిందమును చూచుటకు నేనంగలార్చుచున్నాను. ఇట్లున్న నన్ను చూచి ఎవరైనా నీ కడ్డువచ్చి, "వానికి నీ మోము చూపవలదని పల్కువారుందురా? నీవే చూపకున్నావు. పోనీ నా యర్హత నీకు తెలియలేదనుట వీలు కన్పింపదు. నీవు త్యాగరాజుని హృదయమునకే భూషణమైనవాడవు. (అంతర్యామిగా నాలో నున్నవాడవని తాత్పర్యము.)

నేనన్ననో, ఇహ, పరలోకములందున్న భోగభాగ్యములపై నా మనసుకు అల్పమైన కోరికలేనివాడననే యంశము అతి సన్నిహితుడవైన దైవమవగు నీకే తెలియును. నా చిత్తమును నే నెరుఁగుదును కదా! ఇన్ని కారణములచే నీవే నాకు దర్శనమివ్వకున్నావు. ఇతరులెవ్వరి లోపము గాదు.

## 389. స్వరభూషణి - రూపకం

**వరదరాజ నిను గోరి-వచ్చితి మ్రొక్కేరా ॥వ॥**

**సురలు మునులు భూసురులు-చుట్టిచుట్టి సేవించే ॥వ॥**

**వరగిరి వైకుంఠమట వర్ణింపదరము గాదట-ని**
**ర్జరులను తారకములలో-చంద్రుడై మెరయుదువట**
**వరత్యాగరాజనుత-గరుడసేవ జూడ ॥వ॥**

కాంచీపురమందు వేంచేసియున్న శ్రీ వరదరాజస్వామి గరుడోత్సవమును ప్రత్యక్షముగా దర్శించి శ్రీ త్యాగరాజస్వామివారు కీర్తించిన గేయము.

శ్రీ వరదరాజస్వామివారు వసించే ఉన్నత ప్రదేశమునకు "హస్తిగిరి" యను సంకేతము పురాణప్రసిద్ధము. ఆ గిరియే లక్ష్మీనిలయమై వైకుంఠమని ప్రసిద్ధి. అచట ఇంద్రాది సకలదేవతలు నక్షత్రములైతే శ్రీవరదుఁడు చంద్రుడై భక్తులకు సుఖశాంతులను ఆహ్లాదమును కలిగించుచున్నాడట.

అందు శ్రీహరి గరుడసేవ మిక్కిలి ప్రధానము. అందు సురలు, మునులు, వేదవేత్తలైన బ్రాహ్మణులు, స్వస్తి వాచనములతో చుట్టిచుట్టి సేవించుచూ, అనేక వాద్యములతో తిరువీధి మహోత్సవము మహా వైభవముగా జరుగును. అదే దివ్యక్షేత్రమందు, శ్రీ కామాక్షీసనాథులు శ్రీ ఏకామ్రనాథులున్నూ వేంచేసి యున్నందున శ్రీ కాంచీపురము హరి హర క్షేత్రము, అయ్యగారు స్వయముగా చూడవచ్చితినని, అనుగ్రహింపుమని వేడుకొన్నారు.

## 390. విజయశ్రీ – ఆది

**వర నారద నారాయణ–స్మరణానందానుభవముకల ॥వ॥**

**శరదిందునిభాపఘనానఘ–సారముగాను బ్రోవుమిక ॥వ॥**

**సకల లోకములకు సద్గురు వనుచు–సదానేనతడనుచు హరియు**
**ప్రకటంబుగ కీర్తి నొసంగెనే–భావుక త్యాగరాజనుత ॥వ॥**

ఇందు శ్రీనారదగురువును స్తుతింపుచూ, వారి స్వరూపమే, నారాయణుడనియు, నారాయణకీర్తన స్మరణాదులతో, పరిపూర్ణము, పరిపక్వమునైన ఆనందానుభవము నారదులకే కలుగదని విశ్లేషించినారు.

నారాయణకీర్తనా ద్వారమున, భగవద్వైభవమును లోకమున కందించుకొరకే, నారదుని అవతారమనియు, భగవంతుని ఏకవింశత్య వతారములలో వీరి యవతార విభూతిని, మహాపురాణములు పేర్కొన్నవి.



నారదుని దేహకాంతి శరదిందునిభము; శరత్కాలచంద్రునివలె శుద్ధసత్త్వమయము.

మరియు "నారద" యను సంకేతమే లోకమునకు గురుస్వరూప మాతదేయని తెలుపుచున్నది.

"నృణాం సంబంధి= నారం. అనగా జ్ఞానము. తం దదా తీతి= నారదః" దానిని భక్తుల కనుగ్రహించువా డగుటవలన "నారదుడు" అని వివరము. కావున సర్వలోకముల కీతఁడే సద్గురువు.

అదికాక శ్రీహరి నారదునికి సాక్షాత్కరించి, నీవే నేనని, నారదునితో తనకు అభేదమును బోధించెనట. ఇట్టి సత్కీర్తినందిన పరమ మంగళ స్వరూపుడు. కావున ఓ! నారదా, మమ్ము సారముగ కాపాడి పరమాత్మ స్వరూప తత్త్వజ్ఞానము ననుగ్రహింపుమని కీర్తించినారు.

## 391. సుప్రదీపం – ఆది

**వరశిఖి వాహన వారిజ లోచన**
**కురుశం తనుజిత కుసుమ శరాయుత ॥వ॥**

**శరజభవాంబుద వాహనాది**
**సురనుతపాద సుగుణ కుమార ॥వ॥**
**తారకశూర పద్మాసుర తూల**
**దహన భూధర సుతానందన ధీర**
**శ్రీ రఘువీర భాగినేయాప్త మం**
**దార గుణాకర త్యాగరాజార్చిత ॥వ॥**

వరశిఖివాహన= నెమలివాహనము కలవాడు. కురు= చేయుము, శం= సుఖమును, తను....యుత= పదివేల మన్మథుల జయించగల శరీరసౌందర్యము కలవాడు. శరజభవ= రెల్లునందు పుట్టినవాడు.

అంబుద...పాద= మేఘవాహనుడైన ఇంద్రాది దేవతలచే నుతింపఁబడు పాదములు కలవాడు. తారక...దహన= తారక, శూరపద్మాసురాదులైన అసురులనెడి దూదికి అగ్నివంటివాడు.

భూధరసుతానందన= హిమవత్పుత్రికి కుమారుడు
శ్రీ రఘువర భాగినేయ= శ్రీరామునికి మేనల్లుడు

నెమలివాహనము కల శ్రీ సుబ్రహ్మణ్యస్వామి పదివేల మన్మథులంతటి సౌందర్యము కలవాడని, ఇంద్రాది దేవతల కారాధ్యుడని, తారక శూర పద్మాసురాదులను సంహరించినవాడని, స్తుతించి, తన ఇష్టదైవమైన శ్రీరామునికి మేనల్లుడని బాంధవ్యమును సంతరించుకొని ఆప్తులపాలిటి కల్పతరువని కీర్తించి మాకు సుఖమొసంగుమని వేడుకొన్నారు.

## 392. ఘూర్జరి – ఆది

**వరాలందు కొమ్మని నాయందు**
**వంచనసేయ న్యాయమా!** ॥వ॥

**సురాసుర వినుత రామవామన**
**సుభక్తినె కోరియుండగ నను**
**మనమున నిజముగ నమ్మిన వారి**
**మనసు కొంచ ఫలమాసించరా**
**దనుచు ఘనుని జేసిన నీ బిరుదుకు**
**కనకకశిపు సుతుడు సాక్షిగాదా!** ॥వ॥

**అవివేకముతో తెలిసి తెలియకను**
**భవ సుఖముల కాసించినగాని**
**ధ్రువమైన ఫలమొసఁగు నీశక్తికి**
**ధ్రువుడు సాక్షిగాదా రామ నను** ॥వ॥



**చరాచరాత్మక సురపూజిత ఇక**
**పరాకు లేకను సతతము నీ ద**
**య రావలె ననుచు కోరిన శ్రీత్యా**
**గరాజునిపై కృపలేక నను** ॥వ॥

రామా! నీ పూర్వచరిత్ర పరిశీలింపగా, నీ భక్తులను వరాలందుకొమ్మని ప్రలోభము చూపుటయు వారందుకంగీకరించనపుడు, నీవు పరమ వాత్సల్యముతో వారికి శాశ్వతమైన సుఖశాంతులను అనుగ్రహించుటయు రివాజుగా కన్పించుచున్నది. అందుకు వారికి అచ్చమైన భక్తి యుండుటయే ప్రధానకారణముగాని వేరు అర్హతలున్నట్లున్నూలేదు. అందు దేవతలు–అసురులు–నర మృగములు, బాలురు సైతమున్నట్లు స్పష్టము. ఆ భక్తి సిద్ధాంతమున మొదటివాడు ప్రహ్లాదబాలుడు. నిన్ను నిజముగ నమ్మి, సర్వాత్మనా నిన్నే శరణందినవారి చిత్తము కొంచ ఫలము, అల్పమైన కోరికలకు లోబడకుండ నీవే అనుగ్రహమిచ్చి, శాశ్వతానందము నిచ్చుటలో కనక కశిపు–హిరణ్యకశిపుని కుమారుడు ప్రహ్లాదుడు సాక్షి.

ధ్రువుడు మిక్కిలి బాల్యమున అవివేకముతో రోషావేశముతో, తండ్రిలాలనకై ప్రాకులాడి, అల్పసుఖమున కాసించినను, అతని అచంచల భక్తినిష్ఠకు సంతసించి, వానికి సర్వోన్నతము, నిత్యమునైన ధ్రువపదమొసఁగి కాపాడితివి. అట్లే శత్రు సోదరుడైన విభీషణుడు, నర మృగ పక్షిజాతులు సైతము ఎందరో నీ దయకు పాత్రులైనారు. ఇన్ని తెలిసి ఏమాత్రమూ పరాకులేక నీ కృపకై ఎదురుచూచు నన్ను, ఫలకాంక్షతో వంచనచేయక కాపాడుమని సోదాహరణముగ ప్రార్థించినారు.

## 393. రాగపంజరం – చాపు

**వరదాన వనీతాశా పాహి**
**వరదా నవమదనాశా ఏహి** ॥వ॥

**శరదాభకర విధృతశరాశర-**
**శరదాశుగ సుమశరదా శరహిత** ॥వ॥

**ద్విరదాద్భుతగమన పురదహననుత-**
**స్ఫురదాభరణా జరావనపర-**
**గర దాశన తురగరధా ద్యుతిజిత**
**వరదాసజనాగ్రేసర త్యాగరాజ** ॥వ॥

నవనీతాశా= వెన్నె కోరిక గలవాడు. ఆశతో ఆరగించేవాడు. పాహి= రక్షింపుము. వర దానవ మదనాశా= దానవుల మదమణచువాడు. శరదాభ= మేఘకాంతి కలవాడు. కరధృతశర= బాణధరుఁడు. ఆశర శరదాశుగ= అసురు లనెడి మేఘములకు వాయువువంటివాడు. సుమశరద= మన్మథునికి శరముల నిచ్చినవాడు. ద్విరదాద్భుతగమన= గజగమనుడు. పురదహననుత= శివునిచే స్తుతింపఁబడువాడు. అజరావనపర= దేవతలకు రక్షకుడు. గరదాశనతురగ రథ= సర్పములు ఆహారముగాగల గరుడుడు వాహనమైనవాడు. ద్యుతిజిత...సర= నీ దివ్యకాంతిచే ఆకర్షించిన దాస జనులు కలవాడు (త్యాగరాజవరదా)

ఇందు స్తుతిపరములైన విశేషములచే రాముని విష్ణుపరముగా కీర్తించినారు.

## 394. చెంచుకాంభోజి - దేశాది

**వరరాగ లయజ్ఞులు తామనుచు-వదరేరయా** ॥వ॥

**స్వరజాతి మూర్ఛన భేదముల్-**
**స్వాంతమందు తెలియక యుండియు** ॥వ॥

**దేహోద్భవంబగు నాచముల్**
**దివ్యమే ప్రణవాకారమనే**



**దాహం బెరుంగని మానవుల్**
**త్యాగరాజనుతయేచేరురామ** ॥వ॥

నాదము విశ్వమునకు ఆత్మయైయున్నది. కావుననే, నాదబ్రహ్మయనుట ప్రసిద్ధము. నాదబ్రహ్మమందంతర్లీనమైన చిచ్ఛక్తియే శారదామాత. మానవుల అంతశ్శరీరమందున్న (సుషుమ్న) వెన్ను ఎముక వీణాదండము. ఆ చిచ్ఛక్తి విలాసముగా నాభిమొదలు ఆయాస్థాన భేదములందు నాదరూపములైన సరిగమాది స్వరభేదములతో ప్రకృతియందలి కళావైచిత్ర్యమును రాగస్వరూపముగా వ్యక్తీకరించును. ఈ రాగములందలి సౌందర్యమే ఆ చిచ్ఛక్తియొక్క విలాసము. ఆపై రాగభావము అక్షర, పద, వాక్యరూపమైన సాహిత్యమును ఉపాధిగా స్వీకరించి, లయ విన్యాసముతో పాదన్యాసముంచుటవలన భావానుకూలమైన సంగీతముగా సహృదయులకు అనుభవమగును. ఆ అనుభవము (ప్రణవము) ఓంకారమందు లక్ష్యసిద్ధినంది పరమాత్మ సాక్షాత్కారమునకు సంగీతము సాక్షాత్సాధనమగుచున్నది. జన్మాంతర పుణ్య సంస్కారమున తమకు లభించిన సంగీత జ్ఞానమును, భావుకులైన గాయకులు ఈ లక్ష్యశుద్ధితో గానము చేయవలయును. అట్లుగాక, శబ్దాది విషయ రూపమున, తాత్కాలికముగా లోకమును రంజింపఁ జేయుటయే ఉన్నతాదర్శమని గాయకులు భావించరాదు. అట్టివారికి హెచ్చరికచేయుచూ ఇందు శ్రీత్యాగరాజస్వామి కొంచెము కటువుగా మందలించుచూ, "వరరాగ లయజ్ఞులు తామే యనుకొనుచూ, వదరేరయా" అనిరి.

వీరికి స్వరజాతి మూర్ఛనాభేదములు, స్వాంతమందు ఆంతర్యముగా తెలియవు. ప్రయోగ సరళిలో వీటిని తెలిసినను, పై వివరించిన పరమార్థ ప్రయోజనము వీరికి లేదనుట భావము. అన్నినాదములు ప్రణవమందు లక్ష్యము కలవనియు, ఆ ప్రణవనాదమే పరమేశ్వరుని చిహ్నమైనందున దానిని పొందుటయే బ్రహ్మానందమనియు, ఆ ఆనందానుభవము

పొందవలెనను దాహము–దప్పి వీరికిలేదనియు, తమ ఆవేదనను ఇందు తెలుపుకొన్నారు. ఎన్ని పదార్థములు భుజించిననూ (దప్పికొన్నవాడు నీటికై యెంత తహ తహ నందునో. నాదోపాసకుడు లక్ష్యసిద్ధికై అంత తాపత్రయమందవలెనని తాత్పర్యము.) ఇది తెలియక, అహంభావముతో లోకమును ఏచేరు= బాధించుచున్నారని మందలింపు.

## 395. కైకవశీ – దేశాది

**వాచా మగోచరమే మనసా**
**వర్ణింపఁదరమె రామ మహిమ ॥వా॥**

**రేచారి మారీచుని బడగబెట్టి**
**రెండోవానిశిఖి కొసగెనే ॥వా॥**

**మానవతీ మదెరింగి చా**
**మరమౌట కస్త్రము నేయఁగని**
**మానంబుకై మెడదాచగ**
**మాధవుండు కని కరగి వేగ మే**
**దీనార్తి భంజనుడై ప్రాణ**
**దానం బొసగ మున్నుచనిన**
**బాణంబు నటు చెదరసేయలేదా**
**గానలోల త్యాగరాజనుతు మహిమ ॥వా॥**

శ్రీరాముని మహిమ ఇట్టిదని స్తుతించుటకు వాక్కుల కలవిగానిది వాచామగోచరమని కీర్తించిరి. రాముని దివ్యమహిమకు దీనులయందు దయ, దుష్టులను శిక్షించుట ప్రధాన విషయములు. రేచారి= రాత్రించరుడగు మారీచునితో ముందు రావణ సంహార కార్యక్రమమును భావించి, మారీచుని సజీవునిగా మాత్రము మిగల్చవలెనని తలచి, సముద్రతీరమందు కూల ద్రోసెను. సుబాహుని మాత్రము బాణాగ్నిచే దహించివేసెను. (శిఖికొసగెనే).



ఇక దీన రక్షణయందు రామమహిమకొక అపూర్వమైన ఉదాహరణము.

ఒకపుడు అరణ్యమున స్వేచ్ఛగా తిరుగుచున్న చమరీ మృగమును చూచి దాని వాలమును చామరముగా నుపయోగించుకొను తలంపున, ఆ వాలము మాత్రము తెగునట్లుగా బాణమును వేసెనట. అపుడా మృగము మానవతియగుచే, తన వాలము (తోక) తెగినంతనే తనకు మానభంగమగునని అందుకు సహించక, మానభంగమగుటకంటె, ప్రాణభంగమే మేలని భావించి, తన మెడను త్రిప్పి, తన వాలమునకడ్డము పెట్టెనట. శ్రీరాముడా దృశ్యమును దూరమందుండి చూచి ఈ దీనురాలిని కాపాడవలెనను దయతో వెంటనే తానొక బాణమునువేసి, వేటకాని ముందు బాణమును చెదరగొట్టి ఆ చమరీ మృగముయొక్క మాన ప్రాణములను కాపాడెనట. ఇట్టి లోక సామాన్యమైన ఉదాహరణముతో శ్రీరాముని దీన రక్షకత్వమును నిరూపించినారు.

మిక్కిలి ఉన్నతులైనవారు సామాన్యులందు దయచూపుటలోనే, వారి దీనవాత్సల్యము. ఔదార్యము ఆదర్శవంతములగును.

ఇంతటి రామ మహిమ వాచామగోచరము అనుభవైకవేద్యమేనని ఇందు కీర్తించినారు.

## 396. పంతువరాళి – ఆది

**వాడేరా దైవము మనసా ॥వా॥**

**ఆడిన మాటలు తప్పదనుచును**
**ఆచంద్రార్కముగ కీర్తి కలిగిన ॥వా॥**

**దండి రక్కసుల మదమణచను ఆ**
**ఖండలాది సురకోటులను భూ**
**మండల సుజనులఁబాలింపను గో**
**దండపాణి రూపముతో వెలసిన ॥వా॥**

**దారి తెలియలేని అజ్ఞులకు భవ**
**నీరధి దాటి మోక్షమందుటకు**
**నీరజారి ధరు డుపదేశించే**
**తారకనామముతోను వెలసిన ॥వా॥**

**ధాతృ వినుతుడైన త్యాగరాజుని**
**చేతి పూజలంది బాగుగ ప్ర**
**ద్యోతనాన్వయమునను జనించి**
**సీతాపతియని పేరు కలిగిన ॥వా॥**

ఈ కీర్తనమందు "వాడేరా దైవము" అని ఎత్తుగడలోనే "తత్" అనే మాటతో ఉపనిషత్తులు సర్వాత్మకుడైన సర్వేశ్వరుని చెప్పినట్లు, ఆతడే తన ఉపాస్య దైవమైన రాముడే యన్నట్లు, అందరికీ, తనకు రామునితో, ఏదో పూర్వబాంధవ్యమున్నటుల, పరమోత్సాహంతో కీర్తించినారు.

రాముడు వేదవేద్యుడైనందున, వేదవాక్కువలెనే రాముడున్నూ "ఆడినమాటలు తప్పడు" అనుట ఎంతో స్వారస్యము.

ఇంద్రాది దేవతలను, భూమండలమందలి సజ్జనులను రక్షించుటకును, బలోన్మత్తులైన రాక్షసులను దుష్టులమదమణచుటకును, కోదండపాణియై వెలసిన ఆతడే దైవము-మరియు, తమంత తాముగా ముక్తిమార్గమును తెలియనేరని ఆర్తులకు సంసార విముక్తి కలిగించుటకు, కాశిలో పరమశివుడు కాశీమృతుల అవసానమందువారికి తారకనామము నుపదేశించునట. అట్టి దివ్యనామమైన తారకనామముతో వెలసిన పరంధాముడు రాముడేకదా! బ్రహ్మాదులు నుతించునట్టి త్యాగరాజునిచే (శివునిచే) పూజలందువాడు రాముడేకదా! అట్టి పరమాత్మ సూర్యవంశమున జనించి, సాక్షాల్లక్ష్మియైన సీతకు పతియై ప్రఖ్యాతినంది, చేతనా చేతన భూతకోటిని తన దివ్యవిభూతిచే అంతా రామమయముగా మహాయోగులచే కీర్తింపఁబడు నాతడే దైవము.



వాడేరా! అను ఏకవచన ప్రయోగమందు ఎంతో ఆత్మీయత గోచరించుచున్నది. విశేషించి "పంతువరాళి" రాగభావమీ కీర్తనాభావమున కెంతో దోహదమిచ్చినది.

## 397. బిలహరి - ఏకతాళం

**వాసుదేవ వరగుణ మామవ ॥వా॥**
**వాసవ హృదయ ని-వాస చిద్విలాస ॥వా॥**
**సాగరశయన భవ-సాగర తారక ॥వా॥**
**నీరజ నయన ఘన-నీల సుజన పాల ॥వా॥**
**భాగవత ప్రియ-త్యాగరాజార్చిత ॥వా॥**

## 398. జనరంజని - ఆది

**విడ జాలదురా నా మనసు-వినరా ॥వి॥**
**అడియాసలచే దగిలి నే-నార్తిబడినా పదంబులను ॥వి॥**
**తనువేపనులకు చనినామరి-కనరానిదికనుగొనినా**
**నినుగా భావించి సంతసి-ల్లిన శ్రీత్యాగరాజనుత ॥వి॥**

రామా! నా చిత్తము నీ పాదములను విడచి సంచరించుటలేదు. నామాట వినరా! యని, సహజమైన శైలిలో తమ యనుభవము నిందు కీర్తించినారు.

నా శరీరేంద్రియములు ఏ పనులు చేయుచున్ననూ, అందు ప్రధానములైన కనులు ఏ విలాసములను చూచుచున్నను, నా మనసుమాత్ర మన్నిటను నిన్నే దర్శించుచున్నది. లోకమందు సామాన్యుల చిత్తమొకచోట. శరీరేంద్రియ వ్యాపారములు మరొకచోట పనిచేయుట కలదు. భగవంతుని పూజింపుచున్న సమయమందు చిత్తమెచటనో పనిచేయుట మన అనుభవమే.

అట్లే శ్రీ త్యాగరాజస్వామివారికి చిత్తము శ్రీరాముని పాదములందు. శరీరేంద్రియములు ఇతర విషయములందు పనిచేయుచున్నవట.

అనగా, రాముని చింతతో వారి చిత్తమున కంతటి అలవాటున్నటుల తెలియుచున్నది. ఆ అలవాటు అభ్యాసమువలనగాక, సర్వశరణ్యుడైన రామునియందు అనన్య ప్రేమ భావము కలిగియున్నదని భావము. అట్టి తీవ్రానురాగమునే భక్తియందురు. ఆ ఆనందమునే ఇందు సూచించినారు.

## 399. మాయామాళవగౌళ - దేశాది

**విదులకు మ్రొక్కెద సంగీతకో ॥వి॥**

**ముదమున శంకరకృత సామనిగమ**
**విదులకు నాదాత్మక సప్తస్వర ॥వి॥**

**కమలా గౌరీ వాగీశ్వరి విధి**
**గరుడ ధ్వజ శివనారదులు**
**అమరేశ భరత కాశ్యప చండీ**
**శాంజనేయ గుహ గజముఖులు**
**సుమృకండుజ కుంభజ తుంబురు వర**
**సోమేశ్వర శార్ఙ్గదేవ నందీ**

**ప్రముఖులకు త్యాగరాజవంద్యులకు**
**బ్రహ్మానంద సుధాంబుధి మర్మ ॥వి॥**

ఇందు విశిష్టసంప్రదాయముతో నాదోపాసకులైన పూర్వాచార్యులను నమస్కరించుచున్నారు. దేవనాయకులైన విధి= బ్రహ్మ, గరుడధ్వజ= విష్ణువు, శివ, నారదాదులు, అమరేశ= ఇంద్రుడు, కమలా= లక్ష్మి, గౌరీ, వాగీశ్వరీ= సరస్వతులను, ముందుగా కీర్తించి, క్రమముగా భరత, కాశ్యపులు మొదలు సోమేశ్వర, శార్ఙ్గదేవులను, భగవదంశసంభూతులుగా స్తుతించి, వీరందరు



సంగీతకోవిదులు= సంగీతముయొక్క పరమార్థ స్వరూపమును బ్రహ్మానందరూపముగ తెలియుటయేగాక, అనుభవించిన మహనీయులు. కావున, వారికి మ్రొక్కుచున్నానని ప్రస్తుతించినారు. విశేషించి, శంకరుడు ప్రత్యేకముగా, ఋగ్వేద సూక్తములకు కొన్నింటికి స్వరమేళనముచేసి సామముగా పాడెనని పురాణ ప్రసిద్ధికలదు. అట్టి శివుని సామగాన స్వరప్రక్రియతో, సరిగమాది సప్తస్వరము లేర్పడినవట. కావుననే శ్రీ త్యాగరాజస్వామి వేరొక కీర్తనమందు **"సామ నిగమజ సుధా"** యని పేర్కొనిరి. ఆ సామము శంకర కృతమని సంప్రదాయజ్ఞులందురు. ఈ విధమైన నాదోపాసనమే సాక్షాన్ముక్తికి హేతువై యున్నది. ఇదొక బ్రహ్మానంద సుధాంబుధి. ఇందలి మర్మము అనగా, ఆ సంకేతము గురుముఖముననే తెలియనగును. కావున, అట్టి దివ్యమూర్తులకు నమస్కరించుచూ తన అంతరంగానుభవమును కీర్తించుకొన్నారు.

## 400. జయంతసేన - ఆది

**వినతాసుత వాహన శ్రీరమణ**
**మనసారగ సేవించెదరామ! ॥వి॥**
**నిను సారెకుఁజూడని బ్రతుకేలే**
**మనుజులనేచే జీవన మేలే ॥వి॥**

**మతభేదమనే శకనాస్తిక స-**
**మ్మత వాక్కులు బల్కుట సుఖమా**
**క్షితిలో సత్సంగతి సౌఖ్యము-పా-**
**లిత త్యాగరాజా మరపాల ॥వి॥**

శ్రీహరీ! నిన్నే మనసార సేవించుచున్నాను. నీ దృష్టిలేని జీవుల బ్రతుకు వ్యర్థము. భూమికి భారమైనదగును. మరియు, వారి జీవనము ఇతరులకు హింసారూపమగును. అనగా భగవంతుని లక్ష్యమందుంచుకొనలేని

వారెంతవారైనను, ఏ పని చేసిననూ, అది ఇతరులకు ఏదోవిధముగా, బాధనే కలిగించునుగాని, శాంతినివ్వదు.

కారణమేమనగా:-శకులు అనువారొకప్రత్యేకవర్గము. వారు దైవనింద చేయుదురు. ఆ వర్గమునకే చెందినవారు నాస్తికులు. వేదములందును, ఆ వేదోక్తములైన భగవద్ధర్మములందును ఆసక్తిలేక, తమ బుద్ధినే ప్రమాణముగా భావించి, తమ బుద్ధికి అతీతమైన దివ్యానుభవమును గమనించలేక, తమకు తోచినట్లు మాట్లాడువారు. అట్టివారి మాటలు ఎవ్వరికీ సుఖమివ్వనేరవు.

లోకమందు ఆస్తికులు సత్పురుషులైనవారి సాంగత్యమే ఇహపరములందు సౌఖ్యమిచ్చును. కావున, నిన్నే మనసార సేవింతునని ప్రార్థించినారు.

## 401. ప్రతాపవరాళి – ఆది

**విన నాసకొని యున్నానురా-విశ్వరూపుడనే ॥వి॥**

**మనసారగ వీనుల విందుగా-మధురమైన పల్కుల ॥వి॥**

**సీతారమణితో ఓమనగుంటలాడి గెలుచుట**
**చేత నొకరి కొకరు చూచుచు సా-**
**కేతాధిప నిజమగు ప్రేమతో బల్కుకొన్న ముచ్చట**
**వాతాత్మజ భరతులు విన్నటుల త్యాగరాజ సన్నుత ॥వి॥**

లోకమందు అనేక వినోదములతో వేర్వేరు మనోభావములు, అభిరుచులుకలిగియుండుట సహజము. వీరందరు, తమతమ స్వభావములలో వినోదింతురు. ఇందు కృతిమభావమునకు తావులేదు. భగవంతుడు సహజభావములు కల మానవుల నుద్ధరించుటకై తాను కూడ సామాన్య మానవులవలె నటించుచూ, వీరికి ఉన్నతాదర్శములు కలుగునట్లు క్రమ వికాసమును కలిగించుటకే, తన అవతార లీలా విశేషములను ప్రకటించినారు. ఈ గేయమందు త్యాగరాజస్వామి సీతారాముల ఏకాంత లీలా విశేషమును వర్ణించుచూ, సన్నిధిలోనున్న ఆంజనేయ, భరతాదులతో ఏమో మాట్లాడినట్లున్నూ, ఆ మధురములైన పల్కులను తానున్నూ విన నాసగొనియున్నటుల ప్రార్థించుట స్వభావ రమణీయము.



రాముడు సీతారమణితో ఒకపుడు ఓమనగుంట లాడిరట. అందొకరికి గెలుపు వచ్చినదట. అపుడు ఒకరినొకరు ఆశ్చర్యముగా చూచుకొన్నారట; అపుడు పరస్పరం మధురములైన మాటలు మాట్లాడుకొన్నారట. వాటిని వినే భాగ్యం సన్నిహితులైన భరతునికి ఆంజనేయునికి లభించినదట! ఆ ఆనందము నాకుకూడ కలుగవలెనని ఈ భావుకుని ఆశ.

ఈ చరిత్రను త్యాగరాజస్వామి తన చిత్తమందే ఊహించుకొని, ఒక విలక్షణమైన సన్నివేశమును కల్పించుకొని, శ్రీరాముని పల్కులను విన నాసగొని యున్నటుల పరవశులై కీర్తించుకొనుట, స్వభావ మాధుర్యము నొలికించుచున్నది.

## 402. దేవగాంధారి – దేశాది

**వినరాద నా మనవి ॥వి॥**

**కనకాంగ కావేటి రంగ శ్రీకాంత**
**కాంతలెల్ల కామించి పిలచితే ॥వి॥**

**తేజినెక్కి బాగ తెరువున రాగ**
**రాజసతులు చూచి రమ్మని పిలచితే ॥వి॥**

**భాగధేయ వైభోగ రంగ శ్రీ**
**త్యాగరాజనుత తరుణులు పిలచితే ॥వి॥**

శ్రీరంగనాథుడు దివ్యసుందర మోహనమూర్తిగా భక్తులు మురిసి పోవుచుందురు.

ఆ వైభోగరంగడు, కావేటిరంగడు తేజి= అశ్వవాహనమందు వేంచేసి రాజవీధిలో ఊరేగు ఉత్సవసమయమందు, శ్రీ త్యాగరాజస్వామి కన్నులార దర్శించి, కీర్తించినారు.

లోకమందు శృంగార లీలా వైభవము స్త్రీలలో మూర్తీభవించి యున్నది. లక్ష్మీ, గౌరీ సరస్వతులు త్రిమూర్తులకు సృష్ట్యాది కళా వైభవమును కలిగించినారనుట ఉపాసనా రంగమందొక విలక్షణమైన భావము. కావున సౌందర్యము, లోకాతీతమైన సౌందర్యము వారి స్వంత సొత్తు. లోకమందు కూడ స్త్రీల కండ్లలో, వారి చూపులలోనే సౌందర్యమును నాడెము కట్టగల నేర్పు సృష్టిలో సహజమైనది.

కావున, పరదేవతా స్వరూపులైన తరుణుల దృష్టియే సౌందర్యమును తీర్చిదిద్దును.

ప్రకృతం వైభోగరంగని ఠీవిని శ్రీరంగమందు దర్శించి, కాంతలు, రాజసతులు, తరుణులు, కామించి, వానిని పిలిచినారట. రంగని అర్చామూర్తియందే సాక్షాత్ భగవత్కళను దర్శించి, పరవశలై ఈ ప్రపంచమును మరచి, దివ్య సంపదలో ఆ శృంగార సర్వస్వ మూర్తిని పిలచిన పిలుపు త్యాగరాజస్వామి భావసమాధిలో విన్పించి, తానుకూడ ఆ కాంతల సారూప్యభావమంది, ఆ సందడిలో స్వామీ! నా మనవినిన్నీ వినరాద! యని పల్లవి నెత్తుకొని కీర్తించుట ఈ మహనీయుని భావుకత్వము నిరుపమానము.

## 403. వివర్ధని - రూపకం

**వినవే ఓ మనసా-వివరంబుగ నే దెల్పెద ॥వి॥**

**మనసెరింగి కుమార్గమున-మరి పొరలుచు చెడవలదె ॥వి॥**

**యీ నడతలు పనికిరాదు ఈశ్వర కృపకలుగబోదు**
**ధ్యాన భజన సేయవె వర-త్యాగరాజు మనవి ॥వి॥**



ఇందు మనస్సంబోధముగా హెచ్చరికచేయుచూ, ఈ ప్రపంచమందలి నడవడికను విమర్శించినారు. మనసెరింగి= తన మనసుకు తెలిసియుండి కూడ కుమార్గమున= చెడుదారినిబట్టి, రాగద్వేషములలో అహంకారముతో పొరలవలదు. దొర్లింతలు పెట్టగూడదనుట. అంతేగాక. చాలా విసువుతో ఖండితముగా యెదుటి అజ్ఞానితో, అల్లరివానితో మాట్లాడినట్లు, ఈ నడతలు పనికిరావు. (పనికిరావు) ఇట్లున్నచో ఈశ్వరుని కృపకలుగదు సుమా! శ్రీరాముని ధ్యానించుట, భజించుట నీకు కర్తవ్యము. త్యాగరాజుని మనవి వినుమని యెంతో సహజమైన రీతిలో ఆదేశమిచ్చినారు.

## 404. యమునాకల్యాణి - రూపకం

**విధి శక్రాదులకు దొరకునా ఇటువంటి స-**
**న్నిధి వేడుక చూతాము రారె ॥వి॥**

**సుధీజన రక్షకి ధర్మాం-బుధిసేవ జూడ ॥వి॥**

**ఉడుపతి ముఖులెల్ల వరుసగా బిరుదులనుబట్టి**
**అడుగడుగు జయ జయ-మనగా యావేల్పుల వెల**
**పడుచులు నిజనాట్యమాడగా సమయమున బ**
**సిడి సుమవర్షము గురియగ వడి-వడిగా మరకోటులు**
**తడబడ భూమిని దండము లిడగా సం**
**తోషమునను కడగంటిని జూచు సొగసు ॥వి॥**

**శ్రీరమణిని జూచి బల్కగ నవరత్నాల**
**హారపు సరులల్లాడగ ఆ మొలక నగవు**
**గౌరవ మంతటను మెరయగ నావేళ సనక**
**నారదాదులెల్ల బొగడగా కరమునను**
**బూనిసరిగ చీరకాంతి మెరయగా శృం**
**గారి కొలువుండ శుక్రవారపు సొగసెల్ల జూడ ॥వి॥**

**తరుణారుణ వదనకమలిని అత్యంతమైన**
**కరుణారస పూర్ణనేత్రిని శ్రీపంచనద**
**పురమున నెలకొన్న తల్లిని శ్రీత్యా**
**గరాజ పరిపాలిని సర్వరూపిణి**
**శరణాగత వత్సలిని వరమణులు ధగధగయని**
**మెరయు కంకణయుతకర పరదేవిని సేవింప ॥వి॥**

శ్రీ పంచనద క్షేత్రము తిరువాదియందు వెలసియున్న ధర్మాంబికయొక్క శుక్రవారపు సేవా వైభవము గూర్చి ఈ కీర్తనయందు వర్ణించినారు. ఈ సేవానందము విధి, శక్రాదులకు= బ్రహ్మేంద్రాదులకు దొరకునా! యని ఆశ్చర్యము, ఈ సన్నిధి వేడుకను దర్శింతము రండని, అందరను పిలచుచూ ఇందలి ఆనందదృశ్యమును కన్నులగట్టునట్లు తమ ఆనందమును కీర్తించినారు.

శ్రీ ధర్మాంబికా సన్నిధిని సుమంగళులు స్త్రీలు వరుసగా బరాబరులు సేయుచూ అమ్మవారి ధ్వజ పతాకాదులను ధరించి జయజయధ్వనులు చేయుదురట. దేవవేశ్యలు నాట్యములు సేయుచున్నారట. అంతలో బంగారు పూలవానలు కురియుఁగా దేవతలందరూ, పాదాక్రాంతులై నమస్కరించుచుండగా, ఆ పరదేవత సంతోషముతో వీరి నందరను ప్రసన్న కటాక్షముతో అనుగ్రహించుచున్నదని ఆ సన్నిధిని తీర్చిదిద్దినారు.

మరియు, సకల దేవతానాయకులు, త్రిమూర్తులు సైతమచట సన్నిధిచేసి యున్నారట. వారి దేవేరులును వచ్చియుండగా, ధర్మాంబిక శ్రీ రమణితో ఏమో మాట్లాడినపుడు రత్నాలహారములు కదలుచుండ, ఆ దేవి మందహాస సుందరవదనార విందమును, దర్శించి, సనకాదులు, నారదుడు ఆ తల్లిని స్తుతించిరట. చిలుకను ధరించి శృంగార రసాధిదేవతయగు ఆ దేవిని దర్శించి, సేవించుకొను భాగ్యము బ్రహ్మాదులకున్నూ అరుదైనదనుచున్నారు.



ఆపై ఆ తల్లి పంచనద పురవాసిని యగుటచే తనకేదో నిత్యాను బంధమున్నట్లు త్యాగరాజ పాలినియని కీర్తించి, సర్వుల ధ్యేయముగా, ఆ శుక్రవార సేవాదృశ్యమును అందరి చిత్తములందునూ, నిలచునట్లు వర్ణించియున్నారు.

## 405. మధ్యమావతి – ఆది

**వినాయకునివలెను బ్రోవవే నిను–**
**వినా వేల్పు లెవరమ్మా ॥వి॥**

**అనాథ రక్షకి శ్రీ కామాక్షి సుజ–**
**నాఘ మోచని శంకరి జనని ॥వి॥**

**నరాధములకును వరాలొసఁగ నుం–**
**దరాములై భూసురాధి దేవ–**
**తలు రాయిడిని జెందరాదు దయ జూ**
**డ రాదా కాంచీపురాధి నాయకి ॥వి॥**

**పితామహుడు జనహితార్థమై ని**
**న్నుతా దెలియ వేద దాళిమిగల య**
**వతారమెత్తి ఇకను దామసము సే**
**య తాళజాలము నతార్తిహారిణి ॥వి॥**

**పురాణి దయచే గిరాలు మూకని–**
**కిరాఁజేసి బ్రోచు రాజధరి త్యా**
**గరాజుని హృదయ సరోజమే**
**లే రామసోదరి పరాశక్తి నను ॥వి॥**

కాంచీపురమందు వెలసియున్న శ్రీ కామాక్షిదేవితో "రామసోదరి" యని తన ఉపాస్య దైవమునకు అనుబంధమును కూర్చుకొని కీర్తించినారు.

అనాథలను, అనగా నీవు తప్ప మరెవ్వరూ ఆశ్రయము లేనివారని భావము. అట్టివారి పాపములను హరించి సుఖమిచ్చి కాపాడు ఓ తల్లీ! నన్నును వినాయకుని వాత్సల్యముతో రక్షించునటులరక్షించుము. ఒకపుడు పార్వతి తన ఏకాంత గృహమున కెవరేని వత్తురేమో! యని మట్టితో నిమిత్తమాత్రముగ నొక బొమ్మనుచేసి, దానికి ప్రాణప్రతిష్ఠచేసి ద్వారమందు కావలి ఉంచెనట. అంతలో శివుడే ద్వారమునకురాగా, ఈ కావలియున్న మూర్తి, లోపలకు పోగూడదని నివారించెనట. అంత శివునికి కోపము కలిగి, వాని తల ద్రుంచెను. అంత పార్వతి వచ్చి, తన ప్రియపుత్రునికి హానికలిగెనని పరితపించినది. అపుడు శివుడు ఉత్తర దిశగా తల ఉంచి నిద్రించుచున్న ఏనుగుశిరసు ద్రుంచి తెచ్చి ఈ ద్వారమందున్న వాని కమర్చెనట.

ఆతడే గజముఖుడు, మహాగణపతి. ఆపై శివుడు తన ప్రమథగణములకు పతిగా వీనిని పట్టాభిషేక మొనర్చెననీ, ఈతడే ఆది దైవమనీ శివపురాణకథ ప్రసిద్ధము. ఓ! కామాక్షీ! అట్లే నన్నునూ పుత్రవాత్సల్యముతో కాపాడుమని వేడుకొన్నారు.

ఏ విధమైన అర్హతలేక నరాధములైయుండి నిన్ను శరణందుటచే, అట్టివారికి సైతము వరములిచ్చి కాపాడిన జగన్మాతవు.

అట్లని అర్హులైన భూసురులు–అగ్రజన్ములు నీ దయలేక రాయిడిని= ఉపద్రవమొందుట న్యాయముగాదు. అన్ని వర్గములకు వారివారి యర్హతల ననుసరించి నీ అనుగ్రహము కలుగుటయే న్యాయము. ఇంతకూ భూలోకజనుల హితమునకై బ్రహ్మాదులు నిన్ను ప్రార్థించి ఈ హస్తిగిరి కాంచీక్షేత్రమందు ఆది దైవముగా వెలయింపఁజేసియున్నారని స్థలపురాణము. నీవెంతో మా యపరాధములను మన్నించి, సహింతువని నమ్మినాము. తామసము= ఆలస్యముచేయుట న్యాయముగాదని కోరి, శ్రీ కామాక్షియొక్క అవ్యాజ కటాక్షమునకు మరియొక ప్రసిద్ధ ఉదాహరణ మిచ్చుచున్నారు.



ఓ పురాణి! మధ్యార్జున క్షేత్రమందుకల ఒక మూకనికి= మూగవానికి (మూక కవియని ప్రసిద్ధి) గిరాలు= సమస్త వాక్కుల నిచ్చితివి. పరదేవతా కటాక్షమున మాటలురాని మూక కవికి “(మూక పంచశతి)” యను (అయిదువందల శ్లోకములతో పరదేవతను స్తుతించెను) మధుర కవితా వైభవమిచ్చిన ఓ జగదంబికా! త్యాగరాజుని కూడనట్లే బ్రోవుమని కీర్తించినారు.

## 406. బలహంస – ఆది

**విరాజ తురగ రాజరాజేశ్వర**
**నిరామయుని జేయవే** ॥వి॥

**జరాదిరోగయుత తనువు చే**
**నరాధములు ఏమి సాధించిరి** ॥వి॥

**నిరంతరము సకల విషయ దుఃఖ**
**పరంపరలచే చివుకగ మదిలో**
**దురంతకామ మదమును బాధించగ**
**దుర్మతుడే త్యాగరాజ సన్నుత** ॥వి॥

మానవులకు సహజములైన జరామరణాదులను, వివేకవంతులు రోగములుగా భావించి, శాశ్వతముగా విముక్తిని కోరుకొందురు. ప్రకృతం త్యాగరాజస్వామి విరాజ తురగ= గరుడవాహనుడైన రాజరాజేశ్వరుని రాముని ప్రార్థించుచూ, ఈ మానవ శరీరముచే నరాధములు సాధించిన విశేషమేమియులేదనియూ, నిరంతరమూ విషయ సుఖదుఃఖ పరంపరలతో చివికి= జీర్ణించి అయిననూ, చిత్తమందు, దురంతమైన కామ మదములచే దురాశకలవారై దురాత్మకులగుచున్నారు. కావున, ఓరామా! నన్ను నిరామయునిగ= ఏ విధమైన జన్మ, జరా, మరణాదివ్యాధులు లేకుండ వాటి స్మృతిలేకుండ అనుగ్రహించమని వేడుకొన్నారు.

## 407. కేదారగౌళ - రూపకం

**వేణుగానలోలుని గన-వేయి కన్నులు కావలెనే ॥వే॥**

**(అలి) వేణులెల్ల దృష్టిచుట్టి-వేయుచు మ్రొక్కుచురాగ ॥వే॥**

**వికసిత పంకజవదనలు-వివిధగతుల నాడగ**
**నొకరి కొకరు కరమున నిడి-యోరకనుల జూడగ**
**శుక వచనములు గల తరుణులు-సొగసుగాను బాడగ**
**సకల సురులు త్యాగరాజ-సఖుని వేడగవచ్చే ॥వే॥**

ఇందు వేణుగాన లోలుడగు శ్రీకృష్ణుని రూపమున దివ్య సౌందర్యమును భావించుకొనుచున్నారు. ఆ సౌందర్యమును చూచుటకు వేయి కన్నులు కావలెనట. అంతటి అతిశయమైనదని భావము.

అటనున్న అలివేణులు= స్త్రీలు, తమ చూపులవల్లనే స్వామికి దృష్టిదోషము తగులునని భావించి, ఏవో మంగళ ద్రవ్యములను చుట్టివేయుచూ, మ్రొక్కుచున్నారనుట విలక్షణమైన ఆచారము.

ఒకవంక వాని సౌందర్యమునకు ముగ్ధులగుట, వేరొకవంక పరమాత్మయని మ్రొక్కులిడుట విశేషము.

చాలమంది దేవ, మానవకాంతలు వివిధగతులతో నృత్యములు చేయుటయు తమలో తాము చేతులు చేతులతో స్పృశించుచూ, ఓరచూపులతో ఆ శ్రీహరిని చూచుచూ, చిలుకల ధ్వని ననుకరించు కంఠనాదములతో బాగుగా పాడుచూ సేవించగా దేవతలందరు చూడవత్తురట. ఈ వైభవమును దర్శించుటకు వేయి కన్నులు కావలసియున్నవి.

## 408. మధ్యమావతి - ఆది

**వేంకటేశ నిను సేవింపను పది**
**వేల కనులు కావలెనయ్య ॥వే॥**



**పంకజాక్ష పరిపాలిత ముని జన**
**భావుకమగు దివ్యరూపమును కని ॥వే॥**

**ఎక్కువ నీవని దిక్కుల బొగడగ**
**అక్కర గొని మదిసొక్కి కనుంగొన**
**నిక్కము నీవే గ్రక్కున బ్రోవు త**
**ళుక్కని మెరసే చక్కతనముగల ॥వే॥**

**ఏనోము ఫలమో నీ నామామృత**
**పానము అను సోపానము దొరికెను**

**శ్రీనాయక పరమానంద నీసరి**
**గానము శోభాయమానాంఘ్రులు గల ॥వే॥**

**యోగి హృదయ నీవే గతియను జన**
**భాగధేయ వరభోగీశ శయన**
**భాగవత ప్రియ త్యాగరాజనుత**
**నాగాచలముపై బాగుగ నెలకొన్న ॥వే॥**

నాగాచలము= శేషాద్రియందు వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వరస్వామివారిని దర్శించి సేవించుటకు పదివేల కన్నులుగాని తృప్తికలుగదని "కలౌ వేంకటనాయకః" అన్నట్లు ఇందు తిరుమల వేంకటేశ్వరస్వామివారిని కీర్తించినారు. సనకాది బ్రహ్మర్షులు, దేవర్షులు శ్రీవారి దివ్య స్వరూపమును దర్శింతురట.

సర్వదేవతా స్వరూపుడై, తన దర్శనమాత్రముచేతనే అందరి అక్కరలను తీర్చునట్టి వరప్రసాదమూర్తి. ఎపుడు స్మరించినను మెరుపువలె తళుక్కని మెరిసే దైవమట.

శ్రియఃపతీ! మా జన్మాంతరములందలి నోముఫలముగా, నీసౌందర్యరూపముకన్న మిన్నగా నీ దివ్యనామము ఉన్నతగతి పొందుటకు

మాకు సోపానమై దొరకినది. పాపములను హరించువాడు కావున, "వేంకటేశః" అను పేరేర్పడినది. శ్రీనాయకుడగుట లక్ష్మీపతి, వేంకటేశ్వరుని రూపసౌందర్యము, దివ్యనామమువలెనే శ్రీవారి దివ్యపాదములు, ప్రత్యేక వ్యక్తిత్వము కలిగి సర్వలోక శరణ్యములని మహాయోగులు కీర్తించినారు. ఈ విధముగా నుపాసించి కీర్తించి, సేవించు పరమభాగవతులకు ప్రియుడవు. సప్తగిరులుగా వెలసియున్న శేషాచలమందు వేంచేసి భోగిశయన! నీవే గతియని భావించు నాకు నీ దర్శనమున కావశ్యకమైన దృష్టి ననుగ్రహించమని ప్రార్థించుటయే తాత్పర్యము.

## 409. సురుటి - దేశాది

**వేరెవ్వరేగతి-వేమారులకు సీతాపతీ ॥వే॥**

**ఈ రేడు లోకముల కా-ధారుడవగు నిను వినా ॥వే॥**

**బృందారకాది మునిబృంద శుక సనక స**
**నందన శ్రీ నారదార-విందోద్భవ భవ పు-**
**రందరులకు శ్రీత్యాగ-రాజునికి నిను వినా ॥వే॥**

ఓ సీతాపతీ! నీవు దేశకాలములకు అతీతుడవు కావుననే, ఎవరేయే కాలమందు ఏయే దేశములందునూ, ఆపన్నులకు పదే పదే రక్షకుడవైయున్నావు. కావుననే, పదునాల్గు లోకములకు నీవే ఆధారమై యున్నటుల స్పష్టమగుచున్నది. దేవతలు, మునిబృందము, సార్వకాలికులైన సనకాదులు, శుకుడు, నారదుడు, అరవిందోద్భవుడైన బ్రహ్మ శివేంద్రాదులు, ఆయా యుగములందు నీ రక్షణ నర్థించియున్నటుల ప్రమాణములెన్నో కలవు.

దశరథకుమారుడవై, సీతాపతియై అవతరించినపుడున్నూ పై వర్గమంతయు, వానరవీరులుగా పుట్టి నిన్నే శరణందిరి. శివాంశచే



ఆంజనేయుడు, సూర్యేంద్రాది రూపమున వాలి సుగ్రీవులు, ఇంకెందరో నిన్నే ఆశ్రయించి యున్నందున. సర్వులకు నీవే శరణ్యుడవైనటుల త్యాగరాజునికిని నీవుగాక వేరెవ్వరే గతి యనుట సిద్ధాంతము.

## 410. పంతువరాళి - [1]రూపకం

**శంభో! మహాదేవ శంకర గిరిజా రమణ ॥శం॥**

**శంభో మహాదేవ శరణాగత జన రక్షక**
**అంభోరుహలోచన పదాంబుజ భక్తిం దేహి ॥శం॥**

**సా-సని దని సాని దనీదనిని దాపదపమ పదనీ**
**(సా దనిసా) దనిద పదనిదా పదపమ గమ గారీ**
**సని సానిరీస గారీ గమపామ దాపనీద సని**
**సరి గరిస నిరిసని దనిసాని దప పామ పద ॥శం॥**

**పరమ దయాకర మృగధర[2] ధరగంగాధర ధరణీ**
**ధర భూషణ త్యాగరాజ వరహృదయ నివేశ**
**సుర బృంద కిరీట మణివర నీరాజిత పద గో**
**పురవాస సుందరేశ గిరీశ పరాత్పర భవహర ॥శం॥**

గిరిజారమణ= పార్వతీపతి, అంభోరుహలోచన= పద్మనేత్రుడు, దేహి= ఇమ్ము, మృగధరధర= చంద్రుని ధరించినవాడు. ధరణీధరభూషణ= హిమవంతునికి అలంకారమైనవాడు. (లేక మేరుపు ధనురలంకారమైనవాడు) (లేక శేషుడు అలంకారమైనవాడు) సురబృంద...నీరాజితపద= దేవతల కిరీటములందలి మణులచే నీరాజన మివ్వబడిన పాదములు కలవాడు. గోపురవాస= కోవూరునందు వెలసినవాడు.

శ్రీ కోవూరి సుందరేశ్వరుని పాదారవింద భక్తినిమ్మని ప్రార్థించినారు. స్తుతి పరము.

1. చాపు 2. హర

## 411. శంకరాభరణం - రూపకం

**శంభో శివశంకరరా గురు అంభోరుహనయన ॥శం॥**
**ధరణీధరవర భూషణ-సురసేవిత చరణ ॥శం॥**
**తరుణారుణ కిరణాభసు-చరణా సురహరణ ॥శం॥**
**కమనీయ నిగమ సన్నుత-హిమగిరిజా రమణ ॥శం॥**
**శమనాంతక విమలాంగ ప-రమ కారుణ్యనిధే ॥శం॥**
**సమలంకృత కమలాహిత-కమలాసుత హరణ ॥శం॥**
**నతపోషణ హితభాషణ-ధృతచారు కురంగ ॥శం॥**
**మతభేద పతిత మానవ-మదసంతత భంగ ॥శం॥**
**సుతపోధన హితకర పా-లిత త్యాగరాజ ॥శం॥**

అంభోరుహనయన= పద్మనేత్రుడు, ధరణీ....భూషణ= శేషభూషణుడు తరుణ...చరణ= లేతనైన ఎఱ్ఱని కిరణముల కాంతిగల పాదములు కలవాడు అసురహరణ= రాక్షసులను సంహరించువాడు కమనీయ+నిగమ సన్నుత= వేదములచే స్తుతింపఁబడువాడు శమనాంతక= యముని జయించినవాడు, సమలంకృత కమలాహిత= కమలములకు విరోధియైన చంద్రుడు అలంకారముగా కలవాడు కమలాసుతహరణ= లక్ష్మీ పుత్రుడైన మన్మథుని హరించినవాడు. మత...భంగ= మతభేదముచే పతితులైన మానవులకు సదా భంగించువాడు.

## 412. కుంతలవరాళి - ఆది

**శరశర సమరైకశూర-శరధి మద విదార ॥శ॥**
**సురరిపు మూల బలమను తూల**
**గిరుల కనల సమమౌ శ్రీరామ ॥శ॥**



**తొలిజేసిన పాపవన కుఠారమా**
**కలనైన సేయగలేని**
**బలు విలును విరచి వెలసిన శ్రీరఘు**
**కులవర బ్రోవుము త్యాగరాజనుత ॥శ॥**

ఇందు శ్రీరాముని ప్రతాపమును, భక్తరక్షణమును కీర్తించినారు. సమర రంగమందు రాముడు ప్రయోగించునట్టి ఒక్కొక్క బాణమున్నూ సార్థకమై, శత్రుసంహారమునకు పాల్పడెననియు రాముడే ఏకైక శూరుడని వర్ణించినారు. అట్లే, సముద్రుని మదము హరించినవాడు. సురరిపువైన రావణుని మూల బలమనెడి తూలగిరులు= దూది పర్వతములకు, అనల సముడు= అగ్నివంటివాడు.

అట్లే, తనను శరణందిన భక్తులయొక్క పాపారణ్యమునకు గొడ్డలివంటివాడు. అనగా దుష్టశిక్షణయందు శిష్టరక్షణయందును సార్థకమైన ప్రతాపముగల శూరుడు; ఎంతటి శూరులు కూడ కలనైన ఊహించలేని విధముగా శివధనువును భంగించి, రఘువంశమునకే వన్నె తెచ్చిన సర్వతోముఖమైన సత్యపరాక్రముడైన రాముడు తనను కాపాడవలెనని ప్రార్థించినారు.

## 413. చంద్రజ్యోతి - ఆది

**శశివదన భక్తజనావన శం[1]కర నే తాళగలనా ॥శ॥**
**వసితనమందే ముని యాగమున నీ**
**బాహు పరాక్రమమును నెరుంగ నా రాకా ॥శ॥**
**దిన దిన మౌపాసన జపతప ధ్యానమను**
**యాగమువేళ మనసున బుట్టిన**

1. శంకర= సుఖమునిచ్చువాడు.

ఘన డంభునితోడను మారీచుని
పని చెరచిన యా త్యాగరాజార్చిత ॥శ॥

రాకాశశివదనుడు= పూర్ణిమచంద్రునివంటి ముఖముకలవాడు. మరియు **"శశాంకాదపి నిర్మలః"** (వాల్మీకి) (చంద్రునిలోనైనను కుందేలు ఆకారమైన మచ్చయున్నదిగాని) రామునిలో అదియు లేకుండుటచే రామచంద్రుడు అని సంకేతము. చంద్రదర్శనమునకై చకోరపక్షివలె నీ దర్శనమునకై వేచియున్న నేను తాళలేననుటలో శృంగారభావమున్నూ కలదు.

రామా! నీవు బాల్యమందే విశ్వామిత్ర యాగరక్షణలో చూపిన నీ సత్య పరాక్రమమును నేనెరుగనా? విశ్వామిత్రాది మహర్షులకు మాత్రమే తెలియునట్టిది. **"అహంవేద్మి మహాత్మానం రామం సత్యపరాక్రమం"** అని విశ్వామిత్రుని వచనము. విశ్వామిత్రుడనగా-విశ్వమునకు మిత్రుడు. సూర్యునట్లు లోకమునకు హితవు కల్పించువాడు. తాను వేల సంవత్సరములు చేసిన తపసు చాలకనా వేరే యజ్ఞమును సంకల్పించినది? కాదు. భగవంతుడైన రామునిద్వారా లోకమునకు శ్రేయస్సు కల్పించుటకే. ఈ భావముతో విశ్వామిత్రుని యాగరక్షణ కథకొక ఆంతర్యమును ఇందు కీర్తించినారు.

ఔపాసన= అగ్ని ఉపాసన, జప, తప, ధ్యానములు చేయునప్పుడు రజస్తమోగుణ ప్రాబల్యముచే దంభము= కపటాచరణము. (తాను గొప్పవాడనిపించుకొనుటకై చేయునది) అసురలక్షణము. ఇదియే మారీచుడట.

తాను దిన దినమందును చేయు భగవత్సేవలో యీ దంభుడు నా మనసులోనే పుట్టి సత్కార్యములను చెరచుచున్నాడు. రామా! ఆ మారీచుని పడగొట్టినట్లు నా దంభమునున్నూ తొలగించి నాకు జపతపాదులవలన కలుగు ఫలితమును అనుగ్రహించి కాపాడుమని వేడుకొన్నారు.



## 414. మధ్యమావతి - ఆది

శరణు శరణనుచు మొరలిడిన నా
గిర[1]ములన్ని పరియాచకము లౌనా ॥శ॥

శరజ[2]నయన పరమపురుష నిన్నను
సరణతో కరుణతో మరి మరి ॥శ॥

శరము తరమ తరముగాక కాకా
సురుడు సురుల నరయ వేడగాను ద
శరథ వరకుమారుని బాణ మనుచును
నెరచి జరగ మరల తానుగని గా
బరపడి సరగున శరణను మాత్రమున
ఇరువుగను రజితగిరి నాథాదులు
వరమగు బిరుదున సరసత మెచ్చను
కరుణను స్థిరముగ వరమిచ్చిన నిను ॥శ॥

మునుపు మనసున నసూయలను తపో
ధనుఁడు వినయమునను ద్రౌపదిని శో
ధనము ఘనముగ నిజమునసేయ దృఢ
మునను తన మదిని శరణనగానే
కనికరమున వేగన నీవెంతో చను
వున మునులు సుజనులు సురాసుర
గణము లవనిపాల నరులు బొగడను
వనజ నయన లఘువున బ్రోచిన నిను ॥శ॥

మదిని బెదురు సుదతిని గని నీదు
పదములు దయను ధరలోను బ్రోచే

1. గిరములు= వాక్కులు, 2. శరజనయన= పద్మనేత్రుడు

**గదర[1]మదజనదళనాప [2]ఘనజిత**
**మదన బుధజన ధన [3]త్యాగరాజ**
**హృదయ కుముద జలజధర సంహరణా**
**రి దమన సదమల రదన ముని మనో**
**సదన శుభద నను ముదమున బ్రోవుము**
**సదయుడ కొదవల నదలింపుము నిను ॥శ॥**

రామా! నేను శరణని మొరలబెట్టుచున్నను నా మాటలన్నియు నీకు పరియాచకము లగుచున్నవా? ఇంతవరకు నీ రక్షణ నందినవారు నాకంటె ఘనులా? తొల్లి కాకాసురుడు మీ కపరాధము చేయగా నీ బాణము వానిని తరిమినది. వాడు త్రిలోకనాథులను, దేవతలను శరణందినాడు. రజతగిరి నాథాదులు= శివుడు మొదలైనవారుకూడా, రామబాణ మనివార్య మనిరి. తిరిగి తిరిగి నిన్నే శరణందినంత మాత్రమున వానిని కాపాడితివిగదా! ఆతడపరాధియైనను నీ దయకు పాత్రుడగుట విచిత్రము.

అరణ్యవాసమందు పాండవులను అవమానించు తలపుతో దూర్వాసుడు పదివేలమంది శిష్యులతో ఆతిథ్యమిమ్మని వచ్చినంతనే ఉత్తమ గృహిణి మహాసాధ్వి ద్రౌపది నిన్నే శరణందిన వెంటనే, వారి నాదుకొని కాపాడితివి గదా!

మరియు మహాసాధ్వి అహల్య ఇంద్రుని నిమిత్తముగా గౌతమ శాపముచేపడి యున్నపుడు రామా! నీ పదములే బ్రోచేగదర!

ఇట్లైవరేని సజ్జనులకు, లోకమునకు ద్రోహము చేయువారిని నీయంత నీవే సంహరించి లోకరక్షణము చేయు దయాశాలివి. సకల దేవతలు నీ శరణాగత వాత్సల్యమును బిరుదులతో పొగడుచుందురు. అట్టి నిన్ను శరణందిన నా మాటలు పరిహాసములా? ఓ దయామయా! నా కొదవల= నా కొరంతలను దీర్చి రక్షించుమని వేడుకొన్నారు.

1. మద...దళన= మదోన్మత్తులను సంహరించుమూర్తి, 2. అపఘన...మదన= మన్మథుని మించిన సుందరుడు. 3. త్యాగ...జలజ= త్యాగరాజుని హృదయమనెడి కలువకు చంద్రుడు.



## 415. పంతువరాళి – ఆది

**శివ శివ శివ యనరాదా ఓరీ**
**భవ భవ బాధల నణచుకోరాదా ॥శి॥**

**కామాదుల తెగగోసి పర**
**భామల పరధనముల రోసి**
**పామరత్వము నెడబాసి అతి**
**నేమముతో బిల్వార్చనచేసి ॥శి॥**

**సజ్జన గణముల గాంచి ఓరి**
**ముజ్జగదీశ్వరులని మతినెంచి**
**లజ్జాదుల తొలగించి తన హృ**
**జ్జలజమునను పూజించి ॥శి॥**

**ఆగమముల నుతియించి బహు**
**బాగులేని భాషలు చాలించి**
**భాగవతుల బోషించి ఓరి**
**త్యాగరాజ సన్నుతుడని యెంచి ॥శి॥**

శివోపాసనము వలన వైరాగ్యము జ్ఞానము కలుగునని సంప్రదాయజ్ఞు లందురు. ఇందు తననుకూడ కలుపుకొని, శివారాధనతోబాటు శివనామస్మరణ చేయుమని కీర్తించినారు. అందువలన జన్మసంసార బాధలు శాంతించునట. కామాది వికారములను పరధన కాంతలను కోరక పామరత్వములేక, మంచి నియమముతో బిల్వార్చనము చేయుచో జ్ఞానము కలుగును. అందుకు ప్రధానము సత్సంగము. సజ్జనులను, మూడు లోకముల కధిపతులంతటి గౌరవముతో చూడవలెనట. వేదశాస్త్రములను గౌరవించుచూ తదితరమైన మాటలను వదలిపెట్టి–(భాషలు= ఇతరమైన వ్యర్థపుమాటలు), భాగవతుల పూజించి, శివస్మరణ పరమ మంగళకరమని లలితములైన మాటలతో సహజమైన తీరులో శివభక్తిని హెచ్చరించినారు.

## 416. కళ్యాణి - అది

**శివే పాహిమామంబికే-శ్రితఫలదాయకి ॥శి॥**
**[1]కవేరజోత్తర తీరవాసిని-కాత్యాయని ధర్మసంవర్ధని ॥శి॥**

**స్వభావమౌ నీ ప్రభావము మహా**
**ను భావురాలైన భారతికి బొగ-**
**డ భారమైయుండ [2]భావజారా-**
**తి భామ! నేనెంత భాగ్యదాయిని ॥శి॥**

**[3]కలార్థమవు శశికలాధరీ [4]యుప**
**వలారి మాయావిలాసినీ స-**
**కలాగమనుతే [5]భలారి యన శుభ-**
**ఫలా లొసఁగు పరమ లాలనమ్మున ॥శి॥**

**చరాచరమయీ కరారవిందము-**
**న రామచిలుకను బిరాన బూని**
**పరాకుగా జూడరాదు శ్రీరఘు**
**వరాప్తుడగు త్యాగరాజవినుతే ॥శి॥**

కావేరీ ఉత్తర తీరమందు వేంచేసియున్న "ధర్మసంవర్ధని" యను పరదేవతను స్తుతించినారు. అమ్మా! మహానుభావురాలైన శారదయే నీ మహిమను పొగడలేదన్నచో, నిన్ను స్తుతించుటకు నేనెంతవాడను?

తల్లీ! సర్వవేదసారమైన ఓంకారమునకు నీవు అర్థమైయున్నావు. ఓ! చంద్రకళాధరీ! ఉపబలారి యగు ఉపేంద్రుని (విష్ణువు) మాయా విలాసముతో, దేవకార్యమునకై జగన్మోహినీ స్వరూప విలాసముచే శివుని

1. కావేరీ ఉత్తర తీరమందు వసించునది. 2. మన్మథశత్రువైన శివుని భామ. 3.కం= సుఖమును, లాతి= గ్రహించునట్టిది వేదము. దానికి అర్థమైనది. లేక ప్రణవార్థము. 4. ఉపవ (బలారి) ఉపేంద్రుని మాయావిలాసము కలది. (విష్ణుమాయ) 5. (భలారి) ఉత్సాహరూపమైన ధ్వని.



సైతము మోహింపఁచేసి యున్నావు. భలారే! ఎంత ఆశ్చర్యము! మాకు వాత్సల్యముతో ఫలమిమ్ము. చరాచర ప్రపంచము. నీ స్వరూపము. నీకరారవిందమున రామచిలుకను ధరించినావు. (దక్షిణ దేశమందు అమ్మవారిచేత చిలుక యుండుట సంప్రదాయము) మమ్ము పరాకుగా చూడక కాపాడుమని వేడుకొన్నారు.

## 417. సామం - దేశాది

**శాంతములేక సౌఖ్యములేదు-సారస దళ నయన ॥శాం॥**

**దాంతునికైన వేదాంతునికైన ॥శాం॥**

**దార సుతులు ధన ధాన్యములుండిన**
**సారెకు జప తప సంపద కల్గిన ॥శాం॥**

**యాగాది కర్మములన్నియు చేసిన**
**బాగుగ సకలహృ ద్భావము తెలిసిన ॥శాం॥**

**ఆగమ శాస్త్రములన్నియు చదివిన**
**భాగవతులనుచు బాగుగ పేరైన ॥శాం॥**

**రాజాధి రాజ శ్రీరాఘవ త్యాగ**
**రాజ వినుత సాధురక్షక తనకుప ॥శాం॥**

శాంతమనగా:-ప్రకృతి సిద్ధములైన కష్టసుఖములు, తాపత్రయములు కలిగినను, వాటి స్వరూప స్వభావములను, వాటి సత్తా తెలుసుకొని తాను కంగారు పడక స్తిమితముగా నుండుటయే. అట్టి శాంతములేనిచో ఎంతటి వానికైనను సుఖములేదని ఇందలి హెచ్చరిక.

దాంతుడు-వెలుపలి ఇంద్రియములను మాత్రము జయించినవాడు. వేదాంతి-వస్తుతత్త్వమును ఎరింగినవాడు. వీరికైనను, చిత్తమందు శాంత స్వభావము లేకున్నచో అలజడియే కలుగును. చిత్తచాంచల్యముతో, ఇహ

పరములందు, ఏ విధమైన ప్రయోజనమును సాధింపలేరు. దారా పుత్రులు ధన ధాన్యాది సంపదలు జప తపాదులు, యాగ యోగాదులు సత్సాధనము లెన్నియున్ననూ, శాంతము చిత్తస్థైర్యము లేనివానికి సార్థకములు కావని ప్రబోధించినారు.

## 418. ధన్యాసి – రూపకం

**శ్యామ సుందరాంగ సకల–శక్తియు నీవేరా ॥శ్యా॥**

**తామస రహిత గుణసాంద్ర–**
**ధరను వెలయు రామచంద్ర ॥శ్యా॥**

**దుష్టదనుజ మద విదార–శిష్టజన హృదయ విహార**
**ఇష్ట దైవము నీవేర–ఇలను త్యాగరాజువేర ॥శ్యా॥**

రాముడు శ్యామలమైన శరీర కాంతికలవాడు. త్రిగుణాత్మకమైన ప్రకృతిని శ్యామల వర్ణము కలదిగా వర్ణించుట ప్రసిద్ధము. ఆ త్రిగుణ ప్రకృతియే ఉపాధి కలవాడగుటచే భగవంతుడున్నూ శ్యామలుడు. కావుననే "సకలశక్తియు నీవేరా" యనుట యుక్తము. దుష్టశిక్షణము శిష్టరక్షణము ఆ శక్తియొక్క ప్రధాన కృత్యములు.

అట్టి రామచంద్రుని ఇష్టదైవముగా ఆరాధించు త్యాగరాజు నీకు వేరా! యని ఎంతో చక్కని సమన్వయముతో తాను రామునియందు విలీనమైయున్నట్లు తత్త్వార్థమును వివరించినారు.

(ఈ కీర్తన తమ నిర్యాణమందు కీర్తించినట్లు ప్రతీతి)

## 419. భవప్రియ – దేశాది

**శ్రీకాంత నీయెడ బలాతిబల చెలంగగ లేదా వాదా ॥శ్రీ॥**

**పాకారినుత నీవారి బలాబలమును తెలియగ లేదేమి ॥శ్రీ॥**



**కాకా దైత్యునేక శరమున నేయ–**
**కంజాస్త్రమై బరగలేదా**
**శ్రీకర ద్విజులై తారెరుంగలేని**
**చింత నీకుఁదోచదేమి త్యాగరాజనుత ॥శ్రీ॥**

రాముడు తానే సర్వశక్తులు కలవాడు కావున, నిర్హేతుకదయతో అందరను ఆతడే సంరక్షించి పరిపాలించవలెననే న్యాయమును ఇందు నిరూపించినారు.

విశ్వామిత్రుడు, తన చిరకాల తపసువల్ల ఆర్జించిన సమస్త శస్త్రాస్త్రమంత్ర విద్యా రహస్యములను ఉపదేశించినారు. యాగరక్షణకై తనవెంట వచ్చిన శ్రీరామ లక్ష్మణులకు సూర్యతనయులైన బల–అతిబలయను మహామంత్ర విద్యలను ఉపదేశించిరి. యీ విద్యలు సమస్త మంత్ర విద్యలకున్నూ తల్లులని వేదప్రమాణమున్నది. ఇన్ని విద్యలు నీవద్దనే యుండగా, నీవారి బలా బలములు నీకు తెలియవా? రామా! యని ప్రశ్నించుచూ, రామా! నీ విద్యా బలముచేతనే సర్వులను పాలించి రక్షించగల బాధ్యత, అర్హతలు నీయందే కలవు. అందుకు నిదర్శనముగా కాకాసురునిపై ఒక శరమును వేయగా, అది కంజాస్త్రమై–బ్రహ్మాస్త్రమై, తిరుగులేనిదై, నీ రక్షణచేతనే శాంతించినది. ప్రస్తుతము లోకమందు ద్విజులై, మంత్రాధికారముకల బ్రాహ్మణులు సైతము తమకుగల మంత్రశక్తి నెరుఁగలేనివారైరి. అట్లని నిన్నూ ఎరుఁగనిలేనివారైయున్నారు. కావున, నీవే నిర్హేతుదయతో రక్షించవలసిన బాధ్యత నీయందే యున్నది. అందుచేత, కాపాడుమని హేతువాద బద్ధముగ వేడినారు.

## 420. కలకంఠి – ఆది

**శ్రీ జనకతనయే శ్రిత కమలాలయే ॥శ్రీ॥**

**రాజన్నవమణి భూషణే! శ్రీరఘురామ సఖి**
**సతతం మామవ ॥శ్రీ॥**

**శతవదనా ద్యాశర జలధరానిలే**
**నతమానవ మానస సత్సదనే**
**శతమఖ కిరీట లసన్మణి గుణ నీరా–**
**జిత చరణే త్యాగరాజార్చితే ॥శ్రీ॥**

**"రాఘవత్వేఽ భవత్సీతా రుక్మిణీ కృష్ణ జన్మని"** శుద్ధ సత్వ స్వరూణియగు పరాశక్తియే రామావతారమందు సీతగా, కృష్ణావతారమందు రుక్మిణిగా అవతరించినటుల ప్రమాణములు కలవు. కాని, వీరిని ప్రత్యేకముగా కీర్తించి ఆరాధించుటలేదు. సీతారాములను, రుక్మిణీ కృష్ణులను సంయుక్తముగానే ఉపాసించుట పరిచితమైనది. ఇందు త్యాగరాజస్వామి సీతాదేవికి ప్రత్యేక పురుషకారముతో వ్యక్తిత్వమిచ్చి, **"శ్రీజనకతనయే"** యని, శ్రిత కమలాలయే= ఆశ్రయించిన భక్తులకు సాక్షాన్మహాలక్ష్మిగా కీర్తించినారు. విరాజమానములైన నూత్న మణికాంతులతో నొప్పుచూ రామునికి సఖియైన తల్లీ! ఎల్లపుడూ నన్ను రక్షింపుము.

చరణములందు అమ్మవారి ప్రత్యేకతకు సూచనగా శతవదనాద్యాశర– శతకంఠ, దశకంఠ రావణులాదిగా సకల అసురులనెడు మేఘములను తూలించు మహామేఘమువంటి దానవనీ, నతులైన దాసజనుల చిత్తములందు వసించుదానవనీ, ఇంద్రాదులు కిరీట మణులచే నీ చరణములకు నీరాజన మిత్తురని దివ్య మహిమాతిశయమును కీర్తించినారు.

**"మా జానకి చెట్టబట్టగా మహారాజవైతి"** వని మరియొక్కచోట సీతామతల్లి పారమ్యమును కీర్తించుటచే, రామాయణమందు అమ్మవారి జననమాది లంకానగరవాసము, భక్తవాత్సల్యము మొదలైన అంశములను వాల్మీకి వర్ణించి, రామాయణము కేవల రామకథ మాత్రమే గాదనియు **"సీతా యాశ్చరితం మహత్"** అనియు ఆ పరదేవతయొక్క వైభవమును పేర్కొనినారు. అట్లే ఇందు **"త్యాగరాజార్చితే"** యని శ్రీ జానకిని స్తుతించుట విశేషము.



## 421. ఈశ మనోహరి – దేశాది

**శ్రీ జానకీ మనోహర శ్రీరాఘవ ॥శ్రీ॥**

**నాజాలిని నీవే దెలిసి,**
**నమ్రానను డౌటకేమి కారణము ॥శ్రీ॥**

**నేసేయు దుష్కర్మ దేవత, నీ సన్నిధిని నిల్వసాగెనో**
**నీ సేవ నిల్పగ నేలరా నీరజాక్ష త్యాగరాజ సన్నుత ॥శ్రీ॥**

**"యాదృశీభావనాయత్ర సిద్ధిర్భవతి తాదృశీ"** భావుకుల చిత్తమందు ఏకాగ్రముగా ఏయే భావనలు కలుగునో, ఎదుట అవే సిద్ధించునట. వీని చిత్తము నిర్మలమై యుండవలయును. సత్పురుషులకు వేరు సాధనములతో నిమిత్తము లేకనే వారి చిత్తములందు ఫలితము సిద్ధించునని పెద్దల యనుభవము.

ఈ కీర్తనయందు త్యాగరాజస్వామి ఒక విలక్షణమైన భావచిత్రమును చిత్రించినారు. తాను నిరంతరము దైనందినముగా చేయు రామసేవ ఏదో అవాంతరకారణముచే నొకరోజు నిలుపవలసి వచ్చినదట. అంతలో తన చిత్తము జాలినందినదట. నాకీనాడు రామ కైంకర్యము నిలచిపోయెనే! అను జాలితో శ్రీ జానకీమనోహరుని రాముని మూర్తిని చూచెనట. రాముడు ఏమీ చేయలేక నమ్రాననుడయ్యెనట. తల వంచికొనియుండెనట. ఇందుకు కారణము తానే ఊహించుకుని రామా! నేచేసిన దుష్కర్మములు ఒక దేవతగా రూపుకట్టి, నా కడ్డుగా, నీ ఎదుట నిలిచినవా? స్వామీ! ఇంతకన్న నా చిత్తమందు వేరొక అభ్యంతరమేమీ కన్పించుటలేదే! యని వితర్కించుకొన్నారో, లేక, నీ సేవ నిల్పదేలరా! యను పాఠాంతరమైతే, తన ఏకాగ్రధ్యానము నిలువక చలించుచున్నదని భావము చెప్పవచ్చును. అనగా ఈ చిత్రమందు ఈ మహనీయునికి నిరంతరము శ్రీరాముని హావ భావ చేష్టలను గమనించుట, తన మనోభావములను, రామునియందు

సమన్వయించుకొనుటయే పనిగాని, ఇతర చింతనయేలేని పారవశ్యము ఈ మాటలలో గోచరమగుచున్నది. మహాభావుకుల మధురానుభవములిట్లే యుండును. ఈ రీతులు మన సమన్వయమునకందునవి కావని విధేయులమగుటయే మన కర్తవ్యమని తోచెడిని.

## 422. కానడ – రూపకం

**శ్రీనారద నాద సరసీరుహ భృంగ శుభాంగ ॥శ్రీ॥**

**దీనమాన రక్షక జగదీశ భేశ సంకాశ ॥శ్రీ॥**

**వేదజనిత వరవీణా వాదన తత్త్వజ్ఞ**
**ఖేదకర త్రితాప రహిత ఖేచర వినుత**
**యాదవకులజాప్త సదా మోదహృదయ మునివర్య**
**శ్రీద త్యాగరాజవినుత శ్రీకర మాంపాలయ ॥శ్రీ॥**

నారాయణునికి సాక్షాత్ప్రతినిధి నారదుఁడు త్రిలోకములకు గురువు. వేదాగమ పురాణేతిహాసములందు నారదుని పాత్ర అనేక ముఖములుగా, ప్రసిద్ధమైయున్నది. ప్రకృతం సంగీత సంప్రదాయమందు నారదుని మహిమాతిశమును ఇందు స్తుతించినారు. ప్రధానముగా, నాదమనెడి పద్మమునకు (మకరంద రసాస్వాదనమొనర్చు) భృంగమువంటివాడనుటలో, నాదమును బ్రహ్మానందస్వరూపముగా ననుభవించు మహనీయుడని భావము. శుభాంగ అనుటచే, నారదుని శరీరము భౌతికముగాక, చిదాకాశ రూపమైనందున శుభములనిచ్చునది.

అసంగచిద్రూప లక్షణము కలదయ్యును, సమిష్టి పరిశుద్ధ సూక్ష్మభూతాంశములతో కూడిన నారదుని అంతశ్శరీరము భగవత్సంకల్పాను సారముగా దీనుల కాపాడునట్టిది, జగన్నియామకము, స్వతంత్రమునైనది. కావుననే భేశ= నక్షత్రములకు ఈశుఁడైన చంద్రునికాంతి కలది. అనగా



స్వచ్ఛమైనదిగాన దీనుల మనస్తాపములు క్లేశములు ఆ దివ్యాంతః కరణమందు ప్రతిబింబితములగును. భగవంతునితో ఈ జీవుల క్లేశములను విజ్ఞాపించి నారదుడు లోక రక్షణ మొనర్చును. కావున, దీనమాన రక్షకుడనుట సార్థకమైన విశేషణము.

వేదములనుండి పుట్టి స్వరసమ్మితమైన నాదము వీణాదండమందే సంపూర్ణముగా వ్యక్తమగును. మహాయోగులు వీణాదండ సదృశము సకల దేవతామయమునగు సుషుమ్నానాడియందు సమస్త కళావైభవము ననుభవింతురు. క్రమముగా బ్రహ్మానందము ననుభవింతురు. ఇందుకు నారదుడే లోక గురుడు.

యాదవకులజాప్త! అనుటచే కృష్ణుని దివ్యమోహన లీలలందు నారదుడు ముఖ్యపాత్ర. అఖండ ప్రేమతత్త్వముచే, శ్రీకృష్ణ దివ్యనామకీర్తనము చేయుచూ, విశ్వమునకే సమస్త మాంగళ్యమును కలిగించు మహనీయుడు నారదుఁడని ఇందు స్తుతించినారు.

## 423. ఫలరంజని – దేశాది

**శ్రీనారసింహ మాంపాహి క్షీరాబ్ధి కన్యకారమణ ॥శ్రీ॥**

**దీనార్తి నివారణ భవ్యగుణ**
**దితి తనయ తిమిర సూర్యత్రినేత్ర ॥శ్రీ॥**

**ప్రహ్లాద పరాశర నారద హృత్**
**పంకేరుహ నీరజ బంధో**
**ఆహ్లాదక శుభరోగ సంహార**
**వరద త్యాగరాజాది వినుత ॥శ్రీ॥**

ఇందు లక్ష్మీ నృసింహస్వామివారి రక్షణను కోరుకొన్నారు. నరసింహస్వామివారి అవతారమందు, దీనుల ఆర్తిని తొలగించుట,

దుష్టులను శిక్షించుట ప్రధానాంశములు. భక్తుల ఆపదలను పోగొట్టుటలో స్మరణ మాత్రముననే అనుగ్రహము చూపఁగల ప్రసన్నత ఈ మూర్తికి సహజ లక్షణము. దితి తనయుడైన హిరణ్యకశిపుని దాడితో విశ్వమున కంతకు తిమిరము అంధకార మావరించినపుడు స్వామి సూర్యునివలె ప్రకాశించి త్రినేత్రుడై వానిని సంహరించి, లోకమును శాంతింపఁజేసినారు. ఈ సాహసకృత్యము బ్రహ్మేంద్రాదులకు అశక్యమైనది.

లోకమందు పరమభాగవతులుగా ప్రసిద్ధిగల ప్రహ్లాద నారద పరాశరాదుల హృదయములనెడి పంకేరుహములకు= పద్మములకు బంధువైన సూర్యునివంటివాడు. పరమానందమును కలిగించువాడు. అశుభములను ఆధివ్యాధులను హరించు పరమ మంగళమూర్తి. సమస్త వరములనిచ్చువాడు. త్యాగరాజాదులకు (శివుడు) వినుతుడు అనుటలో భాగవతులు భగవన్నామకీర్తనలందు నియతముగా శ్రీ లక్ష్మీనృసింహ కీర్తనము చేయనిచో ఆ గోష్ఠికి సమగ్రత శాంతి కలుగనేరవని సంప్రదాయజ్ఞులు భావించి, ఆది మధ్యావసానములలో శ్రీ లక్ష్మీ నృసింహ కీర్తనము చేయుట ఆచారము. కావున ప్రత్యేక కీర్తనము కావించినారు.

## 424. నాగస్వరాళి - దేశాది

**శ్రీపతే నీ పదచింతనే జీవనము ॥శ్రీ॥**

**నే పరదేశి నాగాసి బాపవే చనువున దయచేసి ॥శ్రీ॥**

**రాజాధిరాజ రవికోటితేజ, పూజించి నిన్నింద్రాదులు ది-**
**గ్రాజులై వెలయలేదా రాజిల్లు శ్రీత్యాగరాజునికి ॥శ్రీ॥**

ఇంద్ర వరుణాది దిక్పాలురు భగవంతుని పూజించి, నిత్యసన్నిహితులై దేవనాయకులై ఉన్నత పదవులలో నున్నారనియు, తాన మాత్రము “పరదేశి” దూరస్థుడైనట్లు భావించుకొని, చమత్కారముగా రామా! నాగాసి= కష్టములను పోగొట్టమని ప్రార్థించినారు. ఇందుకు తన అధికారమేమనగా శ్రీపతీ! నీ పద చింతనమే నా జీవనము. ఇట్టి ఆర్తులైన భక్తులు స్వర్గాది లోకములందుండనేరరు. వారందరు ఆధికారిక పురుషులు. **“కలౌఖలు భవిష్యంతి నారాయణ పరాయణాః”** కృతాది యుగములందుగాని, స్వర్గాది లోకాంతరములందుగాని, భూలోకమందు తత్రాపి కలిలో వున్నంతమంది పరమభక్తులు లేరనియు కలిలోవలె కేవల భగవత్సం కీర్తన స్మరనాదులవలన ఏర్పడుసిద్ధి మరే లోకమందు ఏ యుగమందును లేదని ఎన్నో ప్రమాణాలు కలవు కావుననే **“కలిం సభా జయంత్యార్యాః కలావిచ్ఛంతి సంభవం”** అనియు కలిని ప్రశంసించియున్నారు. కావున ఇందు నే పరదేశిననియు నాకే యున్నతపదవి వలదుగాని, ఏ కష్టములేక, నీ పదచింతనయను జీవమిచ్చి కాపాడుమని కోరుట ఎంతో స్వారస్యము.



## 425. పూర్ణషడ్జము - దేశాది

**శ్రీమానినీ మనోహర! చిరకాలము మాట**
**యొకటేరా, వేమారు బల్కజాలరా ॥శ్రీ॥**

**శ్రీమంతులౌ నీ సోదరులు సేయురీతి పాదసేవ కోరితిని ॥శ్రీ॥**

**ధర్మాద్యఖిల పురుషార్థములు దాశార్హ నీరూప మబ్బిన**
**మర్మంబు వేరెయున్నది మన్నించుమిక త్యాగరాజనుత ॥శ్రీ॥**

సర్వసాధారణముగా లోకవ్యవహారములో ఇహ-పరములను వేర్వేరుగా భావింతురు. అనగా భోగభాగ్యములు ఇహమునకు సంబంధించినవనీ, కేవల పరమార్థబుద్ధితో వైరాగ్యము కలిగియు ముముక్షువులైయుండుట పరమనీ భావింతురు. ఈ విభాగము ఒక తీరులో న్యాయమనిపించిననూ, పరమభక్తులు భావుకులు అట్లుగాక, తమ సర్వస్వమూ భగవంతుడే యను నిశ్చయము కలిగియుందురు. తమకుఁగల సంపదలను భగవంతునికే

అర్పించి, వారి సేవానందమందే ఆనందించువారే శ్రీమంతులుగాని, కేవల స్వార్థబుద్ధి కలవారు సంపదలున్ననూ, శ్రీమంతులు కానేరరు. బ్రహ్మాండమందలి సకల సౌభాగ్యములు తన స్వరూపమైన మహాలక్ష్మి కూడా శ్రీహరి పాదదాస్యమునేకోరి, **"శ్రీలలనాచరత్తపః విహాయ కామాన్ సుచిరం ధృతవ్రతా"** అనుటచే, తన సౌభాగ్యమునకు పూర్ణసిద్ధి నందినది. ఈ భావమును సూచించుటకే శ్రీమానినీ మనోహర! అని కీర్తించినారు.

ఈ భావముతో శ్రీమంతులౌ నీ సోదరులు, అందు ప్రధానముగా భరతుడు, తనకు ప్రాప్తించిన రాజ్యలక్ష్మిని సైతము లెక్కచేయక ఏకాంతమందు, లక్ష్మణుడు నిన్ననుసరించియు నీ పాదసేవయొనర్చి కృతార్థులైనారని, ఆదర్శమును చూపి, రామా! నేనున్నూ అట్లే పాదసేవ కోరితిననియు న్యాయమైన మాట త్రికాలసత్యమై చిరకాలముండుననియు, సిద్ధాంతములకు కాలపరిణామము మార్పులుండవనియు పదేపదే నీకు విజ్ఞాపించనక్కరలేదనియు నీ సోదరులవలె నన్ను, శ్రీమంతుడుగా నిరంతర పాదసేవకుడుగా అనుగ్రహమిమ్మని త్యాగరాజస్వామియు అర్థించుట ఎంతో గంభీరము.

పై యంశమునకు కారణమును చరణమందు సమర్థించినారు.

ఓ దాశార్హ! అని సంబోధనలో కృష్ణావతారముతో రామునికి అభేదమును చూపినారు.

అనగా, రామావతారమందు, అంతకన్న మిన్నగా కృష్ణావతారమందు, భక్తులు భాగవతులు శాస్త్రీయములైన, తమతమ అధికార అర్హతలకు అతీతముగా రామ, కృష్ణావతార మూర్తులను, శ్రవణ స్మరణ, కీర్తన పాదసేవాదులతో, తమ సర్వస్వమును భగవంతునికి అర్పించి, తమ ధర్మార్థ కామ మోక్షములనే పురుషార్థములు, పరమాత్మస్వరూపముగానే తలచి, ఏ కోరికలులేక, ఆత్మార్పణ మొనరించి ధన్యులైరి. ఈ భావమునే "మర్మము



వేరె యున్నదని" కీర్తించి, రామా! నన్నునట్లే మన్నించమని వేడుకొనుటలో సర్వశాస్త్రార్థ సమన్వయముతో కూడిన భక్తి సిద్ధాంతమును ఇందు వివరించినారు.

## 426. భైరవి - ఆది

**శ్రీరఘువర సుగుణాలయ సరసిజలోచన విరోచనాభ ॥శ్రీ॥**

**తరానలేని పరాకులేటికి బిరాననను**
**బ్రోవగరాదా వాదా ॥శ్రీ॥**

**కమలాహిత నత కమలాహిత ధర**
**మమత దెలిసి నను మన్నించరాదా ॥శ్రీ॥**

**కలశ జలధిలో లక్ష్మితో నాడే**
**కలకాలమున నీసేవ రాజేసే**
**నా మనసెరింగి బల్కు మికను ॥శ్రీ॥**

**కనికరమున నను కని కరముననిడి-**
**చనువున నొక మనవిని బల్కరాదా ॥శ్రీ॥**

**ఆగమమూల అవనిజాలోల**
**వేగమే దెలిసికో త్యాగరాజార్చిత ॥శ్రీ॥**

రామా! నీవు సకల సద్గుణములకు నిలయము సూర్యునివంటి తేజస్సు కలవాడవు. నీ చూపునకు చీకటి ఆవరణములేదు. నీ వంశ పరంపరగా తరతరములుగాలేని పరాకు నీకేల కల్గును? నన్ను కాపాడకున్నావు. నన్ను బ్రోచుటలో నీకేమి అపవాదము వచ్చునా? కమలాహిత= లక్ష్మిని ప్రేమతో హితుడవై నీ వక్షస్థలమందే ధరించియున్నావు. కమలములకు అహితుడైన చంద్రుని ధరించినవాడు శివునిచే కూడ స్తుతింపబడువాడవు. ఎవరినెట్లు ప్రేమించి మమకారము ఆప్తత చూపవలయునో బాగుగా నెరిగినవాడవు.

నన్ను కూడ మన్నించి కాపాడరాదా! పాలసముద్రమందు నివసించు లక్ష్మీపతివి నీవేయని తలంచి కలకాలము నీ సేవ రాజేసే= కలుగవలెనని నా తలంపు నెరిగి ఒక్కమాటు నాతో పల్కరాదా! సకల వేదములకు నీవే మూలపురుషుడవు. నీ వెరుంగనిది లేదు. సర్వజ్ఞుడవు కావున, నా యార్తిని వేగమే తెలుసుకొని కాపాడుము.

## 427. కాంభోజి – ఆది

**శ్రీ రఘువరాప్రమేయ మామవ ॥శ్రీ॥**

**శ్రీ రఘుకుల జలనిధిసోమ శ్రీరామపాలయ ॥శ్రీ॥**

**సారసహిత కులాబ్జభృంగ సంగీతలోల ॥శ్రీ॥**

**విరోచన కులేశ్వర స్వరలయాది**
**మూర్ఛనోల్లసిత నారద వినుత ॥శ్రీ॥**

**శ్రీ భాస్కర కులాద్రి దీప**
**శ్రీ భాగవత నతచరణ సీ–**
**తా భాగధేయ త్యాగరాజనుతా–**
**నిలసుతాప్త సుగుణాభరణ ॥శ్రీ॥**

ప్రమాణములకందని దివ్య మహిమతో అప్రమేయుడవగు ఓ! రామా మా మవ= నన్ను రక్షింపుము.

రఘుకులమనెడి సముద్రమునకు చంద్రునివంటివాడనుటలో అమృతమయుడు, సర్వజనాహ్లాదకరుడని భావము.

సారసహిత= పద్మహితుడైన సూర్యుని కులమనెడి పద్మమునకు తుమ్మెదవంటివాడనుటలో, మకరంద మొలకించు మధురమూర్తి కావుననే సంగీతలోలుడనియు విశేషము.



విరోచన కులేశ్వర! తిరిగి సూర్యకులపతీ! యని పిలిచి, స్వరలయాది మూర్ఛనలతో ఉల్లాసమందు వాడనుటలో, సూర్యనాడీ మార్గమున నాదము వికసించునని తాత్పర్యము.

ఆపై భాస్కర కులమనెడి పర్వతమునకు దీపమువంటి వాడనుటలో, (కులగిరులపై) దీపదర్శనముచేయుట సర్వపాపహరమనియు అదే పరంజ్యోతియనియు సమన్వయము. సీతా భాగ్యదేవత భాగవతోత్తములు నతులైచరణముల నుపాసింతురనియు, ఇన్ని వైభవములను ఆధ్యాత్మికముగా ననుభవించు కుశలుడు అనిలసుతుడు ఆంజనేయుడేగాన వాని కాప్తుడని, అనంత కల్యాణ గుణవైభవము కలవాడని స్తుతించిరి.

## 428. హంసధ్వని – దేశాది

**శ్రీరఘుకులమందు బుట్టి నీవు సీతను**
**చేకొనిన రామచంద్ర ॥శ్రీ॥**

**ఆరామమందు మునుల కోరిక**
**లీడేరసేయ పూనుకొన్న రామ ॥శ్రీ॥**

**వరరత్న పీఠమందు మజ్జనము**
**పుడమిసురుల చేత గైకొన్న రామ ॥శ్రీ॥**

**పరమ భక్తులను పాలనము సేయు**
**సాకేతవాస త్యాగరాజనుత ॥శ్రీ॥**

ఇందు శ్రీరాముని అవతారమును, సీత చేకొనుట పాణిగ్రహణమును వర్ణించి, అరణ్యవాసమందు మునుల కోరికలను దీర్చు వ్యాజమున దుష్టసంహారమొనర్చుటయు, నవరత్న పీఠమందు వసిష్ఠాది భూసురులు మజ్జనముసేయుట యనగా పట్టాభిషేక మహోత్సవమును కీర్తించినారు.

తర్వాత రామరాజ్యమందు పరమభక్తులను పాలనముసేయుటే ప్రధాన ధర్మముగా చెప్పుట విశేషము.

## 429. జయమనోహరి - ఆది

**శ్రీ రమ్యచిత్తాలంకార స్వరూపబ్రోవుము ॥శ్రీ॥**

**మారారి దేవేంద్ర పితామహాదృష్ట దిక్పాలసేవ్య ॥శ్రీ॥**

**సురేశారి జీవాపహార వరసోదర ధరాప శ్రీప**
**నరానంద నేనీవలెగానరా త్యాగరాజార్చిత పద ॥శ్రీ॥**

శ్రీరమ్య...స్వరూప= శ్రీదేవియొక్క రమ్యమైన (స్వయంశోభగల) చిత్తమునకు అలంకారమైనవాడు. మారారి= శివుడు. దేవేంద్ర పితామహాదృష్ట దిక్పాలసేవ్య= బ్రహ్మేంద్రాది దిక్పాలురకు సేవించతగినవాడు. సురేశారి= ఇంద్రశత్రువైన ఇంద్రజితుని జీవమును హరించినవాడు. ధరాప= భూపతి. శ్రీప= లక్ష్మీపతి. నరానంద= మనుష్య స్వరూపమున ఆనంద స్వరూపము కలవాడు.

శ్రీదేవికి సైతము రమణీయమై పుంసాంమోహనమైన దివ్యస్వరూపము కలిగి, మానవ రూపమున మహా యోగులకు మునులకు ఆనందమిచ్చునట్టి ఓ! లక్ష్మీపతీ! నీవలె నేనెందుగానరా యనుటవలన, దివ్య-మానవ మహిమలతో పూర్ణావతార మూర్తియగు రాముని కల్యాణ గుణములు మరెచటనూ దర్శించ వీలులేదని ఆనందముతో కీర్తించినారు.

## 430. అమృతవాహిని - ఆది

**శ్రీరామ పాదమా నీ కృప జాలునే**
**చిత్తానికి రావే ॥శ్రీ॥**

**వారిజ భవ సనకసనందన**
**వాసవాదు లెల్ల పూజించే ॥శ్రీ॥**



**దారిని శిలయై తాపము తాళక**
**వారము కన్నీరును రాల్చగ**
**శూర అహల్యను జూచి బ్రోచి-**
**తా రీతి ధన్యుసేయవే త్యాగరాజ గేయమా ॥శ్రీ॥**

శ్రీరాముడు ఇష్టదైవముగా ఉపాస్యుడైనను, శ్రీరాముని దివ్య పాదమునకొక ప్రత్యేక పురుషకారమిచ్చి, శ్రీవారి పాదుకా వైభవమును కీర్తించి, నీ కృప చాలు ననుటలో సర్వవైభవములను భక్తులకు ప్రసాదించు శక్తిని శ్రీపాదమందు భావించినారు. ఉపాసనా సంప్రదాయమందు సర్వశక్తులు ఆయా దేవతల పాదములందే భావించుట సంప్రదాయము. **"పాదుకాంత దీక్ష"** యను సంకేతము మంత్రశాస్త్ర ప్రసిద్ధము. వారిజభవ= బ్రహ్మా మొదలైన వారందరు ఈ దివ్య చరణారవిందమునే పూజించుచున్నారనియు కావున, వారధికార స్థానములందున్నారనియు విశేషము.

శ్రీరామభక్తి భరితుడగు భరతుడు రామ పాదుకలందే విశ్వ సామ్రాజ్యమును భావించి, వసిష్ఠాదేశముతో యోగియై ఉపాసించిన ఘట్టము ప్రసిద్ధమైనను, అంతకంటే విశేషించి అహల్యాశాప విముక్తిని ప్రస్తావించి ఎవ్వరూ ఊహింపలేని మహిమను కీర్తించుట ఎంతో ప్రసక్తమైనది.

అహల్య మహా సాధ్వి. గౌతముడు మహా తపస్వి. లోకోద్ధరణమునకై కారణ జన్ములుగా అవతరించిన అట్టి మహనీయుల శాప, తాపములలోని ఆంతర్యము లోక సామాన్యమునకు తెలియునదిగాదు. వారి సంఘటనలవలన లోకమునకేదో దివ్యసందేశము ఆదేశింపఁబడును. వారి వివాద సంవాదముల పరిష్కారము భగవంతుడే చూచుకొనవలెను.

ఇచట త్యాగరాజస్వామి భావనలో శాపనిమిత్తముగా శిలయైన అహల్య జాలిని, ఆమె తాపమును, కన్నీరు కార్చుటను భావించి రామపాద మహిమను

కీర్తించుకొని, ఆ తీరుననే నా జాలిదీర్చి నన్ను ధన్యుని చేయుమని ప్రార్థించినారు.

ఈ ఆదర్శ సామ్యమును తనయందు భావించుటలో వీరి చిత్తము శ్రీరామ దివ్యచరణారవిందములందు లగ్నమై, ఆంతరమైన ఆర్తినందినట్లు స్పష్టమగుచున్నది. ఈ విధములైన సన్నివేశములందు చరిత్ర ప్రాధాన్యముకన్న మహాభక్తుల అనుభూతికే ప్రాధాన్యముకలదు.

## 431. భైరవి - ఆది

**శ్రీ నారదమునీ గురురాయగంటి**
**మేనాటి తపమో గురురాయ ॥శ్రీ॥**

**మనసార గోరితి గురురాయ నేడు**
**కనులార కనుగొంటిమి గురురాయ ॥శ్రీ॥**

**మీ సేవ దొరకెను గురురాయ భవ**
**పాశము దొలగెను గురురాయ ॥శ్రీ॥**

**నీవె సుజ్ఞానము గురురాయ**
**నీవె అజ్ఞానశిఖి గురురాయ ॥శ్రీ॥**

**రాజిల్లు వీణెగల గురురాయ**
**త్యాగరాజుని బ్రోచిన సద్గురురాయ ॥శ్రీ॥**

త్యాగరాజస్వామికి నారదుడు స్వయముగా దర్శనమిచ్చి "స్వరార్ణవ" మను సంగీతశాస్త్ర గ్రంథమును ప్రసాదించినట్లు ఆధారములుకలవు. నారదగురుస్తుతి కీర్తనలు ప్రత్యేకముగానున్నవి.

ఈ కీర్తనము "గురురాయ" అను మకుటముతో వీణాధారియైన నారదులను స్తుతించినది. నా ఏనాటి తపః ఫలమో, కనులార కనుగొంటినని, మీ సేవచే భవపాశము-జన్మ సంసార బంధము తొలంగినదని, అజ్ఞానమును దహించ శిఖి= అగ్నివంటివాడవని గురువందన మొనరించినారు



## 432. అఠాణ - ఆది

**శ్రీప్రపియ సంగీతోపాసన-చేయవే ఓ! మనసా ॥శ్రీ॥**

**తాపస జనమాన ధనము త్రి**
**తాప రహిత సప్తస్వరచారి ॥శ్రీ॥**

**రంజింపఁజేసెడు రాగంబులు**
**మంజుళమగు నవతారము లెత్తి**
**మంజీరము ఘల్లని నటించు**
**మహిమ దెలియు త్యాగరాజ నుతుడగు ॥శ్రీ॥**

సప్తస్వర సంచారములు కలిగి, నాట్య గీతములతో కూడిన సంగీతము సర్వజీవులకు ఆంతర్యామియగు శ్రీహరికి ప్రియమైనది. మరియు నాదాత్మకమైనందున ఆంతర్యామియొక్క స్వరూపమునైనది. అట్టి సంగీతము పరమాత్మ స్వరూపముగానే భావించి ఉపాసనచేయుమని మనసును హెచ్చరించినారు.

ఆ నాద శరీరియైన నారాయణునికి, రంజింప చేయునట్టి రాగములే అవతారములట.

ఆ విధమైన రాగ తాళ స్వర రక్తితో నటించునపుడు మంజీరము కాలియందెలరవళితో మనోహరమైన, భగవద్రూపమైన సంగీతోపాసనము. నటరాజమూర్తికి బాగా తెలియును. ఈ దృష్టితో సంగీతోపాసనము తాపసులకు అంతర్దృష్టికల మునులకు మనోధనము. సమస్త తాపములను తొలగించి బ్రహ్మానంద మిచ్చునది యని భావము.

## 433. దేవగాంధారి - ఆది

**శ్రీరఘువర కరుణాకర నీ పద చింతనమే జీవనము ॥శ్రీ॥**

**వారణ రక్షక భక్తజనాఘ ని**
**వారణ సన్మృదుభాషణ సద్గుణ ॥శ్రీ॥**

**మార మారనుత నా మనవిని విను**
**మా రమారమణ మరువకురా సుకు**
**మార మా రసనమున నీ నామము**
**మారు మారు బల్కను దయసేయుము ॥శ్రీ॥**

**వారి వారి మంచికి దగినట్టు**
**వారి వారి భాగ్యము లీవాదే-**
**వారి వారి దానిల శంబర జీ**
**వారి వారి జాసన జనకహరే ॥శ్రీ॥**

**రాజరాజ వందిత పదయుగ దిన**
**రాజరాజ నయన పాలితామర**
**రాజరాజ పూజిత శ్రీత్యాగ**
**రాజరాజ రాఘవనను బ్రోవుము ॥శ్రీ॥**

వారణ రక్షక= గజరక్షకుడు, భక్తజనుల అఘనివారణ= పాపముల వారించువాడు, మారమారనుత= మన్మథుని హరించిన శివునిచే స్తుతింపబడువాడు, మా రసనమున= మా నాలుకమీద, దేవారి= దేవతలకు శత్రులగు రాక్షసులనెడి, వారిదా నిల= మేఘములకు వాయువువంటివాడు. శంబర...జనక= మన్మథునికి బ్రహ్మకు తండ్రి. రాజరాజవందిత పాదయుగ= కుబేరునిచే నమస్కరింపబడు పాదములు కలవాడు. దినరాజ రాజనయన= సూర్యచంద్రులు నేత్రములు కలవాడు. పాలితామరరాజ= ఇంద్రుని పాలించువాడు.



భక్తజనరక్షకుడు కరుణాకరుడైన శ్రీరాముని స్తుతించినారు. నిరంతరము మా నాల్కలందు నీ దివ్యనామము నటించునట్లు అనుగ్రహించుము. వారి వారి మంచికి తగినట్లు వారి భాగ్యములు ఫలించును. అయినను నీ పదచింతనమే మాకు జీవనమని లలితములైన పదములతో కీర్తించినారు.

## 434. జగన్మోహిని - రూపకం

**శోభిల్లు సప్తస్వర సుందరుల భజింపవే మనసా ॥శో॥**

**నాభిహృత్కంఠ రసన నాసాదులయందు ॥శో॥**

**ధర ఋక్సామాదులలో వర గాయత్రి హృదయమున**
**సురభూసుర మానసమున శుభ త్యాగరాజాదులలో ॥శో॥**

ఇందు సరిగమాది సప్తస్వరములయొక్క దివ్యసౌందర్యశోభను ఆధ్యాత్మికముగ అభివర్ణించినారు. సప్తస్వర మాతృకలను, సుందరులుగా చెప్పుటలో ఎంతో ఔచిత్యమున్నది. నాదమే చిన్మయము. భగవంతుని మొదటి యవతారము. స్వరసమ్మేళనముతో, ఆపాతమధురమై, నవరసములను వ్యక్తీకరించుచూ, సర్వదేవతలను రంజింపఁజేసి అమృతమువలె అంతర్బాహ్యములందు ఆనందము నిచ్చునది సంగీతము.

ఇంతటి వైభవమీ స్వరమేళన ప్రక్రియలో ఏర్పడుటకు కారణము, పరమశివుని సద్యోజాతాది పంచముఖములనుండి వ్యక్తములగుటయే యని యోగులు భావించినారు.

శివుని చిదాకాశమునుండి వెల్వడిన ఈ స్వరసుందరులకు, మన శరీరమందు నాభి, హృదయము, కంఠము, నాలుక, నాసము, అను పంచస్థానములను ఉపాధులు స్వీకరించుటచే, ఆ స్వరసౌందర్యమును మనమనుభవించుట కవకాశము కల్గినది. నాదోపాసకులు ఆయా స్థానములను గుర్తించి అందలి విశుద్ధ నాదమును ఉపాసింతురేని, వారి గానము దివ్యమోహనమైన రక్తి నిచ్చుననుటలో సందేహములేదు. ఇంకనూ

ఈ దివ్య నాదోపాసనమువలన, వేదోక్తములైన సమస్త సత్కర్మములు, యజ్ఞయాగాదులున్నూ ఆచరించిన మహాఫలము కలుగుననియు పెద్దల సిద్ధాంతము.

ఋగ్వేద సూక్తములు, వాటియందలి స్వరవిశేషముతో యేర్పడిన సామము, యజుర్వేద అథర్వణవేదములు – ఈ వేదములనుండి ఒక్కొక్క పాదముగా ఏర్పడిన గాయత్రీ మహామంత్ర హృదయము ఈ సప్తస్వర సుందరులకు కేంద్రములనియు, ఈ మంత్రాత్మకమైన నాదబ్రహ్మము, దేవ, బ్రాహ్మణ మానసములందు వ్యక్తమగునని నిరూపించినారు. శుద్ధమైన మనసుతో, గుర్వనుగ్రహముతో, ఈ సప్తస్వర సుందరుల నుపాసించు నాదయోగులకు, సర్వదేవతలు ప్రసన్నులగుదురని సర్వమంగళములు కలుగునని సంప్రదాయ ప్రవర్తకులైన, నారదపరాశర శుకాదులు స్వానుభూతితో సంగీతవైభవమును మన కనుగ్రహించినారు. శ్రీరామోపాసనా విశేషమున త్యాగరాజస్వామి ఇంతటి విశిష్ట సంప్రదాయమును సంగ్రహముగా ఈ గేయమందు పొందుపరచినారు.

జన్మాంతర భాగ్యమున అలవడిన నాద విద్యోపాసనమును, ఈ తీరున భావించిన మహనీయులు లోకపావనులు.

## 435. ధన్యాసి – దేశాది

**సంగీత జ్ఞానము భక్తివినా సన్మార్గము గలదే మనసా ॥సం॥**

**భృంగి [1]నటేశ సమీరజ ఘటజ [2]మ**
**తంగ నారదాదు లుపాసించే ॥సం॥**

**న్యాయా న్యాయము తెలుసును జగములు**
**మాయామయములని తెలుసును దుర్గుణ**
**కాయజాది షడ్రిపుల జయించే**
**కార్యము తెలుసును త్యాగరాజునికే ॥సం॥**

1. నందీశ 2. మార్తాండ



మంత్రద్రష్టలు యోగులు తీర్చిదిద్దిన నియమములుగల సంగీతజ్ఞానము, పరమేశ్వర భక్తితో కలసినపుడు ముక్తి ననుగ్రహించు సన్మార్గమిదేయని సిద్ధాంతము. తదితర వేదోక్తములైన సర్వధర్మములు క్రమముగా మోక్షమునకు సాధనములు కావచ్చునేగాని సద్భక్తి సహితసంగీత జ్ఞానము నాదోపాసనము సాక్షాన్ముక్తి ఫలస్వరూపమని పెద్దలు భావించినారు. "వేదోక్తంబౌ కర్మము వెతగల్గు గతాగతమై" యని త్యాగరాజస్వామి వేరొకచోట స్పష్టీకరించినారు.

ఈ వరవడిలో అనాది గురుపరంపరను ఇందు స్మరించినారు. భృంగి, నటేశ, సమీరజ= ఆంజనేయుడు ఘటజ= అగస్త్యుడు, మతంగఋషి నారదాదులు సంగీత సంప్రదాయ ప్రవర్తకులు. సిద్ధాంతకర్తలు. ప్రపంచమందు వేదశాస్త్రములు న్యాయాన్యాయములగూర్చి వివరములు తెల్పినవి, వేదాంతములు. మనకెదుట కనిపించే విశ్వమంతయు మాయామాత్రమనీ, పరమాత్మయే ఏకైక సత్యవస్తువని వివరించినవి. నిషేధించతగిన కాయజాది= కామము, క్రోధము ఆదిగాగల ఆర్గురుశత్రువులను జయించినగాని, చిత్తశుద్ధి కలుగనేరదనియు శాస్త్రములు బోధించినవి. ఇన్నియు జ్ఞానమునకు ఉత్తమములైన సాధనలను మాట సత్యమే అయినను, సంగీతసహిత భక్తి వీటినిమించి, నాదోపాసనమగుటచే భగవంతునియందు ఏకాగ్రమైన ధ్యానసిద్ధిని అనుగ్రహించునను మాట త్యాగరాజునికే అనుభవము. భగవన్నామకీర్తనము సాధనాంతరాపేక్షలేని స్వతః ప్రమాణమైన సన్మార్గమని నారదాది మహనీయుల సిద్ధాంతమని వివరించినారు.

## 436. [1]ముఖారి – దేశాది

**సంగీత శాస్త్రజ్ఞానముసారూప్య సౌఖ్యదమే మనసా ॥సం॥**

**శృంగార రసాద్యఖిలసార పూ**
**రిత రామకథానందాబ్ధియుత ॥సం॥**

1. సాళగభైరవి

**ప్రేమ భక్తి సుజనవాత్సల్యము**
**శ్రీమద్రమావర కటాక్షము**
**నేమ నిష్ఠ యశో ధన మొసంగునే**
**నేర్పుగల్గు త్యాగరాజు నేర్చిన ॥సం॥**

సంగీత శాస్త్రజ్ఞానము ఋక్సామాది వేదసమ్మితము. ఆ వేదవేద్యుడైన పరమాత్మ మనకు సన్నిహితమై పుంసాం మోహనరూపముతో రాముడుగా అవతరించిన తోడనే, వేదమున్నూ రామాయణ స్వరూపముగా నవతరించినట్లు ఆర్షసిద్ధాంతము. అందును శ్రీరామ తారక దివ్యనామము ఆంతర్యముగా మహాయోగులకు ఉపాస్యము. పార్వతీ శివులకు నిరంతరానంద మిచ్చునది.

కావున, సంగీతజ్ఞులు రామనామమును, **"పాఠ్యేగేయేచ మధుర"**మైన రామచరిత్రను గానము చేయుచో రామతారక బ్రహ్మ వస్తువుతో సారూప్యసిద్ధి కలుగునని ఇందు త్యాగరాజస్వామి తన యనుభవముతో ముద్రవేసినారు. మరియు రామకథ శృంగారాది నవరస భరితము. అనగా ఆ యారసములు ఉదాత్తమైన రామకథతో మన మనుభవింతుమేని, దైవసంపదతో బ్రహ్మానందానుభవము కలుగును.

## 437. రామప్రియ - దేశాది

**సందేహమును దీర్పవయ్య సాకేతనిలయ రామయ్య ॥సం॥**

**నందార్చితపద యుగములు మేలో-**
**నాగరికమగు పదయుగములు మేలో ॥సం॥**

**వరమౌను లెల్ల చరణమ్ములను**
**స్మరియింప నీదు పద మొసంగెనే**
**భరతార్చనచే పాదుకలు**
**ధర నిన్నొసంగె త్యాగరాజ భాగ్యమా ॥సం॥**



సాకేత నిలయుడైన రామునిగూర్చి ఒక విచిత్రమైన సందేహమును తీర్పమని కోరినారు.

శ్రీరామతత్త్వముయొక్క వైభవమంతయు శ్రీరాముని దివ్యపాదములందు కలదని తత్త్వవేత్తలైన మునులు, మహోపాసకులు సర్వవేదాగమ ప్రమాణములతో సిద్ధాంత మొనర్చినారు. అనగా కరచరణాద్యవయవములతో కూడిన స్వరూపముయొక్క సత్తాస్ఫూర్తులు పాదములయందే కలవనుట ఉపాసనా రహస్యము. కావుననే, పాదములకు నమస్కరించుట భారత ఋషిసంప్రదాయము.

మానవ స్వరూపమందు పాదములు క్రిందుగానున్నను, పరమాత్మ వస్తువు ఊర్ధ్వగతమైనది కావున, మహాయోగులు తమ సహస్రారస్థానమందే నిష్ఠకలవారై తమ ఉపాస్యదైవమునే తమ స్వరూపముగా భావించుకొని, మంత్రమయులై తమ ధ్యాన నిష్ఠయందు విష్ణ్వధిష్ఠానముగా గల పాదములను, భగవచ్ఛక్తి యుక్తమైనవిగా భావింతురు. అదియే మహాఫలము. శ్రీవైకుంఠమందు నందుడు, సునందుడు మొదలైనవారు నిత్యపార్షదులు. నిరంతరము విష్ణు సాక్షాత్కారమునేగాక, సారూప్య, సాయుజ్యాది సిద్ధి కలవారు. వారు సాక్షాత్‌గా శ్రీ మహావిష్ణు పాదములనే అర్చింతురు.

ఆ నారాయణుడే శ్రీరాముడుగా అవతరించినందున, భరతయోగి వసిష్ఠాదేశమున శ్రీరాముని దివ్యస్వరూప వైభవమే రామపాదుకలయందు కలదనియు' రాముడు అయోధ్యకు రానందున తాను నందిగ్రామమందు రామ పాదుకలనే సింహాసన మందుంచి తాను రామ ప్రతినిధిగా రాజ్యమేలెను. ఆ ఫలితముగా తాము రామునితో అభేదసిద్ధినందెను.

ఇచ్చట త్యాగరాజస్వామి నందాదులు, సన్మునులు నారాయణుని పాదముల నర్చించి, నీ పద మందినారనీ, భరతుడు నీ పాదుకారాధన చేసినందున, ధరలో "నిన్నొసంగె" ననగా నీతో అభేదసిద్ధినందెనని విశేషము.

లేదా వైకుంఠమందలి విష్ణుచరణములు యీ లోకమందలి వారికి దుర్లభములు. భరతయోగి అస్మదాదులను, సమస్తభూతములను ఉద్ధరించు నిమిత్తమై నీ దివ్య పాదుకారాధనా భాగ్య మనుగ్రహించెనని భావము.

ఇట్లు కీర్తించుకొనుట త్యాగరాజుని భాగ్యమని ఎంతో ఉన్నతమైన ఉపాసనా రహస్యము నిందు వివరించినారు.

## 438. సావేరి - ఆది

**సంసారులైతే నేమయ్యా శిఖి**
**పింఛావతంసు డెదుట నుండగ ॥సం॥**

**హింసాదు లెల్లరోసి హంసాదుల గూడి ప్ర**
**శంసఁజేయుచునే ప్రొద్దు కంసారిని నమ్మువారు ॥సం॥**

**జ్ఞాన వైరాగ్యములు హీనమైనట్టి భవ**
**కాననమున తిరుగు మానవులు సదా**
**ధ్యాన యోగయుతులై నీ నామము బల్కుచు**
**నానా కర్మఫలము దానము సేయువారు ॥సం॥**

**క్రూరపు యోచనల దూరుచేసి తన**
**దార పుత్రుల పరిచారకుల చేసి**
**సారరూపుని పదసారస యుగముల**
**సారె సారెకు మనసార పూజించువారు ॥సం॥**

**భాగవతుల గూడి భోగములెల్ల హరి**
**కే గావింపుచును వీణాగానములతో**
**ఆగమచరుని శ్రీరాగమున బాడుచు**
**త్యాగరాజ నుతుని బాగుగ నమ్మువారు ॥సం॥**

లోకమందు సంసారులైయున్నంత మాత్రాన దైవభక్తిని వైరాగ్యాదులను సాధించు అవకాశము కలుగదని కొందరు భావింతురు. అట్టివారికి



సమాధానముగా సంసారులైయుండియు, దైవభక్తి, వివేక వైరాగ్యములు కలిగి సంసారధర్మమందు అసంగులై, సంసారమందలి సర్వవిషయములను భగవంతుని సేవయందే వినియోగించుచూ, రాజయోగసంపదనంద వచ్చునని త్యాగరాజస్వామి యిందు వివరించినారు.

నిరంతరధ్యాన స్మరణకీర్తనాదులచే ఎల్లప్పుడూ శ్రీహరి తమ యెదుటనే యున్నట్లు భావరక్తిననుభవించుచు సజ్జనులు "సంసారులైతే నేమయ్యా!" యని ఛలోక్తిగా పల్కుటలో ఎంతో దృఢనిశ్చయమున్నటుల తెలియుచున్నది.

మరియు తన మనోవాక్కాయములతో ఇతరుల కెవ్వరికీ హింస చేయక, భగవత్ప్రసంగములు కల సత్సంగము అన్ని సాధనలకు మించినది.

మనమాచరించు అన్ని కర్మలయొక్క ఫలములను భగవంతుని కల్పించి శ్రీహరి కీర్తనము చేయువారికి భగవంతుడే జ్ఞాన వైరాగ్యములను అనుగ్రహించును.

మరియు ఇతరులను బాధించునట్టి దురాలోచనలు చేయక, తనకుఁ గల దారా పుత్ర ధనాదులను, దైవసేవయందే వినియోగించుచూ, వివేకముతో తన పరిసరములను, పరివారమును, భగవత్సేవయందే ఆనందింపఁ చేయవలయును.

పరమ భాగవతులతోచేరి వారనుభవించు భోగములను భగవత్ప్రసాద బుద్ధితో అనుభవించుచూ, వీణాగానముతో రంజింపఁజేయు శ్రీరాగముతో పాడుచూ, దైవోపచారములను సమర్పించవలయును. ఈ రీతి నిత్యము వేకువ లేచి, ప్రబోధసేవ మొదలు పవ్వళింపుసేవ వరకును. సకలోపచారములను ఆచరించి, ఆ శేషమునే తామున్నూ అనుభవించుచూ, సంసారులైననూ, దైవానుగ్రహమువలన కృతార్థత కలుగును. ఈ మార్గము ఎంతో సుగమమైనది. ఇచట "శ్రీరాగముతో హరిని బాడుచు" అనుటవలన

ప్రాచీనముగా స్వామికి చేయు రాజోపచార కీర్తనలన్నియు శ్రీరాగమందే యుండుట రక్తినిచ్చునని భావము. ఇది రాజయోగ మార్గమున దైవోత్సవ సంప్రదాయము.

## 439. ఫలమంజరి – దేశాది

**సనాతన పరమపావన ఘనాఘన వర్ణ కమలానన ॥స॥**

**తనవాడనే యభిమానము దైవమైన నీకేల కలుగదు ॥స॥**

**రాజాధిపాన్వయ సాగరరాజు నీవై విలసిల్లి తే।**
**తేజరిల్లగా కృపజూతువే ఈ జగాన త్యాగరాజ సన్నుత ॥స॥**

నీలమేఘ శరీరుడవైన ఓ! రామా! నీవు సనాతనుడవు. నీకెవ్వరూ కారణములులేక నిరంతరము అభినవమైనవాడవు. (''సనా'' అను అవ్యయమునకు నిరంతరము అర్థము) దేశ, కాల, వస్తువుచే పరిచ్ఛిన్నముకాక నిరంతరముండునట్టి అఖండైక రసస్వరూపుడని భావము. కావుననే, పరమపావనుడవు. లోకరక్షణకై పద్మమువంటి ముఖముతో నీలమేఘశ్యామల కాంతితో రాముడై యవతరించితివి. సర్వప్రపంచమునకు ఆశ్రయుడవు ముందున్నవాడవు నీవే. నిన్నే స్మరించి భజించుచున్న నాపై, తనవాడనే యభిమానము నీకేల కలుగగూడదని రామపరత్వమును వర్ణించినారు.

రాముడై అవతరించి, రాజాధిపులచే వంశములనెడి సాగరమునకు చంద్రునివంటివాడవై, మహాతేజస్సులో విలసిల్లుచూ, సకలభూత జాలములను రాజాధిరాజవై పరిపాలించుచున్నావు. ఈ పరిపాలనా పద్ధతియందైననూ నన్నభిమానించుట న్యాయము. ఇట్లు తనను కాపాడవలసిన బాధ్యత రామునికే సర్వవిధములా కలదని నిరూపించుట స్వారస్యము.



## 440. అసావేరి – చాపు

**సమయము తెలిసి పుణ్యము లార్జించని**
**ధనికు డుండియేమి పోయ్యేమి ॥స॥**

**శమతతోడి ధర్మము జయమేగాని**
**క్రమముతో మనవిని వినవే ఓ! మనసా ॥స॥**

**సారమౌ కవితల విని వెర్రివాడు**
**సంతోషపడి యేమి పడకేమి**
**చేరదేసి గుడ్డికన్నులు బాగ**
**తెరచియేమి తెరవకున్ననేమి ॥స॥**

**తురకవీధిలో విప్రునికి పానకపూజ**
**నెరయచేసి యేమి చేయకుంటె నేమి**
**ధరలోన ధనకోట్లకు యజమానుడు**
**దయ్యమైతేనేమి లోభైతేనేమి ॥స॥**

**ఎదను శ్రీరామభక్తియులేని నరజన్మ**
**మెత్తియేమి మృగమైతేనేమి**
**పదము త్యాగరాజనుతునిపై గానిది**
**పాడియేమి యేడ్చితేనేమి ॥స॥**

లోకమందు సకల సంపదలు ధనాదులు తమ పూర్వజన్మ సుకృతముననను, దైవానుగ్రహము వలననూ కలుగును. కావుననే, ఈ జన్మలో వాటిని వినియోగించు తీరుతెన్నులు తెలియవలెను. వాటిని తిరిగి పుణ్యము నార్జించుటకే వినియోగించవలెను. అట్టి పుణ్యాతిశయముచే లోకము శాంతినందును. తన స్వార్థమునకే గాక ఈ పుణ్యము లోకమునకే సుఖశాంతులనిచ్చును. పాపద్రవ్యములు తాత్కాలిక భోగములకు కారణములైననూ, ఆ అనుభవించిన వారికి శాంతి నివ్వనేరవు.

ఇట్టి పుణ్యశీలికి ఉత్తర జన్మమందు భగవంతుని అనుగ్రహము అద్దాన ముక్తియు కలుగును. ఈ వివేకములేని ధనికుడీ ప్రపంచమున ఉన్ననేమి? పోయిననేమి? యని నిర్వేదముతో కటువుగా కూడ హెచ్చరించినారు. జన్మాంతర సుకృతముచే సంపన్నులైనవారికే పుణ్యకార్యములను చేయు బాధ్యత కలదు. దరిద్రులేమిచేతురు? ఈ చేయుటలో కూడ వారికి అంతరింద్రియ నిగ్రహముండవలెను. అట్టి శమములేక, చేయు పుణ్యకార్యములు కేవలదాంభికములగును. కావుననే "శమతతోడి ధర్మము జయమనినారు. ఇందుకు క్రమముగా లోకానుసారములైన సామెతలను చూపినారు.

మంచి భావపుష్టి లాలిత్యముకల కవిత్వమును వెర్రివాడు విని సంతసించియేమి? లేకున్ననేమి? గ్రుడ్డికన్నులు విశాలములయ్యును మూసియున్ననేమి? తెరచి ఏమి? అట్లే బ్రాహ్మణునికి వసంత పానకపూజ తురకవీధిలో చేయుట అపహాస్యమై దేహశుద్ధిని పొందకనేరదు. అట్టి పుణ్యకృత్యములు చేయుటకన్న మానుటయే శ్రేయము. కోట్లాది ధనవంతుడు కేవల లోభియగుటకంటె దయ్యమగుటయే మేలని సూటిగా చాటునట్లున్నది.

అట్లే, అపూర్వమైన సంగీతము నేర్చికూడ శ్రీరామునిపై ఇష్ట దైవములపైగాక లల్లాయి పదములు పాడుటకంటె, ఏడ్చుటయే మేలనుటచే అయ్యగారి చిత్తమందుగల నాదోపాసనయొక్క గౌరవమెంతో సూచితమగుచున్నది.

లోకము మెప్పుకైగాని, కేవల నరస్తుతికైగాని, సంగీతమును వాడరాదని సిద్ధాంతము. కావుననే, శృంగారపదగేయములందును, గోపాల గోవిందయను భగవన్నామములతో పాడుట సంప్రదాయము. ఇన్ని చెప్పి పర్యవసానమందు హృదయమందు ఏమాత్రమైనను, ఏ మూలముననైనను శ్రీరామభక్తిలేని మానవజన్మము, జంతువులవంటిదనియు చెప్పి, సర్వాత్మనా



తమకుగల, విద్య, కులము, ధనము, కళానైపుణ్యము, కవితాది వైశద్యము భగవంతునియందు పర్యవసానము కానిచో వ్యర్థములని నిరూపించినారు.

త్యాగరాజస్వామి సన్యాసము స్వీకరించికూడ శ్రీరామ గుణగానమందు విరతిలేక ఈ విధమైన వైరాగ్యపరములైన గేయములను కీర్తించినారని పరంపరగా ప్రతీతి కలదు.

## 441. కల్గడ - ఆది

**సమయము ఏమరకే మనసా** ॥స॥

**సుమతులౌ నరులనుచేరి నిజ**
**సుఖ మనుభవించుటకు నీ కిదే** ॥స॥

**అంతరంగమున కలుగు భయమున**
**ఆంతరిక భక్తిమార్గము తెలిసి**
**దాంత సంరక్షకుఁడైన శ్రీ**
**త్యాగరాజ సన్నుతుని జూడ** ॥స॥

ఓ మనసా! దుర్లభమైన మానవజన్మనంది విద్యావివేకములు కలిగియుండి, ఆర్తితో భగవంతుని కీర్తన స్మరణాదులతో సేవించి వాని అనుగ్రహమును పొందుటకిది మంచి సమయము. దీనిని మించిపోనీయక రాముని స్మరింపుము.

లోకమందు ఈ ఉత్తమబుద్ధిగల సజ్జనుల సాంగత్యమంది, పరస్పరం భగవత్కథా శ్రవణ కీర్తనాదులతో, నిజమైన ఆనందమందుట కిదే సమయము.

అంతరంగమందు, మన జన్మాంతర పుణ్యముచే, ఇప్పటికి, జన్మ, జరామృత్యు సంసారములవలని భయము తెలిసినది. ఇపుడే చిత్తమందు నైజముగా వివేకవంతులకు పరిపాకము కలుగును.

ఆవేదన కలిగినందుకు ఫలముగా, ఆంతరభక్తిభావన కలుగును. ఆంతరమనగా, రజస్తమోగుణ వికారములులేక శుద్ధ సత్త్వ వృత్తితో సర్వాశ్రయమైన భగవంతునియందు నిష్కామభక్తి యేర్పడును. దీనినే పరాభక్తియందురు. దీని ఫలముగా దాంతులై, అనగా ఇంద్రియ నిగ్రహాదులు కలిగి, శాంతచిత్తులై, సత్సంగ భాగ్యమందుదురు. అట్టివారిని రక్షించువాడు శ్రీరాముడు. కావున, ఇదే మంచి సమయమని తనచిత్తమును హెచ్చరించినారు.

వీరి మనసునందేదో యొక సమయమున, విలక్షణమైన పరిపాకము కలిగి, వెంటనే మనసును హెచ్చరించిన త్వర ఈ చిన్న గేయమందు వ్యక్తమగుచున్నది.

ఇట్టివే మహనీయుల పరిపాకములు.

## 442. కోకిలవరాళి - దేశాది

**సముఖాన నిల్వగల్గునా కమలానన ॥స॥**

**క్షమకల్గు భూతనయ లక్ష్మణా**
**ది మహాత్ములకేగాని అన్యులకు ॥స॥**

**కమలాసనాద్యమర దిక్పతులు**
**కలశవార్ధిలో జూడనేరక ॥స॥**

**గుమిగూడి మొరలిడ కార్యములు**
**కొనసాగెనట త్యాగరాజ వినుత ॥స॥**

శ్రీరాముని సముఖాన దివ్యసన్నిధిలో ఒక్కమాటైన నిలువవలెనని త్యాగరాజ స్వామివారికి అపూర్వమైన ఉత్సాహము కలిగి ఈ కీర్తనము పాడుకొన్నట్లున్నది. రామచంద్రా! నీ సన్నిధి భాగ్యమెపుడైన కల్గునా? నీ దివ్యముఖారవిందమును దర్శించవలెననియున్నది. కాని నా వంటివానికది



దుర్లభమేమోయనియు తోచెడిని. ఏమందువా? నీవెన్నంటి నీ సన్నిధి భాగ్యము భూపుత్రిగాన అంతటి ఓర్మిగల సీతకు, కేవల శేషాంశగల లక్ష్మణునికీ కలిగినదేగాని, అయోధ్యలో ఎందరాప్తులున్నను, వారికిన్నీ ఏకాంతమందు నీ సన్నిధి భాగ్యము లభింపలేదు.

మరొక విశేషమేమనగా:-కమలాసనుడు బ్రహ్మ మొదలైన ఇంద్రాది దిక్పతులెల్లరు ఏకగ్రీవముగా గుమిగూడి నీ తొల్లింటి నివాసమైన క్షీరసాగరమునకే నీ దర్శనార్థులై వచ్చియుండిరిగదా! వారైనను నీ తొల్లింటి రూపమునైన దర్శింపరైరి. వారేదో మొరబెట్టుకొనగా, ఆకాశవాణితో వారిని సమాధానించి, తర్వాత వారి కార్యములన్నీ కొనసాగించితివి. రాముడుగా అవతరించిన పిదప భూలోకమందు నీ సముఖాన నిల్వగల అవకాశమే వారికిన్నీ దూరమైనది. అనగా :- ఎందరెందరో శ్రీరాముని చూచియున్ననూ, తనవలె హృదయము నర్పించి శ్రీరామ సన్నిధియొక్క విశిష్టతను భావించిన వారెవ్వరూలేరు. అంతటి ఆంతర్యము సీతా లక్ష్మణులకే కలిగినది. ఆ ఆనందము తనకూ కలిగిన యెంతో బాగుండునని త్యాగరాజస్వామివారి గంభీరభావము. ఈ ఆంతర్యము బ్రహ్మేంద్రాదులకు సైతము దుర్లభము.

ఇట్లు భావించుట భక్తియొక్క పరాకాష్ఠను సూచించును.

సీతా లక్ష్మణులు శ్రీరాముని సమ్ముఖమున ఏకాంతమందెట్టి మధురానుభూతులనందిరో వాల్మీకి రామాయణమందు అనేక వివరములు కలవు.

## 443. జనరంజని - దేశాది

**స్మరణే సుఖము (శ్రీ) రామనామ**
**నరుడై పుట్టినందుకు రామనామ ॥స్మ॥**

**వరరాజ యోగనిష్ఠులౌ**
**వారి కానంద మందేటట్టు ॥స్మ॥**

**రామనామ శ్రవణమువల్ల**
**నామరూపమె హృదయంబు నిండి**
**ప్రేపపుట్ట సేయగ లేదా ని**
**ష్కామ త్యాగరాజుసేయు నామ ॥స్మ॥**

ప్రపంచమందు మనుష్యుడై పుట్టినందుకు శ్రీరామనామమును స్మరించుటయే పరమ సుఖమనియు స్మరణము సిద్ధఫలమనియు కీర్తించినారు. రాజయోగనిష్ఠులు నిరంతరము అంతర్బాహ్యములందు శ్రీరామతారకనామ స్మరణముచే బ్రహ్మానందమొందుట అనుభవసిద్ధము.

రామనామశ్రవణముచే శ్రీరాముని దివ్యరూపము హృదయమంతటను నిండి రామునియందు అనన్యమైన ప్రేమను పుట్టించును. అపుడుచిత్త మేకాగ్రమగును. అపుడు రాముని తాత్త్వికరూపము తన కభిన్నముగా సాక్షాత్కారమగును. దానినే బ్రహ్మానందమని శ్రుతులు ప్రమాణీకరించినవి.

అదియే పరమసుఖము. అందుకు రామతారక నామస్మరణము సాక్షాత్సాధనమని ఉపదేశము.

## 444. కాపీనారాయణి – దేశాది

**సరససామదాన భేద దండ చతుర**
**సాటి దైవమెవరె బ్రోవవే ॥స॥**

**పరమ శాంభవాగ్రేసరుండగుచు**
**పల్కు రావణుడు తెలియలేకపోయె ॥స॥**

**హితవుమాట లెంతో బాగ బల్కితివి**
**సతముగా నయోధ్య నిచ్చేనంటివి**
**నత సహోదరుని రాజు చేసిరాక**
**హతము చేసితివి త్యాగరాజనుత ॥స॥**



రాముడు సత్యపరాక్రముడు. సమయమెరిగి ధర్మవృత్తితో సామ, దాన, భేదదండోపాయములని శాస్త్రప్రసిద్ధిగల ఉపాయములను శత్రువులందు ప్రయోగించి, కేవల ఖడ్గవాదముతోగాక, సమ రసభావముతో మెలగునట్టి ధర్మవీరుడు. అంతమాత్రమేగాక, తన బాణముచే హతులైన శత్రువులకు సైతము తన సాయుజ్యపదవి ననుగ్రహించునట్టి దైవము. వానికి సాటి ఎవరున్నారని దైవ మానుష భావములతో రాముని న్యాయకౌశలమునిందు కీర్తించినారు. రాముడు సర్వరక్షకుడగుటవలననే తనను బ్రోవమని సారాంశము.

రామావతారమునకు పరమ ప్రయోజనము రావణసంహారము. రావణుడు నిత్యమూ నవకోటి శివలింగార్చనము చేయు పరమ శాంభవాగ్రేసరుడు. పరమ శివభక్తుడు. శివునికి రాముడన్నను, రామనామమన్నను అత్యంత ప్రీతికలదు. కాని శివభక్తుడయ్యును రాజస తామస ప్రవృత్తిచే రావణుడు శ్రీరామమహిమను తెలియలేకపోయినాడని ఆశ్చర్యము.

అట్లని సర్వభూతములకు అభయప్రదానముచేయు శరణాగత వత్సలమైన దైవము రాముడు. న్యాయముగా, సామ దాన, భేదములను ముందు సూచించినను రావణుడు గుర్తింపడయ్యె, అందు వరుసగా, అంగదాదుల రాయబారముతో, సామవచనములను, అయోధ్యను సైతమిత్తునని దాన వచనములను, రావణుని తమ్ముడై తనకు నతుడైన విభీషనుని తన పక్షమున చేర్చుకొనుటయేగాక, లంకారాజ్యమునకు రాజుగా సముద్రోదకముచే పట్టాభిషేక మొనర్చినను, రావణునికి రాముని ధర్మనిరతి తెలియలేదయ్యె, ఇక వేరే మార్గములేక రామా! రావణుని హతమార్చితివి. ముందు లంకలో సీత ఎంత ఓర్పు వహించినా, నీవెంతగా చతురోపాయములను చూపినను ఫలితము లేకపోయినది. అని వివరించి

మానుషభావమందు ధర్మమూర్తిగా, వాత్సల్యము చూపుటలో అమానుషమైన దైవముగా స్తుతించినారు.

## 445. ముఖారి - దేశాది

సరసీరుహానన రామ-సమయము బ్రోవ చిద్ఘన ॥స॥

పరభామల నర్చించి యన్నమిడి
పగలు రేయి సరసమాడు వారి నొల్ల ॥స॥

బ్రాహ్మణీకము బాయ నీచుల
బ్రతుకాయె నదిగాక యీ కలిలో
బ్రాహ్మమైన మాటలు నేర్చుకొని
బరగేరయ్యా త్యాగరాజనుత ॥స॥

ఇందు రాముని రక్షణకోరుటకు ఇదే సమయమని దేశకాలపాత్రల యొక్క వైపరీత్యమును సూచించినారు. పరభామలు= తాము వివాహము చేసికొన్ననూ, తమ తల్లులు తోబుట్టువులరీత్యా కట్టుకొన్న ఇల్లాండ్రు పరభామలే యగుదురు. రేయింబవలు తమ ఇల్లాండ్రనే, ధన కనక వస్త్రాలంకారములతో నిత్యమూ అర్చింపుచూ, రాత్రింబవళ్లు స్త్రీలతో కాలము గడుపుచు, తమ తల్లులు, ఆడపడుచులపట్ల మర్యాదనైన చూపక స్త్రైణులైనవారని భావము. కాక, తమ గృహిణులున్నను, ఇతర స్త్రీలను ఆపించి, ధనద్రవ్యాదులచే పరకాంతనే పూజించునట్టివారు మరీ హీనులు. ఈ రెండు వర్గములవారి చెలిమి, సాంగత్యముకూడ మిక్కిలి ప్రమాదకరములు. మహాకలి విప్లవము. ఇంతకన్న విశేషమేమనగా ఈ కలిలో బ్రాహ్మణీక మడుగంటినది. బ్రాహ్మణులు జాతిమాత్రోపజీవుల గుటయు, బ్రాహ్మణేతరులు బాహాటముగా బ్రాహ్మణ ధర్మమును, బ్రాహ్మణుల పవిత్రాదర్శములను నిందించుటచే రెండు వర్గములవారు హీనులగుచున్నారు.



బ్రాహ్మణులుకూడ బ్రాహ్మణ ధర్మమందు గౌరవములేనివారగుచున్నారు. కావున, పరస్పరం నీచజీవనులగుచున్నారు. పోనీ ఎప్పటికైననూ ఏ ఒక వర్గమువారైనను పశ్చాత్తాపమంది తమ లోపమును గుర్తింతురేమో! అని తలచితే, వారి వారి గొప్పతనమును చాటుకొనుటకు ఉభయులు బ్రాహ్మ్యమైన మాటలు= తాత్త్వికములు శాస్త్ర సిద్ధాంతములగు పెద్ద మాటలు పల్కుచూ తాత్కాలికముగా తమ తమ గొప్పలను అహంకారములతో చాటుకొనుచూ **"కలౌ వేదాంతినస్సర్వే"** అను రీతిగా అందరు ఆకాశమంటునట్లు తామే ఉత్తములమని చెప్పుకొనుచున్నారు. ఇంతటి వాతావరణమున క్లేశమందుచున్నాను. ఈ సంధి సమయమందే రామా! తప్పక కాపాడుమని వేడుకొనుట ఎంతో సహజమై యున్నది. ఇందొకరిని నిందించవలెననికాక తన ఆర్తిని తెల్పుకొనుటయే ముఖ్య తాత్పర్యము.

## 446. బిలహరి - చాపు

సరసీరుహనయన నీ కటాక్షమే చాలు సజ్జన జీవన ॥స॥

మీనమర్భకుల కామించి కన్నట్లు
దానమీ లంకను దయ జూచినట్లు ॥స॥

సాధుసంగతి నేను సల్పినయట్ల
మాధుర్య భోజన మటు చేసినట్లు ॥స॥

ధన కనకములెల్ల దగిలిన యట్లు
దినము దురాసలు దీరినయట్ల ॥స॥

సింహాసనమున చెలగినయట్ల
బ్రహ్మేంద్ర పట్టానుభవ మందినయట్ల ॥స॥

నాలుగొక్క పది భువన మేలనట్ల
కలుగు కులములెల్ల కడతేరినట్ల ॥స॥

**రాజీవ భవనుత రమణీయ చరిత**
**రాజిల్లు శ్రీత్యాగరాజ వినుత** ॥స॥

ఇందు శ్రీరాముని దివ్యకటాక్ష మహిమను కీర్తించినారు. రాముని నయనములు పద్మములవంటివనుటలో సూర్యప్రకాశముతో అనుబంధ మును సూచించినారు. రాముడు సూర్యవంశీయుడేగాక, సూర్యతేజస్సున కున్నూ ప్రకాశమొసంగు పరమాత్ముడు. అతని ఈ క్షణమే లోకసృష్టికి కారణము.

**"స ఈక్షత లోకాన్ను సృజా ఇతి"** అని శ్రుతి. అదియే సజ్జనులకు జీవనము. రామా! నీ కటాక్షమే చాలుననుటవలన మా సర్వసౌఖ్యములతో పూర్ణులమగుదుమని భావము; ఆ కటాక్ష వైభవముయొక్క ఆదర్శములను క్రమముగా వర్ణించినారు.

"మీనమర్భకుల కామించి కన్నట్లు" అనగా మీనములు సంతానమును ప్రసవించి ఆ పసి కూనలను పోషించుటకు ఏ విధమైన పరికరములు లేనివగుటచే, నీటిలో నాల్గు బారలు.....వెళ్లి అమిత ప్రేమతో వెనుదిరిగి ఆ పసిపిల్లలను చూచునట. వాటి చూపులలో నేదో అమృతాహారమున్నటుల స్పష్టము. కేవల అల్పజీవమైన మీనముల నేత్రము లందే ఇంతటి జీవమును ప్రసాదించిన భగవంతుడు, తన కటాక్షముచే అనుగ్రహించని భాగ్యమేముండును? కావున, రాముని కటాక్షమును అర్థించినారు. మరియు, కేవల ఆసురసంపదచే మలికితమైన లంకారాజ్యము, రావణ వధానంతరము, రామకటాక్షముచే సకల సౌభాగ్య సంపన్నమైనది. ఆ లంకను విభీషణునికి దానమిచ్చి పరమ మంగళ కరముగా కలకలలాడు నట్లొనర్చెననుట ఎంతో స్వారస్యము. ఇంకను అనేక తీరులుగా రామకటాక్ష ఫలమును వర్ణించుచూ, సాధు సాంగత్య మబ్బినట్లు, అన్నాతురుడైన వానికి మధురభోజనము లభించినట్లు, దరిద్రునకప్రయత్నముగ ధన కనకాదులు దొరికినట్లు, ఎంత



దురాశలైనను నెరవేరునట్లు, సింహాసనాధిపత్యము, పదునాల్గు భువనముల కాధిపత్య మబ్బినంత ఆనందము దైవ కటాక్షముచేతనే లభించునని తీర్మానించినారు. కావున శ్రీరామ కటాక్షమే భక్తులకు సర్వస్వమని సిద్ధాంతము.

## 447. శంకరాభరణం - ఆది

**స్వరరాగ సుధారసయుత భక్తి**
**స్వర్గాపవర్గమురా ఓ! మనసా** ॥స్వ॥

**పరమానందమనే కమలముపై**
**బక భేకములు చెల గేమి మనసా** ॥స్వ॥

**మూలాధార జనాదమెరుగుటే**
**ముదమగు మోక్షమురా**

**కోలాహల స ప్తస్వర గృహముల**
**గురుతే మోక్షమురా ఓ! మనసా** ॥స్వ॥

**మద్దెల తాళగతులు తెలియక నె**
**మర్దించుట సుఖమా**
**శుద్ధమనసు లేక భజనచేయుట**
**సూకర వృత్తిరా ఓ! మనసా** ॥స్వ॥

**బహు జన్మములకు పైని జ్ఞానియై**
**బరగుట మోక్షమురా**
**సహజ భక్తితో రాగజ్ఞాన**
**సహితుడు ముక్తుడు రా ఓమనసా** ॥స్వ॥

**రజత గిరీశుడు నగజకు దెల్పుస్వ**
**రార్ణవ మర్మములు**

**విజయము గల త్యాగరాజు డెరుగే**
**విశ్వసించి దెలుసుకో మనసా ॥స్వ॥**

సంగీతశాస్త్ర మర్యాదతో, ఉత్తమభక్తియోగమును మేళవించి, పరమేశ్వరుని సంకీర్తనము చేయుటచే, సర్వవిక్షేపములు బంధములు తొలగి మోక్షానందముతో సరూపమైన బ్రహ్మానందానుభవము కల్గునని నాదయోగుల స్వానుభవము.

స్వర రాగములు మధురమైన అమృతము వంటివి. భక్తి స్వరూప జ్ఞానమే, కేవల ఆత్మజ్ఞానము. ముక్తికి సాక్షాత్సాధనము. ఆ జ్ఞానము స్వర రాగ సుధా రసముతో కుదురుకొని, అడుగడ్గునకునూ, ఆనందమిచ్చును.

త్యాగరాజస్వామి సంగీతసహిత సద్భక్తి మోక్షస్వరూపమనుటకు ప్రమాణములను నిరూపించినారు.

"మూలాధారజ నాదమెరుఁగుట, సప్తస్వర గృహముల గురుతు" తెలియుట మోక్షమునకు సాక్షాత్సాధనములట. మూలాధార చక్రమందు (అధోకుండలిని) **"పరా"** అను పేరుతో నాదము దైవికముగా సహజమై యుండునని యోగుల అనుభవము. ఆ దివ్యనాదము ప్రాణానల సంయోగముచే సప్తస్వర రూపమందును. ఇట్టి సప్తస్వర గృహముల గురుతే ప్రణవనాదము. ఆ ప్రణవమందు చిత్త మేకాగ్రత చెందినపుడు స్వస్వరూపజ్ఞాన మేర్పడును.

అదియే ముక్తియని సిద్ధాంతము. ఇందుకు సత్త్వశుద్ధిగల అంతః కరణము కేంద్రము. ఆ అంతరంగమునే మానస సరోవరమందురు. అట్టి సరోవరమందు సర్వాధారమైన కమలము వికసించియున్నపుడు, ఆ హృత్పుండరీకమందు, పరమేశ్వరుని వేంచేపుచేసి, మద్దెలతాళగతులతో, శుద్ధచిత్తముతో, మూలాధారజనాద సూత్రముతో, రాగభావములతో భగవంతుని, నామగుణ కీర్తనము చేయు యోగికి ముక్తి కరతలామలకము.



అట్లుగాక, అపస్వర లయలతో, పరమానందమనే హృదయ కమలముపై, బకములు-కొంగలు భేకములు కప్పలు ఎగిరి గంతులువేయుచో, ఆ చిత్తకమలము చీలికలై, రసాభాసమునందును. అది సూకరవృత్తియని నిందించినారు.

మరియు **"బహూనాం జన్మనాం అంతే జ్ఞానవాన్మాం ప్రపద్యతే"** (గీత) అనేక జన్మల సుకృతఫలముగా ఎప్పటికో జ్ఞానియైనన్ను పొందును. అంతకన్న సహజ భక్తితో పై వివరించిన తీరుగా రాగజ్ఞాన సహితుఁడైన నాదయోగి ముక్తుడు. ఈ ఉన్నత రహస్యమును రజతగిరీశుడు=శివుడు పార్వతికి ఉపదేశించెనట. ఆ ఉపదేశమే "స్వరార్ణవ" మను గ్రంథముగా ప్రసిద్ధినందెనట. త్యాగరాజస్వామికి శ్రీరామతారక మంత్రము నుపదేశించిన శ్రీరామకృష్ణానంద యతి నారదోపాసననుకూడ తెల్పినట్లును, ఆ యుపాసనచే నారదుడే యతిరూపమున వచ్చి "స్వరార్ణవగ్రంథమును త్యాగరాజ స్వామి కిచ్చినట్లును, తదాది ఆయ్యగారికి సంగీత మర్మములు తెలిసినట్లును, పరం పరగా చెప్పుకొందురు.

ఆ విషయమునే "రజతగిరీశుడు" అనే చరణమందు వివరించినారు.

ఇందు సంగీతశాస్త్ర రహస్యములనేగాక, యోగసాధనా సంపదను కూడ వివరించి, స్వరరాగ సుధారసభక్తి, సాధనాంతరముల యపేక్షలేక ముక్తికి సాక్షాత్సాధనమని ఆదేశించినారు.

## 448. భిన్నషడ్జము - దేశాది

**సరివారిలోన చౌక చాలదాయెనా ॥స॥**

**పొరుగిండ్ల వారలచేతి-పూజ జూచి చల్ల నాయెనా ॥స॥**

**తారుమారుగా బల్కు వారలు**
**తత్తరించగాఁ జూడ న్యాయమా**

**పారమార్థికుల దుఃఖజాలములు**
**బాపలేదా శ్రీత్యాగ రాజనుత ॥స॥**

పరిపాకమందిన భక్తుల చిత్తములు భగవంతునిఁగూర్చి పరిపరి విధముల భావించును. వారే మన్నను, ఆ మాటలలో ఎంతో చనవు, ఆప్యాయత గోచరించును. లోక సాధారణములైన వారి మాటలలో ఏదో విలక్షణమైన భావము సహృదయులకు అనుభవ వేద్యము. చూడుడు:–ఇందు తనకు సరివారలలో చిన్నతనము కలిగినట్లు ఆరోపించుకొని రామునితో ముచ్చటించుకొనుట ఎంతో సహజముగానున్నది. రామా! నా సరివారందరు, తమతమ విద్యా ధనాగార సంసారములతో, నీ చింత లేకున్ననూ, ఎంతో సుఖముగా హాయిగానున్నట్లు తలంచుకొని, నా సంసారము, నా వ్యక్తిత్వమును చూచి చౌక= చులకన చేయుచున్నారు. ఈత డేదో రామభక్తి యని, భజనయని, తన స్వవిషయమందు జాగ్రత్తలేనివాడని హేళన చేయుచున్నారు. అయినను ఇంతవరకును సహించితిని; లోకులు తారుమారు మాటలనుచు, నన్ను తమవలె నుండుమని తత్తరించుచున్నారు.

ఇక నీ కథ ఆలోచించితే, నిజమైన పారమార్థికులను, వారు కోరుటతో నిమిత్తములేకనే నీవే బాధ్యత వహించి వారి యోగక్షేమములను వహించుచునే యున్నావు. ఇందుకెన్నో ఆదర్శములు కలవు. అది తెలిసియే, నేను నీవాడననీ, నిన్నే శరణంది నీ యాంతర్యమునే కోరుచున్నాను. కాని, నన్ను కనీసము సమానులలో ఉత్తమ శ్లోకునిగానైనా నా అనుగ్రహించుట న్యాయమేగదా!

పొరుగింట్ల పుల్లకూర రుచి యన్నట్లు, నిన్నేదో కామించి, పూజించువారి పూజలంది, వారి కోర్కెలను తీర్చిన ఉదంతములున్నూ కలవు; నేనట్లుగాక, నా సర్వస్వమును నీకే యర్పించి సేవించునాపై, ఆంతర్యమును వాత్సల్యమును చూపకున్నావు. ఇంకను నన్ను పరీక్షించుచున్నావేమో! యని ఎంతో నైజమైన భావముతో రాముని వేడుకొనుట అపూర్వముగా అలంకారికముగా నున్నది.



## 449. శ్రీరంజని – దేశాది

**సరియెవ్వరే శ్రీజానకి నీ ॥స॥**

**పరమాత్మునికై గడిదేరి సదా**
**సిరు లిచ్చుటకు చేరి గొలిచిన నీ ॥స॥**

**వనమందు భయంకరమైన తా**
**వున నిల్తునని మనసు దెలిసి**
**కనకాంగి యందందున రాజసుఖం**
**బును కల్గజేసితివె త్యాగరాజనుతే ॥స॥**

శ్రీమద్రామాయణము కేవల రామచరిత్ర మాత్రమేగాక **"సీతా యాశ్చరితం మహత్"** (సీతా చరిత్ర మనియు), సీతయొక్క ప్రత్యేక పురుషకారమును వాల్మీకి నిరూపించినారు. సీతా అమ్మవారి జననము మొదలు, రావణ సంహారము వరకును రామాయణమందు సీతయొక్క ప్రత్యేక వ్యక్తిత్వము స్పష్టమయ్యే యున్నది; ఉపాసనా సంప్రదాయంలో కూడా మాయా నివృత్తికై జగన్మాతయైన పరదేవతను ఉపాసించుట మంత్రశాస్త్ర పద్ధతియైయున్నది. ఈ రీతిలో త్యాగరాజస్వామి సీతాదేవిఁగూర్చి ప్రత్యేకముగా సంకీర్తనము చేయుచూ, అమ్మా! జానకీ! నీ సరి ఎవ్వరని, ఆమె ఉన్నత వైభవాదర్శములను ఇందు వర్ణించినారు.

ధర్మరక్షణకై రాముడుగా అవతరించిన పరమాత్మ స్వయం ప్రవృత్తి లేనివాడు. కేవల దశరథకుమారుడుగా, రాజమాత్రుడుగా నున్నంత మాత్రమున వారి అవతార కృత్యములు నెరవేరునవిగావు. దశరథుని భౌతికరాజ్య సంపద భగవంతుని విశాలాశయమునకు, ధర్మరక్షణ–శత్రు సంహారములకు సరిపోవునదిగాదు. కేవల పరదేవత సాక్షాన్మహాలక్ష్మి, జనకునింట అయోని సంభూతురాలై, శివధనుర్భంగ, పరశురామ దిగ్విజయా దులందు రామునికి బలము చేకూర్చినది. తాను గడిదేరి అనగా ప్రత్యేక

వ్యక్తిత్వమంది పురుషకారముతో రామునికి సిరులిచ్చినదనుట ఎంతో జాతీయము.

అన్నిటికన్న విశేషమేమనగా:– పదునాల్గు సంవత్సరముల అరణ్యవాసమునకు రాముడే వెడలుటకు రాజకుటుంబము, ప్రజలు సహించలేక అల్లాడిరి. అంతటి భయంకరమైన అరణ్యవాసమునకు, ఎందరెన్ని విధముల వారించిననూ, "నీవు అబలవు నావెంట రావలదని" రాముడే చెప్పినను, మహాసాధ్వి సీత, ఇందరిని ఎదిరించి, **"భర్తుర్భాగ్యంతు భార్యైకా"** యని. తన సతీత్వ ధర్మమును, నిలబెట్టుకొను వ్యాజమున, రాముని వెన్నంటి అరణ్యమునే స్వర్గాతిశయమైన రాజ్య భోగముతో, కనకాంగి సువర్ణలక్ష్మియై రామునికి ఎంతో సుఖమును, ఆత్మానందమును కలిగించుటయేగాక, రావణ సంహారరూపమైన అవతార ప్రయోజనమునకును సీతయే సారధ్య మొనరించినదిగదా! కావున సాక్షా త్పరదేవతగా, భావించుట ఎంతో యుక్త మైన భావము.

## 450. తీవ్ర వాహిని – దేశాది

**సరి జేసి వేడుక జూచేది–సాకేతరామ న్యాయమా ॥స॥**

**ధరలోన నీ నిజదాసులను**
**దర్పకాదుల పరివారులను ॥స॥**

**కొక్క శాస్త్రవిదుల నర సన్నుతిచే**
**గొప్ప బహుమతుల సందేరయ్య**
**చక్కగాను భక్తి శాస్త్రవిదులు**
**చాలరని నవ్వేరు త్యాగరాజవినుత ॥స॥**

ప్రపంచమందు దైవసంపద–ఆసుర సంపదలు అని రెండు విధములు. దైవ మందు రమించువారు దైవీ సంపన్నులు; అసుషు=ప్రాణములందు (అనగా) ఇంద్రియములందు రమంతే ఇతి=రమించువారుగాన అసురులు అను వ్యుత్పత్తి ద్వారా కాముకులు ఆసుర సంపదగలవారు.



భగవంతుడు దైవీ సంపదయందు–ఆదరము, ఆసుర సంపదయందు ఉపేక్ష కలిగియుండుట న్యాయము. సాకేత రాముడు ధర్మమూర్తి కావున ఆతని పరిపాలనము న్యాయసమ్మతమై యుండవలెను. కాని, సాకేతరామా! నీవు శిష్టులను–దుష్టులను సరిచేసి, వీరు పరస్పరం హేళన చేసుకొనగా, ఇదొక వేడుకగా భావించుచున్నావు.

ఇట్లు వేడుకచూచుట నీకు న్యాయమా! యని వివరమును చరణమందు చూపు చున్నారు. ప్రకృతం, నీ నిజదాసులను, దర్పకాదులు=కాముకులగు నీ పరివారులను సమానముగా ఆదరించునట్లు కన్పించుచున్నది. ఇది న్యాయముగాదు. నీ ప్రభుత్వ కాలమందెట్లున్నదోకాని, మా సమకాలంలో ప్రభువుల ఆస్థానములందు, విద్యావంతులు కళాచతురులు అయినవారే, కేవల కాముకులై కొక్కోక శాస్త్రమందు, కామ తంత్రములందును ప్రవీణులై రాజాదరణముతో, తమ సంగీత సాహిత్య కళా వైదుష్యముతో గొప్ప సత్కారములను ఉన్నత బిరుదములను పొందుచున్నారు.

ఇట్లే పరివారులు–రాజసేవకులు, ఉన్నతోద్యోగులు గౌరవములను పొందుచున్నారు. వారట్టి బహుమతులను, గౌరవములను పొందుటలో మాకేమీ చింతలేదుగాని, అంత కన్న మిన్నగా మరొక ఉపద్రవ మేర్పడినది. "భక్తి శాస్త్రవిదులు(మాకు) చాలరని నవ్వేరు" ఇది పరమార్థమునకు, లోకక్షేమమునకు గొడ్డలి పెట్టువంటి ద్రోహము.

ఇందుకు మా సమకాలీనులైన ప్రభువులును, ప్రజానుమతమను సాకుతో ఉదాసీనులగుచున్నారు. రారాజుల కెల్ల రాజైనవాడు రాముడేయని నమ్మికగల మేము నీకు మొరబెట్టుకొనుచున్నాము. భగవంతుడవైన నీవు రాజధర్మమును, పరిపాలనా వ్యవస్థను చక్కదిద్దవలసిన బాధ్యతకలవాడవు. అట్లుండి, నీవే వేడుక చూచుట న్యాయముగాదు. అని త్యాగరాజస్వామి తమ కాలమునకే, రాజ మర్యాదలు, సమాజ మర్యాదలు తారుమారగుట

సహించలేక, ఈ అన్యాయమును సవరింపుమని రాముని వేడుకొనుట ఎంతో సముచితము.

## 451. నాగనందిని – ఆది

**సత్తలేని దినములు వచ్చెనా ॥స॥**

**సత్తమాత్రమా సచ్చిత్తశాయి**
**సాకేత నిలయా దైవ ॥స॥**

**కలిలోన ప్రథమ పాదములో**
**తలిదండ్రి గురుభక్తియు లేక**
**పలుమారు దుష్కృత్యం బొనర్ప**
**వలెనా త్యాగరాజనుత దైవ ॥స॥**

మానవుని సత్త–సామర్థ్యముకన్న దైవసత్తయే ప్రధానమైనది. మానవునిలో నున్న బుద్ధీంద్రియ మనః ప్రాణములకు, ఆ యా దేవతారూపమున దైవమే సత్త నిచ్చుచున్నాడు. మనకు కనులు బాగుగానున్నను. సూర్యచంద్రులు, అగ్ని తేజస్సులతో అనుబంధములేనిదే ఏ వస్తువునూ చూడలేము. అట్లే సర్వేంద్రియ కృత్యములకు, దైవము దైవ పరివారులు "సత్తను" అనుగ్రహించుచున్నారు. ఇది ఆ స్తికుల సిద్ధాంతము.

ఈ కీర్తనమందు త్యాగరాజస్వామి కలి కాలముయొక్క దోషములను తెల్పుచూ ఈ కాలములో దైవసత్తలేని అనగా సర్వమునకు దైవమే ఆశ్రయమనెడి ఉన్నత భావములేని దినములు వచ్చినవని వాపోవుచున్నారు.

సత్త మాత్రమా! అనుటలో సత్–చిత్–ఆనందము పరమాత్మ స్వరూప లక్షణములు. అందు "సత్" అనగా సత్త అనే ధర్మం పరమాత్మ స్వరూపము.

పరమాత్మ సత్తవల్లనే సర్వ ప్రపంచము నిలిచియున్నది. ఆపై సచ్చిత్తశాయీ! అనే పిలుపు ఉపనిషత్సారభూతము. సత్+చిత్=సచ్చిత్+త= సచ్చిత్తయని పదము. అనగా మన చిత్తమందు "చిత్" జ్ఞానమున్నది. అందలి తకారమునకు విషయ ప్రపంచమని అర్థము. **"చిత్తం చిదితి జానీయాత్ తకార రహితం యధా" (శంకరులు).**



తకారం అనే విషయవాసన లేనపుడు చిత్తము చిద్రూపమేయని భావము. అట్టి చిత్తమందు యోగనిద్రతో శయనించువాడు పరమాత్ముడు. ఆనంద స్వరూపుడు. కావున, సత్త మాత్రుడేగాక, చిద్రూపుడనియు, శాయీ అనుటవలన అనందరూపు డున్నూ కాగా, రాముడు సచ్చిదానంద స్వరూపుడని తేలినది. ఈ సచ్చిదానందములనే, కేవల నామరూపములతో చేర్చి, ఈ దృశ్య ప్రపంచమును మనము భగవంతుని కన్న వేరుగా చూచు చున్నాము.

వివేకులు, పరమార్థ విచారణపరులు అట్లుగాక, సర్వ ప్రపంచమును భగవ ద్రూపముగా దర్శింతురు. కావున, మనుష్యులు ఈ వివేకము కలిగియుండవలెను. ఈ జ్ఞానము లేనివారిని ద్విపాద పశువులని శాస్త్రము నిందించినది. కావున, ఈ కలిలో పై వివరించిన సత్త బొత్తుగా లోపించినదని అయ్యగారి పరివేదనము. పోనీ క్రమంగా, ఈ వివేకము కలుగగూడదా? యన్నచో, కలియుగ ప్రథమ పాదంలోనే, తమ జన్మకారకులైన తలిదండ్రులయందు, ఆపై వివేక విజ్ఞానములనిచ్చు గురువులందు భక్తిలేకపోగా, నిత్యము దుష్కృత్యములు కూడా చేయువారికి వివేక మెట్లు కలుగును? అని విమర్శించినారు.

ఇక ఏవిధముగా చూచినా కలియుగ ప్రభావం ఎవరికీ తప్పించుకొనే వీలు లేనపుడు, ఈ విమర్శకూడ అనవసరమే యగుచున్నది గదా! యని కొందరనుట కలదు. కాని **"కలిం సభాజయంత్యార్యాః"** కొందరు పెద్దలు కలిని గౌరవింతురట. కారణమేమనగా **"కలౌ ఖలు భవిష్యంతి నారాయణ పరాయణాః"** ఈ కలిలోనే నారాయణ పరాయణులు, భాగవతో త్తములు,

మహాభక్తులు, శ్రీశంకర రామానుజాది మత ప్రవక్తలు ఎందరో మహానుభావులు పుట్టి, తాము తరించి సత్కథా ప్రసంగములతో, భగవన్నామ సంకీర్తనా ప్రాయములైన నామ యజ్ఞములతో లోకము నుద్ధరించినట్లు చరిత్రలు ప్రసిద్ధములై యున్నవి. పురందర, రామదాస, తులసీదాస, నారాయణతీర్థ, జయదేవ, త్యాగరాజాదులు మనకెంతో సన్నిహితులు. కావున కృత త్రేతాది యుగములకన్న కలియొక్క మహిమయే గొప్పదిగా తెలియుచున్నది. కావున కలి దోషములను మనము దగ్గరకు రానీయక, భగవన్నామ కీర్తనా స్మరణాదులచే, రాముని అనుగ్రహము పొందవలెనేగాని, కలి ఎటూ దోషములుకలదే కావున, అనివార్యమనరాదు. కలి దోషము లంటనీయక, తాను సత్సాధనలతో భగవంతుని సేవించవలెనను మహోపదేశము పరోక్షముగా ఈ కీర్తనమందు కలదు. **"కలౌ సంకీర్త్య కేశవం"** అను సూక్తివలన వివేకి, నిరంతర శ్రీహరి కథా శ్రవణ కీర్తనా స్మరణాదులవలన, దైవసత్త నందగలడు కావున, కలి దోషములను నిగ్రహించి మనుజుడు వివేకి కావలెనని బోధించుటయే ఈ కీర్తనయొక్క పరమ తాత్పర్యము.

## 452. భైరవి - ఆది

**సర్వాంతర్యామి నీవనే-సామ్రాజ్యము నిజమే రామ ॥స॥**

**నిర్వాహము లేని ఈ జనులఁగని**
**నిర్మలాత్మ లెటు సైరించిరో గాని ॥స॥**

**దారి తెలియ లేరు కొందరు**
**దరిద్రులైనారు సుదురహం**
**కారులై పరమనికృష్ట మతాచారులైనారు**
**జారులైనా రదిగాక తారు**
**మారుపనులఁ జేసేరు సం**



**సారులైనారు త్యాగరాజ**
**స్వాంతసదన కపటమేమో తెలియ ॥స॥**

**"ఈశ్వర స్సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి, క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి సర్వక్షేత్రేషు భారత"** ఇత్యాది భగవద్గీతా వచనములు పరమాత్మ "సర్వాంతర్యామి" యని ప్రమాణీకరించుచున్నవి. అతీంద్రియమైన ఆత్మస్వరూపమును తెలుసుకొనుటకు శాస్త్రమే ప్రమాణము. **"జన్మాద్యస్యయతః"** అను బ్రహ్మసూత్రము మన ఎదుట కన్పించే జగత్తు సర్వాధిష్ఠానమైన పరమాత్మవల్లనే సృష్టి స్థితి లయముల నందు చున్నట్లు, ప్రత్యక్ష ప్రమాణ బలముచే హేతువాదమున్నూ ఋజువుచేయుచున్నది. కావున ఈ ప్రపంచమంతయు ఆత్మ సామ్రాజ్యమనుటలో సందేహములేదు. ఇది మనుష్యుని కుండదగిన ఉపజ్ఞ-ఇట్టి నిర్వాహములేని జనులు అనేకవిధములుగా భ్రాంతులై, తమ జీవితములను దుఃఖమయములుగా చేసుకొనుచున్నారు. వారి కపటము వ్యవహారకాలమందు వారికి బాధాకరము కాకున్ననూ, నిర్మలాత్ములైన వివేకులు విజ్ఞులు వీరి అజ్ఞానము నెట్లు సహించిరో! ఆశ్చర్యము. పోనీ ఈ అజ్ఞులకు విజ్ఞానమును బోధింతుమని యత్నించినను, తమ అజ్ఞానముతోబాటు కొందరు దురహంకారము కలవారై, జ్ఞాన దరిద్రులై, దారితెలియక సర్వము తమకే తెలిసినట్లు భావింతురు. మరియు తత్కాలమందు తమకు రుచిగా తోచు మాటలతో మోసపోయి, పరమ నికృష్టమైన మతాచారములను అవలంబింతురు. తత్ఫలితముగా, సర్వాశ్రయమైన దైవమును వదలి తమ బుద్ధీంద్రియములతో జారులైనారు. తారుమారు పనులు చేయుచున్నారు. ఆ యా ప్రాకృత విషయ లంపటులై సంసారులైనారు. (అనగా తమసంసారము, అందలి పరికరములు భగవత్సేవకై వినియోగించువారి సంసారము బంధముగాదు అజ్ఞానుల సంసారము బంధకము) త్యాగరాజుని హృదయమే నివాసముగాగల రామా! వీరినిట్లు వంచించు కపటము భ్రాంతి ఏమో! ఎటుల సంక్రమించినదో! తెలియుటలేదని ఆశ్చర్యముతో తత్త్వమును నిరూపించినారు.

## 453. కన్నడ - రూపకం

**సాకేత నికేతన సాకే ననగ లేదా ||సా||**

**నీకేమరులైతిని నీకేల యీ గుణము ||సా||**

**రాకేందు ముఖ ఇంత పరాకేమి నెనరున నీ**
**రాకే మిగుల కోరితిరా కేశిహరణ**
**రాకేమైన చెప్పకురా కేకలు వేతురు**
**రా కేశవ శ్రీత్యాగరాజనుత శుభచరిత ||సా||**

రాముడు ఎపుడో ఒకపుడు లేక స్వప్నమందో తనును సాకేను-రక్షింతునని అన్నట్లు భావము కలిగినది. అదేస్మృతితో రామా! నన్ను రక్షింతుననలేదా! యని ముగ్ధభావనతో, జ్ఞాపకముచేయు రీతిలో ప్రార్థించినారు. అందుకు కారణము, నీకే మరులైతిని గదా! నిన్నే ప్రేమించితిని గదా! నీకీ గుణమేల కల్గవలెను! నీవు సాకేత నగర ప్రభువై యుండి కూడ ఇంత పరాకు ఉండవచ్చునా? నీవొకమాటు వచ్చి దర్శన మిచ్చిన చాలునంటిని గదా! నాకింకేమియు కోరికలులేవు. నీరాకను మాత్రమే కోరితిని. రాకుండుటకు వేరేసాకులు చెప్పకుము. ఇరుగు పొరుగువారు నిన్ను కేకలు వేయరు సుమా! యనుట ఎంతో జాతీయము. ఇందు తాను మాత్రము ఎంతో నిజాయితీగా రామునియందు ప్రేమ జూపునట్లునూ, ఎంతో ప్రేమానుభవముతో వాని రాకను కోరుటయే తన మర్యాదయనియు, రాముడు తనపట్ల ఆదరము చూపకపోవుట వానికే నేరమన్నట్లు సహజ హృదయ పాకముతో నన్న మాటలు.

## 454. హిందోళం - ఆది

**సామజవర గమన సాధుహృత్సార**
**సాబ్జపాల కాలాతీత విఖ్యాత ||సా||**



**సామనిగమజ సుధామయ గానవిచక్షణ**
**గుణశీల దయాలవాల మాం పాలయ ||సా||**

**వేదశిరోమాతృజ సప్తస్వర**
**నాదాచలదీప స్వీకృత**
**యాదవకుల మురళీవాదన వి**
**నోద మోహనకర త్యాగరాజవందనీయ ||సా||**

సామజవరగమన= మత్తేభమువంటి నడకగలవాడు, సాధు....పాల= సాధువుల హృదయపద్మములకు సూర్యుడు, కాలాతీత= కాలమునకు లోబడనివాడు, విఖ్యాత=ప్రసిద్ధుడా, సామ... విచక్షణ= సామవేదమునుండి పుట్టిన అమృతమే స్వరూపముగాగల గానమందు పండితుఁడు, గుణశీల=మంచిశీలముగలవాడు, దయాలవాల= దయకు నిలయుడు, మాం=నన్ను, పాలయ=రక్షించుము, వేద.... దీప=వేదములకు శిఖరమును మాతృకయునగు ఓంకారమునుండి పుట్టిన సప్తస్వరము లనే నాదము లను పర్వతములను దీపమై ప్రకాశింపజేయువాడు, స్వీకృత యాదవకుల= యాదవకులమును స్వీకరించినవాడు.

ఇందు శ్రీరాముని మనోహరముగా వర్ణించినారు. రాముఁడు గజగమనమువలె గంభీరమైన నడకగలవాడనియు సాధువుల హృదయములను ప్రకాశింపఁజేయువాడనియు కాలధర్మముల కతీతుడనియు కీర్తించినారు. తర్వాత సామవేదమునుండి పుట్టిన అమృతమయమైన సంగీతమందు పండితుడు. దాని సారము నెరింగినవాడు. దయాసముద్రుఁడు. వేదములకు శిఖరమైనది ఓంకారము. ఈ ఓంకారము మాతృకగానుండి సప్తస్వరనాదములను కలిగించును. అట్టి నాదమునకు దీపమువంటివాడు రాముడని చెప్పుటచే వేదములకు వేదసారమైన ప్రణవమునకు దానినుండి పుట్టిన సప్తస్వర నాదములకు శ్రీరాముడే ఆశ్రయమనియు లక్ష్యమనియు నిరూపించి

ప్రపంచమందలి విద్యలు, సంగీతము, పరమాత్మయొక్క లక్ష్యమును నిరూపించుటకొరకే ఏర్పడినవని తెలియజెప్పినారు. పైజెప్పిన సామాదివేదములను వాటికి సారమైన సంగీతముచే, పరమాత్మ యాదవకులమందు కృష్ణుడుగా అవతరించి, తన మురళీవాదన రూపమున లోకమునకు మోహమును కల్గించి చరాచర భూతములను తనవంక కాకర్షించె ననియు వర్ణించినారు.

## 455. బ్యాగడ - [1]చాపు

**సామికి సరి జెప్పcజాల వేల్పుల రామ ॥సా॥**

**నా మన సతనిపై నాటియుండcగ నొరుల ॥సా॥**

**ఏటియోచన చాలు ఎవరి కెటులో వ్రాలు**
**మాటలాడేదె మేలు మదికిదె పదివేలు ॥సా॥**

**తనకంటి కెంతో ముద్దు తప్ప డాడిన పద్దు**
**చనవుచేయు నేప్రొద్దు చల్లనిచూపు కద్దు ॥సా॥**

**అన్ని వేల్పులలోన అతనికి సరి గాన**
**తన్నుcబ్రోచిన ఘన త్యాగరాజసఖుcడైన ॥సా॥**

సామికి=శ్రీరామునికి, వేల్పుల=దేవతలను,ఆడినపద్దు=చేసినప్రతిజ్ఞ.

మా సామియైన శ్రీరామునికి ఇతర దేవతలు సాటియని చెప్పజాలను. “నా మనస్సు శ్రీరామునిపై బాగుగా నాటుకొని యున్నందున నా ఆత్మ ప్రమాణముతో రామునకు రాముడే సాటియని తలంచుచున్నాను అని త్యాగరాజు తనకు రామునియందు గల యనురాగమును చూపుకొన్నారు. ఈ దేవతా తారతమ్యములcగూర్చి యోచన సేయుటయు తగనిదే. ఎవరికేది ప్రియమో వారి కష్టసుఖముల అనుభవ మెట్లో వారివారి కర్మవాసనలc

1 .రూపకం.



బట్టి కూడనుండును. నాకుమాత్రము రాముడొక్కమారు మాటలాడిన నదియే పదివేలు. నా కితర యోచనలతో నేమిపని యని రామునియందు తనకుగల మధురభక్తిని సూచించినారు. రామునియందు తన మనస్సు లగ్న మగుటకు ప్రధాన కారణములను చెప్పినారు. నా కంటికి రాముని రూపమెంతో ముద్దు గురియుచుండును. ఆడినమాట తప్పడు. అతడు నాకు తనయొద్ద చనువు గూర్చును. ఎపుడు పరికించినా రాముడు చల్లనిచూపులను కురియుచు నన్ను కాపాడుచున్నాడు. కావున, మా రామసామికి ఇతరదేవత లెవ్వరూ సాటిగారని నా ఆత్మానుభవముచే చాటగలనని తన ఉపాసన యందలి సిద్ధిని లోకమునకు చెప్పినారు. అందరును ఇట్లే తన ఉపాసనలను, విజ్ఞానములను వృధాలోచనలతో వ్యర్థముచేయక ఆత్మప్రీతి, శక్తి గలిగియుండిన ఏ దైవమైనను తనకు కృతార్థత గల్గించునని ఉపదేశమిచ్చినారు.

ఇందలి శైలి శృంగారపదములవలె లలితమై మధురభక్తి యుక్తముగా యున్నది.

## 456. రాగపంజరం - దేశాది

**సార్వభౌమ సాకేతరామ మన ॥సా॥**
**సారcబల్కరాదా దేవతా**

**పార్వతీరమణార్చితపా[1]ద రమా**
**[2]పతివంద్య పరాత్పర దీనబంధో ॥సా॥**

**ముద్దు ముద్దుగా మాటలాడినది**
**ముందు రాక సదా [3]వెతcజెందుచును**
**కద్దు కద్దనుచుc జిరకాలమును**
**కఱcగుచుండ[4] వలెనా త్యాగరాజనుత ॥సా॥**

1. పాదయుగ 2. భక్తవంద్య 3. వెసనంఖు 4. వశమా.

దేవతాసార్వభౌమ=దేవతలకు చక్రవర్తి, పార్వతీ....పాద=శివునిచే అర్చింపఁబడు పాదములుగలవాడు, రమాపతివంద్య=లక్ష్మీపతిచే నమస్కరింపఁబడువాడు.

సకలదేవతలకు అధినాథుడవైన రామచంద్రా నాతో హృదయపూర్వకముగా నొక్కమారు మాటలాడరాదా. శివాదులచే పూజలనందిన వాడవయ్యును దీనులకు పరమబంధుడవై వెలసినావు.

రామా! నాతో నీవు ముద్దుముద్దుగా మాట్లాడియుండి నాముందు రాకనే యుండుటచే నేను సదా కష్టపడుచూ ఎప్పటికో నాకీభాగ్యము కద్దని ఉవ్విళ్ళూరుచూ నీయందలి అనురాగముతో కఱగుచు వేచియుండవలెనా అని ప్రార్థించినారు. త్రిమూర్తు లందరు శ్రీరాముని అవతారధర్మమును పురస్కరించుకొని స్తుతిచేసినట్లు రామాయణ మందు కలదు. కాన రమాపతివంద్యయని ప్రయోగించుట యుక్తమైనదే.

## 457. బంగాళ – దేశాది

**సాక్షి లేదనుచు సాధింపకే**
**సత్యసంధ సద్భక్తపాలక** ॥సా॥

**వీక్షకాదు లెల్ల నవ్వరా జగత్**
**సాక్షివంశనీరధిపూర్ణచంద్ర** ॥సా॥

**శక్తి నీయెడ నిండారలేదా పరా**
**శక్తి బ్రోవ లేదా విషయమందు వి**
**రక్తి కల్గు శ్రీత్యాగరాజుని నిజ**
**భక్తి నీ వెఱుఁగ లేవ మానవుల** ॥సా॥

సాక్షి=సాక్ష్యము, సత్యసంధ=సత్యవ్రతముగలవాడా, సద్భక్తపాలక=సజ్జనులైన భక్తులను పాలించువాడా, వీక్షకాదులు=సర్వమును



చూచునట్టివారు, (సూర్యచంద్రాదులు), జగత్సాక్షివంశనీరధిపూర్ణచంద్ర= సూర్యవంశ సముద్రమునకు చంద్రుడు, నిండారలేదా= పూర్ణముగాలేదా, పరాశక్తి= పరదేవతయైన ప్రకృతి, విషయమందు= లోకసుఖములందు, విరక్తిగల్గు= వైరాగ్యముగల.

రామచంద్రా! నా భక్తినిగూర్చి ఋజువుచేయఁగల మానవుల సాక్ష్యమేమియూ లేదని నన్ను రక్షించక సాధించుచున్నావేమి? అనేకమంది భక్తులను పాలించితివే. వీరికందరి కిట్లే సాక్ష్యమును ఋజువు చేసికొంటివా. అదీగాక జగత్తునకంతకు సాక్షియైన సూర్యవంశమునకు నీ వధిపతివై యున్నావు. ఇట్లు సర్వజ్ఞుడవైన నీవే సాక్ష్యమును కోరినచో చూచేవారందరు నవ్వరా. మరియు ఇతరుల సహాయ మక్కర లేకనే సర్వమూ తెలిసి అందరను కాపాడగలశక్తి నీకేమైన కొరవడియున్నదా.? పరాశక్తి నీకు వశమైయున్నది. గదా. ఆమె దయచూపనన్నదా. ఏమి ఈ యోచన ప్రపంచమందలి సర్వసుఖములందు వైరాగ్యముగల్గి సదా నిన్నే కీర్తించుచూ భజించుచున్న త్యాగరాజుని భక్తినీ వెరుఁగవా రామా యని శ్రీత్యాగరాజు తన భక్తినిగూర్చి రాముఁడు ఋజువును కోరినట్లు కల్పించుకొని రాముఁడు సర్వజ్ఞుడు సర్వసాక్షి సర్వ శక్తియుతుఁడని నిరూపించినారు.

## 458. పంతువరాళి – చాపు

**సారమేగాని యన్యమార్గవి**
**చార మేటికే ఓ మనసా** ॥సా॥

**వారు వీరు దెలియలేక బల్కు**
**వార్తలు విననేలే రామనామము** ॥సా॥

**మారకోటిలావణ్యుఁడైన రఘు**
**వీరుని నామసుధారసమును**

సారెకుఁబానముఁజేసి జగద్వి
హారుఁడై వెలయు నారాయణ
నారాయణ యనుచును
వారము శరదంబుదనిభుఁడౌ శ్రీ
నారదముని వల్మీక జాతునికిఁ
గూరిమి నుపదేశించ లేదా ॥సా॥

పరమపావనుని శరణాగతజన
పరిపాలనబిరుదాంకుని సీతా
వరుని నామసుధారసపానము
నిరతమునను జేసి హరి హరి
హరి యనుచు సంతతంబును
సరియులేని కీర్తిఁ గాంచి దేహము
పరవశంబుఁ జెంది శుక బ్రహ్మ
పరీక్షిత్తు కొసఁగలేదా వాదా ॥సా॥

సామగానలోలుఁడౌ రజతగిరి
ధాముఁడైన త్యాగరాజశివుఁడతి
నేమముతో నామామృతపానము
ఏమఱకను జేసి రామ రామ
రామ యనుచు సతతము
శ్రీమదాదిగౌరికి శృంగారికి
యా మహిమల నా రహస్యముల నతి
ప్రేమను నుపదేశించ లేదా ॥సా॥

సారమే=సారభూతమైన ముఖ్యమైన ఫలమిచ్చునదియే, అన్యమార్గ విచారము=ఇతరసాధనలను ఆలోచించుట మారకోటి లావణ్యుడు=



కోటిమన్మథులతో సరియగు సౌందర్యముగలవాడు, నామసుధారసమును= నామామృతమును, వారము= మాటిమాటికి, శరదంబుదనిభుడౌ = శరత్కాల మేఘమువంటి కాంతిగలిగిన, వల్మీకజాతునికి= పుట్టనుండి పుట్టిన వాల్మీకికి, కూరిమిన్= ప్రేమతో, శరణాగతజన పరిపాలన బిరుదాంకుని= శరణొందిన వారిని కాపాడే బిరుదుగలవానిని, రజతగిరిధాముఁడైన= కైలాస నివాసియైన, అతినేమముతో= మిక్కిలి నియమముతో, ఏమఱకను=అశ్రద్ధచెందక, శృంగారికి= లావణ్యవతికి.

పరమార్థసాధనలలో మిక్కిలి సారమైనది. సద్యఃఫలమిచ్చి పరమ పురుషార్థమొసంగునది రామనామమే. కాన ఇతరసాధనలగూర్చి విచారణ యేల యని మనస్సం బోధనతో రామనామ మహిమను, ఆ సంప్రదాయజ్ఞులను, ఈ కీర్తనమందుపదేశమిచ్చినారు. లోకమందు అనేకులు రామనామసారము నెరుంగలేక ఇతరసాధనల నెన్నో చెప్పుచుందురు. ఆ వాదములలో విక్షేపము నొందవలదు. పూర్వము శ్రీరాముని నామామృతమును బాగుగా నాస్వాదించి లోకముల ననుగ్రహించుకొరకే అంతటను విహారము చేయుచూ శుద్ధస్వరూపుడై యుండు నారదుఁడు సదా నారాయణ దివ్యనామకీర్తనము చేయుచూ నారాయణ రామనామములు ఒక్క పరమాత్మతత్త్వమునే కీర్తించునవని నిర్ణయించి వాల్మీకికి రామతారక మంత్రము నుపదేశించెను.

మరియు పరమపవిత్రుడనియు, శరణాగతులను పరిపాలించు వాడనియు, సాటిలేని దైవమనియు తలచి నిరంతర హరినామ కీర్తనముచే పరవశమొందిన శ్రీశుక బ్రహ్మ పరీక్షితున కుపదేశమిచ్చిన దివ్యనామసారమే రామనామమని నిర్వివాదమైన విషయముగదా.

మరియొక విశేషమేమనగా: సామగాన ప్రియుఁడైన శివుడును మిక్కిలి నియమముతో రామనామామృతము నాస్వాదించి అందలి బ్రహ్మానందములో

పరవశుండై నిరంతరమూ రామకీర్తనమే చేయుచూ ఆదిదేవత పరాశక్తియగు గౌరికి ఆ రామనామతత్త్వమను రహస్యమును అతిప్రేమతో నుపదేశమిచ్చినారు. ఇంతకన్న సంప్రదాయ ధర్మమేమి గావలెను? కావున సారములలో కెల్ల సారమైనది రామనామమే గాని అన్యముకాదని నిర్ణయించినారు.

## 459. అసావేరి - ఆది

**సారి వెడలిన యీ కావేరిని జూడరే ॥సా॥**

**వారు వీరనుచుఁ జూడక తా న**
**వ్వారిగాభీష్టముల నొసంగుచు ॥సా॥**

**దురమున నొక తావున గర్జన భీ**
**కర మొక తావున నిండు కరుణతో**
**నిరతముగ నొకతావున నడచుచు**
**వర కావేరి కన్యకామణి ॥సా॥**

**వేడుకగా కోకిలలు మ్రోయఁగను**
**వేడుచు రంగేశుని జూచి మఱి యీ**
**రేడు జగములకు జీవనమైన**
**మూడు రెండునదినాథుని జూడ ॥సా॥**

**రాజరాజేశ్వరియని పొగడుచుఁ**
**జాజి సుమముల ధరామర గణములు**
**పూజ లిరుగడల సేయఁగ త్యాగ**
**రాజసన్నుతురాలై ముద్దుగ ॥సా॥**

అవ్వారిగా=నిరాటంకముగా, దురమున=తీవ్రగతిని, ఈరేడు జగములకు=పదునాల్గు లోకములకు, మూడు రెండు నదినాథుని=



పంచనదీశ్వరుని, ధరామరగణములు=బ్రాహ్మణ బృందము, ఇరుగడల= ఉభయ తీరములందును.

ఈ కీర్తనమందు శ్రీత్యాగరాజు పంచనదక్షేత్ర మందలి శ్రీ కావేరీ నదియొక్క సౌందర్యమును అచటి ప్రకృతి సౌందర్యమును వర్ణించినారు. కావేరి, వారు వీరు అనక అనగా-పాపులు పుణ్యులు అనే భేదములేక అందరినీ పునీతులుగా చేయుచూ తీవ్రమంద గమనములతో తన పార్శ్వవనములందు కోయలలు కూజితములు చేయుచుండగా శ్రీ రంగనాథుని జూచి పంచనదీశ్వరుని సేవించుకొరకు వచ్చుచున్నదని వర్ణించినారు. ఆ కావేరీ ప్రాంతములందలి బ్రాహ్మణ బృందములు కావేరిని శ్రీ రాజరాజేశ్వరీ యని స్తుతులచేయుచూ పుష్పములతో ఉభయతీరములందు బారులుతీర్చి పూజలు సేయగా త్యాగరాజుచేతనుకూడ సన్నుతురాలై కావేరివచ్చుచున్నది, కనుడని అచటి సుందర దృశ్యమును వర్ణించినారు.

## 460. కేదారగౌళ - [1]జంప

**సిగ్గుమాలి నావలె ధర నెవ్వరు తిరుగఁజాలరయ్యా ॥సి॥**

**ముగ్గురిలో మేలైన రామ**
**మాముఖాబ్జదినరమణ నిన్ను నమ్మి ॥సి॥**

**ముందర దయతోఁబలికిన దింక ముందు రాకపోయె**
**దందనాలతో దినములు గడిపే దారి తెలిసిపోయె**
**అందఱిచేతను నా బ్రతుకు లిపుడు నిందల కెడమాయె**
**మందరధరనాజీవుఁడు జీవన మిందు సేయనాయె అని దెలిసి ॥సి॥**

**ఎల్ల వారివలె భవసాగరమును ఈద మనసురాదు**
**ఉల్ల మునను గని నీవే నేనై యుండఁదెలియలేదు**

1. ఆది.

**బల్లని పనులకు పొయ్యేటి వ్యసన మోర్వఁదరముగాదు**
**తల్లడిల్లుచున్నది నామనసు తాళ దింక మీదు అని తెలిసి ॥సి॥**

**నిన్నాడను నామనసెపుడైన నిజముగ రాలేదు**
**వెన్నవంటి నీ చిత్తానికి నావెతలు తెలియలేదు**
**పన్నగశయన నీదయకు నేఁబాత్రుఁడు గాలేదు**
**కన్నదండ్రి త్యాగరాజుని కింక**
**కరుణఁజూడలేదు అని దెలిసి ॥సి॥**

ముగ్గురిలో=త్రిమూర్తులలో, మా ముఖాబ్జ దినరమణ=లక్ష్మీదేవియొక్క ముఖకమలమునకు సూర్యుఁడు, నా వెతలు= నా కష్టములు.

భగవంతు డింకను పరిపూర్ణ కటాక్షముతో తనను కాపాడలేదని ఒక వంక పరితాపమున్నూ, ఎప్పటికైన ననూ ఆతఁడే కాపాడి తీరవలెనని నిశ్చయసంకల్పముతో తీవ్రానురాగమున్నూ, తనకు రామునియందుగల చనువున్నూ వెల్లడియగునటుల శ్రీ త్యాగరాజు తనయందు తన చేతలందును ఒకవిధమైన నైరాశ్య మారోపించుకొని రామునిగూర్చి మొరలిడుచున్నారు. రామా ఇంతకాలముగా నిన్ను నమ్మియుండి ఎట్టి ప్రయోజనము లేకపోయిననూ సిగ్గువిడచి ఇంకనూ నిన్నే అనుసరించుచూ తిరుగు నట్టి వెర్రివారు నాకంటె మరెవ్వరేని యుందురా.

కారణ మేమన్నచో తొల్త నాకు దర్శనమిచ్చి దయతో రక్షింతునని పల్కిన మాటలు ముందునకు సాగిరాకున్నవి. రోకటి పాటవలె ఎప్పటివలెనే తందనాలతో రోజులు గడచుచున్నవి. అందరు నన్ను నిందించుచూ నేరముల నారోపించుచున్నారు. ఇన్ని శ్రమలుపడుచూ రామా నీ సేవను దర్శనభాగ్యమును ఆశించి ఈ లోకమందే నా జీవుడు బ్రతకవలసియున్నాడు. అట్లని అందరివలె ఈ సంసారమందే మగ్నుడనై యుండుటకు చిత్తము ఇష్టపడకున్నది. పోనీ ఈ దృశ్యప్రపంచమునంతను మరచిగాని



(స్వస్వరూపానుసంధానముచేత) దీని నంతను పరబ్రహ్మాత్మకముగా తలచిగాని (స్వాత్మతత్త్వానుసంధానముచేత) నీవే నే ననెడి అద్వైతనిష్ఠ పొందుట ఎట్లో తెలియ కున్నది. ఏ అకార్యములనైన చేసి ఏదో విధముగా అతిశయమును సంపాదింతు నన్నచో ఆ వ్యసనములవంకకు మనస్సు పోకున్నది. ఇన్ని విధములైన పరితాపములకు గురియైన నా మనసు ఇక తాళకున్నదని తెలిసియు నిన్నే నమ్ముకొనియుండుట సిగ్గుమాలి తిరుగుట గాదా.

రామా! ఇప్పకికైనను నిన్ననుటకు నీయందు నేరారోపణ చేయుటకు మనసు రాకున్నది. నీ చి త్తము వెన్నవంటి మార్దవముగలదిగదా:(కలనైన) నా బాధలు నీకేల తెలియవు? నీ దయకు నేనింకను పాత్రుడనుగా లేదేమి? కావున తండ్రీ నన్నింకను నీవు కరుణజూడకున్నావని తెలిసియుండియు నిరభిమానుఁడై తిరుగుచున్నానని తన పరితాపమును వెల్లడించినారు. ఈ తాపముతో తేలిన సారాంశమేమనగా. నన్ను రక్షించు వాడు రాముడు, నే నాతని రక్షకత్వమును పొందితీరవలెనను పట్టుదలగూడ పోయి త్యాగరాజునికి శ్రీరామునియందలి అనురాగము భక్తి స్వాభావికములై యుండి తన కర్తృత్వమే ఆవశ్యకము లేదనిభావము. కావున, సర్వబాధ్యతలు రామునియందే అధీనములై యున్నవని తెలుపుచు అనన్యభక్తి భావమును సూచించినారు.

## 461. లలిత - రూపకం

**సీతమ్మ మా యమ్మ శ్రీరాముఁడు[1]మాదుతండ్రి ॥సీ॥**

**వాతాత్మజ సౌమిత్రి వైన తేయ రిపుమర్దన**
**తాత భరతాదులు సోదరులు మాకు ఓ మనసా ॥సీ॥**

**పరమేశ వసిష్ఠ పరాశర నారద శౌనక శుక**
**సురపతి గౌతమ లంబోదర గుహ సనకాదులు**

1. మా తండ్రి.

**ధర నిజభాగవతాగ్రేసరు లెవరో వా రెల్లను**
**వరత్యాగరాజునికి పరమబాంధవులు మనసా ॥సీ॥**

వైనతేయ=గరుత్మంతుడు, రిపుమర్దన=శత్రుఘ్నుడు, తాన=జాంబవంతుడు, సురపతి=ఇంద్రుడు.

ఇందు త్యాగరాజు శ్రీ సీతారాములను వారి సోదరులను పరివారులను తన కుటుంబముగాను భాగవతాగ్రేసరులైన శివుడు వసిష్ఠుడు మొదలైనవారిని తన స్వీయ బంధువర్గముగాను భావించి తన సర్వస్వమూ రాముడేయని తన హృదయ వైశాల్యమును నిరూపించినారు. ఇట్లే ప్రపంచములో తనకుగల జననీ జనకులాదిగా గల సకల బంధువులను పై జెప్పిన సీతారాములు మొదలైన భగవత్కూటముగా భావించుచున్నా రనుటయు న్యాయమే. ఇట్లు పరస్పరభావనవలన చిత్తము నిర్మలమై ఏకాగ్రతగల్గి ఆనందము నొందును. **"మాతా రామో మత్పితా రామభద్రః"** అను రామకర్ణామృతము నందలి భావములతో నీ గేయము సరియైయున్నది.

తాగయ్యగారి తల్లి సీతమ్మ, తండ్రి రామబ్రహ్మం కూడయైయుండుట విశేషము.

## 462. కమాస్ – దేశాది

**సీతాపతీ నా మనసున–సిద్ధాంతమని యున్నానురా ॥సీ॥**
**వాతాత్మజాదుల చెంతనే–వర్ణించిన నీ పలుకులెల్ల ॥సీ॥**
**ప్రేమఁజూచి నాపై పెద్ద మనసుఁజేసి**
**నీ మహిమ లెల్ల నిండారఁజూపి**
**ఈ మహిని భయమేటి కన్నమాట**
**రామచంద్ర త్యాగరాజవినుత ॥సీ॥**

సిద్ధాంతమని= నిశ్చయమని.



రామా హనుమదాదుల దగ్గర నీవు పల్కిన మాటలు శరణాగతులైన వారిని గూర్చి నీవుచూపిన వాత్సల్యము నిశ్చయమని నా మనసున విశ్వపించి యున్నాను. వారిచెంతనేగాక నాకును ఒకమారు దర్శనమిచ్చి విశాలహృదయముతో నన్ను ప్రేమించి నీ మహిమలనుకూడా కొన్నింటిని చూపి త్యాగరాజా నేను రక్షకుడనై యుండ నీకేమి భయమని అభయమిచ్చిన మాటలున్నూ నిర్ణయమైనవేయని నమ్ముకొని యున్నాను. నీదయ ఎట్లున్నదోయని ధ్వని.

## 463. శంకరాభరణం – ఆది

**సీతాపతి కావవయ్య ॥సీ॥**

**నతాఘహరణ వినతాసుతగమన**
**కృతాపరాధి సుకృతం బెఱుఁగ నే ॥సీ॥**

**సదాగతిజహిత సదాశివప్రియ**
**ముదాన మనుపుము దాననహరా ॥సీ॥**

**ధరావనధురంధరాజ భవ సా**
**గరార్తిహర త్యాగ రాజవినుత ॥సీ॥**

నతాఘహరణ=నతులైనవారి పాపములను హరించువాడు, కృతాపరాధిన్= అపరాధముల చేసినవాడను, సదాగతిజహిత= వాయుపుత్రుని కిష్టుడు, మనుపుము=రక్షించుము, ముదాన=ప్రీతితో, దానవహర=అసురులను హరించువాడా, ధరావన ధురంధరా=రాజశ్రేష్ఠుడా, అజ=జన్మలేనివాడ, భవసాగరార్తిహర=సంసార సముద్రమందలి ఆర్తిని పోగొట్టువాడ.

ఓ సీతాపతీ నన్ను రక్షింపుము. నే నెట్టి పుణ్యమెరుంగక, నీయెడ అపచారములను చేసినవాడను. నీవా నతులైనవారి పాపములను

పాలద్రోలువాడవు. విశేషించి, రాజశ్రేష్ఠుడవునై యున్నావు. మా సంసారనిమిత్తమైన ఆర్తిని దీర్చి ప్రీతితో రక్షింపు మని ప్రార్థించినారు. వాయుపుత్రునికి హితుడవని చెప్పుట లోకమునకు సదా జీవమిచ్చు నట్టివాడు వాయువు. వాని పుత్రుడగు ఆంజనేయుని కిష్టడగుటచే లోకరక్షకుడవని విశేషాభిప్రాయము చెప్పవచ్చును.

## 464. దేవగాంధారి – దేశాది

**సీతావర సంగీతజ్ఞానము ధాత వ్రాయువలెరా రామ ॥సీ॥**

**గీతాద్యఖిలోపనిషత్సార–భూత జీవన్ముక్తుcడౌటకు ॥సీ॥**

**ఆకాశశరీరము బ్రహ్మమనే–ఆత్మారాముని తా సరిజూచుచు**
**లోకాదులు చిన్మయమనే సుస్వర–**
**లోలుcడౌ త్యాగరాజసన్నుత ॥సీ॥**

సీతావర= సీతాపతీ, ధాత=బ్రహ్మ, ఆకాశశరీరము=ఆకాశమే శరీరముగాగలది, చిన్మయము=చైతన్యముతో నిండినది.

ఓ సీతారామా! సంగీతశాస్త్రముయొక్క తత్త్వమును తెలిసి ఆ సంప్రదాయము నెరుంగవలెనన్నచో లలాటమందు బ్రహ్మ లిఖించి యుండవలెనేగాని స్వప్రయత్న మాత్రముననే సాధించ వలనుగాదు. భగవద్గీత ఉపనిషత్తులు ఉపదేశించు తత్త్వమునకు సారభూతమైన ఓ రామా! జీవన్ముక్తి కారణమగు సంగీతజ్ఞానము నీ అనుగ్రహముచే లభించవలసినదే. **"ఆకాశశరీరం బ్రహ్మ"** అను శ్రుతి ప్రకారము పరమాత్మకు ఆకాశమే శరీరమనియు ఈ విశాలాకాశమందే సమస్తలోకములు చిన్మయములై ప్రకాశించుచున్న వనియు ఆ చిన్మయరూపమే జీవులకు ఆత్మయై యున్నందున తన ఆత్మారాముని పరమాత్మతో సరిజూచుచు ఒక్కటిగా అనుసంధానము చేయుచూ వీటికి పరస్పర సంబంధమును కలిగించునది



సుస్వరనాదమని తెలియుచో, ఆ నాదోపాననచే జీవన్ముక్తి తప్పక సిద్ధించునని భావము, ఆకాశ శరీరమైన బ్రహ్మము, తన ఆత్మ, చిన్మయము లైన లోకములనెడి దృశ్యము ఈ మూటియందును విశుద్ధమైననాదము ఒక్క రూపముగా నిండియున్నది. ఆ నాదోపాసనయే ముక్తికి కారణమని తాత్పర్యము.

## 465. రామమనోహర – దేశాది

**సీతామనోహర శృంగార శేఖర ॥సీ॥**

**వాతాశనారివరవాహన–వారిజాసనాది వందితపద ॥సీ॥**

**తొలిజన్మములను జేసిన పూజా–ఫలమో లేక నీదు కటాక్ష**
**బలవెనీవాcడను నేనని లోకులు–**
**[1]బల్కేరుగా ధన్యుcడనైతిని ॥సీ॥**

**దీనలోక సంరక్షక దైవా–ధీనముగా నీ రూపము నాదు**
**మానసాబ్జమున నాటియుండcగా–నే నెంతటి భాగ్యశాలినో ॥సీ॥**

**దిట్టతనమునను భక్తి స్థిరమౌ–నట్టుగా శ్రీరామ యెన్నటికి**
**గట్టిగాను త్యాగరాజుని చెయి–బట్టి రక్షించేలుకోవయ్య ॥సీ॥**

శృంగారశేఖర=శృంగారమునకు నిధియైనవాడు, వాతా....వాహన= సర్పముల వైరియగు గరుడుడు వాహనముగాగలవాడు, దైవాధీనముగా = దైవాను గ్రహముచే.

శృంగారలావణ్యమునకు నిధియైన ఓ సీతారామా! నీవు గరుడ వాహనుడవైన సాక్షాద్విష్ణుమూర్తివి. బ్రహ్మాదులచే నమస్కరింప బడుచున్నావు. నా జన్మాంతర భాగ్యముననో నీ అనుగ్రహబలముచేతనోగాని లోకులందరు వారంతటవారుగా నన్ను నీవాడని పల్కుచున్నారు. ఈదివ్యకీర్తి నాకు గల్గుటచే

1. బల్కగా.

ధన్యుడనైతిని. మరియు నా స్వప్రయత్న మక్కరలేకయే దైవికముగా నీ దివ్యరూపము నా హృదయపద్మమున బాగుగా నాటి యున్నది. నా భాగ్య వెంతని తలంతును. కావున శ్రీహరీ నీయం దిట్టి భక్తియే జన్మాంతరములందును స్థిరమై యుండునట్లు నీ హస్తావలంబన మిచ్చి రక్షింపుము.

## 466. కానడ–దేశాది

**సుఖి యెవరో రామనామ ॥సు॥**

**సుఖి యెవరో సుముఖి యెవరో**
**అఖిలసారమగు తారకనామ ॥సు॥**

**సత్యము తప్పక సకలలోకులకు భృత్యుఁడై దైవభేదము లేక**
**నిత్యమైన సుస్వరగానముతో**
**నిరంతరము త్యాగరాజనుతనామ ॥సు॥**

రామనామసుఖి=రామనామముచే సుఖమనుభవించువాడు. సుముఖి=సుందర ముఖముగలవాడు (ప్రసన్నుడు), శ్రీ త్యాగరాజనుతనామ= శ్రీ త్యాగరాజనే శివునిచే స్తుతింపబడు రామనామముచే.

సర్వమంత్రములకును సారమైన శ్రీ రామతారక నామముచే దివ్యసుఖమును బ్రహ్మానందము ననుభవించుచూ సుప్రసన్న మైన ముఖముగల మహనీయుఁడెవ్వరో యనుటచే ఆతఁడే లోకోత్తరుఁడు ధన్యుడని భావము. అతని ప్రవ ర్తనమును చెప్పుచూ సుస్వరసంగీతముతో శ్రీ రామనామమును గానము చేయువాడు సత్యమును తప్పక సర్వప్రపంచజీవులకును తాను విధేయుడై యుండి దైవభేదమును తలంచక నిత్యమూ రామకీర్తనము చేయుచుండును. అట్టి భాగ్య మెవ్వరికి కల్గునో కదాయని రామనామ మహిమను వెల్లడించినారు.



## 467. చక్రవాకం–రూపకం

**సుగుణములే చెప్పుకొంటి–సుందర రఘురామ ॥సు॥**
**వగ లెఱుంగ లేక ఇటు–వత్తువనుచు దురాసచే ॥సు॥**
**స్నానాది సుకర్మంబులు[1]దానాధ్యయనంబు లెఱుఁగ**
**శ్రీనాయక క్షమించుము–శ్రీత్యాగరాజవినుత ॥సు॥**

వగలు = నీ నటనలు.

రామా నీ కపటములైన నటనలను నే తెలియలేక తప్పక నీ గుణనామ కీర్తనము చేసినచో. నాకు నీవు ప్రసన్నుడ వగుదువని తలచి ఎంతో ఆశతో నీ సుగుణములనే కీర్తించుచూ కాలమును గడిపితిని. ప్రస్తుతమ మరియొక తీరుగా నిన్ననుటగాని మరియొక సాధనమును అనుష్ఠించుటగాని నా చేతగాదు. పుణ్యతీర్థములలో స్నానాదిక కృత్యములనుగాని, దానము వేదాధ్యయనములనుగాని నే నేమియు ఎరుంగను. రామా! నీవే నన్ను మన్నించి దర్శనమిచ్చి కాపాడుము. త్యాగరాజస్వామి వేదాధ్యయన మొనర్చినవారే అయినను ఇచట చెప్పుకొనుటలో వీరిది ఉపాసనా పద్ధతి యగుటచే ఆ వేదవాదములం దంతగా రక్తిగలవాడనుగానని చెప్పుకొనుటయే అభిప్రాయము.

## 468. కమాస్–రూపకం

**సుజనజీవన సుగుణభూషణ రామ ॥సు॥**

**భుజగభూషణార్చిత బుధజనావనా**
**[2]అజవందిత శ్రితచందన దశతురంగ మా మన ॥సు॥**

**చారునేత్ర శ్రీకళత్ర శ్రీరమ్యగాత్ర**
**తారకనామ సుచరిత్ర దశరథపుత్ర**

1. వేదాధ్యానంబులు. 2. త్మజ

**తారకాధిపాననా ధర్మపాలక**
**తారయ రఘువర నిర్మల త్యాగ రాజసన్నుత ॥సు॥**

సుజనజీవన=సజ్జనులకు జీవనమైనవాడా, సుగణభూషణ= సద్గుణములే అలంకారములుగా గలవాడు, భుజగభూషణార్చిత=శివునిచే పూజింపఁబడువాఁడు. బుధజనావన= విజ్ఞులను కాపాడువాడు, అజవందిత= బ్రహ్మచే నమస్కృతుఁడు, శ్రితచందన= ఆశ్రితులకు చల్లనైనవాడు, దశతురంగ= గరుడవాహనా, మాం+అవ= నన్ను రక్షింపుము, చారునేత్ర= సుందరములైన కన్నులుగలవాడా, శ్రీకళత్ర= లక్ష్మీపతి, తారకనామ= జీవులను తరింపఁజేయు దివ్యనామముగలవాడు, సుచరిత్ర= పుణ్యచరిత్రగలవాడ, తారకాధిపానన= చంద్రునివంటి ముఖముగలవాడా, తారయ= తరింపఁజేయుము, నిర్మల= పరిశుద్ధమూర్తీ.

ఈ కీర్తనము మిక్కిలి లలితములైన సుందరపదవిశేషణములతో శ్రీరాముని కల్యాణగుణములను కీర్తించుచున్నది. భావము సరళముగా నున్నది.

## 469. ఆరభి – చాపు

**సుందరి నిన్ను వర్ణింప బ్రహ్మాది సురలకైన తరమా ॥సుం॥**

**కుందరదన [1]సనందనాది వందిత నే నెంత త్రిపుర ॥సుం॥**

**కలకలమను ముఖకళలను గని కలు**
**వలరాజు భువికి రాఁడాయె**
**చెలఁగు నీ లావణ్యమును గని**
**యలనాఁడె వలరాజు గానక పోయె**
**నిలువరమగు నీ గంభీరమును గని**
**జలరాజు జడవేషుఁ డాయె**

1. సంక్రందనాది.



**బలమైన ధీరత్వమును గని కనకా**
**చలుఁడు తా శిలరూపుఁ డాయె త్రిపుర ॥సుం॥**

**కనులను గని సిగ్గుబడి గండుమీనులు**
**వనధివాసము సేయ నాయె**
**జనని నీ చిఱునవ్వు కాంతి సోకి శివుఁ**
**డనుపమౌ శుభ్రుఁడాయె**
**మినుకు సొమ్ములచేల కాంతుల మెఱపులు**
**గని నిమిషము నిలువదాయె**

**కనకాంగి నీ స్వరమును విని వాణి మ**
**గని జిహ్వను దాఁ [1]బూనికాయె త్రిపుర ॥సుం॥**

**పావనము సేయు బిరుదును గని భక్త**
**పాపము పారిపోనాయె**
**ఏవేళ నీ దయచేత సత్కవు లెల్ల**
**కావ్యములను సేయనాయె**
**మావరునికి చెల్లెలని సంతోసమున**
**దేవి పెద్దలు బల్కనాయె**
**భావించి నీ పాదమున త్యాగరాజు**
**భావుక మనుకోనాయె త్రిపుర ॥సుం॥**

కుందరదన= మల్లెమొగ్గలవంటి దంతములుగలదానా, సనందనాది వందిత= సనందుడు మొదలగు మహాయోగులచే నమస్కరింపఁబడునది. కలువలరాజు= చంద్రుడు, వలరాజు= మన్మథుడు, కానకపోయె= కనుపించక పోయెను (అశరీరుడయ్యె), నిలువరమగు=నిలుకడగల, జలరాజు= సముద్రుడు, జడవేషుడు=జలమే స్వరూపముగాగలవాడు. జడుడని

1. యునికాయె.

శ్లేషార్థము. కనకాచలుఁడు= మేరువు (సువర్ణరూపుడు) గండుమీనులు= గండుచేపలు, వనధివాసము= సముద్ర నివాసము, అనుపమమౌ= సాటిలేని, శుభ్రుఁడు= తెల్లని కాంతిగలవాడు, మినుకు సొమ్ముల=మిఱుమిట్లు గొల్పు భూషణములను, చేలకాంతుల= వస్త్రకాంతులను, పూనికాయె= స్థిరమైయున్నది. పావనముసేయు= పవిత్రముచేయునట్టి, మావరునికి= లక్ష్మీపతికి (మా నాయకుడైన రామునికి), భావుకము=మాంగళ్యము.

ఈ కీర్తనమందు శ్రీ త్రిపురసుందరీదేవతయొక్క దివ్యసౌందర్యమును వర్ణించుచూ సకల చరాచరప్రకృతిసౌభాగ్యము ఆ పరదేవియందు సహజమైయున్న దనియు అది అనంతమనియు చెప్పి బ్రహ్మాదులకు సైతము వర్ణింప నలవిగానిదని నిరూపించినారు.

ఓ త్రిపురసుందరీ! నీవు సనందనాది మహాయోగులచే పూజింపబడుదానవు. పరదేవతవునైన నిన్ను దేవతలే వర్ణింపలేకున్నచో నే నెంతటివాడను. అయినను యథామతి నీ దివ్యరూపమును భావించువాడను.

అమ్మా! కలకలలాడు నీ ముఖకాంతిని జూచి తన సౌందర్య మేపాటియని చంద్రుడు భూమికే రాలేక ఆకసమందే నిలిచిపోయినాడు. మరియు నీ శృంగార లావణ్యమును చూచియే కాబోలు, మన్మథుడు తన సౌందర్యగర్వమును విడచుటయే గాక శరీరమునే విడచి అదృశ్యుడై నాడు. జననీ! నీ గాంభీర్యమునకు వెరచి సముద్రుడు జడత్వము పొందినాడు. (జడమనగా నీరని స్వభావార్థము. నిశ్చేష్టుడైనాడని శ్లేషార్థము) మరియు నీయందుగల ధీరత్వమును చూచి మేరువు తాను సహజముగా సువర్ణాకారుడైనను ఆ రూపమును విడచి విస్మితుడై శిలయైపోయినాడు. ఇట్లే చేపలు, తల్లీ! నీ సోగైన కన్నుల జూచి తమ రూపమునకు సిగ్గుబడి నిరంతరమూ సముద్రమందే దాగి వసించుచున్నవి. వీరి మాటకేమిగాని, ఓ జననీ! నీప్రియుఁడగు పరమశివుడు నీ చిరునవ్వు కాంతి తనయందు సోకుటచేతనే కాబోలు స్వచ్ఛమైన తెల్లని కాంతిగల్గి నిర్మలుఁడైయున్నాడు.



తళతళలతో మిఱుమిట్లు గొల్పు నీ భూషణముల యొక్కయు, దుకూలవస్త్రములయొక్కయు తళుకులను చూచి మాకాంతి ఎంతని అభిమానముతో మెఱుపులు ఒక్క నిమిషమేని నిలువక చాంచల్యము గల్గియున్నవి. ఇట్లే, శ్రీసరస్వతియు నీ మధుర స్వరమును విని నీ ఎదుటకు రాలేక ఎల్లప్పుడూ తనప్రియుడైన బ్రహ్మయొక్క నాల్కయందే స్థిరనివాసము గలదైనది. ఈ అంతచందములకు మించిన మరియొక విశేషమేమనగా అమ్మా! పరమపవిత్రమగు నీ మహిమ భక్తుల పాపములనెల్ల పారదోలు చున్నది. "సర్వమంగళ" గావున దేవి మహిమ వ్యాపించియున్న తావున పాపములు భయపడి పారిపోవునని భావము. సకల చరాచర ప్రపంచరూపిణివగు నీ దివ్యతత్త్వమును నీ దయచేతనే సత్కవులు తెలిసి ప్రణవమాతృకాస్వరూపిణి శబ్దమయస్వరూపిణిగా భావించుటచేతనే అనేక సత్కావ్యములను రచించగల్గుచున్నారు. విశేషించి మా ఉపాస్యదైవమగు లక్ష్మీపతికి నీవు చెల్లెలివని శుద్ధసత్త్వముగా పెద్దలు బల్కుచున్నారు. ఇన్ని విశేషములతో త్యాగరాజు త్రిపురసుందరీ దివ్యచరణములే సకల జగత్తునకు తనకు మాంగళ్యమిచ్చునవియనీ భాగ్యరూపములనీ భావించుకొను చున్నాడు. ఇంతకన్న నిన్నుఁగూర్చి వర్ణించుటకు నేనెంత యని సర్వలోకాతిశయ సౌందర్యము నాయమ్మయందు తీర్చిదిద్దినారు. ఈ కీర్తనమే ప్రత్యేక కావ్యరూపముగా నున్నదనుటకు ఇందలి పదములసొంపు స్వభావోత్ప్రేక్షాదలంకారములు ఉపమలు భావగాంభీర్యము నిదర్శన మిచ్చుచున్నవి. ఆ యా ప్రకృతిసుందర వస్తువులను వాటి స్వభావములనే పరదేవతా సౌందర్యపరముగా ఉత్ప్రేక్షించుట ఎంతయూ రమణీయముగా నున్నది. ఈ రచనయందును తన అతిశయమును చూపుకొనక తల్లీ! సత్కవులు నీ దయచేతనే కావ్యములు సేయనాయె నని తమ సరస్వతీ ప్రసన్నతను ఆ దేవి యను గ్రహముగా భావించుట భక్తలోకమునకేగాక కవిలోకమునకునూ దివ్యోపదేశమని తెలియుచున్నది. చివరకు

ఉపాస్యదైవమగు రామునికి చెల్లెలని ఎంతో సరసముగా బాంధవ్యమును కూర్చుకొనుటలో లాలిత్య మొలుకుచున్నది.

## 470. బ్యాగడ - రూపకం

**సుందరి నన్నిందరిలోఁజూచి బ్రోవవమ్మ త్రిపుర ॥సుం॥**

**సందడియని ఇందుముఖి జాలము వద్దమ్మ త్రిపుర ॥సుం॥**

**బాలే పాలితసురజాలే గమనజిత మ**
**రాళే స్వకృతాఖిలలీలే తిలకాంకిత**
**ఫాలే నీభక్తియు మేలే నీదయ రా**
**దేలే తల్లి త్రిపుర ॥సుం॥**

**వాణీవినుతే శుకపాణీ వరశేష**
**వేణీ లలితే కల్యాణీ సాంబశివుని**
**రాణీ మాధుర్యవాణీ నమ్మితిఁబూ**
**బోణీ తల్లి త్రిపుర ॥సుం॥**

**వారీశస్తుత గంభీరే యాదిపుర వి**
**హారీ దీనజనాధారీ నగరాజ కు**
**మారీ దుష్కర్మవిదారీ త్యాగరాజు**
**కోరియున్న త్రిపుర ॥సుం॥**

బాలే=బాలాత్రిపురసుందరి, పాలితసురజాలే=దేవసమూహములను పాలించునది, గమనజిత మరాళే=రాజహంస నడకను తన గమనముచే జయించినది, స్వకృతాఖిలలీలే=లీలాకల్పితమైన సర్వప్రపంచముగలది, తిలకాంకితఫాలే=లలాటమందు (కస్తూరీ) తిలకముగలది, నీభక్తియు మేలే=నీభక్తియే మేలైనది, రాదేలే=ఏలరాదు, వాణీవినుతే=సరస్వతిచే నుతిగన్నది, శుకపాణీ=చేత చిలుక గలది, వరశేషవేణీ=శేషసర్పమువంటి



జడగలది, వారీశ....గంభీరే= (సముద్రునిచే) వరుణునిచే స్తుతింపబడ్డ గాంభీర్యముగలది. ఆదిపురవిహారి= తిరువత్యూరునందుండునది, దీనజనాధారీ= దీనుల కాశ్రయమైనది, నగరాజకుమారీ= హిమవంతునికన్య, దుష్కర్మవిదారి= దుష్కర్మలను నాశనము చేయునది.

ఓ త్రిపురసుందరీ! నీభక్త కోటులందరిలో నన్నునూ కటాక్షించి కాపాడుము. తల్లీ! ఇందరిలో సందడిగా నున్నదని కాపాడుట కాలస్యము చేయవలదమ్మా. సకల దేవతాజాలములను కాపాడుదానవు. నీ లీలామాత్రముననే సకల బ్రహ్మాండ గోళములను కల్పించుదానవు. నీభక్తియే మేలు. నీదయ రావలెను అని ఆ పరదేవతయొక్క సౌందర్యమును అనేకవిశేషణములతో వర్ణించినారు. దీనజనులను ఉద్ధరించి వారి దుష్కర్మములను హరించునట్టిదానవని త్యాగరాజు నీపాదభక్తినే కోరియున్నాడు. కావున, బ్రోవుము అని ప్రార్థించినారు.

## 471. పంతువరాళి - ఆది

**సుందరతర దేహం వం దేహం రామం ॥సుం॥**

**కుందరదన మా ప్తకుముదశశాంకం**
**కందర్పశతకోటికాంతి మతినిష్కళంకం ॥సుం॥**

**పతితజన పావనం పరిపాలితభువనం**
**శ్రుతినికరసదనం శుభకరవదనం**
**యతివరజీవనం ఇభరాజపాలనం**
**దితిజమదదమనం దీనజనావనం ॥సుం॥**

**నవదూర్వదళనీలం నందితామరజాలం**
**అవనతసురపాలం అద్భుత లీలం**
**భవభయహరణకాలం భక్తజనవత్సలం**
**శివ మద్వైత మమలం శ్రీ మత్క నకాభ చేలం ॥సుం॥**

**ఆగమసంచారం అఖిలలోకాధారం**
**వాగధిపకుమారం వరవీరవీరం**
**రాగాదిసంహారం రాఘన ముదారం**
**త్యాగరాజహృత్సంచారం కారుణ్యపారావారం ॥సుం॥**

సుందరతరదేహం=మిక్కిలి సుందరమైన దేహముగలవాడు, వందే అహం రామం=రాముని నేను నమస్కరించుచున్నాను, కుందరదనం= మల్లెమొగ్గలవంటి దంతములుగలవాడు, ఆప్త కుముద శశాంకం= ఆప్తు లనెడి కలువలకు చంద్రుడు, కందర్ప....కాంతిం= కోటిమన్మథులవంటి కాంతిగలవాడు, అతినిష్కళంకం= మిక్కిలి నిర్మలస్వరూపుడు, పతితజన పావనం= దీనులను పునీతముచేయువాడు, పరి....భువనం= సకలభువన ములను పాలించువాడు, శ్రుతినికర సదనం= వేదసమూహమే నివాసముగా గలవాడు, యతివరజీవనం= యోగిశ్రేష్ఠులకు జీవనమైనవాడు, దితిజమద దమనం= రాక్షసుల మదమణచినవాడు, నవదూర్వదళనీలం= లేతగరికవలె నీలవర్ణము గలవాడు, నందితామరజాలం= దేవసమూహములను ఆనందపెట్టువాడు, అవనతసురపాలం= విధేయులైన ఇంద్రాదులు గలవాడు, భవభయహరణకాలం= సంసార భయమును హరించుటకు కాలుని వంటివాడు, శివం= మంగళస్వరూపుడు, అద్వైతం= ఏకవస్తురూపుడు, అమలం= నిర్మలుడు, శ్రీ....చేలం= శోభాయమానమగు బంగారు కాంతిగల వస్త్రముగలవాడు, వాగధిపకుమారం= బ్రహ్మ కుమారుడుగా గలవాడు, వరవీరవీరం= ఉత్తమశూరులలో శూరుఁడు. ఉదారం= ఔదార్యవంతుఁడు. త్యాగరాజ హృత్సంచారం= త్యాగరాజుని హృదయమందు విహరించువాడు, కారుణ్యపారావారం= కరుణాసముద్రుడు.

ఇందు శ్రీరాముని అనంతకల్యాణగుణములను రూపసౌందర్యమును వర్ణించి **"శివమద్వైతం"** మొదలగు విశేషణములచే తారక బ్రహ్మరూప మనియు ఒక్కటే తత్త్వమనియు సకలవేదములకు తాత్పర్యమైనవాడనియు



చెప్పి తత్త్వార్థమును కీర్తించినారు. ఇందలి పదములు భావములు మిక్కిలి సుందరములుగా నున్నవి.

## 472. కల్యాణి - ఆది

**సుందరి నీ దివ్యరూపమును-జూడఁదనకు దొరికెనమ్మ ॥సుం॥**
**మందగమన నీ కటాక్షబలమో**
**ముందటి పూజాఫలమో త్రిపుర**
**నిసరి నీసధని పధపమాప గమపధనిసానిధప**
**మగారీస నీరిరిసగా గారిధ పామగధా ధానిధని**
**సని ధరిసానిధ గరీగరి గసరీ సరిసనిసాని**
**ధని పధాపమపగమప మపధ పధని ధనిస**
**ధనిసరిగా రిసనిధా పమగరీ నిసరిగామ పధ ॥సుం॥**

**భువిలో[1]వరమౌ శ్రీమదాది**
**పురమున నెలకొన్న నీ సొగసు విని**
**సువివేకులైన బ్రహ్మాది-సురలు గుంపు గూడి**
**కవివాసరపుసేవ కనుంగొన**
**కలుగునా యని కరఁగుచు మదిలో**
**దివి దత్తరము పడుచునుండఁగా**
**దీనజనార్తిహారిణి త్రిపుర ॥సుం॥**

**కలిలో దీనరక్షకి యని సభ**
**కలిగిన తావునఁబొగడుదు నమ్మా**
**సలలిత గుణ కరుణాసాగరి నీ-సాటి యెవరమ్మా**

**[2]అలసివచ్చినందుకు నా మనసు**
**హాయి చెందు నా యని యుండగ మతి**

1. నారమౌ. 2. కలసి

**కలకలమని సురసతులు వరుసగాఁ**
**గొలుచు శుక్రవారపు ముద్దు త్రిపుర ॥సుం॥**

**నన్నుఁ గన్నతల్లి నా జన్మము**
**నాఁడు సఫలమాయె నమ్మా ఇపుడు**
**ఘనదరిద్రునికి పైకమువలెఁగనుల పండువుగా**
**వనజనయన ఎండుపైరులకు జలమువలె శుభ దాయకి కామ**
**జనకుని సోదరి శ్రీత్యాగరాజమనోహరి గౌరి ॥సుం॥**

మందగమన=మందమైన నడకగలది, ముందటి=తొలిజన్మయందైన, కవివాసరపుసెవ=శుక్రవారపుసేవ, కరగుచు=ప్రేమార్ద్రులగుచు, దివి=ఆకసమందు; తత్తరము=తొందరపాటు, సలలితగుణ కరుణాసాగరి=సుందరములైన గుణములు కల్గి కరుణకు సముద్రమువంటిదానా, అలసివచ్చి నందుకు=పరితాపముతో వచ్చినందుకు, సురసతులు=దేవకాంతలు, వనజనయన=పద్మనేత్రీ, కామజనకునిసోదరి=మన్మథుని తండ్రియైన విష్ణువునకు చెల్లెలు, శ్రీత్యాగరాజ మనోహరి=త్యాగరాజుడను (శివునికి) కాంత.

ఇందు శ్రీబాలాత్రిపురసుందరియొక్క శుక్రవారపుసేవ ప్రస్తుతించఁ బడినది. ఓసుందరీ! నాపూర్వజన్మ భాగ్యముననూ నీ కటాక్షబలముననూ నీదర్శన మబ్బినది. భూలోకమున ఆదిపురమున (నేటి తిరువత్యూరు) నీవు వెలసి ఇచటివారు చేయు శుక్రవారపు పూజల నందుచుండగా నీసొగసు దర్శించవలెనని మురియుచూ బ్రహ్మాదిసురలు ఆకాశమందు గుంపులుగూడి యున్నారు.

ఓ జననీ! కలిలో దీనులైనవారిని కాపాడు దయామయివని పలుసభలలో నీ కీర్తిని పాడుకొందును. నాకు నీ దర్శనము ప్రాప్తించినందుకే నా మనస్సు బ్రహ్మానంద మొందుచుండగా దేవకాంతలు కూడ వచ్చి



ముచ్చటగా శుక్రవారపు సేవ సేయుచుండగా చూడగల్గుటచే నాజన్మ సఫలమైనది. పేదవానికి అప్రయత్నముగా ధనరాసులు లభించినట్లు ఎండలచే ఎండిపోవుచున్న పైరులకు చక్కని వర్షము కురిసినట్లు నా కనులపండువుగా నీ సేవాభాగ్యము లభించినది. ధన్యుడనైతిని తల్లీయని సకల పరివారములతో పూజల నందుచున్న త్రిపురసుందరిని కీర్తించినారు.

## 473. సింధురామక్రియ – ఆది

**సుధామాధుర్యభాషణ సుధాక రానన ॥సు॥**

**కథామృతముచే బహుకాలము ఆఁ**
**కలి దీరియున్నాను బ్రోవుము ॥సు॥**

**దురాత్ములగు భూకిరాతకులఁజే**
**ర రాదనుచు సుందరాకార నీ**
**పరాయణుల చెలిమి రాఁగోరు త్యా**
**గరాజనుత ఓ పరాత్పర సుగుణ ॥సు॥**

సుధామాధుర్యభాషణ= అమృతమువలె మధురమైన పల్కులుగలవాడు, సుధాకరానన= చంద్రునివంటి ముఖముకలవాడు, భూ కిరాతకుల= ఈ లోకమందలికిరాతకులవంటి దుర్జనులను, నీ పరాయణుల= నిన్నే చింతించు సజ్జనుల, చెలిమి= స్నేహము, రాఁగోరు= రావలెనని కోరునట్టి.

ఓ పరాత్పరుఁడవైన రామా! నీ మాటలు అమృతమువలె మాధుర్యము గలవి. చంద్రకాంతిగలది నీ దివ్యముఖారవిందము. ఇట్టి నీదివ్యమూర్తినే చింతించుచూ ఎంతో కాలము నీ కథలనెడి అమృతమును త్రావి నీ దివ్యనామమును కీర్తించి నేను తృప్తి నొందియున్నాను. ఈ కలిలో లోకమందలి దుర్జనుల చెంతచేరక సదా నీయందు పరమభక్తిగల భాగవతజనులతో చేరి అదియే ఎల్లప్పుడు నాకు కావలెనని కోరు కొన్నాను. కావున, నన్ను కాపాడి నీ దివ్యసాక్షాత్కారమిచ్చి ముక్తునిగాఁజేయుము.

అనగా నిరంతరము శ్రీరామచరిత్రను కీర్తించుటచే తృప్తుడై శ్రీరాము డొక్కమారు తనకు దర్శనమిచ్చి అమృత మొల్కు నట్లు మాట్లాడవలెనని త్యాగరాజుని కోరిక.

## 474. శంకరాభరణం - ఆది

**సుందరేశ్వరుని జూచి సురలఁ-జూడ మనసు వచ్చునా ॥సుం॥**

**అందముగల వరకాశికి సమానమైన గోపుర**
**మందు వెలయుమా ॥సుం॥**

**చరణములను బంగారునూపురములు**
**కరముల రవకంకణయుగములు శ్రీ**
**కర ముఖమున కస్తూరితిలకము**
**మెఱయుచునుండు లావణ్యముఁగల ॥సుం॥**

**ఒకచో బ్రహ్మాదిసురలు ఒకచో నిర్జరవారతరుణులు**
**ఒకచో తుంబురు నారదాదులు**
**ఒకచో భక్తులెల్లఁ బాడు ॥సుం॥**

**రాజరాజునికి చెలికాఁడయిన రాజశేఖరుని గోపురనిలయుని**
**రాజసగుణరహితుని శ్రీత్యాగరాజ**
**పూజితుని రజతగిరీశుని ॥సుం॥**

వరకాశికి= శ్రీకాశీక్షేత్రమునకు, గోపురమందు=కోవూరునందు, రాజ రాజునికి=కుబేరునికి, రాజశేఖరుని=చంద్రుడు శిరోభూషణమైనవాని, రాజసగుణ రహితుని=విశుద్ధసత్త్వమూర్తియైనవాని, రజతగిరీశుని= కైలాసవాసుని.

ఇందు కోవూరి సుందరేశ్వరుని మనోహర సౌందర్యమును వర్ణింపదలచి సుందరేశ్వరుని చూచిన తర్వాత, మరేదేవతలనూ చూచుటకు మనసే రాదని



కీర్తించినారు. పరమశివుడు శ్రీకాశీతుల్యమైన కోవూరునందు అతి లావణ్యమూర్తిగా వెలసి యుండుటచేతనే సుందరేశ్వరుఁడనియు ప్రసిద్ధిగల్గెను. ఆ పరమశివుని చరణములందు బంగా రందెలున్నవట. కరములందు వజ్రరత్నములతో నమర్చిన కంకణములునూ గలవట. దివ్యఫాలమున కస్తూరితో కావిరిబొట్టుకూడ నలంకరింపఁబడినదట. ఇట్టి పరమేశ్వరుని సేవించుటకు ఒకప్రక్క బ్రహ్మాదిదేవతలు మరొకచో దేవవేశ్యలు మరొక్క భాగమున తుంబురు నారదాదులు పరమభక్తులు సేవించుచున్నారట. ఇట్లు కుబేరునికి చెలికాడైన శ్రీ సుందరేశ్వరుఁడు మహావైభవముగా శుద్ధసత్త్వమూర్తియై వెలయుచున్నాఁడు. ఈ సౌందర్య మే దేవతలందునూ లేదని వర్ణించినారు. సుందరేశ్వర స్వామి కోవూరునందు లింగాకృతియేగాక సుందరమగు అవయవములతో వెలసియుంట ప్రసిద్ధమే.

## 475. శ్రీరంజని - రూపకం

**సొగసుగా మృదంగ తాళము జత గూర్చి నినుఁ**
**జొక్కఁజేయు ధీరుఁడెవ్వఁడో ॥సొ॥**

**నిగమశిరోర్థము గల్గిన నిజవాక్కులతో స్వరశుద్ధముతో ॥సొ॥**

**యతివిశ్రమ సద్భక్తివి-రతిద్రాక్షారస నవరస**
**యుతకృతిచే భజియించే-**
**యుక్తిత్యాగరాజుని తరమా శ్రీరామ ॥సొ॥**

నిగమశిరోర్థము=ఉపనిషత్తుల తాత్పర్యము, నిజవాక్కులతో= సత్యవచనములతో స్వరశుద్ధముతో= శుద్ధస్వరములతో, యతివిశ్రమ... కృతిచే= యతిప్రాసములు, ఉత్తమభక్తి, పదవాక్యముల చివ్వర విశ్రాంతి, ద్రాక్షాపాకమువంటి లాలిత్యము, నవరసములు వీటితోచేరిన కీర్తనచే, యుక్తి=

కౌశలము, త్యాగరాజుని తరమా= త్యాగరాజను శివుని కితరుఁడైన వానికి సాధ్యమా(లేక) ఆత్మార్థమున త్యాగరాజునికి–తరమా యని సమన్వయము.

ఓరామా! సంగీత సంప్రదాయమును బాగుగా నెరిఁగి వివేక వైరాగ్యములతో గూడిన తత్త్వనిశ్చయమునూ తెలిసి నిన్ను గూర్చి సంకీర్తనము చేయఁగల్గుట ధన్యత గలది. నృత్తము–వాద్యము–గీతము–అను నీ మూడిటియొక్క మేళనమే సంగీతమని సంప్రదాయము. కావున, సొగసుగా మృదంగమందలి తాళగతితో తన సంగీతకృతిని మేళవించి నిన్నానందింపజేయగల మహాత్ముడెవ్వడోగదా! యని తన ఆనందమును వెల్లడించినారు. పైన “సొగసుగా” యని విశేషించుటచే మృదంగము దానియందు సహజమైయున్న తాళగతియు గాయకుని గానమును పోషించుచూ దాని ననుకరించవలెనేగాని లయ గాయకుని మనోధర్మమునకు విక్షేపమును కల్గించరాదు అని అభిప్రాయము. ఇక తాను కీర్తించు కీర్తనమున్నూ ఏదో లోకసామాన్యములైన భావములతో జిగిబిగియైనపదముల గుంపుతో కటువుగా నుండరాదు. పరమేశ్వరుని స్వరూపమునకు అంతరంగమునకు సరియైన ఉపనిషద్వాక్యములందలి తాత్పర్యములతో నిండి గంభీరభావములతో నొప్పుచూ యతిప్రాసములుండి భక్తిరసముప్పొంగునట్టి భగవన్నామములు మధ్య మధ్య ప్రయోగింపఁబడుచూ ఒక్కొక్క భావమునకు చేరిన పదవాక్యముల తుదిని గానమందలి రాగభావమును ఒప్పించుటకు తగు విశ్రాంతిగల్గి కవిత ద్రాక్షాపాకమువలె లలితమై యుండి అందందు సందర్భోచితముగా నవరసముల నొలికించుచూ మనోహరముగా నుండవలెను. ఇట్టి కృతిచే శ్రీరాముని భజించు కౌశలము శ్రీ త్యాగరాజునికే (శివునకే) గలదని చెప్పుట ద్వారా ఇందలి స్వారస్యము తనకును (మన త్యాగరాజునికి) గలదనియే ధ్వనించుచున్నను త్యాగరాజునికి తరమాయని తన నిగర్వమునుకూడ సూచించినారు. ఇట్టి మర్యాదతో రాముని కీ ర్తించువాడు ధన్యుఁడు మహనీయుఁడని భావము.



## 476. కన్నడగౌళ – రూపకం

**సొగసుఁజూడఁదరమా నీ ॥సొ॥**

**నిగనిగమనుచుఁగపోలయుగముచే మెఱయుమోము ॥సొ॥**

**అమరార్చిత పదయుగమో అభయప్రదకరయుగమో**
**క మనీయ తనునిందిత కామ కామరిపునుత నీ ॥సొ॥**

**వరబింబసమాధరమో వకుళసుమంబుల యురమో**
**కరధృతశరకోదండ మరక తాంగవరమైన ॥సొ॥**

**చిఱునవ్వో ముంగురులో మఱి కన్నుల తేటో**
**వరత్యాగరాజార్చిత వందనీయ ఇటువంటి ॥సొ॥**

అమరార్చిత పదయగమో=దేవతలు పూజించు పాదయుగములా, అభయ ప్రదకరయుగమో=అభయమిచ్చునట్టి హస్తములజంటయా, కమనీయ....కామ=మన్మథునికన్న అతిశయమైన శరీర సౌందర్యముగల వాడా, కామరిపునుత=శివునిచే నుతుఁడు, వకుళసుమంబుల యురమో= పొగడ పూలమాలలచే నిండిన వక్షస్థలమా, మరకతాంగ= మరకతమాణిక్య మువంటి నీలకాంతిగలవాడా, వందనీయ=నమస్కరింపబడువాడా.

ఓ రామా! నీ సొగసు అందచందములను చూడవశమా. ఎంత చూచినా తనివి తీరునా. అద్దమువలె నిగనిగలాడు గండప్రదేశములతో కూడిన నీ ముఖారవిందము సౌందర్యమునకు నివాసమే. మరిన్నీ దేవతలుకూడ నిత్యము అనురాగముతో పూజించు నట్టి నీ పాదములు, సర్వలోకముల కభయమిచ్చునట్టి నీ దివ్యహస్తములు లోకోత్తర మైన మహిమ గల్గియున్నవి. మన్మథుని మించిన యందము దేవతలకు కోరదగిన మహిమయు నీయం దేకముగా గలవు. బింబఫలమువలె ఎఱ్ఱని కాంతిగల నీయధరము పొగడపూవులతో నిండిన వక్షస్థలమూ నీ సౌందర్యమును

చూపుచున్నవి. చేత ధనుర్బాణములు నీ పరాక్రమ సూచకములు. అన్నిటికన్న విశేషముగా మనసు నాకర్షించ గల సహజాలంకారములు, నీ చిరునవ్వు, ఫాలమందలి ముంగురులు, నీ కన్నులందలి తళుకు. ఇటువంటివెన్నో మనోహర భావములు నీ యందు నిత్యనూతనములై ప్రకాశించుచుండును. ఇందేదిచూచిన తనివితీరుటలేదు. ఇంతటి సౌందర్యము మాదృక్కులకు మితిమీరియున్నది అని త్యాగరాజస్వామి రాముని రూపమును వర్ణించుకొనుచూ "పదయుగమో కరయుగమో యని ఓకారాంతముగా ప్రయోగించుటవలన అదా ఇదా ఏమి ఈ అపార సౌందర్యము, ఆహా ఎంత ఆశ్చర్యమని సంభ్రమముతో ఆనంద మొందుట ఇందలి భావము.

## 477. యమునాకళ్యాణి - ఆది

**హరి దాసులు వెడలే ముచ్చట-ఆనందమాయోదయాళో ॥హ॥**

**హరి గోవింద నరహరి రామకృష్ణయని**
**వరుసగ నామము కరుణతోఁజేయుచు ॥హ॥**

**సంగతిగాను మృదంగఘోషములచే**
**బొంగుచు వీధుల కేగుచు మెఱయుచు ॥హ॥**

**చక్కని హరిచేఁజిక్కి తిమని మదిఁ**
**జొక్కుచు నామమె దిక్కని పొగడుచు ॥హ॥**

**దిట్టముగా నడుకట్టుతో నడుగులు**
**బెట్టుచు తాళము బట్టిగల్ గలనఁగ ॥హ॥**

**జ్ఞానముతో రామధ్యానముతో మంచి**
**గానముతో మేను దాన మొసంగుచు ॥హ॥**

**రాజరాజునిపై జాజులు చల్లుచు**
**రాజిల్లుచు త్యాగరాజునితోఁగూడి ॥హ॥**



హరిదాసులుకూడి బృందగానము చేయుచూ త్యాగరాజునితో సహా తిరువాది వీథులయందు వెడలుచున్న దృశ్యమును ఇందు మనోహరముగా వర్ణించుకొన్నారు.

భాగవత భక్తకూటముతో హరికీర్తనము చేయునట్టి ముచ్చట ఎంతో ఆనందము కల్గించుచున్నది. రామా! యని తన యానందమును రామునికి నివేదించు కొనుచున్నారు.

హరిదాసు లెల్లరు హరీ గోవిందా నరహరీ రామా కృష్ణా యని మంగళ నామములను వరుసగా రాగ భావ సంగతులతో పాడుకొనుచూ మృదంగధ్వనులు చెలరేగగా ఇనుమడించిన ఉత్సాహముతో పొంగుచూ ఆర్తిని కరుణారసమును తమ కర చరణ విన్యాసములందునూ చూపుచూ సుప్రసన్నములైన ముఖములతో కలకల లాడుచూ వీథులలో తిరుగుచున్నారట. మరియు వీరు కీర్తనము చేయు నపుడు తాము చక్కనైన శ్రీహరికి పరవశులై యున్నటుల భావించుటచే హరి నామమును బల్కునపుడు చొక్కుచూ ఈ దివ్యనామమే మాకు శరణ్యమని వాక్కు చేతను భావముచేతను శారీరకాభినయముచేతనూ కూడ వెల్లడించుచున్నారట. గట్టిగా నడుము కట్టులను ఉత్తరీయములతో బిగించి (ఇది ప్రప త్తికి సూచనము) మెల్లగా అడుగువెంట అడుగిడుచు తమ చేతుల తాళములను ఘల్లుమని గతి తప్పక మ్రోగించుచూ సహజానందరసముతో నుప్పొంగినభావములతో మనోహర ముగా గానము చేయుచూ మధ్య మధ్య సంకీ ర్తనా పారవశ్యముతో ధ్యానమున మునుగుచూ ఆ నామములందలి తత్త్వార్థములను గుర్తెరుంగుచూ తమ శరీరములను శ్రీహరికి సమర్పించుకొని పరవశులై శ్రీరాముని దివ్య మూ ర్తిని (పటమునో, విగ్రహమునో) తమవెంట నిడుకొని మధ్య మధ్య దానిమీద జాజులు చల్లుచూ పరమానంద తాండవముతో వెడలుచున్నారని ఆ దృశ్యము కన్నుల గట్టునట్లు వర్ణించినారు. ఇందలి పద లయ గతియు యమకములును ఆ కీర్తనయొక్క మర్యాదనే యనుకరించుట స్వారస్యముగా

నున్నది. ఇది స్వీయానుభావము గావున ఇంతటి భావగాంభీర్యము గల్గియున్నది.

## 478. ముఖారి – ఆది

**క్షీణమై తిరుగ జన్మించే–సిద్ధి మానురా ఓమనసా ॥క్షీ॥**

**గీర్వాణ నాటకాలంకార వేదపు**
**రాణ యజ్ఞజపతపాదుల ఫలము ॥క్షీ॥**

**ఏదిచేసిన జగన్నాథుఁడు శిరమున**
**హృదయమున వహించి**
**పదిలమైన సత్పదము నొసంగే బాట**
**త్యాగరాజవినుతుని భజనరా ॥క్షీ॥**

జన్మించేసిద్ధి=జననాధుల నిచ్చునట్టి ఫలప్రాప్తి, గీర్వాణ=సంస్కృతము.

ప్రపంచమందు వివిధములైన ఫలములనిచ్చు సాధనము లనేకములు గలవు. కాని, అవన్నియు పునరావృత్తిగలవై జన్మపరంపరలనే ఇచ్చునుగాని శాశ్వతానందమివ్వనేరవు. కావున! ఇందు శ్రీత్యాగరాజు తన మనసునే సంబోధించుచూ ఓ మనసా! నీవు చేయుకర్మలు ఫలములు అనుభవముచే క్షీణించిపోగా మరల సుఖదుఃఖ మిశ్రమమైన జన్మయే ఫలముగాగల సిద్ధిని మానుము. పరిశుద్ధమైన వాఙ్మయము నుపాసించుటవలనగాని సత్కావ్యములను నాటక రూపకాదులను రచించుటవలనగాని వేదాధ్యయనము పురాణ పఠనాదుల వలనగాని యజ్ఞ జపాదుల వలనగాని వచ్చుఫలము తప్పకుండా పునర్జన్మనిచ్చునట్టిదే కాన అట్లుగాక ఏకాగ్ర భక్తితో శ్రీహరిని మనో వాక్కాయముల నొక్కచో చేర్చి భజించితివేని నీ వెట్టికర్మలు చేసినను శ్రీహరి శిరసా మనసా అనురాగముతో స్వీకరించి పునరావృత్తిలేని స్థిరమైన ఆనందము నిచ్చునట్టి ముక్తిని అనుగ్రహించును. ఇట్టి మోక్షానందమందు పై జెప్పిన ఉత్తమ సాధనలందలి ఫలములన్నియు



అంతర్భవించియున్నవే. పరమాత్మను భజించుచూ నీ చేయునవి హరికి సమర్పించితివేని అవి కొద్దిపాటివైనను పరమాత్మ ఘనమైనవాటిగానే స్వీకరించును. కావున, జన్మపరంపరల నిచ్చునట్టి ఇతర భావములను విడనాడుము.

**ఆబ్రహ్మభువ నా ల్లోకాః పునరా వృత్తినోఽర్జున।**
**మా ముపేత్య తు కౌంతేయ పునర్జన్మ న విద్యతే ॥ ॥గీత॥**

ఓ అర్జునా! బ్రహ్మలోకము మొదలు అన్నియు పునరావృత్తిగలవే. నన్ను పొందినవానికి మాత్రము పునర్జన్మ దుఃఖము గలుగదు అనియు **"క్షీణే పుణ్యే మర్త్య లోకం విశంతి"** యజ్ఞాది రూపములైన ఉత్తమకర్మ లాచరించి స్వర్గాది ఫలముల నొందినా ఆ పుణ్యఫలము క్షీణించినంతనే మరల జన్మకు వత్తురు. కావున, సర్వమునూ హరిసమర్పణ చేయుచూ హరిని శుద్ధమనసుతో భజించువాని సిద్ధి సర్వోన్నతమైనది.

## 479. దేవగాంధారి – ఆది

**క్షీరసాగరశయన నను–చింతలఁబెట్టవలెనా రామ ॥క్షీ॥**

**వారణరాజును బ్రోవనువేగమె–**
**వచ్చినది విన్నానురా రామ ॥క్షీ॥**

**నారీమణికిఁజీరలిచ్చినది నాఁడే నే విన్నానురా**
**ధీరుఁడౌ రామదాసుని బంధము–దీర్చినది విన్నానురా**
**నీరజాక్షికై నీరధి దాటిన–నీ కీర్తిని విన్నానురా**
**తారకనామ త్యాగరాజనుత–**
**దయతో నేలుకోరా రామా ॥క్షీ॥**

వారణరాజును=గజరాజును, నారీమణికి=ద్రౌపదికి, నీరజాక్షికై=సీతకై, నీరధి=సముద్రమును.

ఇందు శ్రీ త్యాగరాజస్వామి క్షీరసాగర శయనుఁడైన శ్రీహరి భక్తరక్షణ మందు చూపిన ఉదారమును తలంచుకొనుచూ నన్ను నట్లే కాపాడుమని ప్రార్థించినారు. ఇందు కనేక నిదర్శనములను చూపుచూ మొట్టమొదట స్వయం వివేచనతో "నీవేతప్ప నితః పరంబెఱుగ" నని వివశుడై ప్రార్థించిన గజరాజును కాపాడ వచ్చుటయు క్రమముగా మానవతి పరమభక్తురాలును అగు ద్రౌపది రాజసభలో అవమానమును సహించలేక "కృష్ణా" యన్నంతనే ఆమెకు వలువల నిచ్చుటయు నేనెప్పుడో విన్నానురా రామా యని మిక్కిలి స్వారస్య మొల్కునట్లు పల్కినారు. మరియు జానకి రాముని ఇల్లాలగుటచే ఆమె ఆర్తిని దీర్చినాడనుట కంటె ఆమె పరమభక్తితో తను వాఙ్మనస్సులచే రామునియం దనన్యయై యుండుటవలననే సముద్రమును దాటి రావణసంహార మొనర్చి సీతను కాపాడి యున్నావనియు అంత కన్న కూడ మిక్కిలి సన్నిహితముగా తనది పరాయిది అనుభేదమే మరిచి సర్వ స్వమునూ రామార్పణ మొనర్చిన రామదాసుని బంధమును తీర్చి కాపాడితివనియు ఋజువుచేసినారు. ఇందరి ఆర్తులను పోగొట్టి వారిని తరింపఁజేసినది రామా నీ తారక నామమే. అనగా: నీ వేమియు ఈ భక్త రక్షణమునకు స్వయముగా శ్రమించవలసిన పనిలేదు. నీతారకనామ మహిమయే చాలునని ధ్వనితో ఓ తారకనామా! యని పిలిచి త్యాగరాజునికూడ పైవారివలె ఏలుకొనుమనియు నిన్నిట్లు మొలబెట్టుకొన్న తర్వాత కూడ నన్ను చింతలబెట్టుట నీకు ధర్మముగాదనియు జాలితో కీర్తించినారు.

* * *

# అనుబంధము

## 1.[1]కనకాంగి – ఆది

**శ్రీ గణనాథం భజామ్యహం**
**శ్రీకరం చింతితార్థ ఫలదం ॥ శ్రీ॥**

**శ్రీగుహాగ్రజ మగ్రపూజ్యం**
**శ్రీకంఠాత్మజం శ్రిత సామ్రాజ్యం ॥శ్రీ॥**

**రంజిత నాటకరంగ తోషణం**
**శింజితవర మణిమయ భూషణం**
**ఆంజనేయావతారం సుభాషణం**
**కుంజరముఖం త్యాగరాజపోషణం ॥శ్రీ॥**

గణములనగా సర్వదేవతలు–మానవులు. వీటికిపతి=గణపతి. ఆధ్యాత్మికముగా, మహత్తత్త్వమాది పంచ మహా భూతములు, మరియు మానవుని అంతఃకరణము ఇంద్రియములు, వాటికన్నిటికి నాధుడు. లక్ష్మీకరుడు, సర్వాధిపతి యగుట వలన ఎవరేది చింతించి, పూజించినను వారికి సర్వార్థములను ఇచ్చువాడు. శ్రీ గుహునికి కుమారస్వామికి అన్న, అగ్ర పూజనందువాడు. శ్రీకంఠుడైన శివునికి కుమారు డగుటచే సర్వ సామ్రాజ్యములు ఆశ్రితుల కిచ్చు శీఘ్ర ప్రసన్నత కలవాడు. ఆంజనేయుడు శంకరాంశుడగుటచే, ఆ అవతార మీ గణనాధునిదే యని సంగ్రహ రామాయణము ప్రమాణము. జగన్నాటకమును రంజింపచేసి, సంతోషమును కలిగించువాడు. సర్వ కళలను ఆరంభించునపుడు. విద్యారంభమందు, వారి వారి ఆత్మశక్తులను విజృంభింపఁజేయు రక్తి గణనాధుని ఉపాసనవలన సిద్ధించునని సంప్రదాయము.

దివ్య మణిమయములైన బంగారు గజ్జెలతో నృత్యముచేయుచూ. తాండవ గణపతిగా నృత్యము చేయుట ఆ దివ్యమూర్తి విశేషము. మంగళ

1. వాలాజాపేట వెంకటరమణ భాగవతులవారి సంప్రదాయంలో అముద్రితములైన కీర్తనలు.

స్వరూపమైనగజ ముఖము కలవాడు. ఇదియే ప్రణవాకారమని శ్రుతులు వర్ణించినవి. ఇట్లు సర్వ విద్యాధి దేవతయైన గణపతిని స్తుతించినారు.

## 2. గంభీరవాణి - దేశాది. మేళకర్త (30)

**సదా మదిం దలతు గదరా**
**ముదాస్పద నగజాధిపతే ॥స॥**

**సదా శివానంద స్వరూప-**
**సదయ మోద హృదయ పద సరోజములనే ॥స॥**

**దిగంబరాంధక దైత్యహర**
**దిగీశ సన్నుత గంగాధర**
**మృగాంక శేఖర నటన చతుర**
**మనుప సమయ మిదిరా త్యాగరాజనుత ॥స॥**

ఇది సదాశివుని స్తుతించు గేయము. ముదాస్పద=సర్వానందములకు నిలయమైనవాడు. నగజా=పార్వతికి అధిపతి=ప్రియుడు ఎల్లప్పుడు ఆనందము, సంతోషముకల హృదయముతో భక్తుల ననుగ్రహించువాడు. దిగంబరుడు, అంధకుడను దైత్యుని సంహరించినవాడు. మృగాంకము, చంద్రకళ శిరసున ధరించినవాడు. దిగీశులు-దిక్పతులైన ఇంద్రవరుణాదులచే సన్నుతుడు.

అట్టి సదాశివా! నన్ను కాపాడ సమయమని వేడుకొన్నారు.

## 3. మాళవశ్రీ - దేశాది

**ఎవరున్నారు బ్రోవ**
**ఇంత తామస మేలనయ్యా ॥ఎ॥**

**వివరంబుగ దెల్పవయ్యా**
**విశ్వేశ శ్రీపంచనదీశ ॥ఎ॥**

**మనసారగ ధ్యానింపను**
**మనసు నిలుపు మర్మంబు దెలిపి**



**తనవాడనే దలచి ధైర్య**
**మొసగు త్యాగ రాజనుత ॥ఎ॥**

తిరువాది పంచనదీశ్వరుడు తనవాడైనట్లు సన్నిహితునిగా భావించి, నన్ను కాపాడుటకు నీకన్న వేరెవరున్నారని, తామసించవలదని వేడుకొన్నారు. రాముడు తన ఇష్ట దైవమైనను, విశ్వమునకే శివుడు ఈశ్వరు డగుటవలన సకలదేవతలు, పరమశివునికి ఆంతర్యమైన వారేనని భావము.

మరియు పంచనదీశుడు - అనగా నదులవలె ప్రవహించు మన పంచేంద్రియ వృత్తులు స్రవంతినులు. వీటికి కేంద్రము మనసు. కావున శంకరా! నిన్ను ధ్యానించుటకు, ధైర్యోత్సాహముల నిచ్చు మనసు మాకు స్వాధీనమగుటలేదు. కావున, మా మనసు నిలకడ చెందునట్లు - నన్ను తనవాడని భావించి రక్షింపుము. **"కపాలిన్! భిక్షో! మే హృదయ కపి మత్యంత చపలం। దృఢంభక్త్యా బద్ధ్వా శివ భవ దధీనం కురువిభో!"** (శివానందలహరి) శంకరులు ప్రార్థించినట్లు ధ్యాననిష్ఠ శివానుగ్రహమువల్లనే కలుగునని తెలియుచున్నది.

## 4. శంకరాభరణం - ఆది

**సారసనేత్రాపారగుణ**
**సామజ శిక్షాఽగోద్ధరణ ॥ఎ॥**

**పాప ఘనాభ్ర సమీరణ పామర**
**పాలిత పావన నామచణ**
**తాపస మానస సారస భ్రమ**
**రాఽనఘ రాఘవ మార-**
**మణ యోగివంద్యపాహి హే!**
**సాగరా ర్తిహరణ రాగలోభ దూర**
**శ్రీత్యాగరాజపోషణ ॥సా॥**

అపారగుణ - అనంత కల్యాణ గుణములు కలవాడు, సామజశిక్ష= సామ వేదమునుండి పుట్టిన (గాంధర్వమును) శిక్షించినవాడు, అగోద్ధరణ=

పర్వత మెత్తినవాడు, (గోవర్ధనం)పాప...సమీరణ= పాపములనెడి మేఘములకు వాయువంటివాడు, పామర...చణ= దీనులను(సైతము) రక్షించు నామము కలవాడు, తాపస... భ్రమర= తాపసుల మనః పద్మమునకు మధుపము వంటివాడు, మా రమణ= లక్ష్మీపతి.

ఇందు రామునికి అభిన్నముగా లక్ష్మీపతిని స్తుతించినారు.

## 5. గానమూర్తి - దేశాది (మే.3)

గానమూర్తే శ్రీకృష్ణవేణు ॥గా॥

గానలోల త్రిభువనపాల పాహి ॥గా॥

మానినీమణి శ్రీ రుక్మిణి
మానసాపహార మార జనక దివ్య ॥గా॥

నవనీతచోర నంద సత్కిశోర
నరమిత్ర ధీర నరసింహశూర
నవమేఘతేజ నగజా సహజ
నరకాంతకాజ నత త్యాగరాజ ॥గా॥

## 6. రత్నాంగి - ఆది

కలశవార్ధిజాం సతతం భజే ॥క॥

కమల లోచనాం రమాం మాం
కలభ గామినీం కరిభిర్వృతాం
కమలనాభ హృత్కమల శ్రితాం ॥క॥

కమనీయ జయ ధనధాన్యరూపాం
కనకాది ధైర్యలక్ష్మీ స్వరూపాం
కమలాం మహాసంతాన రూపాం
కమలాలయాం త్యాగరాజ మోక్షరూపాం ॥క॥

కలశవార్ధిజాం=సముద్రుని కుమార్తె, మాం=లక్ష్మి, కలభగామినీం= గజగమన, కరిభిర్వృతాం=గజలక్ష్మీ, ఈ గేయము లక్ష్మీస్తుతి. జయలక్ష్మి, ధన ధాన్యలక్ష్మి, కనకలక్ష్మి, ధైర్యలక్ష్మి, సంతానలక్ష్మి, మోక్షలక్ష్మి యని అష్టలక్ష్మి స్వరూపములను కీర్తించినారు. త్యాగరాజస్వామి గేయములలో ఈ లక్ష్మీస్తుతి అపూర్వము. "త్యాగరాజ మోక్షరూపాం" అనే అంకితమందు త్యాగరాజునికి మాత్రము మోక్ష స్వరూపిణి యనుట విశేషము.



## 7. హరికాంభోజి - రూపకం

రారా ఫణిశయన రవి జలధిజ నయన ॥రా॥

రాకా శశివదన-రమణీయాపఘన ॥రా॥

రారా భవతరణ-రారామిత సుగుణ
రారా భూ రమణ-రారాబ్జ సుచరణ ॥రా॥

రారా సుకుమార-రారా సమశూర
రారా రఘువీర-రారాయుధి ధీర ॥రా॥

రారా జానకితో-రారా సహజులతో
రారా పవనజుతో-రారా భక్తులతో ॥రా॥

నాగావరనేతా-రాగగుణ విరహితా
సాగర తనయాయుత-త్యాగ రాజవినుత ॥రా॥

## 8. పంతువరాళి - ఆది

హరి హరి యనుకోవే నీ హృద-
యార్తులెల్లఁదొలఁగ జేయుదోవే ॥హ॥

పంతము లీడేరు యీ జగ-
మంత శ్రీహరియంచును పలుమారు ॥హ॥

ఇహపరములు కద్దు ఈ భవ-
గహనమునను హీనవార్త వద్దు ॥హ॥

ధన నెలవులు లేదు పరసా-
ధనముగాని తండ్రి సొమ్ముబోదు ॥హ॥

ఆరోగ్యము గలుగు తొలి జ-
న్మాఘమెల్ల మొదలుబెట్టి తొలగు ॥హ॥

భేదము తోచదురా సద్గురు-
పాదమందు బుద్ధి కుదుర జేసునురా ॥హ॥

రాజమార్గమురా త్యాగ-
రాజు పూజించే బ్రతుకు దోవరా ॥హ॥

## 9. శ్యామ - ఆది

రామరమ రామరమ రామరమ రామరమ
రామరమ రామమాంపాహి ॥రా॥

వనమున చని మునిజన గణమును కను-
గొని నెనరున ఘనమున పాలించిన ॥రా॥

వనజ నయన నిను మనసున దిన దిన
మును కనుగొన నను యనఘుని శాయవే ॥రా॥

సురనర వరశ్రిత చరణ కమలయుగ
కర(వర) ధృత గిరివర యరమర శాయక ॥రా॥

మురఖర హరహరి పరిచర కరుణా-
కర గర ధరనుత కరివర వరదా ॥రా॥

శరణు శరణనుచు నిరతము నిను హృ-
త్సరసిజమున రఘువర పూజింతును ॥రా॥

కలియుగమున నెలకొన్న యితర విబు
ధుల కని నిను నా మదిని దలంతును ॥రా॥

బహువచనము లెందుకు ఇక నీవే-
ఇహపరములు నా సర్వస్వమ్మును ॥రా॥

సరసిజభవ ముఖవందిత పదయుగ
నిరుపమగుణ పాలిత త్యాగరాజ ॥రా॥



## 10. బేగడ - ఆది

ఘట్టివాడె యనుచు పేరు-
బెట్ట వచ్చురా నీకు ॥ఘ॥

సొట్ట మూలబలము తామే-కొట్టుకొనను సేయు నీకు ॥ఘ॥

పట్టికై దశరధుడు-ఇష్టి శాయబుట్టు నీకు ॥ఘ॥

పుట్టనట్టి సతిని చెట్ట-బట్టునట్టు సేయు నీకు ॥ఘ॥

రావణేశుఁ దలలు దునిమి వే-ద్క(వి)జయము బూను నీకు॥ఘ॥

రట్టు తీర్చి త్యాగరాజు చెట్ట-బట్టునట్టు సేయు నీకు ॥ఘ॥

## 11. సావేరి - చాపు

కంటకులను నమ్మనేరనురా, ము-
క్కంటి సన్నుత శ్రీరామా ॥కం॥

ఆశలచేత ధనేశులగాచిన-
గాసి చాలును వృధాశలు జూపే ॥కం॥

తెలియక ఇన్నాళ్లు కలినరులను నమ్మి
యలసితిగాని యాకలి దీర్ప లేని ॥కం॥

తోషింపఁజేసే వేషము ధరియించి
భాషించినా కంఠశోషణేగాని ॥కం॥

మనుజ సమూహములను కన్న తావున-
కనులు మూసి తెరచినగానీ ॥కం॥

దిన దినమును పౌరులఁ బిల్చి తత్త్వము-
వినయము నుపదేశించిన కాసివ్వని ॥కం॥

కొంచెపు నరులను వంచనచేత నే
గించి (నను) జగద్వంచకులయ్యే ॥కం॥

శీలులైన గుణశాలు లుండగా మాయా-
జాల నరుల భాగ్యశాలు లనేటి ॥కం॥

ఎనరాని కోరికే కొనసాగ లేకుంటె
మనసున నిను దూరుకొనిన దురాత్మ ॥కం॥

సముఖానకెల్ల పైకములకు తాననే-
విముఖమైతే దైవములను దూరే ॥కం॥

కరిధన తనయ నికరములఁగోరుచు-
ఫరవలేక నిన్ను మరచియుండేటి ॥కం॥

విడనని రామునిపై దృఢభక్తి దెలిపి ప-
సిడిగన్న మాత్రాన విడిచిపెట్టు ॥కం॥

రాజ దశరథరాజ సుపుత్ర-రాజ మా
త్యాగరాజనుత పవిత్ర ॥కం॥

ఆగత జనపోషణాగమ సంచార-
త్యాగరాజ హృదయాకర నినువినా ॥కం॥

నతజన పోషణ మితపరిభాషణ-
శ్రిత త్యాగరాజసన్నుత సర్వలోక ॥కం॥

పరమ పావననామ కరుణాసింధో!-
వరత్యాగరాజ హృచ్చరదీన బంధో ॥కం॥

## 12. కాపి - ఆది

పాహి పరమదయాళో హరే! మాం ॥పా॥

సుందరానన ముకుంద రాఘవ పు-
రందరాదినుత మందరాగధర ॥పా॥

పంకజాప్త హరిణాంక నయన సీ-
తాంక సుగుణ మకరాంక జనకమాం ॥పా॥

క్రూర మానవ విదార భవ్యకర-
నీరదాభ సుశరీర మా రమణ ॥పా॥

మంజుభాషణ నిరంజనాప్త హృ
త్పం జరాంతచర కంజలోచనా ॥పా॥



నిర్వికారగుణ సర్వరూప ధర
పూర్వదేవ మదగర్వహరణ ॥పా॥

పూర్ణరూప కలశార్ణవ స్థిత సు-
పర్ణవాహన సువర్ణ చేల ధర ॥పా॥

రక్షమా మనిశ మక్షరామృత ర-
సాక్ష నిర్జర సుపక్షచాప ధర ॥పా॥

రంగనాయక శుభాంగ సూర్యకుల-
పుంగవారి మద భంగ సర్వదా ॥పా॥

నాగశయన భవరోగ నాశక స-
దాగతిజ హిత త్యాగరాజనుత ॥పా॥

## 13. కేదారగౌళ - రూపకం

లాలి యూగవయ్య నా -పాలి దైవమా ॥లా॥

మాలిమిగల సీతతోను-మంచమునను పవ్వళించి ॥లా॥

శ్రీకోసల పురినివాస-దేవ దేవ చిద్విలాస
పాకారిమణి ప్రకాశ-పద్మనాభ దరహాస ॥లా॥

సురభామలు ప్రేమమీర-సొగసుగాను బాడగా
సురతరు సుమవర్షములు-సురలు గురియ జేయగా ॥లా॥

పాలువెన్న పరమాన్నము-బాగుగ నీ వారగించి
బాలుడై న త్యాగరాజు-భాషణముల నాలకించి ॥లా॥

## 14. యమునా కల్యాణి - రూపకం

శంకర గిరిజారమణ మృ-గాంక కళాధర పాహి ॥శం॥

పంకజ భవసుర పతిముఖ-సంకటహరణ సుఖార్ణవ ॥శం॥

పరమ దయాకర శుభకర-గిరీశ పరాత్పర భవహర ॥శం॥

సుందరవందిత సనక స-నందన మందర ధరనుత ॥శం॥

రాజిత మృగధర త్యాగ-రాజను తామరపాలన ॥శం॥

# శ్రీత్యాగరాజమంగళాష్టకమ్

## మధ్యమావతి - ఆది

రామ బ్రహ్మసుపుత్రాయ రామనామ సుఖాత్మనే
రామచన్ద్ర స్వరూపాయ త్యాగరాజాయ మంగళం॥

శ్రీమత్కాకర్ల వంశాబ్ధి చంద్రాయామిత తేజసే
పూర్ణాయ పుణ్యరూపాయ త్యాగరాజాయ మంగళం॥

నారదాచార్య కరుణా పాత్రాయా ద్భుతకీర్తయే
ధీరాయ నిర్వికారాయ త్యాగరాజాయ మంగళం॥

కావేరీ తీర వాసాయ కారుణ్యామృత వర్షిణే
అవనీసుర రాజాయ త్యాగరాజాయ మంగళం॥

శ్రీకారుణ్య సముద్రాయ లోకాను గ్రహకారిణే
సాకేతాధిప భక్తాయ త్యాగరాజాయ మంగళం॥

యోగిపుంగవ మిత్రాయ యోగానంద స్వరూపిణే
రాగలోభ విముక్తాయ త్యాగరాజాయ మంగళం॥

గానశాస్త్ర ప్రవీణాయ కలికల్మష నాశినే
శరణాగత పోషాయ త్యాగరాజాయ మంగళం॥

దీనమానస పోషాయ దివ్యనామ సంబోధినే
జ్ఞానభక్తి ప్రదానాయ త్యాగరాజాయ మంగళం॥

**"వాలాజాపేట వెంకటరమణ కృతమ్"**

* * *